

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 118

శనివారం 19-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సెమీస్‌లో అర్జున్

ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో నొదిర్‌బెక్‌పై గెలుపు - 15లో



చెస్ కడుపున చిత్రకళ పుట్టింది

చిత్రలేఖనంలో రాణిస్తున్న విశ్వనాథన్ ఆనంద్ కుమారుడు అఖిల్ - 13లో



అమెరికా కల చెదురుతోంది!

చదువుల కోసం అమెరికా వెళ్లే భారతీయుల సంఖ్యలో ఈ ఏడాది 70-80% తగ్గుదల నమోదైందని పలు సంస్థలు తెలిపాయి.

- వివరాలు 6లో



మృగాళ్లకు అండగా తృణమూల్

మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన మృగాళ్లను తృణమూల్ కాంగ్రెస్ కాపాడుతోందని ప్రధాని మోదీ ఆరోపించారు.

- వివరాలు 6లో



టీఆర్‌ఎఫ్ ఓ ఉగ్ర సంస్థ

పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ లష్కరే జేబు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది.

- వివరాలు 6లో



ఆ నివేదికను రద్దు చేయండి

నోట్ల కట్టల విషయంలో అంతర్గత విచారణ కమిటీ నివేదికను అలహాబాద్ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంలో సవాల్ చేశారు.

- వివరాలు 6లో

రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేయండి



ఏపీ సీఎం చంద్రబాబుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి


- రోజుకు 3 టీఎంసీలు తీసుకునే ఆ ప్రాజెక్టు విషయంలో ఉదారత చూపండి
- పాలమూరు ప్రాజెక్టులు అడ్డుకోకుండా పూర్తి చేసేందుకు సహకరించండి
- మీరు బాధ్యతగా ఉండండి.. మమ్మల్ని బతకనివ్వండి.. మీ మేలు మరిచిపోం
- మేం విజ్ఞప్తులు చేస్తాం.. వినకుంటే ఎలా పోరాడాలో తెలుసు
- నేను రెండున్నరేళ్లలో పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయిస్తా
- నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్ కర్నూల్: 'ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేస్తున్నా.. పాలమూరు ప్రాజెక్టులను అడ్డుకోవద్దు. పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసుకునేందుకు సహకరించండి. ఈ ప్రాజెక్టులను అడ్డుకోవడం న్యాయమా? ఒకనాడు పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నామని మీరు చెప్పారు. మీరు బాధ్యతగా ఉండి, మమ్మల్ని బతకనివ్వండి. మా ప్రాజెక్టులను పూర్తి చేసుకోనివ్వండి. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి 4 టీఎంసీల నీరు తీసుకునేది..ఇప్పుడు 9.5 టీఎంసీల నీరు తీసుకెళ్లేందుకు ప్రాజెక్టులు పెట్టుకున్నరు. రోజుకు 3 టీఎంసీలు తీసుకునే రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేసి ఉదారత చూపండి. రెండు తెలుగు రాష్ట్రాలను, తెలుగువారిని సమానంగా అభివృద్ధి చేయాలన్న మీ ఆలోచన నిజమైతే రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేయండి. పాలమూరు ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు సహకరించండి. పాలమూరు బిడ్డలం మీ మేలు మర్చిపోం. మేం విజ్ఞప్తులు చేస్తాం. వినకపోతే ఎలా పోరాటం చేయాలో పాలమూరు బిడ్డలకు తెలుసు. పాలమూరు ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తిచేసేలా నేను బాధ్యత తీసుకుంటా..' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో రూ.200 కోట్లతో చేపట్టనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఇక్కడి మదన గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు.

మేం అన్నం పెడితే.. నువ్ సున్నం పెట్టావు..

'పాలమూరు నుంచి 2009లో ఎంపీగా గెలిచిన కేసీఆర్ ఈ ప్రాంతానికి చేసింది, ఇచ్చింది ఏంటో చెప్పాలి. కరీంనగర్ నుంచి పారిపోయి

మిగతా 12వ పేజీలో ▶



శుక్రవారం రాత్రి భారీ వర్షానికి గచ్చిబౌలి ప్రాంతంలో భారీగా స్తంభించిన ట్రాఫిక్

చినుకు

సిటీ అంతా వణుకు

- హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం
- కంటోన్మెంట్, బోయిన్‌పల్లిలో అత్యధికంగా 11.5 సెం.మీ..
- వాగుల్ని తలపించిన రోడ్లు.. ఫ్లైఓవర్లపైనా వరద ప్రవాహం
- స్తంభించిన ట్రాఫిక్.. గంటలకొద్దీ నిలిచిపోయిన వాహనాలు
- రంగంలోకి జీహెచ్‌ఎంసీ, హైడ్రా, జలమండలి, ఎమర్జెన్సీ బృందాలు
- పూర్తిగా మునిగిన ప్యాట్నీనగర్..

2 లో



ప్యాట్నీ నగర్‌లో వరదలో చిక్కుకున్న వారిని పడవల ద్వారా తరలిస్తున్న సహాయక సిబ్బంది

3 రోజులు భారీ వర్షాలు

- రాష్ట్రంపై చక్రవాత ఆవర్తనం, వాయుగుండం ప్రభావం
- ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, రాష్ట్రం మొత్తానికి ఎల్లో అలర్ట్
- శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల భారీ వర్షాలు నమోదు
- హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే అధికంగా వర్షం

2 లో

న్యూస్‌రీల్

నిజమైన బీసీలకే రిజర్వేషన్లు దక్కాలి



రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అవి బీసీల కొంప ముంచే రిజర్వేషన్లన్నారు. - 12లో

బీఆర్‌ఎస్ పదేళ్ల తప్పులను సరిదిద్దుతున్నాం



బీఆర్‌ఎస్ పదేళ్లలో సాగునీటి రంగంలో చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లోని జలవిద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. - 12లో



మంత్రుల ఫోన్లూ ట్యాపింగ్!

- సీఎం సీటుకు ఎసరొస్తుందనే అనుమానంతో రేవంత్‌రెడ్డే చేయిస్తున్నారు
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ
- ఈ విషయం తప్పైతే మనవడిపై ఒట్టేసి చెప్పాలని సవాల్
- తాను లోకేశ్‌ను కలవలేదని స్పష్టీకరణ.. కలిసినా తప్పేమిటని ప్రశ్న

3 లో

స్టాక్ మార్కెట్లో యూత్!

- 30 ఏళ్లలోపు పెట్టుబడిదారులు **39%**
- 40 ఏళ్లలోపు వారు ఏకంగా **70%**
- ఇన్వెస్టర్లలో నాలుగింట ఒకవంతు మహిళలు
- మదుపర్లలో తెలుగు రాష్ట్రాల వాటా **7%**

ఒకప్పుడు.. 'స్టాక్ మార్కెట్‌తో మాకేంటి సంబంధం?' అని సామాన్యుడు అనుకునేవాడు. కానీ, ఇప్పుడు అదే స్టాక్ మార్కెట్లో సామాన్యులు కూడా పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యంగా, కోవిడ్, ఆ తరువాత జరిగిన అనేక పరిణామాలు.. ఇలా ఇందుకు కారణాలు అనేకం. ఫలితంగా ఇప్పుడు ఇన్వెస్టర్ల సంఖ్యలో ఏటా కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. దేశ జనాభాలో సుమారు 11.5 కోట్ల మంది జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడులు పెట్టారు. వీరిలో 30 ఏళ్లలోపు వారు 39 శాతం కాగా.. మహిళలు సుమారు 25 శాతం కావడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లోనూ మదుపరులు.. ముఖ్యంగా మహిళల సంఖ్య భారీగా పెరిగింది.



- సాక్షి, స్పెషల్ డెస్క్

బిహార్.. దేశంలోనే అత్యల్ప తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వేదికగా బిహార్ ఇన్వెస్టర్ల సంఖ్య అయిదేళ్లలో దేశంలోనే అత్యధికంగా 678 శాతం పెరిగింది. మదుపరుల సంఖ్య 7 లక్షల నుంచి 52 లక్షలకు దూసుకెళ్లింది. బిహార్‌లోనే ఇలా ఉంటే మరి ఇతర రాష్ట్రాల్లో? అవును.. ఇతర రాష్ట్రాల్లోనూ మదుపరులు గణనీయంగా పెరిగారు. ఎన్ఎస్ఈలో మదుపరుల సంఖ్య 2014–15లో 1,79,60,000. ఈ ఏడాది మే నాటికి అది ఏకంగా 11,49,42,000కు చేరింది. అంటే పదేళ్లలో 540 శాతం పెరుగుదల! 5–6 నెలలకే కొత్తగా కోటి మంది ఇన్వెస్టర్లు వచ్చి చేరుతున్నారంటే స్టాక్ మార్కెట్ పట్ల ఆసక్తి ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

సులభమైన షేర్ల లావాదేవీలు!

స్మార్ట్ ఫోన్ సామాన్యుడికి చేరువైంది. ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సులువయ్యాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ అంటే భయపడే రోజుల నుంచి.. ప్రతిరోజూ వేలూ, లక్షల రూపాయలను రకరకాల మార్గాల్లో పంపే పరిస్థితులు వచ్చాయి. డిజిటల్ అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. మరోపక్క.. దేశీయ స్టాక్ మార్కెట్ కూడా రోజురోజుకూ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ మదుపరులను ఊరిస్తోంది. తక్కువ సమయంలో, సులభమైన ఆదాయ మార్గంగా స్టాక్ మార్కెట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలంటే ఒకప్పుడు దరఖాస్తు ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉండేది. ఏ కంపెనీని ఎంచుకోవాలో సమాచారం తెలిసేది కాదు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు! షేర్ల కదలిక కళ్ల ముందు కనపడుతోంది. సామాన్యులు సైతం అతి తక్కువగా.. అంటే రూ.100 పెట్టుబడితో స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టొచ్చు. పెట్టుబడి పెట్టడమే కాదు.. ఉపసంహరణ సైతం చాలా సులభం అయిపోయింది. ముఖ్యంగా రిటైల్ ట్రేడింగ్‌ను సులభతరం చేసే ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ ఎన్నో వచ్చాయి. కోవిడ్ సమయంలో చాలామందికి ఇంటి దగ్గర ఉంటూ ఆదాయార్జన మార్గంగా స్టాక్ మార్కెట్‌ను ఎంపిక చేసుకున్నారు. ఇలాంటి అనేక అంశాలు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల సంఖ్య పెరగడానికి కారణమయ్యాయి.


పెరిగిన మహిళా శక్తి!..: స్టాక్ మార్కెట్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుండడం విశేషం. మహిళా ఇన్వెస్టర్ల వాటా 2022–23లో 22.5 శాతం కాగా ఈ ఏడాది మే నాటికి 24.4 శాతానికి చేరింది. గోవాలో అత్యధికంగా మహిళా పెట్టుబడిదారులు 32.6 శాతం ఉన్నారు. దేశంలో మొత్తం ఇన్వెస్టర్ల పరంగా మహిళా ఇన్వెస్టర్ల అత్యధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. అక్కడ 28.4 శాతం ఉంటే , గుజరాత్‌లో 27.8 శాతం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 23.4, తెలంగాణలో 24.9 శాతం మహిళలు ఉన్నారు.

ఆ మూడు రాష్ట్రాలు..: ఒక కోటి మంది ఇన్వెస్టర్ల క్లబ్‌లో చేరిన మూడో రాష్ట్రంగా గుజరాత్ అవతరించింది. 1.86 కోట్లతో మహారాష్ట్ర, 1.31 కోట్లతో ఉత్తరప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రాంతాల వారీగా చూస్తే 4.2 కోట్లతో ఉత్తర భారత్ అగ్రస్థానంలో ఉంది. పశ్చిమ భారత్ 3.5 కోట్లు, దక్షిణాది 2.4 కోట్లు, తూర్పు భారత్‌లో 1.4 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. సంఖ్యా పరంగా ఏడాదిలో ఉత్తరాదిలో 24%, తూర్పు భారత్ 23%, దక్షిణాది 22%, పశ్చిమ భారత్‌లో 17% వృద్ధి నమోదైంది. మే నెలలో తోడైన కొత్త ఇన్వెస్టర్ల సంఖ్యలో దేశంలోని టాప్–10 జిల్లాల్లో రంగారెడ్డి (8), హైదరాబాద్ (10) చోటు దక్కించుకున్నాయి.


తెలుగు రాష్ట్రాల్లో.. ఇన్వెస్టర్ల సంఖ్య, మొత్తం ఇన్వెస్టర్లలో రాష్ట్రం వాటా (శాతాల్లో)

రాష్ట్రం	2014-15	2025 మార్చి నాటికి	శాతం
ఆంధ్రప్రదేశ్	10,02,000	52,40,000	4.6
తెలంగాణ	2,79,000	27,74,000	2.4





మదుపరులు.. మైలురాళ్లు



మార్కెట్‌ను నడిపిస్తున్న యువత!

స్టాక్ మార్కెట్లో 30 ఏళ్ల లోపు వయసున్న ఇన్వెస్టర్ల హవా నడుస్తోంది. మొత్తం మదుపర్లలో ఈ జెనరేషన్–జడ్ వాటా 2025 మే నాటికి 39 శాతానికి పెరిగింది. ఇక కొత్త రిజిస్ట్రేషన్స్‌లో 56.1 శాతం వాటా వీరిదే. 2019–20 నుంచి యూత్ వాటా నూతన పెట్టుబడిదారుల్లో 52 శాతంపైగా ఉండడం విశేషం.

దేశ వ్యాప్తంగా 11.5 కోట్ల మంది మదుపరులకు జూలై 14 నాటికి 22.87 కోట్లకుపైగా ట్రేడింగ్ అకౌంట్లు ఉన్నాయి. వీటిలో ఏపీ నుంచి 1.04 కోట్లకుపైగా ఉంటే, తెలంగాణలో 51.50 లక్షలకుపైగా ఉన్నాయి.



హైదరాబాద్‌లోని నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జిపై వరద



ఉస్మాన్‌గంజ్‌లో భారీగా నిలిచిన నీటిలోనే వెళ్తున్న వాహనదారులు



రసూల్‌పురాలో వరద కారణంగా ఓ కార్ల షోరూంలో చిక్కుకున్న సిబ్బంది.. వీరిని అధికారులు బోట్ల సాయంతో రక్షించారు


ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం సూచనలు



సాక్షి, హైదరాబాద్: వర్షంలో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాలని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో భారీ వర్షం నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్‌వర్క్స్, విద్యుత్, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

ఇదండీ జాతర



స్వామీ! మీరే కాపాడాలి.. ఎక్కడ మద్యం కేసులయినా మమ్మల్నే అందులోకి లాగుతున్నారు!

చినుకు సిటీ అంతా వణుకు

హైదరాబాద్ మహానగరాన్ని ముంచెత్తిన వర్షం
- వాగుల్ని తలపించిన రోడ్లు.. ఫ్లైఓవర్లపైనా వరద ప్రవాహం
- స్తంభించిన ట్రాఫిక్.. గంటలకొద్దీ నిలిచిపోయిన వాహనాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో శుక్రవారం మధ్యాహ్నం తర్వాత రెండు, మూడు గంటల పాటు కురిసిన అతి భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. నాలాలు, డ్రైనేజీలు ఉప్పొంగి ప్రవహించాయి. రోడ్లన్నీ వాగుల్ని తలపించాయి. ఫ్లైఓవర్లపై సైతం వరద ఏరులా ప్రవహించింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. పలు ప్రధాన రహదారుల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొన్నిచోట్ల వరద ఉధృతికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు కొట్టుకుపోయాయి. నగరం నలుమూలలా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కంటోన్మెంట్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో అత్యధికంగా 11.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో 6 సెం.మీ పైగా వర్షం కురిసింది. ఉద్యోగాలకు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లిన వారు నరకయాతన పడ్డారు. రోడ్లపై మోకాలిలోతు నీళ్లు ప్రవహిస్తుండటంతో మెట్రో స్టేషన్లు, ఫ్లైఓవర్ల కింద, పెట్రోల్ బంకులు వద్ద గంటల కొద్దీ తలదాచుకున్నారు.

ఎటు చూసినా వరదే..

హైదరాబాద్‌లోని మాదాపూర్ నెక్టార్ గార్డెన్ వద్ద, ఎల్‌బీనగర్, మలక్‌పేట, మూసారంబాగ్, చైతన్యపురి ప్రాంతాల్లో రోడ్లపై వరద వాగుల్ని తలపించింది. షేక్‌పేట్, ఖాజాగూడ, రాయదుర్గం, గచ్చిబౌలి, కొండాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్, హైటెక్ సిటీ, మియాపూర్, ఏఎంబీ మాల్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. టోలిచౌకి నానల్ నగర్ జంక్షన్ వద్ద నాలా పొంగిపొర్లింది. పాతబస్తీలోని డబీర్‌పురా, శివగంగా నగర్, రాజన్న బావి, ఛత్రినాక చౌరస్తా, అచ్చయ్య నగర్, హనుమాన్ నగర్, అంబికా నగర్, పటేల్ నగర్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, లక్డీకాపూల్, శ్రీనగర్ కాలనీ, శ్రీకష్ణానగర్, ఇందిరా నగర్, ఫిలింనగర్, వెంకటగిరి, అమీర్‌పేట తదితర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. ఫిలింనగర్‌లోని పలు బస్తీల్లో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది. ఉప్పల్, రామాంతపూర్, అంబర్‌పేట, తార్నాక, మెట్టుగూడ తదితర ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో నగరం

రోడ్లపై వరద ప్రవాహంతో వాహనాలన్నీ ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుపోయాయి. అర కిలోమీటరు దూరం ప్రయాణించడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. సాయంత్రం కార్యాలయాలు, కాలేజీలు, పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్లే టైమ్ కావడంతో ఎక్కడ చూసినా వాహనాల బారులు కిక్కిరిసిపోయి కన్పించాయి. ప్రధానంగా ఐటీ కారిడార్ రాయదుర్గం, షేక్‌పేట్ మార్గంలో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రాయదుర్గం, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్, గచ్చిబౌలి పీజేఆర్ ఫ్లైఓవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నాంపల్లి, మెహదీపట్నం, టోలిచౌకి మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. హఫీజ్‌పేట్, ఆల్విన్ కాలనీ, చందానగర్ మార్గంలో కిలోమీటరు ప్రయాణానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. అంబర్‌పేట పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, అలీకేఫ్ చౌరస్తాల్లో, బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చౌరస్తా మాదాపూర్ వరకు ట్రాఫిక్ స్తంభించింది. అమీర్‌పేట, పంజగుట్ట, ఖైరతాబాద్, మాసబ్ ట్యాంక్, ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తా, విరించి ఆస్పత్రి చౌరస్తా, యూసుఫ్‌గూడ శ్రీకష్ణానగర్ రోడ్లలో ట్రాఫిక్ నిలిచిపోయింది. మూసారంబాగ్ బ్రిడ్జిని వరద ముంచెత్తింది.

సహాయక కార్యక్రమాలు పర్యవేక్షించిన హైడ్రా కమిషనర్

వరద ఉధృతికి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ప్యాట్నీ నగర్ పూర్తిగా ముంపునకు గురైంది. పలు భవనాల సెల్లార్లలోకి వర్షపునీరు చేరింది. దీంతో నాలుగు పడవల ద్వారా అధికారులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. స్థానికులను, వివిధ కార్యాలయాల్లో ఉన్న ఉద్యోగులు సుమారు 80 మందిని బయటకు తీసుకొచ్చారు. ఫైరింజన్ ద్వారా వర్షపు నీటిని తోడారు. మొదటి, రెండవ అంతస్తులో నివాసం ఉంటున్న స్థానికులు ఇళ్లను విడిచి బయటకు వచ్చేందుకు నిరాకరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సహాయ కార్యక్రమాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం...

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సుమారు 270 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సిబ్బందిని రంగంలోకి దింపి దాదాపు 200 ఫీడర్ల పరిధిలో కేవలం ముప్పై నిమిషాల వ్యవధిలో సరఫరా పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో సరఫరా పునరుద్ధరణకు కొంత అదనపు సమయం పట్టిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టాయి. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మొయినాబాద్ మండలం నదీమ్‌నగర్ గ్రామంలో మైసమ్మ దేవాలయం వద్ద దాదాపు 200 ఏళ్ల వయసున్న వేప చెట్టు నేలకొరిగింది.

హైదరాబాద్‌లో రాత్రి తొమ్మిది గంటల వరకు వర్షపాతం నమోదు ఇలా..

ప్రాంతం	సెంటీమీటర్లు
కంటోన్మెంట్, బోయిన్‌పల్లి	11.5
నాచారం	10.1
ఉప్పల్	9.8
మల్కాజిగిరి	9.8
బండ్లగూడ	9.7
ఉస్మానియా యూనివర్సిటీ	9.0
ముషీరాబాద్	8.8
బండ్లగూడ	8.7
కుత్బుల్లాపూర్	8.7
బార్కాస్	8.6
రియాసత్‌నగర్	8.3
అంబర్‌పేట	8.0
మాదాపూర్	7.9
హిమాయత్‌నగర్	7.8
సైదాబాద్	7.8
చిలకలగూడ	7.7
అల్వాల్	7.6
జీడిమెట్ల	7.3
శేరిలింగంపల్లి	7.2
సరూర్‌నగర్	6.9
చార్మినార్	6.8

మూడు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంపై వాయుగుండం, ఆవర్తనం ప్రభావం
- ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, రాష్ట్రం మొత్తానికి ఎల్లో అలర్ట్
- శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల భారీ వర్షాలు నమోదు
- హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే అధికంగా వర్షం



సాక్షి, హైదరాబాద్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నుంచి రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించింది. శుక్రవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రానున్న మూడు రోజులు కూడా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు సైతం నమోదు కావొచ్చని అంచనా వేసింది. బికనీర్, సికార్, వాయువ్య మధ్యప్రదేశ్ నుంచి నైరుతి ఉత్తరప్రదేశ్ వరకు వాయుగుండం కొనసాగుతోంది. ఇది క్రమంగా తూర్పు ఆగ్నేయ దిశలో కదిలి ఈశాన్య బంగాళాఖాతం వరకు విస్తరించనుంది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీనికి సమాంతరంగా ఉపరితల ద్రోణి కూడా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

మధ్య తెలంగాణలో భారీ వర్షం..: శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల వర్షాలు కురిశా యి. ప్రధానంగా మధ్య తెలంగాణలో భారీ వర్షాలు నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 50 చోట్ల 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిసింది. రా ష్ట్రంలో వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం ఉదయం వరకు రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, సిద్దిపేట, భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

జీహెచ్ఎంసీ సమీప జిల్లాల్లో భారీ వర్షం

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల చక్రవాత ఆవర్తనం, దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు వర్షాలకు అనుకూలంగా మారాయి. దీంతో మూడు రోజుల పాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో వచ్చే మూడు రోజులకు రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ చేశాం.

- డాక్టర్ కే.నాగరత్న
డైరెక్టర్, ఐఎండీ-హైదరాబాద్

150 ఎంబీబీఎస్ సీట్లు గోవిందా!

వరంగల్ ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ షాక్!
- ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్లకు అనుమతి నిరాకరణ
- రెన్యువల్ కోసం లంచం ఇచ్చినట్లు సీబీఐ కేసుతో చర్యలు

సాక్షి, హైదరాబాద్: రెన్యువల్ కోసం లంచం ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్‌లోని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ (ఎఫ్‌సీఐఎంఎస్)కి ఈ సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్లలో షాక్ తగిలింది. త్వరలో ప్రారంభం కానున్న ఎంబీబీఎస్ అడ్మిషన్ల జాబితా నుంచి ఈ కళాశాలను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తొలగించింది. ఈ కాలేజీలో ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లను రెన్యువల్ చేయలేదు. దీంతో రాష్ట్రంలో ఈసారి 150 ఎంబీబీఎస్ సీట్లు తగ్గనున్నాయి. వైద్య కళాశాల రెన్యువల్ కోసం రూ.66 లక్షలు లంచంగా ఇచ్చినట్లు సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగాసీబీఐ నమోదుచేసిన కేసుల ఆధారంగా మొత్తం 3,000 మెడికల్ సీట్లను ఎన్ఎంసీ ఈసారి రెన్యువల్ చేయలేదు. అందులో తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐఎంఎస్ ఒక్కటే ఉంది.

రెన్యూవల్ కోసం అడ్డదారులు: ఎఫ్‌సీఐఎంఎస్ 2023లోనే ప్రారంభమైంది. ఈ కళాశాలకు ట్రస్టీగా ఉన్న ఫాదర్ జోసఫ్ కొమ్మారెడ్డి.. కళాశాల రెన్యువల్ కోసం అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది. నకిలీ బోధకులు, అద్దె రోగులతో కళాశాల పరిధిలోని బోధనాసుపత్రిని నింపి అప్పటి అధికారులను మేనేజ్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్ బి.హరిప్రసాద్ (కదిరి, ఏపీ), డాక్టర్ అంకం రాంబాబు (హైదరాబాద్), డాక్టర్ కృష్ణ కిషోర్ (విశాఖపట్నం) ద్వారా రెండు విడతల్లో రూ.66 లక్షలను ఎంసీఐ అధికారులకు లంచంగా ఇచ్చినట్లు సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

ఇంజనీరింగ్‌లో 77,561 సీట్ల భర్తీ

82 కాలేజీల్లో వంద శాతం సీట్ల కేటాయింపు
- ఇంకా మిగిలిపోయిన సీట్లు 5,493
- ఆప్షన్లు ఇచ్చినా సీట్లు రానివారు 16,793 మంది
- సీట్ల కేటాయింపు..తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ ప్రకారం


సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలివిడత కౌన్సెలింగ్‌లో 77,561 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 5,493 సీట్లు మిగిలిపోయాయి. 82 కాలేజీల్లో వంద శాతం సీట్లు నిండాయి. 6,083 మందికి ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు వచ్చాయి. తక్కువ ఆప్షన్లు ఇవ్వడం వల్ల 16,793 మంది సీట్లు పొందలేకపోయారు. ఈఏపీసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు శుక్రవారం చేపట్టారు. ఆ వివరాలను సాంకేతిక విద్య విభాగం వెల్లడించింది. రాష్ట్రంలో 172 కాలేజీల్లో 83,054 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. వీటి కోసం 94,354 మంది విద్యార్థులు 59,31,279 ఆప్షన్లు ఇచ్చారు. ఈసారి కొత్తగా మాక్ సీట్ల కేటాయింపు చేపట్టారు. దీని తర్వాత విద్యార్థులు ఆప్షన్లు మార్చుకున్నారు. మాక్‌తో పోలిస్తే 36,544 ఆప్షన్లు మారాయి. ఇందులో కొంతమంది కాలేజీలు మార్చుకుంటే, మరికొందరు బ్రాంచీలు మార్చుకున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 22లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. తొలిసారిగా ఎస్సీ కుల వర్గీకరణ ప్రకారం ఇంజనీరింగ్ సీట్లు కేటాయించారు.

కంప్యూటర్ కోర్సులదే ఆధిపత్యం: మొదటి విడతలో 77,561 సీట్లు భర్తీ అయితే, ఇందులో 57,042 సీట్లు కంప్యూటర్, ఇతర ఎమర్జింగ్ కోర్సుల్లోనే ఉన్నాయి. ఈ విభాగంలో 1,700 సీట్లు మాత్రమే మిగిలిపోయాయి. ప్రధాన ప్రాధాన్యత ఎమర్జింగ్, కంప్యూటర్ బ్రాంచీలే అయినా... ఈసారి కోర్ గ్రూపుల వైపు విద్యార్థులు ఎక్కువగా మొగ్గారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 16,112 సీట్లు ఉంటే, 14,054 సీట్లు భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్‌లో అన్నింటికన్నా తక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. అయినప్పటికీ గతంతో పోలిస్తే కొంత మెరుగే కనిపించింది. గత ఏడాది ఈ బ్రాంచీల్లో 40 శాతం సీట్లు కూడా భర్తీ అవ్వలేదు.

సీట్ల భర్తీ వివరాలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

జూరాలకు మళ్లీ భారీ వరద

1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..18 క్రస్ట్‌గేట్ల ఎత్తివేత



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి మళ్లీ భారీగా వరద వస్తోంది. గురువారం ప్రాజెక్టుకు కేవలం 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం ఉదయం నుంచి క్రమక్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 1.15 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో ప్రాజెక్టు 18 క్రస్ట్ గేట్లు ఎత్తి 71,604 క్యూసెక్కుల వరద నీటిని కృష్ణానదిలోకి వదిలేశారు. విద్యుదుత్పత్తి కొనసాగిస్తూ 30,498 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మంత్రుల ఫోన్లూ ట్యాపింగ్!

- సీఎం సీటుకు ఎసరొస్తుందనే అనుమానంతో రేవంత్‌రెడ్డే చేయిస్తున్నారు
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ
- ఈ విషయం తప్పైతే మనవడిపై ఒట్టేసి చెప్పాలని సవాల్
- తాను లోకేశ్‌ను కలవలేదని స్పష్టీకరణ. కలిసినా తప్పేమిటని ప్రశ్న


మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సండ్ర వెంకటవీరయ్య తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తన సీఎం సీటుకు ఎసరొస్తుందనే అనుమానంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఫోన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆరోపించారు. వీరివే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారని అన్నారు. ఈ విషయం తప్పని రేవంత్‌రెడ్డి తన మనవడిపై ఒట్టేసి చెప్పగలరా అని నిలదీశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి 'బనకచర్ల'ను గురుదక్షిణగా చెల్లించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ మంత్రి లోకేశ్‌ను తాను కలవలేదన్న కేటీఆర్.. కలిసినా తప్పేమిటని ప్రశ్నించారు. ఖమ్మంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ కుటుంబాన్ని, అలాగే ఇటీవల మాతృవియోగం పొందిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును భద్రాద్రి జిల్లా కుర్నవల్లిలో శుక్రవారం ఆయన పరామర్శించారు. అంతకుముందు ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు

ఢిల్లీ మీటింగ్‌కే వెళ్లనని.. కేంద్ర ప్రభుత్వం ఏపీ చేతుల్లోనే ఉన్నందున బనకచర్లపై అసలు చర్చకే ఒప్పుకోమని చెప్పిన రేవంత్‌రెడ్డి, 24 గంటల్లోనే అక్కడ తేలాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ సమావేశంలో బనకచర్ల ప్రస్తావనే రాలేదని ముఖ్యమంత్రి చెప్పగా.. ఏపీ మంత్రి రామానాయుడు మాత్రం బనకచర్లపై కమిటీ వేస్తున్నట్లు వెల్లడించడంతో..రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలు చంద్రబాబుకు తాకట్టు పెట్టారని తేలిపోయిందని అన్నారు. గోదావరి జలాల్లో తెలంగాణ హక్కు తేలాల్సి ఉందని కేటీఆర్ చెప్పారు. గోదావరిలోని 1,486 టీఎంసీల నికర జలాల్లో 968 టీఎంసీలు, 3 వేల టీఎంసీల మిగులు జలాల్లో 1,950 టీఎంసీలు తెలంగాణ వాటాగా వచ్చేలా చంద్రబాబు చేతిలోని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించాలని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టులపై ఇచ్చిన అభ్యంతరాల లేఖలు కూడా ఉపసంహరించుకునేలా చూడాలని చెప్పారు. తాను అర్ధరాత్రి వేళ ఏపీ మంత్రి లోకేశ్‌ను కలిశానని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని.. లోకేశ్ ఏమైనా దావూద్ ఇబ్రహీమా?, రేవంత్ మాదిరి అంతర్రాష్ట్ర దొంగా? అని ప్రశ్నించారు. తామిద్దరం ఫ్రెండ్లీగా ఉంటామని తెలిపారు. రాష్ట్ర యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కే కాకుండా రేవంత్‌రెడ్డి ప్రసంగాలు, వార్తలు, చిట్‌చాట్‌లకు దూరంగా ఉండాలని అన్నారు.

ముఖ్యమంత్రి స్థాయి ఎక్కడ?

ముఖ్యమంత్రి అంటే ఒక స్థాయి, హుందాతనం ఉండాలని కేటీఆర్ అన్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు, రోశయ్య, కేసీఆర్ హుందాగా వ్యవహరించారని చెప్పారు. కానీ రేవంత్‌రెడ్డి వ్యవహారాన్ని రాష్ట్రం గమనిస్తోందని పేర్కొన్నారు. చర్చకు కేసీఆర్ వస్తాడా.. కేటీఆర్ వస్తాడా? అన్న సవాల్‌ను తాను స్వీకరిస్తే పిరికిపందలా పారిపోయాడని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా లైవ్ కెమెరాల ముందు ఎవరేంటో తేల్చుకుందామని సవాల్ చేశారు. మానసిక రుగ్మతతో బాధపడుతున్న రేవంత్‌రెడ్డిని డాక్టర్‌కు చూపించాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

ఎనుముల బ్రదర్స్ దోపిడీ బయట పెడతాం..

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం డ్రామా ఆడుతున్నట్లు బీసీలు అర్థం చేసుకున్నారని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం చేతుల్లో ఉన్నది ఇవ్వకుండా, కేంద్రం చేతిలో ఉన్న బీసీ రిజర్వేషన్లను వాళ్లే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి గాసిప్స్ ఎడిక్షన్ పట్టడం వల్లే దుబాయ్‌లో ఎవరో చచ్చిపోతే తనకు అంటగడుతున్నారని ధ్వజమెత్తారు. ఎనుముల బ్రదర్స్ దండుపాళ్యం బ్యాచ్‌లా దోచుకుంటున్న వైనాన్ని బయట పెడతామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఫుట్‌బాల్ ఆడే బాధ్యత తాము తీసుకుంటామని చెప్పారు. ఎనుముల సోదరుల భూ దందాలు, బాబుగారి కోసం బనకచర్ల, రాహుల్‌గాంధీకి మూటలు, బావమరిదికి రూ.1,135 కోట్ల కాంట్రాక్టు, ప్రశ్నిస్తే అక్రమ కేసులు, నెలకోసారి ఢిల్లీ, చీకట్లో మోదీ కాళ్లు పట్టుకోవడం వంటివి హామీల కంటే ముందే అమలవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నదని అనుమానం

కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు


జనగామలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాటి బీఆర్ఎస్ వారసత్వాన్ని స్వీకరించి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నదనే అనుమానం కలుగుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జనగామలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఆందోళన కలిగిస్తే, కాంగ్రెస్ సర్కారు కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫోన్‌ను కూడా నాడు ట్యాప్ చేశారని, ఆయనెట్లా కేసీఆర్‌ను కాపాడుతారని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి చండాలమైన వ్యక్తిని తానెక్కడా చూడలేదన్నారు. భార్యాభర్తలు బెడ్రూంలో మాట్లాడుకునే మాటలను కూడా ట్యాప్ చేసి విన్న ఘనుడు కేసీఆర్ అని సంజయ్ దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బీజేపీ స్టాండ్ వెరీ క్లియర్‌గా ఉందని, వంద శాతం వర్తింపజేస్తే, కేంద్రాన్ని ఒప్పించి బిల్లును ఆమోదింపజేసే బాధ్యత తీసుకుంటామన్నారు. 51 శాతం జనాభా ఉన్న బీసీలకు ఇప్పటికే మోదీ ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లను అందిస్తోందని, మరి కాంగ్రెస్ ఒరగబెట్టిందేంటని నిలదీశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చితే ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోమని, అన్ని అంశాలపై కేంద్రం కమిటీ వేస్తున్నట్లు ప్రకటించిందని సంజయ్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారకర్తలుగా బీజేపీ బ్రాండ్ అంబాసిడర్లు మాజీ సర్పంచులే ముందుండి పనిచేస్తారన్నారు.

మీ భాషతోనే మీ దుకాణం క్లోజ్ అయింది

కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: 'మీ భాష తీరు కారణంగా మీ దుకాణం క్లోజ్ అయింది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విరుచుకుపడ్డారు. ఖమ్మం వెలుగుమట్ల అటవీ పార్కులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అహంకారం, దుర్వినియోగం మాత్రమే జరగ్గా, గత ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. అయినా పిచ్చి, రోత మాటలతో ప్రధాని, ముఖ్యమంత్రి హోదాలనే కాక రాజకీయాలను దిగజార్చొద్దని సూచించారు. ఇంట్లో సరిచేసుకోలేని వారు ఇతరులపై మాట్లాడటం సరికాదని తుమ్మల హితవు పలికారు. కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్లు అధికారంలోకి రావాలని కంటున్న కలలు నెరవేరవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిపుణుల సూచనలను విస్మరించి నిర్మించడంతో రూ.లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని తుమ్మల తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు పూర్తయితే బీఆర్ఎస్ నేతల రంగు బయటపడుతుందన్నారు. ఫోన్లు ట్యాపింగ్ చేయించాల్సి అవసరం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై విమర్శలంటే బ్లాక్‌మెయిలింగే..

సీపీఐ జాతీయ నేత నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: రేవంత్‌రెడ్డి ప్రజలు ఎన్నుకున్న సీఎం ..ఆయన్ను విమర్శిస్తే అది బ్లాక్‌మెయిల్ చేయడమేనని సీపీఐ జాతీయ నేత నారాయణ వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల భేటీపై నారాయణ సానుకూలంగా స్పందించారు. ఇద్దరు సీఎంలు కలిసి మాట్లాడితేనే సమస్యలకు పరిష్కార మార్గాలు దొరుకుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. నారాయణ శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల వంటి అంశాలపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రాజకీయ లబ్ధి కోసం నీళ్లపై రాజకీయం చేయడం తగదన్నారు. జల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటును స్వాగతించాలన్నారు. అయితే ఆ కమిటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం బనకచర్లకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం లేదని.. పాత ప్రాజెక్టులను పూర్తి చేయ డం మొదటి బాధ్యతని స్పష్టం చేశారు. ఆంధ్రలో ఈ ప్రాజెక్టుపై ప్రజలలో సెంటిమెంటును రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని నారాయణ ఆరోపించారు. నీటిని అడ్డు పెట్టుకుని రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే.. అది తల్లిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడమేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పునాదులు సరిగ్గా వేయలేదని ఆరోపించారు. తెలంగాణ సెంటిమెంట్ క్షీణతకు కేసీఆరే కారణమని.. రాష్ట్ర ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలే ఆయనకు ప్రాధాన్యంగా మారాయని విమర్శించారు.

సాక్షి

శనివారం, 19 జూలై 2025

నాటో మొరటు భాష!

ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు. కానీ ఆర్నెల్ల నిరీక్షణ తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కొద్దో గొప్పో సయోధ్య కుదిరేసరికి నాటో కూటమి ఆయన లక్షణాలు పుణికి పుచ్చుకున్నట్టు కనబడుతోంది. రష్యాతో వాణిజ్యం సాగిస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ భారత్, చైనా, బ్రెజిల్ దేశాలకు చేసిన హెచ్చరిక దీన్నే చాటుతోంది. ట్రంప్‌తో నాలుగు రోజులక్రితం భేటీ అయ్యేవరకూ తన భవిష్యత్తు ఏమవుతుందోనన్న బెంగతో నాటో దిగాలుగా, అయోమయంగా వుంది. ఎందుకంటే నాటో ఖర్చులో సింహభాగం అమెరికాదే. అది తప్పుకున్న మరుక్షణం సంస్థ కుప్పకూలుతుంది. ట్రంప్ ప్రసన్న వదనంతో పలకరించేసరికి పులకరించి తన స్థాయి ఏమిటన్నది నాటో మరిచిందని రూట్ మాటలు చెబుతున్నాయి. ఈ మూడు దేశాలూ యుద్ధం వద్దని రష్యాకు నచ్చజెప్పాలట. లేనట్టయితే ఆ పర్యవసానాలు ఈ దేశాలూ ఎదుర్కొనాల్సి వస్తుందట. ఇంకా వలస పాలన మాటున దోపిడీ సాగించిన నాటి రోజులే వున్నాయని రూట్ భ్రమపడుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఎవరూ సమర్థించరు. అలాగే గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం, ఇటీవల ఆ దేశమే ఇరాన్‌పై చేసిన దాడి, దానికి వత్తాసుగా అమెరికా సాగించిన దాడులు అంగీకరించరు. నాటో దన్నుతో ఉక్రెయిన్ కావాలని రష్యాతో గిల్లికజ్జాలకు దిగిన వైనం అందరికీ తెలుసు. తమ చేతికి మట్టి అంటకుండా రష్యాను దెబ్బతీసి, దాన్ని సర్వనాశనం చేయగలమన్న భ్రమలో యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను ఉసిగొల్పాయి. కానీ మూడేళ్లయినా ఆ యుద్ధం ఆగకపోవటంతో యూరప్ దేశాలకు దిక్కుతోచటం లేదు. ఆ నిరాశా నిస్పృహల పర్యవసానంగానే నాటో కూటమి అతిగా మాట్లాడుతోంది.

అటువంటి బెదిరింపులకు దిగేందుకు తనకున్న అర్హతేమిటో నాటో గమనించుకోలేదు. 1949లో ఆవిర్భావం మొదలుకొని దాని చరిత్రంతా దురాక్రమణలు, యుద్ధాలే. నిక్షేపంగా వున్న లిబియాపై చమురు, సహజవాయు నిక్షేపాల్ని కొల్లగొట్టడానికి దండెత్తి, రసాయన ఆయుధాలున్నాయంటూ ఆరోపించి, పాలకుడు గడాఫీని దారికి తెచ్చుకుని, ఆయన నిరాయుధుడు కాగానే సాయుధ ముఠాలను ఎగతోసింది నాటోయే. ఆ ముఠాలతో ఆయన్ను అత్యంత అమానుషంగా హత్య చేయించింది కూడా నాటోయే. 2011 మొదలుకొని ఇప్పటివరకూ ఆ దేశం అంతర్యుద్ధంతో సతమతమవుతోంది. బోస్నియా, హెర్జిగోవినా, కొసావో, అఫ్గాన్, ఇరాక్, సోమాలియా తదితర చోట్ల అమెరికాతో కలిసి, విడిగా నాటో సృష్టించిన కల్లోలం సామాన్యమైంది కాదు. ఈ యుద్ధాల్లో లక్షలాది మంది పౌరులు మరణించారు. రష్యా–ఉక్రెయిన్ లడాయిలోఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సాయాన్నందిస్తూ ఈ యుద్ధం ఆరకుండా కాపాడుతున్నది కూడా నాటోయే. అలాంటి సంస్థ ఏ అర్హతతో మననూ, వేరే దేశాలనూ బెదిరిస్తుంది?

నాటో అనేది పుట్టుకనుంచీ అమెరికా కోసం, దాని ప్రయోజనాల పరిరక్షణ కోసం పనిచేస్తున్న పెద్ద పోలీస్. ఒక సైనిక కూటమిగా వుంటూ ప్రపంచ దేశాలపై ఆంక్షలు విధించటం సాధ్యమనే నాటో అనుకుంటున్నదా? ఆ పని యూరప్ దేశాలది. కానీ వాటికి హెచ్చరించటం సంగతలా వుంచి అడిగే ధైర్యం కూడా లేదు. ఒకనాడు సంపన్న రాజ్యాలుగా చలామణి అయిన యూరప్ దేశాలు ఇప్పుడు ఉత్పాదకతను పెంచటం ఎలాగో... అరకొర ఆర్థిక వ్యవస్థలతో ప్రజానీకంలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చటం ఎలాగో అర్థంకాక తలలు పట్టుకుంటున్నాయి. ఈ దేశాలతో కూడిన నాటో మాత్రం పెద్ద మాటలు మాట్లాడుతోంది. ఇన్నేళ్ల అమెరికా సాహచర్యంతో ఇష్టానుసారం బడుగు దేశాలపై బలప్రయోగం చేయటం అలవాటైన నాటోకు ఈ ప్రపంచంలో ఐక్యరాజ్య సమితి, భద్రతామండలి వంటి అంతర్జాతీయ వేదికలున్నాయని కూడా గుర్తున్నట్టు లేదు. ఆంక్షలైనా, విధినిషేధాలైనా వాటిద్వారా అమలు కావాలి. అదనంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటివి వున్నాయి. రష్యాతో వ్యాపారం చేయాలో లేదో అమెరికా, యూరప్ సొంతంగా నిర్ణయించుకోవచ్చు. అందులో ఎవరూ జోక్యం చేసుకోలేరు. కానీ మేమే కాదు... ఎవరూ వ్యాపారం చేయకూడదంటే చెల్లదు.

తన ఇంధన అవసరాలేమిటో, దాన్ని నెరవేర్చుకోవటానికి అనుసరించాల్సిన వ్యూహమేమిటో భారత్ ఆలోచించుకుంటుంది. రష్యాపై అమెరికా ఆంక్షలు విధించినా మన దేశం బేఖాతరు చేసింది. రష్యా చవగ్గా అమ్మజూపిన ముడి చమురు, సహజ వాయువు కొనుగోలు చేసింది. క్రితంతో పోలిస్తే 2023లో రష్యా నుంచి చమురు, సహజవాయు దిగుమతులు 1,500 శాతం పెరగటానికి ఇదే కారణం. చైనా, బ్రెజిల్ కూడా ఈ దోవనే వెళ్లాయి. రష్యాను ఏకాకిని చేయాలన్న పాశ్చాత్య ప్రపంచం కలల్ని బద్దలుకొట్టాయి. మన విదేశాంగ శాఖ నాటో ద్వంద్వ ప్రమాణాలను సరిగానే ఎత్తిచూపింది. ప్రజల ఇంధనావసరాలు మినహా తమకేదీ ప్రాముఖ్యంగల అంశం కాదని జవాబిచ్చింది. ఒకప్పుడు 27 దేశాల నుంచి ముడి చమురు కొనుగోలు చేసిన మన దేశం, ఇప్పుడు 40 దేశాలనుంచి కొంటున్నది. రష్యాపై తీసుకొచ్చిన అభిశంసనపై ఓటింగ్ జరిగినప్పుడల్లా ఐక్యరాజ్యసమితిలో మన దేశం గైర్హాజరైంది. అదే సమయంలో యుద్ధాన్ని విరమించాలని రష్యా అధినేత పుతిన్‌కు నచ్చజెప్పింది. అదే సలహా ఉక్రెయిన్‌కు కూడా ఇచ్చింది. ఇవి తెలియకుండా ఇష్టానుసారం మాట్లాడటం, హెచ్చరికలు జారీ చేయటం తగదని నాటో గుర్తించాలి. తెలిసీ తెలియకుండా తగుదునమ్మా అని జోక్యం చేసుకుంటే వున్న పరువు కాస్తా పోతుందని గుర్తెరగాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.నవమి ప.1.28 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** భరణి రా.12.17 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ప.10.53 నుండి 12.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.32 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** రా.7.45 నుండి 9.14 వరకు

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

రెండు ధ్రువాలతో సమతూకం ఎలా?

విశ్లేషణ



కె.సి. సింగ్

అమెరికాలో కొత్త ప్రభుత్వ సమర్థతను మదింపు చేసేందుకు సాధారణంగా, అధ్యక్షుడి మొదటి 100 రోజుల పాలనను లెక్కలోకి తీసుకుంటారు. కానీ, ట్రంప్ రెండవ విడత పాలన మొదలై 180 రోజులు గడుస్తున్నా వాణిజ్య వివాదాలకు పరిష్కారం ఒక కొలిక్కి రాలేదు. ఉక్రెయిన్, గాజాలలో సైనిక కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయి. వ్యూహాత్మక భాగస్వామి అమెరికా, ముఖ్యమైన ఆర్థిక పోషక దేశం చైనాలతో సంబంధాలలో సమతూకం పాటించేందుకు ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథొని ఆల్బనీస్ జూలై నెల మధ్యలో 6 రోజుల పర్యటనపై చైనా వెళ్ళారు.

దౌత్యం, వాణిజ్యంతో వ్యవహరిస్తున్న భారత దౌత్యవేత్తలు కూడా అలాంటి సందేహ డోలనే ఎదుర్కొంటున్నారు. 'బ్రిక్స్' శిఖరాగ్ర సభలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆ మధ్య బ్రెజిల్ వెళ్ళారు. ఆయన భారత్‌కు తిరిగి వచ్చే మార్గ మధ్యంలో ఉన్నప్పుడే బ్రెజిల్ అధ్యక్షుడు లూల డ సిల్వా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మధ్య వాగ్వాదం నెలకొంది. వారి మధ్య మాట మాట పెరగడానికి విదేశాంగ విధానంపై అభిప్రాయ భేదాలు కారణం కాదు. బ్రెజిల్ ఆంతరంగిక వ్యవహారాలలో ట్రంప్ బాహాటంగా జోక్యం చేసుకోవడమే తగాదాకు దారితీసింది. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జాయిర్ బొసొనారొపై విచారణకు స్వస్తి పలకాలని ట్రంప్ డిమాండ్ చేశారు. దీనిపై అమెరికా జోక్యాన్ని లూల తిరస్కరించారు. అమెరికా దండిస్తున్నట్లుగా సుంకాలు విధిస్తే తామూ ప్రతీకార చర్యలకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చైనాతో సవ్యంగా లేకపోయినా...

ఆ విధంగా, ప్రజానీకం నేడు రెండు ధ్రువాల ప్రపంచాన్ని ఎదుర్కొంటోంది. 'నాటో' దేశాల మద్దతు ఎంతవరకు లభిస్తుందో తెలియకపోయినా, వాటిని తోడు చేసుకుని అమెరికా ఒక ధ్రువంగా ఉంది. చైనా–రష్యా ఇరుసు రెండవదిగా ఉంది. ప్రచ్ఛన్న యుద్ధం నాటి స్థితితో పోలిస్తే, ఒక్కటే తేడా కనిపిస్తోంది. చైనా–అమెరికా ప్రత్యర్థులే కావచ్చు కానీ, వాణిజ్యం, సాంకేతికతల విషయంలో అవి ప్రస్తుతం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధ ప్రత్యర్థులైన సోవియట్ యూనియన్, అమెరికా మధ్య అప్పట్లో అలాంటి సంబంధాలు ఉండేవి కావు. దాంతో, బ్రెజిల్, భారత్ లాంటి ప్రవర్ధమాన దేశాలకు ఈ రెండు ధ్రువాల మధ్య సమతౌల్యం పాటించడం కష్టంగా మారుతోంది. చైనాతో మనకు సరిహద్దు వివాదం ఉండటం, మనల్ని చైనా ఒక బలమైన ప్రత్యర్థిగా చూస్తుండటం వల్ల, మన పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.

ఆగస్టు 1లోగా, ఏదో ఒక అంగీకారానికి రాకపోతే, 'ప్రతిగా ఎదురు కాగల సుంకాలను' తప్పించుకునేందుకు అమెరికాతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకోవడం భారత్‌కు తక్షణ సమస్యగా ఉంది. అధ్యక్షుడు ట్రంప్ సుంకాలపై తడవకో మాట మాట్లాడుతున్నారు. ఇదంతా అనిశ్చితిని పెంచుతోంది. 'విముక్తి దినం'గా ప్రకటించిన ఏప్రిల్ 2 నుంచి రెండు డజన్లకు పైగా పర్యాయాలు సుంకాలపై తలకిందుల ధోరణిని చూశాం. సుంకాల పేరిట అమెరికా బెదిరింపులు పరిపాటిగా మారడంతో కాబోలు,



◆ 'నాటో' దేశాల మద్దతుతో అమెరికా ఒక ధ్రువంగా ఉంది. చైనా–రష్యా ఇరుసు రెండవదిగా ఉంది. చైనా – అమెరికా ప్రత్యర్థులే కావచ్చు గానీ, వాణిజ్యం, సాంకేతికతల విషయంలో అవి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధ ప్రత్యర్థులైన సోవియట్ యూనియన్, అమెరికా మధ్య అప్పట్లో అలాంటి సంబంధాలు ఉండేవి కావు. దాంతో, బ్రెజిల్, భారత్ లాంటి ప్రవర్ధమాన దేశాలకు ఈ రెండు ధ్రువాల మధ్య సమతౌల్యం పాటించడం కష్టంగా మారుతోంది.

అంతర్జాతీయ మార్కెట్లు కూడా వాటిని పెద్దగా లెక్కలోకి తీసుకోవడం మానేశాయి. '90 రోజులలో 90 ఒప్పందాలు' అంటూ ట్రంప్ చేసిన వాగ్దానం నీటిమీద రాతగా మారింది. ఒక్క వియత్నాం, బ్రిటన్‌లతోనే వాణిజ్య ఒప్పందాలు కుదిరాయి. చైనాతో పాక్షికంగా మాత్రమే అవగాహన కుదిరింది.

వాణిజ్య ఒప్పందం కొరవడిన నేపథ్యంలో, ఆగస్టు 1 తర్వాత, అమెరికా 30% సుంకాల బెదిరింపును అమలు జరిపితే తాము విధించగల ప్రతీకార సుంకాల జాబితా సిద్ధంగా ఉందని యూరోపియన్ యూనియన్ వెల్లడించింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథొని ఆల్బనీస్ బాటనే భారత్ కూడా అనుసరించింది. షాంఘై సహకార సంస్థ సమావేశాలలో పాల్గొనేందుకు బీజింగ్ వెళ్ళిన భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, భారత్–చైనా సంబంధాలను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. అయితే, వాస్తవాధీన రేఖ వద్ద సేనల ఉపసంహరణ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా, పాకిస్తాన్‌కు చైనా క్రియాశీల సహాయం అందించిన సంగతి తెలిసిందే. వీటికితోడు, దలైలామా 90వ పుట్టిన రోజు ఈ సమయంలోనే వచ్చింది. దలైలామాకు క్రియాశీల మద్దతు ఇవ్వడం ద్వారా, టిబెట్‌పై తమ పట్టును తగ్గించడంలో భారత్ తోడుదొంగగా వ్యవహరిస్తోందని చైనా భావిస్తోంది. అదే సమయంలో, ట్రంప్ కల్లోలిత ప్రపంచంలో, భారతీయ మార్కెట్ ప్రాధాన్యాన్ని చైనా గ్రహించింది.

పాకిస్తాన్‌కు అమెరికా స్నేహహస్తం

అమెరికాతో తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు భారత్ కడపటి ప్రయత్నాలలో ఉంది. భారతీయ దృక్కోణం నుంచి చూసినప్పుడు వ్యావసాయిక, పాడిపరిశ్రమ మార్కెట్లను సంరక్షించుకోవడం ప్రాధాన్యంగా ఉంది. ఎలాన్ మస్క్ సంస్థ 'టెస్లా' ముంబయిలో తన మొదటి షోరూమ్ తెరవడం, సాధారణ పరిస్థితులలోనైతే, సానుకూల సంకేతంగానే ఉండేది. కానీ, ఆయనకు, అధ్యక్షుడు ట్రంప్‌కి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భారత్–అమెరికా వాణిజ్య వివాదాన్ని పరిష్కరించడంలో మాట సాయం చేయగల స్థితిలో లేనని మస్క్ చేతులు ఎత్తేయవచ్చు.

భారత్ దౌత్యపరంగా పెద్ద సవాల్‌నే ఎదుర్కొంటోంది. అమెరికాతో పెంచిపోషించుకుంటూ వచ్చిన సన్నిహిత సంబంధాలు ఏ మేరకు ప్రతిఫలాలు చూపగలవో తెలియడం లేదు. పాకిస్తాన్‌కు అమెరికా చాస్తున్న స్నేహ హస్తమే ఇందుకు నిదర్శనం. జైలులో ఉన్న పాకిస్తాన్ తెహ్రీక్–ఏ–ఇన్సాఫ్ నాయకుడు ఇమ్రాన్ ఖాన్‌తో సయోధ్య కుదుర్చుకోవలసిందిగా పాక్ సైన్యాన్ని అమెరికా ప్రభుత్వం ముందుకు తోస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. అమెరికా నిర్దేశించిన 50 రోజుల గడువు లోగా ఉక్రెయిన్‌తో రష్యా కాల్పుల విరమణకు రాకపోతే, రష్యా నుంచి చమురు కొనే అన్ని దేశాలను అమెరికా లక్ష్యం చేసుకోగల కత్తి కూడా భారత్ మెడపై వేలాడుతోంది. చైనాకు దగ్గరయ్యేందుకు ఆస్ట్రేలియా ప్రధాని చేసిన ప్రయత్నం చూసిన అమెరికా, ఆస్ట్రేలియాతో (బ్రిటన్‌తో కలుపుకొని) ఉన్న వ్యూహాత్మక త్రైపాక్షిక పొత్తును సమీక్షిస్తామని సంకేతాలు పంపుతోంది. ఆ పొత్తు ప్రకారం ఆస్ట్రేలియాకు అణు జలాంతర్గాములు అందవలసి ఉంది. తైవాన్ విషయంలో చైనాతో సైనిక ఘర్షణ తలెత్తితే, తమకు అండగా ఉంటామంటూ హామీ ఇవ్వాలని జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియాలను పెంటగాన్ కోరుతున్నట్లు తెలుస్తోంది. ఒకపక్క వివిధ దేశాలపై ఏకపక్షంగా సుంకాలు విధించుకుంటూపోతున్న అమెరికా, ఒకవేళ చైనాతో ఏదైనా ఘర్షణ తలెత్తితే, వ్యూహాత్మక మిత్ర దేశాల నుంచి క్రియాశీల సైనిక మద్దతు ఆశించడం కష్టమన్న వాస్తవాన్ని మాత్రం విస్మరిస్తోంది.

అయితే, ట్రంప్ తాను మొదలెట్టిన వాణిజ్య యుద్ధానికి తానే త్వరలో ఒక పరిష్కారం కనుగొనక తప్పని స్థితిలో పడవచ్చు. ఎందుకంటే, లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టైన్‌కు సంబంధించిన పత్రాలు ప్రస్తుతం అమెరికా న్యాయ శాఖ వద్ద ఉన్నాయి. ఆ నేరాలతో మరికొందరు ప్రముఖుల పేర్లు కూడా ముడిపడి ఉన్నాయి. వాటిలో ట్రంప్ పేరు కూడా ఉందని మస్క్ వెల్లడించారు. ట్రంప్ ఆ రొంపి నుంచి బయటపడే హడావిడిలో కూడా ఉన్నారు. అమెరికా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఇప్పటికే పెంచింది. భారత్ తమ నుంచి రక్షణ సామగ్రిని ఎక్కువ కొనుగోలు చేయాలని అమెరికా కోరుకోవడం మరో సమస్యగా ఉంది. కానీ, సైనిక పరంగా అమెరికాపై మితిమీరి ఆధారపడటం వ్యూహాత్మకంగా పెద్ద పొరపాటు అవుతుంది. ప్రస్తుత ప్రపంచ రాజకీయ–ఆర్థిక స్థితిగతులు 'ప్రతి ఒక్కరినీ ఊహాగానాలకు లోను చేస్తున్నాయి' అని ఎకనామిస్ట్ మ్యాగజైన్ ఇటీవల వ్యాఖ్యానించడంలో వింతేముంది?

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి ('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

తిరోగమనం



ఇండియా మీద యురోపియన్ యూనియన్(ఈయూ) ఆంక్షలు అత్యంత తిరోగమన చర్య. ఇందులోని కపటత్వం, క్రూరత్వం ఏమిటంటే – ఈయూ తానే నేరుగా రష్యా నుంచి చమురే కాదు, సహజ వాయువు, శుద్ధిచేసిన చమురు ఉత్పత్తులను కొంటుండటం!

– కన్వల్ సిబాల్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

స్వతంత్ర విధానం



రష్యా–ఇండియా–చైనా(ఆర్ఐసీ) త్రికం కోసం రష్యా నుంచి తిరిగి కొత్త ఒత్తిడి వస్తున్నప్పటికీ, ఈ నమూనాలో ఏ సమావేశం కోసం ఇండియా అంగీకరించలేదు. బహుళ ధ్రువ ప్రపంచానికి ఇది వారసత్వమని రష్యా అంటోంది. క్వాడ్‌కు నిరోధంగా చైనా చూస్తోంది. చైనా పట్ల అంత విశ్వాసం లేని ఇండియా దీనికి దూరంగా ఉంటూ తన వ్యూహాత్మక స్వతంత్రతను కోరుకుంటోంది. ఈ రెండో ప్రచ్ఛన్న యుద్ధంలో ఇండియా తనను తాను ఏదో ఒకవైపు బంధించుకోవాలని అనుకోవడం లేదు.

– వెలీనా త్చకరోవా, స్ట్రాటెజిస్ట్

అసలైన జ్ఞానం



జ్ఞానాన్ని దాటగలిగే వివేకం లేనంతవరకూ శాంతికి ఆ జ్ఞానమే అడ్డంకి.

– జేమ్స్ పియర్స్, లైఫ్ కోచ్

అదే ఎందుకు?



తమ సహజ శరీర నిర్మాణం వల్ల మహిళల పట్ల భిన్నమైన ఆదరణ చూపాలనేది ఒక వాస్తవం అని మీరు భావిస్తుంటే– ఒకటి గుర్తుంచుకోండి... మీరు మగ శరీరం అనేది ఒక ప్రమాణమనీ, దానికి మేము కట్టుబడి ఉండాలనీ నమ్ముతున్నట్టు.

– రాబిన్ అట్కిన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్

స్ఫూర్తిదాయకం



ఇప్పుడు 57 ఏళ్లున్న మా నాన్న, చావు అంచులదాకా వెళ్లి క్యాన్సర్ సర్జరీ చేయించుకున్నాక, మూడేళ్ల పాటు చదివి టెక్నాలజీ పీహెచ్‌డీ పూర్తిచేశాడు, అదీ ఫుల్ టైమ్ ఉద్యోగం చేస్తూ. ఎందుకంటే ఎప్పుడో మా తాతకు 40 ఏళ్ల క్రితం ఇచ్చిన మాట కోసం. కంగ్రాట్స్ పాపా!

– విక్రమ్ పాయ్, వ్యాపారవేత్త

జీవితంలో విజేత



జీవితం అనేది ఒక ప్రయాణం. సంతులనం కోల్పోకుండా ఎగుడు దిగుళ్లను దాటేవాడే విజయుడవుతాడు. గతం గురించి మథనం వద్దు. మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవద్దు. తప్పులను పునరావృతం చేయొద్దు. ప్రతికూలత మీద ఫోకస్ పెట్టొద్దు. మీ దారిలో ఇతరులకు సాయం చేయండి. ఎక్కడికి వెళ్లినా దయను పంచండి.

– ముఫ్తీ మెంక్, ఆధ్యాత్మిక బోధకులు

ఇదీ ఇండియా!



వన్ వే రోడ్డులో కూడా రెండు వైపులా చూడాల్సి వచ్చే ఏకైక దేశం – ఇండియా!

– రితిక, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

కృతజ్ఞత చెప్పడమే!

మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మతో సహా అనేక ప్రాంతీయ పేర్లు కలిగిన దేవత మహాకాళి. ఈ దేవతకు తెలంగాణలో ఆషాఢ మాసమంతా ప్రజలు పండుగ చేసి బోనాలు ఎత్తుతారు. బోనం ఎత్తడమంటే అమ్మోరికి కృతజ్ఞతను తెలుపుకోవడమే! బోనాల మూలాలు 19వ శతాబ్దం నాటివి. ఆ సమయంలో వినాశకరమైన ప్లేగు వ్యాధి జంట నగరాలను తాకింది. 1813లో మధ్యప్రదేశ్‌లోని



ఉజ్జయినిలో ఉన్న హైదరాబాద్ సైనిక బెటాలియన్ ఈ అంటువ్యాధి నుండి ఉపశమనం కోసం మహాకాళి ఆలయంలో దేవిని ప్రార్థించింది. ప్లేగు వ్యాధి తగ్గుముఖం పట్టగానే, బెటాలియన్ తిరిగి వచ్చి సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయాన్ని నిర్మించి, బోనాలను సమర్పించే సంప్రదాయాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపునకు మూల స్తంభంగా మారింది. 2014లో అధికారికంగా తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రకటించబడింది.

ఈ పండుగకు పౌరాణిక ప్రాముఖ్యం కూడా ఉంది. ఆషాఢ మాసం సందర్భంగా మహాకాళి దేవత తన తల్లిదండ్రుల ఇంటికి వార్షిక ఆగమనాన్ని సూచిస్తుంది. భక్తులు ఆమెను నైవేద్యాలతో స్వాగతిస్తారు. ఇది వివాహిత కుమార్తె ఇంటికి వచ్చినప్పుడు ఆమెను లాలించడం లాంటిది. వేప ఆకులు, పసుపు, కుంకుమ, వెలిగించిన దీపం వంటివాటితో అలంకరించబడిన కొత్త మట్టి లేదా ఇత్తడి పాత్రలలో బియ్యం, పాలు బెల్లం కలిపి వండిన పవిత్ర భోజనమే... బోనం! మహిళలు ఈ బోనాలను తలపై పెట్టుకుని దేవాలయాలకు తీసుకువెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ఇలా బోనాలు తీసుకువెళ్లే ఊరేగింపుకు పోతరాజు నాయకత్వం వహిస్తాడు. బోనాల పండుగను ఒక మతపరమైన పండుగ కన్నా ఎక్కువే అనాలి. కుటుంబాలు బోనం నైవేద్యాన్ని పంచుకుంటాయి. దాని తర్వాత మాంసాహార విందు, ఈత లేదా తాటి కల్లు సేవిస్తారు. వీధులు వేప ఆకులతో అలంకరించబడి జానపద పాటల గాలిని నింపుతాయి. కొన్ని ప్రాంతాలు ఆషాఢంలో కాకుండా శ్రావణంలో బోనాల పండుగ జరుపుకొంటాయి. ఆంధ్ర ప్రాంతంలో గ్రామ దేవతలకు ఆషాఢ, శ్రావణాల్లో కొలుపులు చేయడం బోనాల పండుగను పోలి ఉంటుంది.

– డా॥ జి. వెన్నెల గద్దర్ । చైర్‌పర్సన్, తెలంగాణ సాంస్కృతిక సారథి

అందరూ చదవాలనీ... ఎదగాలనీ...

చాలామంది ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు, ర్యాంకులు వచ్చిన పిల్లలకి మా చిన్నప్పుడు నగదు రూపంలో బహుమానాలు ఇచ్చేవారు. సాధు సుబ్రహ్మణ్య శర్మ గారు మాత్రం పుస్తకాలు బహుమానంగా ఇచ్చేవారు. సైన్సుని, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి విస్తృతంగా చదవడం తప్పనిసరి అనే ఎరుక నా మటుకు నా చిన్నప్పుడు సాధు సుబ్రహ్మణ్య శర్మ గారిలోనే చూశాను.

చిన్నతనంలో ఆ కాలానికి ఆయన ఇచ్చిన పుస్తకాల విలువ నాకు తెలియ లేదు. అందుకే, చిన్నప్పుడు ఆయన నాకు స్వయంగా బహూకరించిన నండూరి రామ్మోహనరావు 'విశ్వదర్శనం' దర్శనానికి నోచుకోకుండా చాలా కాలం అలాగే ఉండిపోయింది. అందరి చేతా చదివించాలి అనే ఆయన బలమైన ఆశయమే కాకినాడలో సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని నెలకొల్పేలా చేసింది.

'బంకోలా' నవలా రచయితగా సుప్రసిద్ధులైన ఆయన ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి పదవీ విరమణ చేశారు. కాకినాడలో నివాసం. గోదావరి జిల్లా కోనసీమ ప్రాంతంలో గల సముద్ర తీరంలోని కోరంగి రేవు ప్రాంతంలో బ్రిటిష్ కాలం నాటి మత్స్యకారుల జీవన ఘర్షణ, వలస దేశంగా మారుతూ ఉన్న పరిణామాలు, దాని గురించి వారి ఆవేదన కథా వస్తువుగా బంకోలా రాశారు. తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచే నవల అది. అందులో 1825–30లలో వాడుకలో ఉండి కనుమరుగైన అనేక అచ్చ తెలుగు పదాలు కనబడతాయి. ఒక చారిత్రక సందర్భానికి నవలా రూపం ఇవ్వదలచుకున్న రచయిత ఎంత లోతుగా పరిశోధన చేయాలో తెలియజేసే గ్రంథం అది.

ఈ మధ్యే ఆయన్ని కాకినాడ వెళ్లి కలిశాను. అదే ఆఖరి కలయిక అవుతుందని మాత్రం అనుకోలేదు. తొంభైకి పైగా వయసు, నడవలేని స్థితిలో కూడా నేను పుస్తకాల గురించి మాట్లాడితే ఎంతో ఉత్సాహంగా మాట్లాడారు. 'జీవితం చాలా పెద్దది, ఒక సిద్ధాంతానికి పరిమితమవ్వద్దు. విస్తృతంగా తెలుసుకోవాలి' అని చెప్తూ, ఆయన సహాయకురాలితో, 'లైబ్రరీకి తీసుకుని వెళ్ళు' అన్నారు. 'సాధు మెమోరియల్ మినీ లైబ్రరీ మరియు పిల్లల ఆటల కేంద్రము' అని బోర్డు ఉంది. లోపలికి వెళ్తే రెండు గదుల నిండా పుస్తకాలు. ఐదారు పుస్తకాలు తీసుకుని రిజిస్టర్‌లో నోట్ చేశాను. మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళి తీసుకున్న పుస్తకాలు చూపించాను. కొంతసేపు పుస్తకాల గురించి మాట్లాడారు. ఎక్కువ మాట్లాడలేక ఆక్సిజన్ పెట్టుకుంటున్నారు. ఇబ్బంది పెట్టకూడదు అని, 'థాంక్స్ అండి, వెళ్తున్నాను' అన్నాను. ఇంతలో సహాయకురాలిని పిలిచి, ఆయన రాసిన పుస్తకాలు ఇమ్మన్నారు. ఆయనకి చాలా పేరు తెచ్చిన 'బంకోలా' నా దగ్గర ఉండటంతో మిగతా పుస్తకాలు ఇచ్చారు. అందులో ఒకటి 'డయలెక్ట్స్ ఆఫ్ ఎవల్యూషన్స్ సిస్టమ్స్ ఎప్రోచ్ అండ్ న్యూ ఫ్రంటీర్స్ ఆఫ్ ఫిలాసఫీ'. 600 పేజీల పుస్తకం. దానికి రెండవ భాగం కూడా రాయ వలసిందని నేను అంటే, 'అనుకున్నాను కానీ కుదరలేదు' అన్నారు.

నివాళి



◆ గోదావరి సముద్ర తీరంలోని కోరంగి రేవు ప్రాంతంలో బ్రిటిష్ కాలం నాటి మత్స్యకారుల జీవన ఘర్షణ, వలస దేశంగా మారుతూ ఉన్న పరిణామాలు, దాని గురించి వారి ఆవేదన కథా వస్తువుగా 'బంకోలా' (లైట్‌హౌజ్) నవల రాశారు సాధు సుబ్రహ్మణ్య శర్మ.

ఉద్యోగ రీత్యా ట్రాన్స్‌ఫర్లలో ఏ ఊరు వెళ్తే ఆ ఊరులో ఉన్న సెకండ్ హ్యాండ్ బుక్ స్టోర్స్‌కి మా పిల్లలని తీసుకుని వెళ్ళి పుస్తకాలు కొనే వాడిని అని పాత సంగతులను అపురూపంగా గుర్తు చేసుకున్నారు. తొమ్మిది పదుల వయసులో ఒక మంచి మానవ సమాజాన్ని కాంక్షిస్తూ తనకి ఉన్న పరిమితుల్లో సొంతంగా లైబ్రరీ నిర్వహించ డానికి మించిన సార్థకత ఒక మనిషికి ఇంకేముంటుంది! ఆ సార్థక జీవి తన 93వ యేట జూలై 18న తుది శ్వాస విడిచారు. పుస్తకాలు అందరూ చదవాలి, అందరూ ఎదగాలని చివరి క్షణం వరకూ కాంక్షించిన గొప్ప పుస్తక ప్రేమికుడికి ఇవే కన్నీటి నివాళులు.

– పిన్నింటి సాయిపవన్ । న్యాయవాది, 99662 11006

అధ్యాత్మ దీపం

అష్టాదశ పురాణాలలో అన్నిటికంటె ఎక్కువ ప్రసిద్ధి, ప్రాచుర్యం పొందిన పురాణం భాగవత మహాపురాణమే. ప్రజాబాహుళ్యం పరిగణనలో, సనాతన ధర్మసారాన్ని సమగ్రంగా ఆవిష్కరించే గ్రంథ రత్న త్రయం రామాయణ, భారత, భాగవతాలు.

వేద శాస్త్రాలన్నీ కూలంకషంగా నేర్చి, ఇతరులకు నేర్పిన తరువాత కూడా తృప్తి లేక అసంతోషంగా ఉన్న వ్యాసుడు, నారదుడి సూచన మేరకు భాగవతం రచించి, దుఃఖ నివృత్తి పొందగలిగాడు. కారణం, అందులో పదేపదే భగవల్లీలలను బహువిధాలుగా నుతించటం.

అసంఖ్యాకమైన శ్రీహరి అవతారాల్లో, ముఖ్యమైన ఇరవై రెండు అవతారాలలో చూసిన లీలలనూ, చేసిన బోధలనూ భాగవతం వివరిస్తుంది. అందునా, ముఖ్యంగా మత్స్య, కూర్మాది దశావతారాల కథలు. వాటిలో కూడా ప్రధానంగా నారసింహ, వామన, కృష్ణావతార గాథలు. తత్రాపి, ప్రముఖంగా పూర్ణావతారమైన శ్రీకృష్ణుడి దివ్య చరిత్ర.

అంతేకాదు, ఎన్నెన్నో కర్మలనూ, కర్తవ్యాలనూ, విధి నిషేధాలనూ బోధించే ఎన్నెన్నో శాస్త్రాలు వినటం అల్పాయుష్కులైన కలియుగ వాసులకు అసాధ్యం. కాబట్టి వాటి సారాంశాన్నంతా వ్యాసుడు భాగవతంలో నింపాడు. '... ఆత్మ తత్త్వము/ ఆధ్యాత్మ మనబడు, అట్టి ఆధ్యాత్మము/ తెలియ జేయగ జాలు దీపమనగ,/ సకల వేదములకు సారాంశమై, ఏకమై...' ఒప్పారుతుంది భాగవతం. 'వేదం అనే కల్పవృక్షానికి కాసిన పండు భాగవతం. శుకుడు అనే చిలుక దాన్ని కొరకగా, అది మరింత తియ్యబారి, జారి మనకు దొరికింది. దాని రసం అమృతమే. ఆఖరి ఘడియ దాకా, మరల మరల ఆస్వాదించండి' అంటాడు వ్యాస మహర్షి.

తెలుగు వారికి భాగవతమంటే మరీ ప్రీతి. అందుకు కారణం ఆద్యంతమూ మధురాలైన మధురాధిపతి లీలలకు మరింత మాధుర్యాన్ని సంతరించి, రసవత్తరంగా తీయని తెలుగు పద్యాలలో తీర్చి దిద్దిన పోతన్నగారు. ఆయన చేత శ్రీమన్నారాయణ కథా ప్రపంచాన్ని పలికించిన విభుడు స్వయంగా రామభద్రుడే. కాకపోతే, ఆంధ్ర భాగవతానికి అంతటి తీపి ఎందుకు వస్తుంది? ఆ అధ్యాత్మ దీపానికి అంతటి కాంతి ఎలా సంక్రమిస్తుంది?

అతి రహస్యమైన హరి జన్మ కథలను / మనుజు డెవ్వడేని మాపు, రేపు
చాల భక్తి తోడ చదివిన, సంసార / దుఃఖరాశి బాసి తొలగిపోవు!

– మారుతి శాస్త్రి

అబూజ్‌మడ్ అడవుల్లో పేలిన తుపాకీ

- ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టుల మృతి !
- మృతుల్లో ముఖ్య నేతలు..కొనసాగుతున్న కూంబింగ్

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ తూటాల మోత మోగింది. ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టు ముఖ్యనేతలు చనిపోయినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారంపై అందిన సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా విభాగాల భద్రతా బలగాలు గురువారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పలుమార్లు ఎదురుకాల్పులు జరిగాయి. సాయంత్రం ఆ ప్రాంతంలో గాలించగా యూనిఫామ్ ధరించి ఉన్న ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఏకే 47, ఎస్‌ఎల్‌ఆర్ రైఫిళ్లు, మందుపాతరలు, డిటోనేటర్లు, ఇతర పేలుడు సామగ్రి, నిత్యావసర వస్తువులు భద్రతా బలగాలకు లభ్యమైనట్టు తెలిసింది. అయితే మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాక కూడా ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగిస్తున్నట్టు అక్కడి పోలీసు ఉన్నతాధికారుల ద్వారా సమాచారం అందుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరికొందరు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలిసింది. మృతదేహాల వద్ద లభించిన ఆయుధాల ఆధారంగా మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ మృతుల వివరాలను మాత్రం పోలీసు ఉన్నతాధికారులు రాత్రి వరకు వెల్లడించలేదు.


అమ్మా.. అన్న మెట్ల కింద ఊగుతున్నడే..

- ఉరేసుకున్న అన్నను చూసి తల్లిదండ్రులకు చెప్పిన తమ్ముడు
- వైకల్యంపై మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


వశిష్ట

కోరుట్ల: అన్న ఉరేసుకున్నాడని తెలియని తమ్ముడు.. 'అమ్మా.. అన్న మెట్ల కింద ఊగుతున్నడే'.. అని అమాయకంగా తల్లిదండ్రులకు చెప్పాడు. ఉరే సుకున్న పెద్ద కొడుకును చూసి లబోదిబోమన్న తల్లిదండ్రులు కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. చిన్నపాటి వైకల్యానికి మనస్తాపంతో ఒక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ చిరంజీవి కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరు ట్ల పట్టణంలోని భీమునిదుబ్బలో నివసించే వడ్లకొండ మురళి, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వశిష్ట (17)కు పోలియో వల్ల కాలికి కొంచెం వైకల్యం ఉంది. గతేడాది పదో తరగతి పూర్తి చేసుకున్న వశిష్ట.. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌లో చేరాడు. వారం క్రితం సెలవుల్లో ఇంటికి వచ్చిన వశిష్ట.. శుక్రవారం మళ్లీ హైదరాబాద్ బయలుదేరాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులు పనుల్లో ఉన్నప్పుడు.. ఇంటి మూడో అంతస్తు మెట్లకు చీరతో ఉరేసుకున్నాడు. అన్న మెట్ల కింద ఊగుతున్నాడని.. చిన్న కొడుకు చెప్పేసరికి.. కంగారుపడ్డ తల్లిదండ్రులు వెంటనే పైకి వెళ్లి వశిష్టను కిందకు దించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారు.









విద్యుత్‌తో నడిచే ఈ విమానం పేరు సోలార్‌స్ట్రాటోస్. దీన్ని తయారు చేసిన స్విట్జర్లాండ్‌కు చెందిన రాఫెల్ డొంజన్ కంపెనీ శుక్రవారం టెస్ట్ ఫ్లైట్ నిర్వహించింది. ఆ సందర్భంగా ప్రఖ్యాత మాటర్‌హార్న్ పర్వతాల గుండా స్ట్రాటోస్ ఇలా దూసుకెళ్తూ కన్పించింది.

టీఆర్ఎఫ్ ఓ ఉగ్ర సంస్థ

- అమెరికా ప్రకటన
- పహల్గాం దాడి వల్లే నిర్ణయం

వాషింగ్టన్/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడికి పాల్పడిన లష్కరే తొయిబా జేబు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. టీఆర్ఎఫ్‌ను విదేశీ, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అని పేర్కొంది. పహల్గాంలో 26 మందిని విచక్షణారహిత కాల్పులతో బలిగొన్న ఉగ్రవాద దాడికి స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. ఇది జమ్మూకశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు తర్వాత పుట్టుకొచ్చిన లష్కరే జేబు సంస్థ. కశ్మీర్‌లో భద్రతా బలగాలపై, పౌరులపై పలు దాడులకు పాల్పడింది. లౌకిక సంస్థ ముసుగులో మతపరమైన దాడులను కొనసాగించింది. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ సంస్థకు పాకిస్తాన్ నుంచి నిధులు, మద్దతు అందుతున్నాయి. పహల్గాం మారణకాండను 2008లో ముంబైలో లష్కరే జరిపిన దాడుల తర్వాత భారత్‌పై జరిగిన అత్యంత ప్రాణాంతక ఉగ్ర దాడిగా అమెరికా అభివర్ణించింది. కశ్మీర్ రెసిస్టెన్స్ అని కూడా పిలిచే టీఆర్ఎఫ్ పహల్గాం ఉగ్ర దాడి తన పనేనని తొలుత ప్రకటించింది. తర్వాత ఈ దాడి కారణంగా భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు పెచ్చరిల్లడంతో ప్రకటనను వెనక్కు తీసుకుంది.

స్వాగతించిన భారత్

టీఆర్ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా అమెరికా గుర్తించడాన్ని భారత్ స్వాగతించింది. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా మధ్య సహకారాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. టీఆర్ఎఫ్ కార్యకలాపాలను, దానికి నిధులను అంతర్జాతీయ స్థాయిలో అడ్డుకునేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని వెల్లడించింది. ఉగ్రవాదాన్ని అస్సలు ఉపేక్షించకూడదన్న నినాదానికి భారత్ కట్టుబడి ఉందని, ఉగ్రవాద సంస్థలు, వారి ముసుగు సంస్థలు జవాబుదారీగా ఉండేలా చేయడానికి అంతర్జాతీయ భాగస్వాములతో కలిపి పని చేయడాన్ని కొనసాగిస్తామని తెలిపింది. 'టీఆర్ఎఫ్‌ను విదేశీ, అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా గుర్తించినందుకు అమెరికా విదేశాంగ శాఖను, మంత్రి రూబియోకు మా అభినందనలు. ఉగ్రవాదంపై పోరులో భారత్–అమెరికా సహకారానికి ఇది తాజా నిదర్శనం'' అని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. గత ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పీఓకేల్లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఇది ఇరు దేశాల నడుమ సాయుధ ఘర్షణకు దారితీయడం, పాక్ విజ్ఞప్తి మేరకు చివరికి కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం తెలిసిందే.

మృగాళ్లకు అండగా తృణమూల్

పశ్చిమ బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదు

- విచ్చలవిడిగా వసూళ్ల దందా సాగుతోంది
- డబ్బుల కోసం పారిశ్రామికవేత్తలను పీడిస్తున్నారు
- ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

దుర్గాపూర్: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, వారు నిత్యం భయంభయంగా బతకాల్సి వస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన మృగాళ్లను ఆ పార్టీ కాపాడుతోందని ఆరోపించారు. మమతా బెనర్జీ ప్రభుత్వ నిర్వాకం వల్ల బెంగాల్‌లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న వసూళ్ల దందా చూసి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడం లేదని చెప్పారు. ప్రధాని మోదీ శుక్రవారం బెంగాల్‌లో పర్యటించారు. చమురు, గ్యాస్, విద్యుత్, రైలు, రహదారులకు సంబంధించిన రూ.5,400 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. జాతికి అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాపూర్‌లో బహిరంగ సభలో మాట్లాడారు. కోల్‌కతా ఆసుపత్రిలో యువ వైద్యురాలిపై ఘోరంగా అత్యాచారం జరిగిందని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వారిని నిస్సిగ్గుగా వెనకేసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఆ అత్యాచార ఘటన పట్ల దేశమంతా కలవరపాటుకు గురైందని, ఇప్పటికీ కోలుకోలేదని అన్నారు. ఆ ఘటన మర్చిపోకముందే మరో కాలేజీలో మహిళపై అత్యాచారం జరిగిందని ఆక్షేపించారు. ఈ కేసులో నిందితుడికి తృణమూల్ కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్నట్లు బయటపడిందని పేర్కొన్నారు.



శుక్రవారం బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో సభలో మాట్లాడుతున్న మోదీ

రాష్ట్రంలో గూండా ట్యాక్స్

''బెంగాల్‌లో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయి. ప్రజలకు రక్షణ కల్పించడంలో, న్యాయం చేకూర్చడంలో తృణమూల్ కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. ముర్షీదాబాద్‌లో అల్లర్లు జరిగితే పోలీసులు బాధితులనే వేధించారు. బాధ్యులను వదిలేశారు. రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరుగుతుందన్న ఆశలు అడుగంటాయి. వారి ప్రాణాలకే భద్రత లేకుండా పోయింది. ఇదంతా ప్రభుత్వ నిర్వాకం కాదా? తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డబ్బుల కోసం పారిశ్రామికవేత్తలను పీడిస్తోంది. రాష్ట్రంలో ఆర్థిక ప్రగతికి అడ్డు తగులుతోంది. గూండా ట్యాక్స్‌కు భయపడి పారిశ్రామికవేత్తలు బెంగాల్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. పెట్టుబడులు రావడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం తృణమూల్ కాంగ్రెస్‌కు ఎంతమాత్రం ఇష్టం లేదు. బెంగాల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మేము సంకల్పించాం. దేశ ప్రగతికి బెంగాల్‌ను చోదక శక్తిగా మారుస్తాం'' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.



బిహార్‌లోని మోతీహారిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌తో మోదీ

ఈశాన్య భారత అభివృద్ధికి 'వికసిత్ బిహార్'

మోతిహారీ: 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించాలన్న నిర్ణయం బిహార్ గడ్డపైనే తీసుకున్నానని, అది ఎలా విజయవంతమైందో ప్రపంచం చూసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈశాన్య భారతదేశ సమగ్రాభివృద్ధికి 'వికసిత్ బిహార్' అత్యంత కీలకమని స్పష్టంచేశారు. రాష్ట్ర బహుముఖ ప్రగతికి కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ శుక్రవారం బిహార్‌లో పర్యటించారు. తొలుత తూర్పు చంపారన్ జిల్లాలో రూ.7,200 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మోతిహారీ జిల్లా కేంద్రంలో బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 'బనాయేంగే నయా బిహార్, ఫిర్ ఏక్‌బార్ ఎన్డీయే సర్కార్' అనే నూతన నినాదం ఇచ్చారు. దీనిపై జనం పెద్దఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. మళ్లీ ఎన్డీయే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని, సరికొత్త బిహార్‌ను నిర్మించుకుందామని మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతించారు. బిహార్‌లో విపక్ష కాంగ్రెస్–ఆర్జేడీ కూటమిపై ప్రధానమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఆర్జేడీ ప్రభుత్వం పేదల భూములు బలవంతంగా లాక్కుందని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. పేదలు, అణగారినవర్గాల పేరిట కాంగ్రెస్–ఆర్జేడీ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. బిహార్ వెనుకబాటుతనానికి ఆ రెండు పార్టీలే కారణమని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యువత సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని మోదీ వెల్లడించారు. ఇందుకోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేయబోతున్నట్లు ప్రకటించారు. బిహార్ సర్వతోముఖాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, గత 45 రోజుల్లో 24,000 స్వయం సహాయక సంఘాలకు రూ.1,000 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. మోతిహారీని ముంబై తరహాలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మహాత్మా గాంధీ పోరాటానికి బిహార్‌లోని చంపారన్ నూతన దిశను నిర్దేశించిందని మోదీ గుర్తుచేశారు.

కూటమి భేటీలకు మేమిక దూరం

ఇండియా కూటమిలో లేము: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: వర్షాకాల పార్లమెంట్ సమావేశాల ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి భారీ షాక్ తగిలింది. ఈ నెల 21 నుంచి మొదలయ్యే వర్షాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఇండియా పక్షాలు ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ భేటీకి, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే శనివారం ఏర్పాటు చేసిన భేటీకి దూరంగా ఉండనున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. ''ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చామని మా పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఆ కూటమి కేవలం గత లోక్‌సభ ఎన్నికల దాకానేనని కూడా ఆయన అప్పుడే చెప్పారు. కనుక ఇండియా కూటమిలో ఆప్ ఇంకెంతమాత్రమూ భాగం కాదు. టీఎంసీ, డీఎంకే వంటి పార్టీలు మాకు మద్దతిస్తున్నందున పార్లమెంటులో వారితో అంశాలవారీగా సమన్వయాన్ని కొనసాగిస్తాం' అని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ తెలిపారు. బిహార్, యూపీ, పూర్వాంచల్‌లో బుల్డోజర్ రాజ్యం, ఢిల్లీలో పేదల ఇళ్ల కూల్చివేతలపై కేంద్రాన్ని ఆప్ నిలదీస్తుందన్నారు.

కూటమి బలహీనం

గత లోక్‌సభ ఎన్నికల అనంతరం హరియాణా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుంటుందని భావించినా సీట్ల పంపకాల్లో విభేదాలతో అది జరగలేదు. ఆ తర్వాత పంజాబ్, గుజరాత్ ఉప ఎన్నికల్లో కూడా ఆప్ ఒంటరిగానే పోటీ చేసింది. గుజరాత్‌లో విశావదర్ ఉప ఎన్నికల్లో ఆప్ విజయం తర్వాత కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఇండియా కూటమి కేవలం గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించినది మాత్రమే నన్నారు. ''ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తు లేదు. బిహార్ సహా అన్ని ఎన్నికల్లోనూ ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుంది'' అని ప్రకటించారు. దానిపై పార్టీ తాజాగా మరింత స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో విపక్షాల స్వరం నానాటికీ మరింత బలహీనపడుతోందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఆప్‌కు ప్రస్తుతం లోక్‌సభలో 3, రాజ్యసభలో 8 మంది ఎంపీలున్నారు. ఇండియా కూటమి నుంచి ఆ పార్టీ బయటకు రావడం విపక్ష ఐక్యతకు పెద్ద దెబ్బే కానుంది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా జోక్యం, మనపై ఆ దేశ సుంకాలు, బిహార్‌లో ఈసీ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి పలు అంశాలపై వర్షాకాల సమావేశాల్లో కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇలాంటి సమయంలో కీలక బిల్లులపై ఓటింగ్ జరిగే పక్షంలో ఆప్ లేకపోవడం ఇండియా కూటమికి సంఖ్యాపరంగా ఇబ్బందిగా మారనుంది.



మద్యం కుంభకోణం కేసులో...

భూపేశ్ బఘెల్ కుమారుడి అరెస్టు



చైతన్య బఘెల్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘెల్ కొడుకు చైతన్యను మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం అరెస్టు చేసింది. భిలాయ్‌లోని బఘెల్ నివాసాన్ని సోదా చేసిన కాసేపటికే ఆయనను అదుపులోకి తీసుకుంది. శుక్రవారమే చైతన్య పుట్టినరోజు. 'నా కుమారునికి పుట్టినరోజు బహుమతి ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అధికార బీజేపీలోని ఇద్దరు అత్యున్నత నాయకులకు ధన్యవాదాలు' అని భూపేశ్ ఎక్స్‌లో వ్యంగ్య పోస్ట్ పెట్టారు. ''మోదీ, అమిత్ షా ఇచ్చే పుట్టినరోజు బహుమతులు ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్యంలోనూ ఎవరూ ఇవ్వలేరు. గతంలో నా పుట్టినరోజు నాడు అత్యంత గౌరవనీయ నేత అయిన నా సలహాదారుతో పాటు ఇద్దరు ఓఎస్డీల ఇళ్లపైకి ఈడీని పంపారు. ఇప్పుడు నా కొడుకును తన పుట్టినరోజు నాడే ఈడీ అరెస్టు చేసింది. ఈ బహుమతులకు ధన్యవాదాలు. వీటిని జీవితాంతం గుర్తుంచుకుంటా'' అని పేర్కొన్నారు. చైతన్య అరెస్టు రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళానికి దారితీసింది. కాంగ్రెస్ తీవ్ర నిరసనలు నడుమ సమావేశాలను కాసేపు వాయిదా వేశారు.

చమురు ఆదాయ వనరులే లక్ష్యంగా

రష్యాపై ఈయూ, యూకే ఆంక్షలు

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌పై దురాక్రమణ సాగిస్తున్న రష్యాపై యూరోపియన్ యూనియన్, యూకేలు మరింత కఠిన ఆంక్షలను ప్రకటించాయి. రష్యా ఇంధన రంగం, పాతబడిన ట్యాంకర్ నౌకలతో దొంగచాటుగా ముడిచమురు రవాణా, సైనిక నిఘా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. యుద్ధాన్ని ఆపేసే వరకు రష్యాపై ఇలాంటి ఒత్తిడులు కొనసాగుతూనే ఉంటాయని ఈయూ విదేశాంగ విధానం చీఫ్ కాయ కలాస్ చెప్పారు. తాజా ఆంక్షలు అత్యంత కఠినమైనవన్నారు. ఇందులో భాగంగా ముడిచమురు ధరను మార్కెట్ ధర కంటే తక్కువగా 60 నుంచి 45 డాలర్ల వరకు తగ్గిస్తున్నట్లు ఈయూ తెలిపింది. 27 దేశాలతో కూడిన ఈయూ చమురు బారెల్ ధరను 48 డాలర్లుగా నిర్ణయించింది. అమెరికా సహా జీ7 గ్రూప్ దేశాలు సైతం ఈ విషయంలో తమతో కలిసి వస్తాయని ఈయూ ఆశిస్తోంది. అయితే, తాజా ఆంక్షలపై అమెరికా స్పందించకపోవడం గమనార్హం. ఆయిల్ విక్రయాల ద్వారా పెద్దమొత్తంలో ఆర్జిస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చే మొత్తాన్ని ఉక్రెయిన్‌తో యుద్ధానికి వాడుతున్నట్లు ఈయూ ఆగ్రహంతో ఉంది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే ఈయూయేతర దేశాలపైనా నిషేధం విధించింది. రష్యా, జర్మనీల మధ్య ఉన్న నార్డ్ స్ట్రీమ్ పైపులైన్ల ద్వారా రష్యా చమురు సరఫరా చేయకుండా నిషేధం విధించింది. అంతేకాదు, రష్యాలోని బ్యాంకులు ఎలాంటి నిధులు సేకరించకుండా, ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించకుండా ఆంక్షలు ప్రకటించింది ఈయూ. ఇందులో చైనాకు చెందిన రెండు బ్యాంకులున్నాయి. దీంతోపాటు, రష్యా మిలటరీ ఇంటెలిజెన్స్ విభాగం జీఆర్‌యూ లక్ష్యంగా యూకే మరిన్ని ఆంక్షలను విధించింది. ఉక్రెయిన్‌లోని మరియుపోల్‌లోని ఓ థియేటర్‌లో 2022లో తలదాచుకున్న వారిపై బాంబు దాడికి కుట్ర పన్నడంతోపాటు, రష్యా ఏజెంట్ కుటుంబాన్ని నెర్వ్ ఏజెంట్‌తో చంపేందుకు యత్నించినందుకు జీఆర్‌యూకు చెందిన 18 మంది అధికారులపై ఆంక్షలు అమలవుతాయని తెలిపింది.



కాయ కలాస్

భారత్‌లోని రాస్‌నెఫ్ట్ రిఫైనరీపై ప్రభావం

ఈయూ విధించిన ఆంక్షల ప్రభావం భారత్‌లోని రష్యా ఇంధన సంస్థ రాస్‌నెఫ్ట్ నడిపే రిఫైనరీపైనా పడనుంది. ఈ విషయాన్ని ఈయూ విదేశాంగ విధానం చీఫ్ కాయ కలాస్ తెలిపారు. బ్యారెల్ ధరను 60 డాలర్లకు తగ్గించడంతో రాస్‌నెఫ్ట్ సంస్థ భారత్‌లో క్రూడాయిల్‌ను ఈ ధరకే అమ్మాల్సి ఉంటుందన్నారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేసే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా నుంచి ఏకంగా 40 శాతం అందుతోంది. ఈయూ ఆంక్షలతో అంతిమంగా భారత్ లాభపడనుంది. గుజరాత్‌లోని వడినా ర్‌లో ఉన్న నయారా ఎనర్జీ లిమిటెడ్‌లో రాస్‌నెఫ్ట్‌కు 49.13% వాటా ఉంది. ఇక్కడి రిఫైనరీలో ఏడాదికి 20 మిలియన్ టన్నుల చమురు శుద్ధి అవుతుంది. తాజా ఆంక్షలతో నయారా కంపెనీ యూరప్ దేశాలకు పెట్రో ఉత్పత్తులను విక్రయించడం కుదరదు.

కమిటీ నివేదికను రద్దు చేయండి

- నా ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర
- సుప్రీంకోర్టులో జస్టిస్ వర్మ పిటిషన్

న్యూఢిల్లీ: నోట్ల కట్టల విషయంలో అంతర్గత విచారణ కమిటీ నివేదికను సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నివేదికను రద్దు చేయాలని కోరుతూ గురువారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తనపై అభిశంసన చర్యలు ప్రారంభించాలంటూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చేసిన సిఫార్సులను సైతం సవాలు చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వాన్ని, సుప్రీంకోర్టును ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఎంక్వైరీ కమిటీ నివేదికను రద్దు చేయాలంటూ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి ఒకరు సుప్రీంకోర్టును ఆశ్రయించడం అత్యంత అరుదైన ఘటన అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఒకవైపు ఏర్పాట్లు జరుగుతుండగా, మరోవైపు ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. నోట్ల కట్టల వ్యవహారంలో తన వాదన పూర్తిగా వినకుండానే నివేదిక రూపొందించారని అంతర్గత ఎంక్వైరీ కమిటీ తీరును ఆయన తప్పుపట్టారు. ఈ దర్యాప్తులో లోపాలు ఉన్నాయని స్పష్టంచేశారు. తనకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలు కమిటీకి లభించలేదన్నారు. తనను దోషిగా తేల్చాలన్న ముందస్తు వ్యూహంతోనే నివేదిక సిద్ధంగా చేశారని విమర్శించారు. తనపై దర్యాప్తు ప్రక్రియ మొత్తం రాజ్యాంగవిరుద్ధంగా సాగిందని, తన ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదికపై తాను అధికారికంగా స్పందించకముందే దాన్ని మీడియాకు లీక్ చేశారని, తన ప్రతిష్టను దెబ్బ తీయాలన్న కుట్ర జరిగిందని జస్టిస్ వర్మ మండిపడ్డారు. అందుకే ఈ నివేదికను రద్దు చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.



అభిశంసన తీర్మానం ప్రవేశపెడతాం: మేఘ్వాల్

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోసం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ శుక్రవారం వెల్లడించారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎంపీలేనని, ఇందులో ప్రభుత్వం పాత్ర ఏమీ ఉండదని తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు జడ్జిని పదవి నుంచి తొలగించే హక్కు పార్లమెంట్‌కు ఉందని గుర్తుచేశారు. అభిశంసన తీర్మానానికి లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యుల మద్దతు అవసరమని అన్నారు.

అమెరికా కల చెదురుతోంది..!

80 శాతం తగ్గిన మన విద్యార్థులు • యూరప్ దేశాలవైపు వారి చూపు • ఏడాదిలోనే పరిస్థితులు తారుమారు

ముదురు పాకాన పడుతున్న అమెరికా వీసా సంక్షోభం భారతీయ విద్యార్థుల పాలిట పిడుగుపాటుగా మారుతోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటినుంచీ విద్యార్థి వీసాలపై నానారకాల ఆంక్షలు విధిస్తుండటంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి అన్న చందంగా తయారవుతోంది. దాంతో పై చదువుల నిమిత్తం అగ్ర రాజ్యానికి వెళ్లే మనవాళ్ల సంఖ్యలో ఈ ఏడాది ఏకంగా 70 నుంచి 80 శాతం తగ్గుదల నమోదైందని హైదరాబాద్‌కు చెందిన పలు ఎడ్యుకేషన్ కన్సల్టెంట్లు ఆందోళన వెలిబుచ్చారు. వీసా అపాయింట్‌మెంట్లను ఉన్నట్టుండి ఫ్రీజ్ చేయడం, వీసా దరఖాస్తుల తిరస్కరణల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండటం వంటివి కూడా ఇందుకు కారణంగా నిలుస్తున్నట్టు వారు వివరించారు. ''మామూలుగానైతే ఏటా ఈ సమయానికల్లా విద్యార్థులు వీసా ఇంటర్వ్యూలు పూర్తి చేసుకుని, అమెరికా వెళ్లే ఏర్పాట్లలో తలమునకలుగా ఉంటారు. ఈసారి మాత్రం మేమింకా వీసా స్లాట్లు అందుబాటులోకి వచ్చాయా అని రోజూ ఎంబసీ పోర్టల్‌ను చెక్ చేసుకునే దశలోనే ఉన్నాం! ఇంత దారుణ గత కొన్నేళ్లలో ఎన్నడూ లేదు'' అంటూ వాపోయారు. ఇది చాలదన్నట్టు ఈసారి వీసా స్లాట్లను అమెరికా ఎంబసీలు దశలవారీగా విడుదల చేస్తున్నాయి. చెప్పా పెట్టకుండా ఉన్నట్టుండి కొత్త నిబంధనలు తెచ్చేస్తున్నాయి. ఇలాంటి ఆకస్మిక నిర్ణయాలు మొత్తం వీసా ప్రక్రియపై విద్యార్థుల్లో టెన్షన్ పెంచేస్తున్నాయి. అంతేకాదు. ఎలాగోలా వీసా స్లాట్లు బుక్కయినా, స్లాట్ దొరికిందంటూ విద్యార్థులకు కన్ఫర్మేషన్ రావడం లేదు. కొత్తగా అప్‌డేట్ చేసిన స్లాట్ సిస్టంను ఎంబసీలు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తుండటమే ఇందుకు కారణం కావచ్చని కన్సల్టెంట్లు అంటున్నారు. కానీ ఈ పరిణామం విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి లోను చేస్తోంది. ''మరికొద్ది రోజుల్లో గనక వీసా స్లాట్లను విడుదల చేయకపోతే వేలాది మంది భారత విద్యార్థుల అమెరికా చదువుల కల కల్లగా మిగిలిపోనుంది. వాళ్లు తీవ్ర ఆందోళనతో రోజూ ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు'' అని ఓ కన్సల్టెంటు ఆవేదన వెలిబుచ్చారు. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ మాత్రం వీసా స్లాట్ల ప్రక్రియ పునఃప్రారంభమైందని, అపాయింట్‌మెంట్ల కోసం విద్యార్థులు తరచూ వెబ్‌సైట్లో చూస్తుండాలని సూచించారు. గతేడాది రికార్డు స్థాయిలో ఏకంగా 3.3 లక్షల మందికి పైగా భారత విద్యార్థులు పై చదువుల నిమిత్తం అమెరికా వెళ్లారు. ఈ విషయంలో చైనాను అధిగమించి భారత్ తొలి స్థానంలో నిలిచింది కూడా! కానీ ట్రంప్ రాకతో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. 2024 జనవరి నాటికి 11.6 లక్షలకు పైగా భారత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్నట్టు విదేశాంగ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. యూరప్ దేశాలకు వెళ్తున్న మన విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది.

ఇతర దేశాలే ముద్దు

అమెరికా వీసా కోసం అష్టకష్టాలు పడేకంటే ఇతర దేశాలను చూసుకోవడమే మేలని భారత విద్యార్థుల్లో అత్యధికులు భావిస్తున్నారు. ''అమెరికా కలలను నిజం చేసుకునే ప్రయత్నంలో ఇప్పటికే ఏడాది వృథా చేసుకున్నా. ఇంకా దానిమీదే ఆశలు పెట్టుకుని మరో ఏడాది కూడా కోల్పోవడానికి సిద్ధంగా లేను. నాలాంటి ఎంతోమంది విద్యార్థుల అమెరికా కలలకు నా ఉద్దేశంలోనైతే ముగింపు కార్డు పడ్డట్టే'' అని 23 ఏళ్ల ఓ ఆశావహ విద్యార్థి చెప్పుకొచ్చాడు. ఇప్పుడతను ఆటోమోటివ్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసేందుకు జర్మనీ వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు.

214(బి)తోనే సమస్య!

గత మార్చిలోనే వీసా స్లాట్లు బుక్ చేసుకుని ఎట్టకేలకు ఇంటర్వ్యూ దాకా వెళ్తున్న భారత విద్యార్థుల్లో అత్యధికులకు ఎంబసీ నుంచి మొండిచెయ్యే ఎదురవుతోంది! ఈ పరిణామంపై కన్సల్టెంట్లే విస్తుపోతున్నారు. మంచి అకడమిక్, సోషల్ మీడియా రికార్డు తదితరాలుండి, గతేడాది దాకా అనాయాసంగా వీసాలు లభించిన ప్రొఫైళ్లను ఈసారి నిర్ద్వంద్వంగా తిరస్కరించేస్తున్నారు. అమెరికా ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్‌లోని 214(బి) సెక్షనే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. చదువు పూర్తయ్యాక మాతృదేశానికి కచ్చితంగా తిరిగి వెళ్తామన్న నమ్మకాన్ని ఎంబసీ అధికారులకు మనవాళ్లు కల్పించలేకపోతున్నారు. ''ఈ నిబంధనలు కొత్తవేమీ కాదు. ఏళ్లుగా ఉన్నవే. కానీ వాటిని ఈ ఏడాదే తొలిసారి అమలు చేస్తున్నారు'' అని డాలస్‌లో ఇమిగ్రేషన్ కన్సల్టింగ్ సంస్థ నడుపుతున్న రవి లోతుమల్ల వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



బ్లాక్ పాంథర్స్ డే ఔట్!

తమిళనాడులోని నీలగిరి అడవుల్లో రెండు చిరుతలతో కలిసి రాత్రి వేళ సరదాగా షికారుకు బయల్దేరిన అరుదైన బ్లాక్ పాంథర్

కాళ్ల వద్ద వాపు.. చేతి వద్ద గాయం..!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై అనుమానాలు
- అది సాధారణ అనారోగ్యమేనన్న వైట్‌హౌస్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(80) ఆరోగ్యంపై మరోసారి వదంతులు చెలరేగాయి.ఆదివారం న్యూజెర్సీలో జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ తిలకించేందుకు వచ్చిన ట్రంప్‌నకు కాళ్ల వద్ద నరాలు ఉబ్బిపోయినట్లుగా కనిపించడం, కుడి చేతిపై పలు చోట్ల వాపు కనిపించడంపై పలు దృశ్యాలు ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేశాయి. ట్రంప్ వాస్తవ ఆరోగ్య స్థితిని కప్పిపుచ్చేందుకు అధ్యక్ష యంత్రాంగం ప్రయత్నిస్తోందా? అంటూ ఎక్స్‌లో ఓ యూజర్ అనుమానం వ్యక్తం చేశాడు. అధ్యక్షుడు ట్రంప్ శ్వాస సంబంధ సమస్యతో బాధపడు తున్నట్లుగా మరికొందరు నెటిజన్లు పేర్కొన్నారు. ఇలా వస్తున్న రకరకాల వదంతులపై అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. వీన్స్ ఇన్‌సఫియెన్సీ అనే సిరల వ్యాధితో ట్రంప్ బాధపడుతున్నారన్నారు. 70 ఏళ్లు దాటిన వారిలో సాధారణంగా కనిపించేదేనని చెప్పారు. 'ట్రంప్ కాళ్ల దిగువ భాగంలో, చీలమండ వద్ద వాపును వైద్యులు పరీక్షించారు. దీన్ని సాధారణ లోపంగా నిర్ధారించారు. భయపడాల్సిన అవసరం లేదన్నారు'అని ఆమె తెలిపారు. ఇతర వైద్య పరీక్షల్లో గుండె వైఫల్యం, కిడ్నీ వైఫల్యం వంటివి లేనట్లు వైద్యులు చెప్పారని తెలిపారు.



సాక్షి
హైదరాబాద్

శనివారం । 19 । జూలై । 2025



భగాయత్‌లో కంపు కంపు!
ఉప్పల్ భగాయత్ కంపుమయంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కడంతో చెత్త కుప్పను తలపిస్తోంది. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. -8లో



పుట్-పుట్.. వీకెండ్ సెట్..
నగరంలో కొత్త తరహాలో సందడి చేస్తున్న ఆటే మినీ గోల్ఫ్. చిన్న గోల్ఫ్, పుట్-పుట్, క్రేజీ గోల్ఫ్ పేరు ఏదైనా గోల్ఫ్ క్రీడకు ఇది డిటో అనే చెప్పాలి. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/22.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం పడే సూచనలున్నాయి. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఆటోలకు అనుమతులు ఎప్పుడో?

పెండింగ్‌లో డ్రైవర్ల ప్రొసీడింగ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: ఆటోరిక్షా అనుమతుల కోసం అర్హులైన డ్రైవర్లు పడిగాపులు కాస్తున్నారు. రవాణాశాఖ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం షోరూమ్‌లలో వివరాలను నమోదు చేసుకున్న సుమారు 12 వేల మందికి పైగా డ్రైవర్లకు ఆర్టీఏ నుంచి ఇప్పటి వరకు ప్రొసీడింగ్‌లు లభించలేదు. ఔటర్‌రింగ్‌రోడ్డు పరిధిలో ఆటోడ్రైవర్‌లకు ఉపాధిని కల్పించేందుకు 65 వేల కొత్త ఆటోలకు ప్రభుత్వం పర్మిట్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రవాణాశాఖ విధివిధానాలను అమలు చేసింది. ఈ నెల 7 నుంచి షోరూంలలో ఆటోడ్రైవర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. కానీ ఇప్పటి వరకు కేవలం వెయ్యి మందికి మాత్రమే రవాణా శాఖ ప్రొసీడింగ్‌లు ఇచ్చినట్లు తెలిసింది. కనీసం 11వేల మంది డ్రైవర్లకు ఇంకా ప్రొసీడింగ్‌లు లభించలేదు. ఎల్పీజీ, సీఎన్జీ కేటగిరీల్లో 20 వేల ఆటోలు, ఎలక్ట్రిక్ కేటగిరీలలో 20 వేల ఆటోలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మరో 25 వేల ఆటోలను ఎల్పీజీ లేదా సీఎన్జీ నుంచి ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు వీలుగా రిట్రోఫిట్‌మెంట్‌లను ఏర్పాటు చేసుకొనే వెసులుబాటును ఇచ్చింది. ఇప్పటి వరకు ఎల్పీజీ కేటగిరీకి చెందిన ఆటో పర్మిట్లు పూర్తయ్యాయి. సీఎన్జీ, ఎలక్ట్రిక్ కేటగిరీలకు చెందిన ఆటోలు మాత్రమే ఉన్నాయి. నిబంధనలకనుగుణంగా పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ 15 రోజుల్లో కేవలం వెయ్యి మందికి మాత్రమే ప్రొసీడింగ్‌లు ఇచ్చారని ఏఐటీయూసీ కార్యదర్శి బి.వెంకటేశం విమర్శించారు. ప్రొసీడింగ్‌లలో జాప్యంతో ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుందరీకరణ దిశగా నియోపోలిస్ కూడలి

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్ నియోపోలిస్ జంక్షన్ సరికొత్త అందాలను సంతరించుకోనుంది. హైదరాబాద్ చారిత్రక, వారసత్వ, సాంస్కృతిక లక్షణాలు ప్రతిబింబించేలా జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు సత్వాకు చెందిన ఎడెన్ బిల్డ్‌కాన్ ముందుకొచ్చింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ మేరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)తో సత్వా గ్రూపు ఒక అవగాహన ఏర్పాటు చేసుకొంది. నియోపోలిస్ సెజ్ మెయిన్ వద్ద ఉన్న రోటరీ, నియోపోలిస్ నుంచి, మోకిలా రోడ్డులోని రెండు త్రికోణ కూడళ్లను అభివృద్ధి చేసి పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దనున్నారు. సాంస్కృతిక శిల్పాలు, కళాకృతులను ఏర్పాటు చేయనున్నారు. ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కూడా సత్వా గ్రూపు చేపట్టనుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని హెచ్ఎండీఏ అధికారులు కోరారు.

త్వరలో ఫతేనగర్ ఫ్లై ఓవర్ పునరుద్ధరణ

జీహెచ్ఎంసీ టెండర్ నోటిఫికేషన్ జారీ

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు ఫ్లై ఓవర్లకు రంగులు వేసే పనులు మాత్రమే కాకుండా పాడైపోయిన వాటిని బాగుచేసే చర్యలకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఫతేనగర్ ఫ్లై ఓవర్ పునరుద్ధరణ పనులకుగాను పరిశోధన, స్టెబిలిటీ, పునరుద్ధరణ పనులకు సంబంధించి కన్సల్టెన్సీ సర్వీసులను ఆహ్వానిస్తూ జీహెచ్ఎంసీ టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. బల్కంపేట ఆలయం నుంచి ఫతేనగర్ రోడ్ వరకు.. ఫతేనగర్ ఫ్లై ఓవర్ జంక్షన్ నుంచి సనత్‌నగర్ రోడ్ వరకు ఫ్లై ఓవర్ పునరుద్ధరణతోపాటు ఫుట్‌పాత్‌లు, మీడియన్లు, డక్ట్‌ల ఏర్పాటుకు అర్హత గల ఏజెన్సీల నుంచి కన్సల్టెన్సీ సేవలను ఆహ్వానించింది. ఎంపికయ్యే ఏజెన్సీ అవసరమైన అన్ని పరీక్షలు చేసి రెండునెలల్లోగా సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకుగాను టెండర్ల దాఖలుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువుంది. బ్రిడ్జి శిథిలావస్థకు చేరడం, ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు పునరుద్ధరణ పనులకు సిద్ధం కావడం గమనార్హం.

వచ్చే నెలలో ఓయూ 84వ స్నాతకోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 84వ స్నాతకోత్సవం ఆగస్టు 3వ వారంలో జరగనుంది. పీహెచ్‌డీ పూర్తి చేసిన స్కాలర్స్ డాక్టరేట్ డిగ్రీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్ శుక్రవారం పేర్కొన్నారు. ఓయూలో రెగ్యులర్, దూరవిద్య కేంద్రం, అటానమస్ కాలేజీల్లో డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు వచ్చే నెల 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.500 అపరాధ రుసుముతో ఆగస్టు 8 నుంచి 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొ.శశికాంత్ పేర్కొన్నారు. ఓయూలో 2023 నవంబరు 1 నుంచి 2025 ఆగస్టు 6 వరకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీని సాధించిన స్కాలర్స్ 84వ స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. పీహెచ్‌డీ స్కాలర్స్ రూ.2200 ఫీజు, ఇతర విద్యార్థులకు రూ.1400 ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను చూడవచ్చు.


దిల్‌సుఖ్‌నగర్‌లో వరద నీటిలో వాహనాలు

అమీర్‌పేట్ ధరమ్‌కరమ్ రోడ్డుపై భారీగా వరద




చైతన్యపురిలో సహాయక చర్యలు

ముంపు ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ముంపు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యటించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు కూడా రంగంలోకి దిగాయి. వరద నీటితో ఇళ్లలో చిక్కుకున్న బాధితులను డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



చినుకుతో చిగురుటాకులా..

భారీ వర్షంతో వణికిన నగరం

భారీ వర్షంతో మహా నగరం చిగురుటాకులా వణికింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో శుక్రవారం సిటీ విలవిలలాడింది. వరద నీటితో రహదారులు నీట మునిగాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాంతో వాహన చోదకులు నరకయాతన అనుభవించారు. అర కిలోమీటర్ దూరానికి గంటల కొద్దీ సమయం పట్టింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో బస్తీల వాసులు ఇబ్బందుల పాలయ్యారు. నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. రాత్రి 9 గంటల వరకు బోయినపల్లిలో 11.5 సెం.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. - సాక్షి, సిటీబ్యూరో


నగరంలో వాహనదారుల వాన కష్టాలు


నల్లగొండ ఎక్స్ రోడ్డులో ట్రాఫిక్ జాం


వీఎస్టీ వద్ద..


అమీర్‌పేట్‌లో..


గచ్చిబౌలిలో నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

హైడ్రాకు ఏడాది

HYDRAA

2024 జూలై 19న ఏర్పాటు చేసిన ప్రభుత్వం

- చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాకు చెక్
- ముంపు, విపత్తుల సమయంలో డీఆర్ఎఫ్ చొరవ
- ఇప్పటి వరకు రూ.30 వేల కోట్ల విలువైన భూమికి 'కంచె'

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏడాది పూర్తి చేసుకుంది. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ నేతృత్వంలో ఈ విభాగానికి రూపమిస్తూ ప్రభుత్వం గత ఏడాది జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. తొలినాళ్లల్లో కేవలం చెరువుల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు పైనే దృష్టి పెట్టిన ఈ విభాగం ఆపై తన పంథా మార్చింది. జలవనరులతో పాటు పార్కులు, ప్రభుత్వ స్థలాలు, నాలాలు తదితరాల్లో ఉన్న ఆక్రమణల్నీ తొలగిస్తోంది. ఈ ఏడాది కాలంలో రూ.30 వేల కోట్లకు పైగా విలువైన 500 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ నుంచి బయటకు వచ్చి..

గతంలో జీహెచ్ఎంసీ అధీనంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) ఉండేది. దీని పరిధి పరిమితంగా ఉండేది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల వరకు ఉన్న ప్రాంతంలో విపత్తు నిర్వహణ, స్పందన ఒకేలా ఉండాలని భావించిన ప్రభుత్వం హైడ్రాకు రూపమిచ్చింది. 'గ్రేటర్'తో పాటు ఓఆర్ఆర్‌కు ఆనుకుని, అవతలి వైపు ఉన్న అన్ని ప్రాంతాలను దీని పరిధిలోకి తీసుకువచ్చింది. గత జనవరి నుంచి రాణిగంజ్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి ఏర్పాటు చేస్తోంది. ఫిర్యాదుదారుల అర్జీల ఆధారంగా హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణల్ని తక్షణమే కూల్చేస్తోంది.

తొలిదశలో ఆరు చెరువుల్లో పునరుజ్జీవం...

ఓపక్క రాజధానిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను సాంకేతికంగా గుర్తించడానికి హైడ్రా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో (ఎన్నారెస్సీ) కలిసి పని చేస్తోంది. ఈ కసరత్తు త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మరోపక్క హైడ్రా తొలి దశలో రాజధానిలోని ఆరు చెరువులను పునరుద్ధరించి, సుందరీకరిస్తోంది. కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా ఈ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. బతుకమ్మకుంట, సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, భుమ్రుఖ్ ఉద్దీన్ దౌలా చెరువులను ఎంపిక చేసుకున్నారు. బతుకమ్మ కుంట పనులు పూర్తి కావస్తున్నాయి.

విపత్తు నిర్వహణలోనూ..

విపత్తు నిర్వహణలోనూ హైడ్రా కేవలం ఓఆర్ఆర్ వరకు పరిమితం కావట్లేదు. రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా రెస్క్యూ ఆపరేషన్స్‌లో ముందుంటోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22 నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ కూలిపోయి అనేక మంది అందులో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంతో పాటు ఇటీవల సంగారెడ్డి జిల్లాలో జరిగిన సిగాచీ పేలుడు రెస్క్యూ ఆపరేషన్‌లోనూ డీఆర్ఎఫ్ పాల్గొంది. నగరంలో వర్షం కురిసిన, చెట్లు కూలిన సందర్భాల్లో రోడ్లపైకి వచ్చి పని చేస్తోంది. ఈ విభాగం నుంచి కొందరు ట్రాఫిక్ వలంటీర్లుగా పని చేస్తూ పోలీసులకు సహకరిస్తున్నారు. రద్దీ వేళల్లో రహదారుల ఉంటూ ట్రాఫిక్ నియంత్రిస్తున్నారు.

చెరువుల పునరుద్ధరణకు బతుకమ్మ కుంట ఓ రోల్‌మోడల్

అంబర్‌పేట: గ్రేటర్ పరిధిలో చెరువుల అభివృద్ధికి అంబర్‌పేట బతుకమ్మకుంట రోల్ మోడల్‌గా నిలుస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రాకు ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలిసి ఆయన బతుకమ్మకుంట అభివృద్ధిని పరిశీలించారు. బతుకమ్మకుంట పునరుద్ధరణ తీరును పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా వివరించారు. చెరువుల పునరుద్ధరణ అవసరాలపై విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. బతుకమ్మకుంట పరిసర ప్రాంతాలు భావితరాలకు ఒక కానుకగా ఉంటాయన్నారు. రాబోయే బతుకమ్మ వేడుకలను ఇక్కడ పునరుద్ధరించిన చెరువులో నిర్వహించుకునేలా అందంగా ముస్తాబు చేస్తామన్నారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. తాను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఇక్కడ చెత్త, ముళ్ల చెట్లు ఉండేవని, ప్రస్తుతం ఒక అందమైన నీటి చెరువుగా మార్చడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, మాజీ ఎంపీ వీహెచ్, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.


బతుకమ్మకుంట వద్ద విద్యార్థులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, కలెక్టర్ హరిచందన

అప్రమత్తంగా ఉండండి

నగర ప్రజలకు, అధికారులకు మేయర్ సూచన

లక్డీకాపూల్: భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. అవసరమైన సహాయం హెల్ప్‌లైన్ 040- 21111111 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో మాన్సూన్ ఎమర్జెన్సీ, హైడ్రా బృందాలు ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఆమె ఆదేశించారు. రోడ్డుపై నిలిచిన నీటితో, నాలా వద్దకు వృద్ధులు, పిల్లలు వెళ్లకుండా చూడాలని నగర ప్రజలను కోరారు. ఆపద సమయంలో జీహెచ్ఎంసీ హెల్ప్ నంబర్‌తో పాటు హైడ్రా హెల్ప్‌లైన్ నంబర్ 90001 13667ను సంప్రదించాలని మేయర్ విజయలక్ష్మి కోరారు.

ఔటర్‌పై ఘోర ప్రమాదం

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా విషాదం


కావలి బాల్‌రాజ్


గుగులోతు జనార్దన్


జడ కృష్ణ


మాలోతు చందులాల్


భాస్కర్‌రావు

- మితిమీరిన వేగంతో లారీని ఢీకొన్న కారు
- నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- చికిత్స పొందుతూ మరొకరి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్: బతుకుదెరువుకోసం పొట్ట చేతపట్టుకొని వలస వచ్చారు. నిత్యం పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. దైవ దర్శనం కోసం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లికి చెందిన కావలి బాల్‌రాజ్ (40) చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వరంగల్ జిల్లా మాసంపల్లి తండాకు చెందిన మాలోతు చందులాల్ (29), ఏపీలోని విజయనగరం జిల్లా కలంరాజుపేటకు చెందిన జడ కృష్ణ (25) మొయినాబాద్‌లోని డ్రీమ్ వ్యాలీ రిసార్ట్‌లో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా వెదుళ్లవలసకు చెందిన దాసరి భాస్కర్‌రావు (39) డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా దాసరితండాకు చెందిన గుగులోతు జనార్దన్ (45) మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సోలార్ విల్లాస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. బాల్‌రాజ్ నిర్వహిస్తున్న చికెన్ సెంటర్ వద్దకు వీరంతా తరచూ వస్తుండడంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అందరూ స్నేహితులుగా మారారు. గురువారం రాత్రి బాల్‌రాజ్ సొంత కారు తీసుకొని ఐదుగురూ కలిసి యాదగిరిగుట్టకు వెళ్లారు. దర్శనం అనంతరం శుక్రవారం తెల్లవారుజామున ఘట్కేసర్ నుంచి మొయినాబాద్‌కు ఔటర్‌రింగ్‌రోడు మీదుగా వస్తుండగా బొంగ్లూర్ ఎగ్జిట్ 12కు సమీపంలో 108 కేఎం వద్దకు రాగానే నిద్రమత్తు, అతివేగంతో కారు డ్రైవింగ్ చేస్తున్న చందులాల్ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. కారు ముందుభాగం లారీ వెనుకభాగంలో ఇరుక్కుపోవడంతో కారు నుజ్జునుజ్జయింది. జనార్దన్, చందులాల్, బాల్‌రాజ్, భాస్కర్‌రావు కారులోనే ఇరుక్కుపోయి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు. కృష్ణ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చందులాల్‌కు జనార్దన్ వరుసకు బాబాయ్ అవుతాడు.


నుజ్జునుజ్జయిన కారు

కొత్వాల్ బన్‌గయా మేజిస్ట్రేట్

ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్వహించిన సీపీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా (ఎగ్జిక్యూటివ్) మారారు. పాతబస్తీలోని చెత్తబజార్‌లో ఉన్న కొత్వాల్ హౌస్‌లో కార్యనిర్వాహక న్యాయస్థానం నిర్వహించారు. మీర్‌చౌక్, కాలాపత్తర్, బండ్లగూడ, కంచన్‌బాగ్, సంతోష్‌నగర్, మంగళ్‌హాట్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ పోలీసులు తన ముందు ఉంచిన అంశాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రౌడీషీటర్లు, నేరస్తులతో పాటు అసాంఘిక శక్తులను మందలించారు. వాళ్లు ఇటీవల చేసిన నేరాలు, ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకుంటూ భవిష్యత్తులో ఇలాంటి వ్యవహారాలు ఉపేక్షించమని స్పష్టం చేశారు. మొత్తం ఎనిమిది గ్యాంగులకు సంబంధించిన కేసుల్ని విచారించిన ఆయన నగరంలో ఎవరైనా ప్రజా జీవితానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసినా, రౌడీ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూసేందుకు తనకు ఉన్న ఈ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలను భవిష్యత్తులోనూ వినియోగిస్తానని చెప్పిన ఆనంద్ కేసుల్ని తదుపరి విచారణ కోసం వాయిదా వేశారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

హిమాయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (కేఎంఈఎస్) 85వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. యువత భవిష్యత్ కోసం ప్రధాని మోదీ బంగారు బాటలు వేస్తున్నారని అన్నారు. యువత అవకాశాలు అందిపుచ్చు కోవాలని, కష్టపడి చదివి లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. అన్ని రంగాలలో ఏఐ, చాట్ జీపీటీ తదితర ఆధునిక టెక్నాలజీ దూసుకు పోతుందన్నారు. దేశంలో ప్రధాన నాగరాలలో సెమీ కండక్టర్స్, తదితర ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిని చేపడుతున్నట్లు తెలిపారు. మోదీ ఆవిష్కరించిన ఏఐ చిప్‌లలో కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మెడికల్, ఇంజినీరింగ్ తదితర సీట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కేఎంఈఎస్ లాంటి అనేక విద్యా సంస్థలు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా నుంచి వచ్చి భారత్‌లో చదువుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అనంతరం విద్యారంగం, ఎన్‌సీసీ, క్రీడలు, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సేవా రంగంలో ప్రతిభ కనబర్చిన వారికి, ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ ఢీకొని యువతి మృతి



లావణ్య (ఫైల్)

మూసాపేట: రోడ్డు దాటుతుండగా ఓ మహిళను క్రేన్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేటలోని చైతన్య బస్తీకి చెందిన దాసరి లావణ్య (29) హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. గురువారం మధ్యాహ్నం మూసాపేట నుంచి ప్రశాంత్‌నగర్‌కు వెళ్తుండగా బాలానగర్ నుంచి వై జంక్షన్ వైపు వస్తున్న క్రేన్ రోడ్డు దాటుతున్న లావణ్యని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్‌లో శాంతిభద్రతల్ని మంటగలుపుతున్నారు..

కాంగ్రెస్ హయాంలో అన్నీ అరాచకాలే

- పోలీస్ శాఖ ఆత్మాభిమానాన్ని చంపుకొని పనిచేస్తోంది..
- హైదరాబాద్‌లో ఒక్క సీటు రాలేదని కక్షగట్టి గూండా రాజకీయాలు
- కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు



కార్పొరేటర్ మేకల సునీత, రాముయాదవ్‌లను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

గౌతంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో శాంతి భద్రతలు కనుమరుగవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అల్వాల్‌లో ఇటీవల ఆషాడమాసం బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గొడవల కారణంగా గాయపడిన గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ భర్త మేకల రాముయాదవ్ తదితర బీఆర్ఎస్ నేతలను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నక్సల్స్ చెలరేగిపోతారని, శాంతిభద్రతలు అదుపుతప్పుతాయని రకరకాలుగా మాట్లాడరని, కానీ బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో భారత దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ అభివృద్ధిని, శాంతి భద్రతల పరిరక్షణను గుర్తించిన ప్రజలు 2018, 2023 శాసన సభ ఎన్నికలలో హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తిరుగులేని విజయాన్ని అందించారన్నారు. అలాగే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జీహెచ్ఎంసీలో 99 కార్పొరేటర్ సీట్లు గెలిచి రికార్డు సృష్టించామన్నారు. హైదరాబాద్‌లో ఒక్క ఎమ్మెల్యే సీటు రాలేదనే కోపంతో ఇక్కడి ప్రజలమీద పగబట్టి శాంతియుత వాతావరణాన్ని చెడగొడుతున్నారని కాంగ్రెస్ పాలకులపై మండిపడ్డారు.

పోలీసులు ఏం చేస్తున్నారు?

హైదరాబాద్‌లో నగరంలో పిచ్చి కుక్కలు బాగా పెరిగిపోయాయని, అలాగే మల్కాజిగిరిలో కూడా పిచ్చి కుక్కలు బాగా పెరిగిపోయాయన్నారు. మల్కాజిగిరి చౌరస్తాలో గంటసేపు ట్రాఫిక్‌జాం చేస్తూ..'నేను ఇక్కడికి వచ్చిన..నువ్వు రా' అని, బస్తీమే సవాల్ అని చెప్పి చిల్లర రాజకీయాలు చేస్తుంటే పోలీస్ యంత్రాంగం ఏం చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేలను, నాయకులను అరెస్టు చేసుడు కాదు..ఇలాంటి గూండాగాళ్లను నియంత్రించాలన్నారు. మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడకనే రౌడీలతో దాడులు చేయిస్తోందని విమర్శించారు.

అధికారం శాశ్వతం కాదు..

'ఎప్పుడూ..ఎవ్వరికీ రాజకీయ అధికారం శాశ్వతం కాదు. మళ్లీ మా టైం వస్తది. ఈ రోజు కట్టు బానిసల్లాగా పనిచేస్తున్న అధికారులను మా ప్రభుత్వం వచ్చిన తరువాత ఏం చేయాలో రాసి పెట్టుకుంటున్నాం' అని కేటీఆర్ హెచ్చరించారు. పోలీసులు కాంగ్రెస్‌కు తొత్తులుగా పనిచేస్తూ ఇటీవల గాయపడిన మేకల రాము యాదవ్‌పై ఏడు కేసులు, జగదీష్ గౌడ్, చిన్నాయాదవ్, కార్పొరేటర్ సబిత కిషోర్‌లపై కేసులు నమోదు చేశారని, దాడికి పాల్పడ్డ వారిపై మాత్రం ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. మల్కాజిగిరికి చెందిన మాజీ ఎమ్మెల్యే గతంలో డైరెక్టుగా సిద్దిపేటకు వెళ్లి మా మాజీ మంత్రి హరీష్‌రావు కార్యాలయంపై దాడి చేసి..అక్కడున్న బోర్డులను ధ్వంసం చేసి హరీష్‌రావును పెట్రోపోసి తగలపెడతానని బహిరంగంగా మాట్లాడితే కేసులు పెట్టలేని సన్నాసులు, పిరికిపందలు ఈ రాష్ట్ర పోలీసులు అని దుయ్యబట్టారు. విధ్వంసకర రాజకీయాల కారణంగా ఇటీవల పక్కరాష్ట్రంలో ఓ ఐపీఎస్ అధికారి రాజీనామా చేసి వెళ్లిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. మల్కాజిగిరిలో మా పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులపై దాడి జరిగితే రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్‌లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వస్తామని, అప్పుడు పూర్తి బాధ్యత డీజీపీ, రాష్ట్ర హోం మంత్రి, పోలీసులదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో అధ్యాపకులు గీసిన చిత్రాలతో కూడిన 'మేనేజ్ చేద్దాం' చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

భగాయత్‌లో కంపు కంపు!

అధ్వానంగా మారిన పారిశుద్ధ్య నిర్వహణ

- ఎటు చూసినా చెత్త కుప్పలే..
- విజృంభిస్తున్న దోమలు..వైరల్ ఫీవర్లు
- ఆందోళనలో నివాసితులు



ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు

ఉప్పల్: చక్కటి లేఅవుట్..మంచి గ్రీనరీ, వెడల్పాటి రోడ్లతో ఆకర్షణీయంగా కన్పించే ఉప్పల్ భగాయత్ ఇప్పుడు కంపుమయంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కడంతో చెత్త కుప్పగా మారింది. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తిందని స్థానికులు మండిపడుతున్నారు. కాలనీ అంతటా..రోడ్లపై ఎక్కడ చూసినా చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా కన్పిస్తున్నాయి. నెలల తరబడి వాటిని తరలించకపోవడంతో రోజురోజుకు కుప్పలు భవనాల ఎత్తును మించుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇక వర్షాకాలం కావడంతో చెత్తకు వరద నీరు చేరి మురుగు మయం అవుతోంది. దీంతో దోమలు పెరిగి స్థానికులు నిద్రకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీహెచ్ఎంసీ ఏం చేస్తుంది?

ఉప్పల్ భగాయత్ పరిస్థితులను చూస్తే అసలు జీహెచ్ఎంసీ వ్యవస్థ ఉందా లేక నిద్రపోయిందా అనే అనుమానాలు కలగక మానదు. రోడ్లుకు ఇరువైపుల ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పారబోస్తున్నా బల్దియా అధికారుల దృష్టికి రాకపోవడం విడ్డూరం. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన అతి పెద్ద హెచ్ఎండీఏ లే అవుట్ ఉప్పల్ భగాయత్. ఫేజ్-1, ఫేజ్-2లుగా విభజించిన ఈ లేఅవుట్ 420 ఎకరాల పైమాటే. ఇప్పటికే రెండు వేలకు పైగానే కుటుంబాలు నివాసముంటున్నాయి. సంవత్సరానికి రూ.5 కోట్లకు పైగానే ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. అదనంగా నిర్మాణాల అనుమతులతో సంవత్సరానికి దాదాపుగా రూ.3 వేల కోట్లకు పైగానే ఆదాయం వస్తోంది. అయినా కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ భగాయత్‌లో వసతుల లేమిపై స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024లోనే లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో పాటు స్థానిక కార్పొరేటర్ సైతం తన వంతుగా కృషి చేయగా జీహెచ్ఎంసీ ఉప్పల్ భగాయత్‌కు ప్రత్యేకంగా 21 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించింది. వీరంతా ఫేజ్-1 ప్రధాన రోడ్లపైనే దృష్టి సారిస్తూ ఫేజ్-2లో గుర్తు వచ్చినప్పుడు మాత్రమే వచ్చి కొంత మేర మాత్రమే రోడ్లు ఊడుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నెల రోజులు పడుతుంది..



ఉప్పల్ భగాయత్‌కు ప్రత్యేకంగా ఈ మధ్య కాలంలోనే 21 మంది సిబ్బందిని ఏర్పాటు చేశాం. ముందుగా ప్రధాన రహదారులు, ఆ తర్వాత అంతర్గత రోడ్లపై దృష్టి సారిస్తాం. రెండో ఫేజ్‌లోనూ పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. బోనాల పండుగ దృష్ట్యా సిబ్బంది ఆ ఏర్పాట్లలో నిమగ్న మయ్యారు. అందువల్ల పారిశుద్ధ్య పనుల్లో కొంతమేర జాప్యం జరుగుతోంది. పెద్ద పెద్ద చెత్త కుప్పలను తొలగించేందుకు ఇంకా నెల రోజులు పట్టవచ్చు. ఈలోగా రోడ్ల శుభ్రతపై దృష్టి సారిస్తాం.

- రాజు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్

పట్టించుకునే నాథుడే లేడు..



అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదు. ట్యాక్స్‌లు మాత్రం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. రోడ్లు, పారిశుద్ధ్యంపై పట్టింపు లేదు. లోకాయుక్తలో కేసు వేస్తే గాని దిగి రాలేదు. అప్పటి నుంచి కొంత మంది సిబ్బందిని నామమాత్రంగా కేటాయించారు. ముందుగా పేరుకుపోయిన పెద్ద చెత్త కుప్పలను తొలగించేందుకు యంత్రాలు అవసరం. త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలుస్తాం.

- మేకల మధుసూదన్‌రెడ్డి, ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇరువురి నుంచి రూ.1.18 కోట్లు

- కాజేసిన సైబర్ నేరగాళ్లు, కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఇద్దరి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.18 కోట్లు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లాలాగూడకు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి (83) గత నెల 23న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ఈయన పేరుతో మనీలాండరింగ్ కేసులో అరెస్టు వారెంట్ జారీ అయిందంటూ భయపెట్టాడు. ఈడీ జారీ చేసినట్లు ఓ నకిలీ లేఖను సృష్టించి వాట్సాప్ ద్వారా పంపాడు. అందులో తన ఆధార్ నెంబర్ కూడా ఉండటంతో వృద్ధుడు నమ్మేశాడు. అరెస్టు ముప్పును తప్పించుకుని, ఈ కేసు నుంచి బయటపడాలంటే లాయల్టీ పేమెంట్ కట్టాలని చెప్పిన సైబర్ నేరగాళ్లు దఫదఫాలుగా రూ.32.2 లక్షలు కాజేశారు. యూసుఫ్‌గూడకు చెందిన మరో వృద్ధుడికి (64) పెట్టుబడుల పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.86 లక్షలు కాజేశారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెల నుంచి ఈ తంతు నడిచింది. సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు తమ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టాలని ఎర వేశారు. తొలినాళ్లల్లో చిన్నమొత్తాలు పెట్టుబడిగా పెట్టించి, లాభాలు చూపించారు. ఆపై పెద్ద మొత్తం పెట్టిన తర్వాత విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. నగదు తీసుకోవాలంటూ మరికొంత మొత్తం కట్టాలంటూ బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.86 లక్షలు కాజేశారు.

'బంగ్లా' నుంచి వచ్చి బ్లాక్‌మెయిలింగ్స్!

రీతూ రావుగా మారిపోయిన రీతూ మోనీ

- సోషల్ మీడియా ద్వారా పురుషులకు ఎర
- ఇద్దరితో సహజీవనం..మరొకరితో పెళ్లి
- స్థానికురాలిగా దరఖాస్తు చేసి గుర్తింపు కార్డులు..
- నాటకీయంగా వెలుగులోకి వచ్చిన వైనం
- ఇద్దరిని అరెస్టు చేసిన నల్లకుంట పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: బంగ్లాదేశ్‌కు చెందిన రీతూ మోని బతుకుతెరువు కోసం అక్రమంగా నగరానికి వచ్చింది. రీతూ రావుగా మారి ఇక్కడే ఉంటూ సోషల్‌మీడియా ద్వారా ఎర వేసి పలువుర్ని ఆకర్షించింది. ఇద్దరితో సహజీవనం చేసిన ఆమె మరో వివాహితుడిని వివాహం చేసుకుంది. వీరిలో ఒకరి చిరునామాతో ఆధార్ కార్డు, పాన్‌కార్డు తీసుకుని... మరొకరి చిరునామాతో అప్‌డేట్ చేయించింది. ఈమె వ్యవహారం నాటకీయంగా వెలుగులోకి రావడంతో కేసు నమోదు చేసిన నల్లకుంట పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

ఒకరి తర్వాత మరొకరితో...

అక్రమంగా సరిహద్దులు దాటిన రీతూరావు 2020లో హైదరాబాద్ చేరుకుంది. ఉద్యోగం కోసం వచ్చినట్లు ఇక్కడ నివసిస్తూ సోషల్‌మీడియా ద్వారా ఆసిఫ్‌నగర్‌కు చెందిన నరేష్‌ను పరిచయం చేసుకుంది. అతడితో కొన్నాళ్లు సహజీవనం చేసిన రీతూ..ఆసిఫ్‌నగర్ చిరునామాతో ఆధార్ కార్డు, పాన్ కార్డు తీసుకుంది. ఈ చిరునామాతోనే సిమ్‌కార్డులు సంగ్రహించింది. కొన్నాళ్లకు సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన గన్‌ఫౌండ్రీ వాసి శంకర్‌రావు వద్దకు చేరింది. ఆ సందర్భంలో తన ఆధార్ కార్డును గన్‌ఫౌండ్రీ చిరునామాకు అప్‌డేట్ చేసుకుంది. ఈమె ధోరణి కారణంగా శంకర్ తరచు ఘర్షణకు దిగేవాడు. ఓ దశలో అతడిని భయపెట్టడానికి ఇంట్లోనే షాంపూ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో శంకర్ ఆమెను గుడిమల్కాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. దీనిపై గుడిమల్కాపూర్ ఠాణాలో కేసు నమోదైంది.

ఆస్పత్రిలో వదిలి వెళ్లిపోవడంతో...

నరేష్, శంకర్‌లతో సహజీవనం చేస్తున్న సందర్భంలోనే రీతూ నిజామాబాద్‌కు చెందిన ప్రవీణ్‌ను ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం చేసుకుంది. ఓ సందర్భంలో వీరిద్దరూ నగరంలోని ఓయో రూమ్‌లో గడిపారు. తాను గుడిమల్కాపూర్ ఆస్పత్రిలో ఉన్నానని, శంకర్ వదిలేసి వెళ్లిపోయాడంటూ రీతూ ప్రవీణ్‌కు ఫోన్ చేసింది. ఆస్పత్రికి వెళ్లిన అతడు బిల్లు చెల్లించిన ఆమెను తీసుకుని వెళ్లి విద్యానగర్‌లోని తన ఫ్లాట్‌లో ఉంచాడు. కొన్నాళ్లు సహజీవం చేసినా.ఆమె ఒత్తిడి మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 15న యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నాడు. ఓ సందర్భంలో ఆమెకు సంబంధించిన బంగ్లాదేశీ గుర్తింపు పత్రాలను అతడు చూశాడు. నిలదీయగా రీతూ సైతం అసలు విషయం చెప్పింది. అదే సమయంలో పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో భయపడిపోయిన ప్రవీణ్ ఆమెను వదిలి నిజామాబాద్ వెళ్లిపోయాడు.

భార్యకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి...

తనను విడిచి వెళ్లిపోయిన ప్రవీణ్‌ను తన దారికి తెచ్చుకోవాలని భావించిన రీతూ అతడి భార్యకు సోషల్‌మీడియా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపింది. ఆమె యాక్సెప్ట్ చేసిన తర్వాత ప్రవీణ్‌తో అయిన పెళ్లి ఫొటోలు షేర్ చేసింది. వీటిని చూసిన ప్రవీణ్ భార్య షాక్‌కు గురై భర్తను నిలదీసింది. నిజం చెప్పిన అతడు ప్రస్తుతం రీతూ డబ్బు కోసం వేధిస్తోందని, బెదిరిస్తోందని వాపోయాడు. దీంతో ఇద్దరూ కలిసి వచ్చి నల్లకుంట ఠాణాలో రీతూపై ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా రీతూను పోలీసులు ఠాణాకు పిలిపించారు. ఆమె విచారణ నేపథ్యంలోనే బంగ్లాదేశీగా గుర్తించారు. న్యాయనిపుణుల సలహా మేరకు డిపోర్టేషన్ చేయాలని నిర్ణయించుకుని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అయితే ఆమె ఆధార్, పాన్ కార్డులు పొందినట్లు తేలడంతో బుధవారం కేసు నమోదు చేశారు. రీతూతో పాటు ఆమెను వివాహం చేసుకుని వదిలేసిన ప్రవీణ్‌ను అరెస్టు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నరేష్, శంకర్ కోసం గాలిస్తున్నారు.

ముగ్గురు చిక్కారు!

- సీపీఐ నేత చందు నాయక్ హత్య కేసులో పురోగతి
- హత్య జరిగిన రోజు రాజన్న వెంట ఉన్న ఇద్దరు..
- పారిపోవడానికి సహకరించిన క్యాబ్ డ్రైవర్ అదుపులోకి..
- వీరిలో ఒకరిపై విశాఖపట్నంలో చోరీ కేసు
- ప్రధాన నిందితుల కోసం వేట కొనసాగింపు

సాక్షి, సిటీబ్యూరో: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ అలియాస్ చందు నాయక్‌ను కాల్చి చంపిన కేసులో ముగ్గురు నిందితులను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరిపై విశాఖపట్నంలో చోరీ కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు. పొరుగు రాష్ట్రంలో తలదాచుకున్న ప్రధాన సూత్రధారుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలు, ఆధిపత్యపోరుతో పాటు వివాహేతర సంబంధం కూడా కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చందు నాయక్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న రాజన్న అలియాస్ రాజేష్ తుపాకులు సమకూర్చుకోవడంతో పాటు తన అనుచరుడైన ఏడుకొండలు, ప్రశాంత్ సహా ఐదుగురితో కలిసి రంగంలోకి దిగాడు. దాదాపు నెల రోజులుగా హత్య పథకాన్ని అమలులో పెట్టడానికి ప్రయత్నాలు చేశాడు. చివరకు మంగళవారం ఉదయం 6.10 గంటల ప్రాంతంలో చందు ద్విచక్ర వాహనంపై, శాలివాహననగర్ పార్కు వద్దకు వచ్చారు. అప్పటికే చందు ఇంటి సమీపంలోని బాలాజీ కిరాణా స్టోర్స్ వద్ద రాజన్న, ఏడుకొండలు, ప్రశాంత్ కారులో వేచి ఉన్నారు. పార్కు వద్ద మరో ఇద్దరు అనుచరుల్ని ఉంచారు. వాకింగ్ ముగిసిన తర్వాత చందు నాయక్ పార్కులోనే తన స్నేహితులైన అంజన్న, డాక్టర్ నాగరాజు తదితరులతో మాట్లాడి పార్కు నుంచి బయటకు రాగా..రాజన్న, ఏడుకొండలు, ప్రశాంత్ ఆయన కళ్లల్లో కారం కొట్టి, తుపాకీతో కాల్చి చంపేశారు. ఈ హత్యకు కాపుకాసిన ఇద్దరూ తమ దారిలో వెళ్లిపోగా..రాజేష్, ఏడుకొండలు, ప్రశాంత్ అదే కారులో ప్రధాన రహదారి వరకు వెళ్లారు. అక్కడ రాజన్న, ప్రశాంత్ దిగిపోగా..ఏడు కొండలు కారు తీసుకువెళ్లి అద్దెకు ఇచ్చిన సంస్థకు అప్పగించాడు. అప్పటికే అక్కడ తమ అనుచరుడైన క్యాబ్ డ్రైవర్‌ను రాజన్న సిద్ధంగా ఉంచాడు. అతడి సహకారంతో నగరం దాటి వెళ్లిపోయాడు. మిగిలిన నిందితులూ పారిపోయారు. ఘటనాస్థలి నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను విశ్లేషించిన పోలీసులు క్యాబ్ డ్రైవర్‌తో పాటు పార్కు వద్ద కాపుకాసి, చందు కదలికపై రాజన్నకు ఉప్పందించిన ఇద్దరినీ గుర్తించారు. ఈ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని క్యాబ్ స్వాధీనం చేసుకున్నారు. రాజన్న అనుచరులు ఇద్దరిలో ఒకరు కొన్నాళ్ల క్రితం విశాఖపట్నంలో చోరీ చేశాడు. అక్కడి ఠాణాలో నమోదైన ఈ కేసు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. హైదరాబాద్ పోలీసుల విచారణలో సదరు నిందితుడు ఈ నేరాన్నీ అంగీకరించాడు. ఈ ముగ్గురినీ వివిధ కోణాల్లో విచారిస్తున్న పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు రాజన్న సహా మిగిలిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

లయన్స్‌క్లబ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీగా ఉమా శంకర్

పంజగుట్ట: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320ఏ, అడిషనల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీగా అమీర్‌పేటకు చెందిన సమాజ సేవకులు లయన్ పి.ఉమా శంకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అభయ బంజార క్లబ్ అధ్యక్షులు లయన్ అదిరెడ్డి, కార్యదర్శి లయన్ చంద్రశేఖర్, సూర్యనారాయణ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఉమా శంకర్ రెడ్డి అభయ బంజారా క్లబ్ ద్వారా పదేళ్లుగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు, వికలాంగులకు సైకిళ్లు పంపిణీ, వృద్ధులకు దుస్తులు, పేద విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ ఫీజులు చెల్లిస్తూ నిత్యం ప్రజా సేవలో ఉంటారని గుర్తుచేశారు. గతంలో ఆయన లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా క్లబ్ సెక్రటరీగా, అధ్యక్షుడిగా, లయన్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎ జోనల్ చైర్‌పర్సన్‌గా, గత సంవత్సరం రీజనల్ చైర్‌పర్సన్‌గా సేవలు అందించారని కొనియాడారు.

శాకంబరి దేవిగా రాజరాజేశ్వరి



ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని పూలు, పండ్లు, కూరగాయలు, భిన్న రకాల ఆకు కూరలతో అందంగా అలంకరించారు. శాకంబరి దేవిగా ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా బోనాల వేడుకలు..



బోనాల వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టేలా బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో వేపమండలతో అలంకరించిన బోనం కుండను తలపై మోసుకెళ్తూ సభకు తీసుకువెళ్లారు. పోతరాజులు నృత్యాలు, శివసత్తుల పూనకాలతో ప్రాంగణం హోరెత్తింది. ఈ సందర్భంగా ప్రజా శ్రేయస్సు కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజల మనిషి మాగంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రజల మనిషిగా తన నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషిచేసి వేలాది అభిమానులను సొంతం చేసుకున్న వ్యక్తి మాగంటి గోపీనాథ్ అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గణపతికాంప్లెక్స్ సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంగళరావునగర్ డివిజన్ నేతలు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను పక్కాగా అందిస్తూ, ఎప్పుడు కష్టం వచ్చినా తోడుగా నిలిచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు నియోజకవర్గంతో ఎనలేని బంధం ఉందన్నారు. ఆయన లేని లోటు తీరనిదన్నారు. కార్పొరేటర్ దేదీప్య, రాజ్‌కుమార్ పటేల్, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు..



పెద్దమ్మ గుడిలో షెడ్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ దేవస్థానం ఆవరణలో చెత్తకుప్పల వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తులు బోనాల మొక్కులు తీర్చుకున్న అనంతరం ఇక్కడే షెడ్లలో విందు భోజనాలు చేస్తారు. ఈ షెడ్ల ప్రాంతంలోనే గుట్టలుగా చెత్త పేరుకుపోయి వ్యర్థాల దుర్వాసనతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ వ్యర్థాలు తొలగించాల్సి ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఆలయ నిర్వాహకులు పేరుకుపోయిన వ్యర్థాల విషయంలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



పంజగుట్ట మెట్రో స్టేషన్ కింద నిలిచిన వరద నీరు..



సోమాజిగూడ బొంగుల బస్ట్ రోడ్డులో..



ప్రజాభవన్ వద్ద..

దంచికొట్టిన వాన

జన జీవనం అస్తవ్యస్తం • చెత్తతో మూసుకుపోయిన వరద నీటి కాల్వలు • పలు ప్రాంతాలు జలమయం



వరద నీరు నిలిచిన ప్రాంతంలో హైడ్రా పోలీసులు

బంజారాహిల్స్: ఉరుములతో కూడిన కుండపోత వర్షంతో శుక్రవారం నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల పరిధిలోని పలు బస్తీలు, కాలనీలు నీటమునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీరు వెళ్లే మార్గాల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో రహదారులపై మోకాళ్ల లోతు నీళ్లు నిలిచాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన వాన రాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, లక్డీకాపూల్, శ్రీనగర్ కాలనీ, శ్రీకృష్ణానగర్, ఇందిరానగర్, ఫిలింనగర్, వెంకటగిరి, అమీర్‌పేట తదితర ప్రాంతాలన్నీ నీటమునిగాయి. ఫిలింనగర్‌లోని పలు బస్తీల్లో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది. బంజారాహిల్స్‌లోని సింగాడికుంట, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్, నాయుడు నగర్, ఎస్సీటీనగర్ బస్తీవాసులు వరద నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమాజిగూడలో మక్తాలో వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చౌరస్తా మాదాపూర వరకు ట్రాఫిక్ స్తంభించింది, అమీర్‌పేట, పంజగుట్ట, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తా, విరించి ఆస్పత్రి చౌరస్తా, యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ రోడ్లలో వరద నీటిలో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైడ్రా, మాన్‌సూన్ టీమ్‌లు అక్కడక్కడ కనిపించగా ట్రాఫిక్ పోలీసులే రోడ్డెక్కి చెత్తను తొలగించి నీటిని సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. గంటల తరబడి వాహనదారులు నరకాన్ని చూడగా నివాసితులు ఇళ్ళల్లో చేరిన నీటిని బయటికి తోడుకోవాల్సి వచ్చింది.





బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు జంక్షన్‌లో వర్షం...







అమీర్‌పేట్ చర్మాస్ జంక్షన్‌లో..

ఘనంగా అమ్మవారి కుంకుమార్చన



పూజలో పాల్గొన్న మహిళలు

హిమాయత్‌నగర్: ఆషాఢమాసం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ), హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామావళి, కుంకుమార్చన హిమాయత్‌నగర్‌లోని బాలాజీభవన్ టీటీడీ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. అర్చకులు రాఘవచార్యులు పూజ చేయించారు. మహిళలందరికి కుంకుమ పూలు, మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాలు అందజేశారు. ధర్మ ప్ర చార పరిషత్ సహాయ కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణ, ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్, కల్యాణ మండపం మేనేజర్ నీరజ, ధర్మ ప్రచార మండలి సభ్యులు నిషిత, జూనియర్ అసిస్టెంట్ సతీష్, రమణ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలక్రిష్ణ, సల్మాన్ బేగ్ పాల్గొన్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనం

మంత్రి వివేక్ వెంకటస్వామి



పట్టు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి వివేక్, బాబా ఫసియుద్దిన్

రహమత్‌నగర్: బోనాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శమని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం బోరబండ లో కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ నగరంలో జరిగే బోనాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. తన చిన్నతనంలో తల్లితో కలిసి సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్స వాల్లో పాల్గొనేవాడినని గుర్తు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర సుభిక్షంగా ఉండాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గత కొంత కాలంగా బోరబండ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాలకు పట్టు వస్త్రాలు అందించడం బాబా ఫసియుద్దిన్ మత సామరస్యానికి నిదర్శమ న్నారు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ మాట్లాడుతూ బోరబండ డివిజన్‌లో అన్ని మతాల ఉ త్సవాలు, పండుగలు కలిసి మెలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌కుమార్ గౌడ్, బండారి అశోక్, ఆనంద్, ఖయ్యూంలతో పాటు ఆలయ కమిటీ చైర్మన్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిమ్స్ పరిపాలన వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఆస్పత్రి పరిపాలన వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు చేపట్టనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఇందుకు సిక్స్ సిగ్మా విధానాలు కీలకమైన సాధనంగా నిలుస్తున్నాయన్నారు. శుక్రవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల సిక్స్ సిగ్మా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిమ్స్ వైద్యం పట్ల ఉన్న నమ్మకంతో రోజు రోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా పరిపాలన విభాగం మరింత సమర్థవంతంగా సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఆస్పత్రి పరిపాలనలో సవాళ్లను అధిగమించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. నిమ్మ సత్యనారాయణ, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు డా.ఎన్. లక్ష్మీ భాస్కర్, డా.కేవీ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డా. రాకేష్ , డా. చరణ్ రాజ్, ఎంహెచ్ఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మార్త రమేష్, ఆర్ఎంఓ సయ్యద్ సల్మాన్ పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ కల్పించాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా బీసీలపై దాడులు, గ్రామ బహిష్కరణలు జరగడం బాధాకరమని పలువురు నేతలు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఇటీవల బీసీలపై దాడుల నేపథ్యంలో 'బీసీ రక్షణ చట్టం – ఆవశ్యకత' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ డాక్టర్ పూర్ణచంద్ర రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, జీవీఆర్ నారగోణి, విజయ్‌కుమార్, మేకపోతుల నరేందర్ గౌడ్ పాల్గొన్నారు. వెనుకబడిన తరగతులపై వివక్ష, అణచివేత నిరోధక చట్టం 2025 ముసాయిదాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ .. సమాజంలో బీసీలు గౌరవంగా బతకాలంటే బీసీ రక్షణ చట్టం తేవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం తీసుకువస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. చిరంజీవులు మాట్లాడుతూ ..బీసీల్లో 3743 కులాలు ఉన్నట్లు గుర్తించారని అందులో 984 కులాలు ఒక్క ఉద్యోగం కూడా సంపాదించకపోవడం అంటేనే ఎంత వెనకబాటులో ఉన్నారో అర్థమౌతుందన్నారు. జనాభాలో సగభాగం ఉన్నా వ్యాపారం, సినిమా, రాజకీయం, మీడియా అన్ని రంగాల్లో బీసీలు వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సోగరా బేగం, చపర్తి కుమార్, విజయ్ కుమార్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో టోకరా..

వెంగళరావునగర్: డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చందానగర్‌కు చెందిన శ్రీనివాసరావు ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం తన స్నేహితుడైన కట్టా రామ సురేష్ ద్వారా తోట రవి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. జీహెచ్ఎంసీలో అధికారిగా పని చేస్తున్నట్లు చెప్పుకున్న అతను డబుల్ బెడ్‌రూం ఇంటిని రూ.20 లక్షలకు ఇప్పిస్తానని చెప్పాడు. ఆ తర్వాత కొన్నాళ్లు రవి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఎల్లారెడ్డిగూడకు పిలిపించాడు. అక్కడ అతడికి కాటూరి నారాయణమ్మ, వెంకట్ అనే వ్యక్తులను జీహెచ్ఎంసీ అధికారులుగా పరిచయం చేయడంతో అతను వారి డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం రూ.80 వేలు చెల్లించాడు. సదరు వ్యక్తులు అతడిని నమ్మించేందుకు తెల్లపేపర్‌పై ఇంటికి సంబంధించిన వివరాలు టైప్ చేయించి, ఆఫీసు సీల్ వేయించి అందజేశారు. దానిని తీసుకుని శ్రీనివాసరావు ఆన్‌లైన్‌లో పరిశీలించగా అది డూప్లికేట్‌గా గుర్తించాడు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను విక్రయిస్తామని ఇదే తరహాలో బి.కుమార్‌బాబు, కాటూరి నారాయణమ్మ, వెంకట్ అనేకమందిని మోసం చేసి లక్షలు వసూలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శ్రీనివాసరావు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో నివసించే గాలీబ్ సాహెబ్ ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చి మూడు నెలల క్రితం వసీమా (31) అనే యువతిని మూడో పెళ్లి చేసుకున్నాడు. గత కొద్ది రోజులుగా అతను భార్యను అదనపు కట్నం తేవాలంటూ ఒత్తిడికి చేస్తున్నాడు. దీంతో ఆమె ఈ విషయాన్ని తన తల్లిదండ్రులు, సోదరుడి దృష్టికి తీసుకెళ్లింది. గురువారం కూడా వేధించడంతో మనస్తాపానికి లోనైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు హఫీజుద్దీన్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు గాలీబ్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు

ఖైరతాబాద్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని బైండ్ ఓవర్ చేసిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.శుక్రవారం ఉదయం ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయం ఎదురుగా రోడ్డుపై అదే ప్రాంతానికి చెందిన మహిళ జిజి బాయి మద్యం విక్రయిస్తుండటంతో దాడి చేసిన పోలీసులు ఆమె నుంచి 80 మద్యం బాటిళ్లు, రూ.4300 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఆమెపై కేసులు ఉండటంతో ఆర్డీఓ సమక్షంలో బైండ్ ఓవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్టూడెంట్ వీసా ఇప్పిస్తానని మోసం..

వెంగళరావునగర్: వీసా ఇప్పిస్తానని యువకుడి నుంచి నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎల్లారెడ్డిగూడకు మహ్మద్ జాఫర్‌కు 2023లో దావూద్ హుస్సేన్ అనే వ్యక్తి ద్వారా మూసా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతను పోర్చుగల్ ఏజెంట్‌గా పరిచయం చేసుకున్నాడు. దీంతో జాఫర్ ఆస్ట్రేలియన్ స్టూడెంట్ వీసా కావాలని కోరాడు. మూసా అందుకు సరేనని తనకు రూ.3.45 లక్షలు ఇస్తే వీసా ఇప్పిస్తానని చెప్పడంతో జాఫర్ అతడికి నగదు ఇచ్చాడు. ఎంతకాలమైనా తనకు వీసా రాకపోవడంతో జాఫర్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని వారిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. మూసా రూ.75 వేలు ఇచ్చాడు. మిగిలిన నగదు అతడి భార్య యాస్మిన్ సుల్తానాకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆమె పోలీసు కేసులకు భయపడి పోర్చుగల్ పారిపోయింది. ఇటీవల తిరిగి నగరానికి రావడంతో బాధితుడు మహ్మద్ జాఫర్ తనను మోసం చేసిన దావూద్ హుస్సేన్, మూసా, యాస్మిన్ సుల్తానాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం..

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఏడుకొండలు వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. ఈనెల 14న అతను తన బైక్‌ను తాను ఉంటున్న అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో పార్క్ చేశాడు. అనంతరం సొంత పనిమీద నంద్యాల వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షేక్‌పేట మండల కార్యాలయంలో బోనాల వేడుకలు..



బోనాల వేడుకల్లో పాల్గొన్న జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుందరెడ్డి తదితరులు..

బంజారాహిల్స్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల వేడుకలు శుక్రవారం షేక్‌పేట మండల కార్యాలయంలో ఘనంగా జరిగాయి. హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుందరెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, షేక్‌పేట మండల తహశీల్దార్ వై.అనితారెడ్డితో పాటు హైదరాబాద్ జిల్లాకు చెందిన 16 మంది మండల తహశీల్దార్లు, కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. మండల కార్యాలయ ఆవరణలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎర్రగడ్డలో..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానికులు అమ్మవారి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలహారబండి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. బీఆర్ఎస్ నేత దివంగత ఎమ్మెల్యే మాగంటి సోదరుడు మాగంటి వజ్రనాథ్ ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో ఫలహారబంగి ఊరేగింపులో పాల్గొన్నారు.

సంస్కార్ స్కూల్‌లో...

మోతీనగర్ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో చిన్నారులు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోనం ఎత్తి సందడి చేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

కల్లును నిషేధిస్తే మద్యపానాన్ని కూడా నిషేధించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: లిక్కర్ మాఫియాకు తలొగ్గి ఓఆర్ఆర్ పరిధిలో కల్లును నిషేధిస్తామంటే ఊరుకునేది లేదని, లక్షలాదిమందితో నిరసన వ్యక్తం చేస్తామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కల్తీని అరికట్టలేక ఒక కులవృత్తిని దానిపై ఆధారపడ్డ వేలాది మంది పొట్ట కొడతామనడం సరికాదని, కల్తీకి తాము కూడా పూర్తిగా వ్యతిరేకమని, కల్తీ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కల్లును నిషేధించి జాతి ద్రోహులుగా మిగులుతారా ..? లేక అడ్డుకుని జాతి గుండెల్లో ఉంటారా తేల్చుకోవాలన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. అధికారంలోకి రావడానికి కులవృత్తులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలు మరచి వృత్తులే లేకుండా చేస్తున్నాయన్నారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం కల్లును నిషేధిస్తే తెలంగాణ ప్రభుత్వంలో తిరిగి తెరిపించుకున్నామని కోటి 20 లక్షల కల్లు చెట్లు పెంచామని గుర్తుచేశారు. కూకట్‌పల్లి కల్లు దుకాణం కాంగ్రెస్ కార్పొరేటర్‌ది అని అసలు ఏం జరిగిందో తెలుసుకుని ఆ దుకాణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ప్రతి గ్రామానికి ఐదు ఎకరాలు చెట్లు పెంచేందుకు స్థలం కేటాయించడంతో పాటు డిపో ఏర్పాటు చేస్తామని, వైన్‌షాపుల్లో 20 శాతం గౌడ కులస్థులకు ఇస్తామని, జగిత్యాల జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లాగా పేరుపెడతామని హామీ ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కల్లు కల్తీని పూర్తిగా నివారించాలని, మత్తు పదార్థాలు తయారు చేస్తున్న ఫార్మా కంపనీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ గౌడ సంఘాల నాయకులు దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ, జైహింద్ గౌడ్, ఐలి వెంకన్న గౌడ్, మేకపోతుల నరేందర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, యాదగిరి, ఏడుకొండలు, రామ్మోహన్ ఉన్నారు.

ప్రమాదాలను 'అడ్డు'కున్నారు

రహమత్‌నగర్: వర్షపు నీటితో నిండిన గుంత వల్ల ప్రమాదాలు జరక్కుండా విద్యార్థులు అడ్డుకున్నారు. గుంతకు అడ్డుగా నిలబడి వాహనాలను దారి మళ్లించి తమ సేవా గుణం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే...బోరబండ నాట్కో స్కూల్ ఎదుట జీహెచ్ ఎంసీ పనుల్లో భాగంగా ఇటీవల గుంతను తవ్వారు. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి గుంత నిండి వర్షపు నీటిలో కనిపించకుండా పోయింది. దీంతో అటుగా వస్తున్న వాహనాలు ప్రమాదవశాత్తు గుంతలో పడవచ్చునని భావించిన విద్యార్థులు గుంత చుట్టూ నిలబడి వాహనాలను దారి మళ్లించి ప్రమాదాలు జరుగకుండా అడ్డుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు వారు వర్షంలో నిలబడి విద్యార్థులు అందించిన సేవలను స్థానికులు కొనియాడారు.



వాహనాలు, విద్యార్థులను దారి మళ్లిస్తున్న దృశ్యం





పెట్స్ అంటే ప్రేమ..

సినీ నటులు వైష్ణవి, ఆనంద్ దేవరకొండ

సాక్షి, సిటీబ్యూరో: తనకు పెట్స్ అంటే ఎంతో ఇష్టమని, తమ ఇంట్లో కూడా ఓ పెట్ ఉందని టాలీవుడ్ నటి, బేబీ సినిమా ఫేం హీరోయిన్ వైష్ణవి చైతన్య అన్నారు. కొంపల్లిలో నూతనంగా నెలకొల్పిన సెవెన్ ఓక్స్ మల్టీ స్పెషాలిటీ పెట్ హాస్పిటల్లో 'పెంపుడు జంతువుల ఆరోగ్యం, అత్యాధునిక వైద్యం'పై ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'నేను పెట్ లవర్‌ని. ఆల్ఫా అనే పెట్ మా ఇంట్లో పిల్లాడిలా మారిపోయింది. ఆల్ఫాకు హెల్త్ బాగోలేనప్పుడు ఇంట్లో సభ్యులు ఎంతో ఆందోళన చెందారు. ఆ సమయంలో జుబ్లీహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి ఆల్ఫా ఆరోగ్యంగా ఇంటికి వచ్చాకగానీ మా మనసులు కుదుటపడలేదు' అంటూ గుర్తు చేసుకున్నారు. పెట్స్ ప్రేమికులు పెరుగుతున్న పరిస్థితిలో వాటికి అత్యాధునిక వైద్య సేవలు అందించే ఆస్పత్రులు పెరగాల్సి ఉందన్నారు. యువ నటుడు ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ మనలా పెట్స్ వాటి బాధను, అనారోగ్య సమస్యను చెప్పుకోలేవని, మనమే జాగ్రత్తగా గుర్తించాలని, తమ ఇంట్లో పెట్స్‌ను కేరింగ్‌గా చూసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో దర్శకుడు మధుర శ్రీధర్ రెడ్డి, సెవెన్ ఓక్స్ పెట్ హాస్పిటల్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ డా.శ్రీ రెడ్డి, ఎండీ సంధ్య బి.రెడ్డి పాల్గొన్నారు.





హైదరాబాద్ అంటే ప్రతి రంగంలోనూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. సాంస్కృతిక జీవన శైలి, ఆహార విధానం మొదలుకుని ఎంటర్‌టైన్మెంట్ వరకూ ప్రతి రంగంలోనూ తన సత్తా చాటుకుంటోంది. అంతేకాదు క్రీడా రంగంలోనూ.. క్రీడా సంబంధిత వినోద రంగంలోనూ తన ప్రశస్తిని నిలుపుకుంటోంది. ఇటీవలి కాలంలో నగరంలో కొత్త తరహాలో సందడి చేస్తున్న ఆటే మినీ గోల్ఫ్. చిన్న గోల్ఫ్, పుట్-పుట్, క్రేజీ గోల్ఫ్ పేరు ఏదైనా గోల్ఫ్ క్రీడకు ఇది డిటో అనే చెప్పాలి. అయితే పెద్ద విస్తీర్ణంలో కాకుండా మినీయేచర్ కోర్స్ అన్న మాట. ఈ కొత్త తరహా వినోదభరితమైన థీమ్ ఇటు పిల్లలను, అటు పెద్దలను ఎంటర్‌టైన్ చేస్తుంది. భారతదేశంలో తొలి ఇండోర్ మినీ గోల్ఫ్ కోర్స్ బంజారా హిల్స్‌లో ఏర్పాటైంది. **ఒక్క మాటలో చెప్పాలంటే ఇది వాస్తవిక 3డీ మినీ గోల్ఫ్ సిమ్యులేటర్.** - సాక్షి, సిటీబ్యూరో

పుట్ - పుట్.. వీకెండ్ సెట్..

నగరంలో మినీ గోల్ఫ్ సందడి

క్రీడాసక్తిని పెంపొందిస్తూనే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సమయం గడపడానికి అనువైన మినీగోల్ఫ్ నగరంలో ప్రారంభం కావడం, నగర వాసుల్లో పెరుగుతున్న క్రీడాసక్తి, వినోదాల మేళవింపు అభిరుచికి నిదర్శనం. ఇప్పటికే బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్.. వగైరా ప్రసిద్ధ ఆటలకూ ఇదే తరహాలో కొత్త రూపాలు పుట్టుకొచ్చేశాయి. ఇవి నగరంలో ఫుల్ క్రేజ్‌తో ఆదరణ పొందుతున్న పరిస్థితుల్లో తాజాగా మినీ గోల్ఫ్ కూడా వచ్చేసింది.

- పుట్ పుట్ గోల్ఫ్‌కు విదేశాల్లో ఫుల్ క్రేజ్
- దేశంలోనే తొలిసారిగా భాగ్యనగరంలో ఏర్పాటు
- ప్రొఫెషనల్స్ కాని వారి కోసం ప్రత్యేకం
- పూర్తి స్థాయి క్రీడా-వినోదంగా రూపకల్పన



ఏమిటీ ప్రత్యేకత..

దీనిని మినీ గోల్ఫ్, మినియేచర్ గోల్ఫ్, పుట్-పుట్ క్రేజీ గోల్ఫ్ వంటి అనేక పేర్లతో పిలుస్తారు. విండ్‌మిల్స్, ర్యాంప్స్, సొరంగాలు తదితర ఆర్టిఫిషియల్ అడ్డంకులతో కోర్సులు రూపొందించారు. ఇవి వినోదంతో పాటు ఆటపై ఆసక్తిని పెంచేలా ఉంటాయి. మినీ గోల్ఫ్‌ను పుటర్, గోల్ఫ్ బాల్‌తో ఆడతారు. కోర్సు చివరిలో అతి తక్కువ స్ట్రోక్‌లు ఉన్న ఆటగాడు గెలుస్తాడు. మొత్తంగా 18 హోల్స్‌తో కూడిన, ఆకట్టుకునే లేఅవుట్ ఇది. ఆహ్లాదకర వాతావరణంలో ఆడే ఆట మినీ గోల్ఫ్.

పుట్-పుట్ గోల్ఫ్ అనే పేరుకి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఇది సాధారణంగా మినీ గోల్ఫ్‌కు సమానార్థంలో ఉపయోగిస్తారు. ఆటలో ఉపయోగించే పుట్ అనే పదం నుంచి ఇది పుట్టింది. గోల్ఫ్‌లో పుట్ అంటే చిన్న దూరం నుంచి బంతిని హోల్‌లోకి మెల్లగా తోయడం. మినీ గోల్ఫ్‌లో ఎక్కువగా ఈ తరహా పుట్టింగ్ ఉంటుంది. అలాగే విభిన్న థీమ్‌లు, చిన్న వంతెనలు, జంప్‌లు, రంగు రంగుల అవరోధాలు ఉంటాయి. అంతకు ముందే ఉన్నప్పటికీ ఈ ఆటను ఒక ఎంటర్‌టైన్‌మెంట్ యాక్టివిటీగా.. 1954లో డాన్ క్లేటన్ అనే వ్యాపారవేత్త 'పుట్ అండ్ పుట్ గోల్ఫ్ కోర్సెస్ ఆఫ్ అమెరికా' పేరిట నార్త్ కరోలినాలో ప్రారంభించాడట. అతను రూపొందించిన కోర్సులు సరదాగా, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా ఉండేవట.



- స్వీడన్, ఫిన్‌ల్యాండ్, జర్మనీ, నెదర్లాండ్స్ లాంటి దేశాల్లో కాంపిటీటివ్ మినీ గోల్ఫ్ కూడా ఉంది. అలాగే అడ్వెంచర్ గోల్ఫ్ పేరుతో లేక్ పార్కులు, బీచ్ సైడ్‌ల దగ్గర కూడా ప్రాచుర్యం పొందింది. స్వీడన్‌లో అంతర్జాతీయ స్థాయిలో వరల్డ్ మినీ గోల్ఫ్ ఛాంపియన్ షిప్స్ కూడా నిర్వహిస్తున్నారు.
- ఆస్ట్రేలియాలో హోలీ మోలీ గోల్ఫ్ క్లబ్ పేరుతో సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్ నగరాల్లో కేఫ్ + మినీ గోల్ఫ్ స్టైల్ కాంబోను అందిస్తున్నారు. ఇది కేవలం గేమ్ మాత్రమే కాదు. మ్యూజిక్, ఫుడ్, లైటింగ్ అన్నిటినీ కలిపిన ఎంటర్‌టైన్‌మెంట్ హబ్.
- దుబాయ్‌లో త్రీడీ బ్లాక్‌లైట్ మినీ గోల్ఫ్ 3డీ గ్లాసెస్‌తో ఆడే వినూత్న అనుభవంగా ఆటను మార్చి అందిస్తుంది. ఫ్యామిలీ టూరిస్టులు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు.

వివిధ దేశాల్లో జోరుగా..

ఇలాంటి మినీ గోల్ఫ్ కోర్సులు ఇప్పటికే అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్ వంటి ప్రదేశాల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. మినీ గోల్ఫ్ లేదా పుట్-పుట్ గోల్ఫ్ ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన వినోద ఆట. ఇది చిన్నవారికి మాత్రమే కాదు, పెద్దవారికీ సరదాగా గడిపే ఒక ఎంటర్‌టైన్‌మెంట్ యాక్టివిటీగా మారింది.

- అమెరికాలో ఈ గేమ్ చాలా పాపులర్. ప్రత్యేకించి ఫ్లోరిడా, కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి రాష్ట్రాల్లో ఎన్నో థీమ్-బేస్డ్ మినీ గోల్ఫ్ కోర్సులు ఉన్నాయి. పైరేట్స్ కోవె అడ్వెంచర్ గోల్ఫ్, కాంగో రివర్ గోల్ఫ్, గ్లో గోల్ఫ్ వంటివి ఉన్నాయి. వీటిలో కొన్ని డార్క్ లైట్, డైనోసార్ థీమ్, జురాసిక్ పార్క్ లాంటి థీమ్‌లతో అద్భుతంగా డిజైన్ చేసినవి ఉన్నాయి.
- ఇండోర్‌లో అన్ని రకాల వాతావరణాల్లోనూ ఆడుకునే వీలు ఉండడం, సకుటుంబ సపరివార సమేతంగా వినోదించగలగడం, తక్కువ నైపుణ్యం ఉన్నా ఎక్కువ వినోదం అందించేది కావడం, థీమ్‌ల వల్ల మినీ గోల్ఫ్ కోర్సులు చూడడానికి ఆకర్షణీయంగా ఉండడం, క్యాజువల్ డేటింగ్, టీమ్ అవుటింగ్‌లకు నప్పడం.. వంటి కారణాలతో విదేశాల్లో బాగా పాపులర్ అవుతూ నగరంలో తాజాగా ఎంట్రీ ఇచ్చిన ఈ మినీ మ్యాజిక్ ఇక్కడ ఎంతగా విస్తరిస్తుందో చూద్దాం.





దీప్ మేళా.. ప్రదర్శన భళా..

- హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభం
- సందర్శకులను ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా 'దీప్ మేళా -2025' ఆకట్టుకుంటోంది.. ప్రముఖ మహిళా దాతృత్వ సామాజిక సంక్షేమ సంస్థ దీప్‌శిఖా మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. 61 సంవత్సరాల వారసత్వంతో, పేద మహిళలు, పిల్లలకు మద్దతుగా, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి నిధులు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా యేటా నిర్వహించే ఈ దీప్ మేళాను అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ నందిని మల్లు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ప్రారంభించారు. దీనిని 1987 నుంచి దీప్‌శిఖా మహిళా క్లబ్ ఆధ్వర్యంలో కన్యా గురుకుల్ హైస్కూల్ నిర్వహిస్తూ.. సుమారు 1700 మంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ వార్షిక కార్యక్రమం ఎలైట్ జ్యువెలరీ, డిజైనర్ వేర్, హస్తకళలు, జీవనశైలి కళాఖండాలు, గిఫ్ట్ ప్లాటర్లు, గృహోపకరణాలు, చర్మ సంరక్షణ ఉత్పత్తులతో పాటు ప్రత్యేకమైన రాఖీలు ప్రదర్శనలో అలరిస్తున్నాయి. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 230కి పైగా స్టాళ్లు ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



అనగనగా.. కాఫీ.. కథ..

మెక్సికో, పెరు, పనామా, టాంజానియా, యెమెన్ వంటి ప్రాంతాల పేర్లు చెప్పగానే కాఫీ లవర్స్ మనసు ఉప్పొంగిపోతుంది. ఎందుకంటే అక్కడ కాఫీకున్న ప్రశస్తి అలాంటిది. రుచికరమైన కాఫీతో పాటు విభిన్న రుచుల్లో కాఫీ ఆస్వాదించే హాట్‌స్పాట్స్ ఇవి. ఇలాంటి కాఫీ ఫ్లేవర్స్‌తో నగరం స్థానం పదిలం చేసుకుంది. గ్లోబల్ ఫేం కాఫీ బ్రాండ్‌లన్నీ నగరంలోనూ ఆదరణ పొందుతున్నాయి. అయితే సరికొత్తగా నగరంలోని ఖాజాగూడ వేదికగా టాటా స్టార్‌బక్స్ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి కాఫీ ఎక్స్‌పీరియన్షియల్ స్టోర్ ఆవిష్కరించారు. ఈ స్టోర్‌లో భారత్‌లో సేకరించిన సరికొత్త ఫ్లేవర్స్‌తో కాఫీ అందించడం విశేషం. - సాక్షి, సిటీబ్యూరో

భారతీయ ఫ్లేవర్స్‌తో అరుదైన రుచులు

సిటీలో సరికొత్తగా బ్లాక్ ఈగల్ ఎస్ప్రెస్సో మెషిన్

ఖాజాగూడలో దక్షిణాదిలో మొట్టమొదటి స్టోర్ ఆవిష్కరణ



కాఫీ గురించి, స్టార్‌బక్స్ కాఫీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. అయితే నగరంలో వినూత్నంగా ఆవిష్కరించిన ఈ ఫ్లేవర్డ్ కాఫీ విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన స్టార్‌బక్స్.. భారత్‌లోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో సేకరించిన ఫుడ్ ఫ్లేవర్స్ (కొబ్బరి, బెల్లం, చింత, మిర్చి, శికంజి)తో తయారు చేసి అందిస్తున్నారు. ఇందులో భాగంగా సినిమన్ జాగ్రి లాటే, మలబార్ కోకోనట్ క్రీమ్ లాటే, కోకో బర్న్స్ ఐ చిల్లీ లాటే, ట్రిమరిండ్ రెడ్ పెరూ, శికంజీ కోల్డ్ బ్రూ వంటి కాఫీ రకాలకు ఎక్స్‌పీరియన్షియల్ స్టోర్ ప్రత్యేకతగా నిలుస్తోంది. అంతేకాకుండా ఇక్కడే.. ఎక్స్‌ప్రెస్సో జోన్, బ్రూబార్ ఏర్పాటు చేసి కాఫీ లవర్స్‌కు స్టార్‌బక్స్ బరిస్టా నైపుణ్యాలను ప్రత్యక్షంగా అవకాశం కల్పిస్తున్నారు. ఢిల్లీ పంజాబీ బాగ్, ముంబయి ధనరాజ్ మహల్ తరువాత భారత్‌లో మూడో ఎక్స్‌పీరియన్షియల్ స్టోర్ ఇదే.

సిటీ స్పెషల్.. బ్లాక్ ఈగల్ ఎస్ప్రెస్సో..

కాఫీకి నగరంలో ఉన్న ఆదరణ దృష్ట్యా దక్షిణాదిలోనే మొదటిసారి ఈ కాఫీ హాట్‌స్పాట్ ప్రారంభించాం. ఈ స్టోర్‌లో ఐదు రకాల ఎక్స్‌క్లూజివ్ ఎస్ప్రెస్సో బీన్, 13 రకాల హోల్ బీన్ వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి భారత్‌తో పాటు కెన్యా, సుమత్రా, లాటిన్ అమెరికా వంటి ప్రఖ్యాత ప్రాంతాల నుంచి తీసుకొచ్చాం. కాఫీని వినూత్నంగా అందించడానికి ఈ స్టోర్‌లో బ్లాక్ ఈగల్ ఎస్ప్రెస్సో మెషిన్ ఏర్పాటు చేశాం. - విభోర్ మిశ్రా, స్టార్ బక్స్ కాఫీ అంబాసిడర్, ఏపీఏసీ-చైనా



దక్షిణాదికి సరి కొత్త ఫ్లేవర్లు..

కేరళ కొబ్బరితో చేసిన క్రీమ్ లాటే, మహారాష్ట్రలో లభించే రుచికరమైన జామకాయ ఫ్లేవర్‌తో వావ్ అనిపించే కాఫీ.. ఇలా ఇక్కడి వినూత్న కాఫీ ఆవిష్కరణలు దక్షిణాదికి సరికొత్త గుర్తింపునిస్తున్నాయి. నేను విదేశాల్లో పర్యటించి కాఫీ పైన చేసిన పరిశోధనల్లోని పలు అరుదైన రుచులు ఈ ఫ్లేవర్స్‌లో గమనించాను. రుచికరమైన, నాణ్యమైన అరబికా కాఫీ బీన్స్ రుచిని ఆస్వాదించవచ్చు.
- నిఖిత ఉమేష్, ప్రముఖ పేస్ట్రీ చెఫ్, చాకోలేటియర్

బ్రైడల్ ఎగ్జిబిషన్‌లో తారల సందడి

హెచ్ఐసీసీ నోవోటెల్‌లో మూడు రోజుల పాటు నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో ప్రతిష్టాత్మక హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో బ్రైడల్ వేర్, వెడ్డింగ్ ఫ్యాషన్ జ్యువెలరీ, లైఫ్‌స్టైల్ వేర్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్ గ్రాండ్ లాంచ్‌లో నటి సురభి, స్రవంతి, చాందిని, కామాక్షి, నిరుపమ పాల్గొని సందడి చేశారు. ఎగ్జిబిషన్‌లో 350కి పైగా ఐకానిక్ డిజైనర్లు.. జ్యువెలర్లు బ్రైడల్ వేర్, వెడ్డింగ్ వేర్, జ్యువెలరీ, చీరలు, ఫ్యాషన్ వేర్, లైఫ్ స్టైల్ వేర్ వంటి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

భారతీయ వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు

ఫెమినా మిస్ ఇండియా ఏపీ భవ్యారెడ్డి



శ్రీనగర్‌కాలనీ : భారతీయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉందని, చేనేతకారుల వస్త్రాలను ధరించి వారిని ప్రోత్సహించాలని ఫెమినా మిస్ ఇండియా ఏపీ భవ్యారెడ్డి అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ట్రెన్స్‌గ్రూప్ ఆధ్వర్యంలో అభినయ ఎక్స్‌పో పేరిట శుక్రవారం ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ ప్రాంతాలరు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను, వన్‌గ్రామ్‌గోల్డ్ ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈనెల 20 వరకూ ఈ ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకురాలు శాంతి కతివరణ్ తెలిపారు.

సాక్షి రియల్టీ

శనివారం
19-07-2025



కొత్తిల్లు కొందామా.. పాతిల్లు చూద్దామా?

సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల. అయితే గృహ కొనుగోలు నిర్ణయం అంత తేలికైందేమీ కాదు. ప్రాంతం ఎంపిక నుంచి మొదలు పెడితే బడ్జెట్, నిర్మాణ నాణ్యత, నిర్మాణ సంస్థ నేపథ్యం, కొనుగోలుదారుడి అవసరాల వరకూ ప్రతి ఒక్కటీ ప్రధానమైందే. సమాజంలో గుర్తింపు కోసం కొందరు ఇల్లు కొంటే.. మరికొందరేమో పెట్టుబడి కోసం, ట్యాక్స్ నుంచి మినహాయింపుల కోసం కొంటుంటారు. కారణాలేవైనా ఇల్లు కొనడమనేది ఓ నిరంతర ప్రక్రియ. మరి, ఎలాంటి ఇల్లు కొంటే సొంతింటి యోగం మరింత తేలికవుతుంది? అంటే కొత్త ఇల్లు కొనడమా? లేక సెకండ్ హ్యాండ్ ఇల్లు బెటరా? అని! - సాక్షి, సిటీబ్యూరో

- దేశంలో కొత్త గృహాలకు డిమాండ్ ఎంత ఉందో రీసేల్ లేక సెకండ్ హ్యాండ్ ఇళ్లకూ అంతే ఉంది. కొత్త ఇల్లు నేరుగా డెవలపర్ నుంచి కొనుగోలు చేస్తే.. రీసేల్ ప్రాపర్టీలను పాత యజమాని నుంచి కొనుగోలు చేస్తాం. కొత్త లేక పాత ప్రాపర్టీ ఏదైనా కానీ ఎంపికలో ప్రధానమైంది బడ్జెట్. దీంతో పాటూ మన జీవన శైలి, అవసరాలు, అభిరుచులు, ఇంటీరియర్, ఇంధన సామర్థ్యాలు వంటివి కూడా ప్రాపర్టీ ఎంపికలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

ప్రధాన నగరంలో సెకండ్సే బెటర్..

ఇల్లు కొనుగోలు చేసిన వారెవరైనా సరే ఎప్పటికీ ఒకే ఇంట్లో ఉండాలనుకుంటారు. ఫ్యామిలీ పెరిగినప్పుడు లేదా తగ్గినప్పుడు గానీ ఉద్యోగ రీత్యా, కుటుంబ అవసరాల రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గానీ ఆర్థిక అవసరాల కోసం ఇంటిని విక్రయించాలనుకుంటారు. విద్యా, వైద్యం, వినోదం ఇతర అవసరాలకు రోజూ ప్రధాన నగరంతో అనుబంధం ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో కొత్త గృహాలు దొరకడం కొంత కష్టం. ఒకవేళ దొరికినా ధర ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ఏరియాల్లో సెకండ్ హ్యాండ్ ఇల్లును కొనుగోలు చేయడం బెటర్. అవసరమైతే దాన్ని కూల్చేసి మన అవసరాలు, బడ్జెట్‌కు తగ్గట్టు మళ్లీ కొత్త గృహాన్ని నిర్మించుకోవచ్చు. అయితే ఇది కొంత డబ్బు, సమయంతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ప్రధాన నగరంలో, అభివృద్ధి చెందిన ప్రాంతంలో రీసెల్ ప్రాపర్టీలను ఎంచుకోవటమే ఉత్తమమనేది నిపుణుల సూచన.



రీసేల్ కొనేముందు..

- రీసేల్ ప్రాపర్టీ కొనుగోలు చేసేటప్పుడు పాత యజమాని నేపథ్యం, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు, టైటిల్, అనుమతి పత్రాలు, గృహ రుణానికి సంబంధించిన పత్రాలు వంటి వాటిని స్వయంగా పరిశీలించుకోవాలి. ఏమాత్రం అవగాహన లేకపోయినా లేక తప్పిందం జరిగినా సరే మొదటికే మోసం వస్తుంది. అదే కొత్త ఇల్లు కొనుగోలు చేస్తే ఈ ప్రక్రియంతా డెవలపరే పూర్తి చేసేస్తాడు.
- పాత ఇళ్లలో ఎలక్ట్రిక్ వైర్లు, ఉపకరణాలు, బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ వంటి వాటిల్లో సమస్య వస్తుంటుంది. అదే కొత్త గృహాల్లో బ్రాండెండ్, నాణ్యమైన ఉత్పత్తుల వినియోగంతో ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పైగా పాత ఇళ్లలో వాస్తు మార్పులు, గదుల్లో చిన్న చిన్న మార్పులు చేయాలంటే ఇబ్బందులుంటాయి. అదే కొత్త గృహాల్లో నిర్మాణంలో ఉన్నప్పటి నుంచే డెవలపర్‌కు మన అవసరాలకు తగ్గట్టుగా నిర్మాణంలో మార్పులు చేసుకునే వీలుంటుంది.



ప్రధాన నగరంలో అయితే పాతిల్లే బెటర్	నిర్వహణ భారం వద్దనుకుంటే కొత్త ఇల్లు..

శివారు ప్రాంతాల్లో కొత్త ఇళ్ల ధరలు తక్కువ

- కొత్త గృహాలతో పోలిస్తే రీసేల్ ప్రాపర్టీలు కొంత తక్కువ ధరకే లభ్యమవుతాయి. కానీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాపర్టీ బదిలీ రుసుము, వినియోగ చార్జీలు వంటివి చెల్లించాల్సి ఉంటుంది. పైగా సెకండ్ హ్యాండ్ హోమ్స్ నిర్వహణ భారం ఎక్కువగా ఉంటుంది. పైగా మన అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా ఇంటిని రిపేర్ చేయించాల్సి ఉంటుంది. ఆయా ఖర్చులన్నింటినీ కలిపి చూస్తే మాత్రం రీసేల్ ప్రాపర్టీ కంటే అభివృద్ధి చెందే ప్రాంతంలో, శివారు ప్రాంతంలోని కొత్త గృహాల ధరలే తక్కువగా ఉంటాయి.
- పర్యావరణం స్పృహ, ఇంధన నిర్వహణ సామర్థ్యాలు, కరెంట్ బిల్లుల మీద అవగాహన ఉంటే మాత్రం కొత్త ఇల్లు కొనడమే ఉత్తమం. ఎందుకంటే కొత్త గృహాలు ఎనర్జీ ఎఫీషియన్సీ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. ఇంట్లోనే ఉపకరణాలతో పాటూ గోడలు, పైకప్పులు, కిటికీలు, తలుపులు కూడా ఇంధన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయి. దీంతో విద్యుత్ బిల్లు తక్కువగా రావటంతో పాటూ నిర్వహణ వ్యయం కూడా తక్కువ అవుతుంది. రీసేల్ ప్రాపర్టీలను కూడా ఎనర్జీ ఎఫీషియన్సీ ప్రమాణాలకు అనుగుణంగా మార్చవచ్చు. కానీ, ఆయా పాత గృహాలు దశాబ్దాల క్రితం నాటి ప్రమాణాలను అనుగుణంగా నిర్మితమైనవి. వాటిని ఇప్పటి ప్రమాణాలను అనుగుణంగా మార్చాలంటే ఖర్చు ఎక్కువవుతుంది. కొత్త ఇళ్లలో గాలి, వెలుతురు బాగా వస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉంటారు.



గతంలో ఇల్లు అంటే నాలుగు గోడలుండే నిర్మాణం. కానీ, ఇప్పుడు ఇల్లంటే ఓ హోదా.. హుందా! ఇందుకోసం ఎంతైనా ఖర్చు చేస్తున్నారు సొంతింటి వాసులు. నిర్మాణ సంస్థలూ తక్కువేం కాదు.. సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో కనిపించే విభిన్న తరహా నిర్మాణాలను భాగ్యనగరంలో నిర్మించేస్తున్నారు. ప్రాజెక్ట్ ఎలివేషన్స్ నుంచే సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టేస్తున్నారు. పడవ ఆకారంలో ఎలివేషన్, ఎలివేషన్‌లోనే వర్టికల్ గార్డెన్ ఏర్పాటు వంటివి ఈ జాబితాలోనివే మరి!! - సాక్షి, సిటీబ్యూరో



ఎలివేషన్స్‌లో గార్డెన్స్

అందంతో పాటూ ఆరోగ్యాన్ని అందించే సొంతిల్లు

విభిన్న తరహా నిర్మాణాలతో కస్టమర్లను ఆకర్షిస్తున్న సంస్థలు

పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరి అవసరాలు, అభిరుచులకు తగ్గట్టుగా నిర్మాణాలుండాలి. మూస ధోరణిలో నిర్మించే ప్రాజెక్ట్‌లను ప్రజలు ఆదరించట్లేదు. విదేశీ తరహాలో నిర్మాణం.. అన్ని రకాల వసతులు.. అదీ అందుబాటు ధరల్లో ఉండే ప్రాజెక్టులు అంటే కస్టమర్లు జై కొడుతున్నారు. దీంతో విదేశాల్లో కనిపించే విభిన్న నిర్మాణాలు ఇప్పుడు భాగ్యనగరంలోనూ కనిపిస్తున్నాయి. కస్టమర్లను ఆకర్షించడం కోసం విభిన్న ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో సంస్థల మధ్య పోటీ పెరిగి భాగ్యనగరం హంగులు అద్దుకుంటోంది.

ఎలివేషన్లలో వర్టికల్ గార్డెన్..

రిసార్ట్, విల్లాల్లో విశాలమైన స్థలం అందుబాటులో ఉంటుంది. అందుకే చుట్టూ పచ్చదనంతో ల్యాండ్ స్కేపింగ్ చేస్తారు. కానీ, అపార్ట్‌మెంట్స్‌లో.. అది కూడా స్థలాల లభ్యత తక్కువగా ఉండే మహానగరాల్లో కాసింత కష్టమే. దీనికి పరిష్కార మార్గాన్ని చూపిస్తోంది నిలువైన ఉద్యానవనాలు(వర్టికల్ గార్డెన్స్). భవనాల ఎలివేషన్లలో నిలువుగా మొక్కలు పెంచడం వర్టికల్ గార్డెన్స్ ప్రత్యేకత. అయితే ఇవి ఎలివేషన్, బయటి గోడల మీదనే సాధ్యమవుతాయి. ఎండ పడని ప్రాంతంలో అంటే ఇంట్లో, హాల్‌లో, బెడ్ రూమ్‌లో వర్టికల్ గార్డెన్స్‌ను పెంచడం కుదరదు. ఇక్కడ పూల మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ పెంచుకోవచ్చు. సూర్యరశ్మి పడే ప్రాంతమైతే వర్టికల్ గార్డెన్స్‌లో కూరగాయలు, ఆకుకూరలు కూడా పెంచుకునే వీలు కూడా ఉంటుంది.

ఖర్చు ఎక్కువే..

సాధారణ భవనాలతో పోలిస్తే వర్టికల్ గార్డెన్స్ భవనాల ధర చ.అ.కు రూ.100–200 అధికంగా ఖర్చవుతుంది. అయినా సరే బిల్డర్లు నిర్మాణాలు



చేపడుతున్నారు. కస్టమర్లకు ఏదో నాలుగు గోడలుండే ఇంటిని అందించాలని కాకుండా వారి ఇంటిని అందంగా.. ఆరోగ్యకరంగా బృందావనంగా తీర్చిదిద్దుతున్నారు. వర్టికల్ గార్డెన్స్ భవనాలు పర్యావరణహితంగా ఉంటాయి. శబ్ద, వాయు కాలుష్యం తక్కువగా ఉండటంతో పాటు ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. భవనం గోడలు, పిల్లర్లను ఆధారం చేసుకొని బయోలాజికల్ ఎరువులతో పెంచడం వల్ల భవనం చల్లగా ఉంటుంది.

పిల్లలే లక్ష్యంగా..

ఇంటి కొనుగోళ్లలో పిల్లల అభిరుచులకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అందుకే పిల్లల అభిరుచులకు అనుగుణంగా విదేశీ ఆర్కిటెక్చర్లతో ప్రాజెక్ట్‌లను డిజైన్ చేయిస్తున్నారు బిల్డర్లు. ఇందుకోసం ప్రాజెక్ట్ ఎలివేషన్ దగ్గర నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విశాలమైన ఆట స్థలాలు, వినూత్నమైన ఎలివేషన్లతోనే పిల్లల్ని ఆకట్టుకుంటే.. ప్రాజెక్ట్‌లోనే పాఠశాలలు, ఆస్పత్రుల వంటి ఏర్పాటుతో తల్లిదండ్రులనూ కట్టిపడేస్తున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రికి వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణం చేయడం, వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి నుంచి కిలోమీటర్ల దూరముండే స్కూల్‌కు తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఏమాత్రం ఇష్టపడట్లేదు. అందుకే ఫ్లాట్‌ను కొనుగోలు చేసేముందు పిల్లల అవసరాలు, ఆరోగ్యానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్ట్‌లో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి ఆధునిక సదుపాయాలే కాకుండా ఇందులోనే పాఠశాల, ఆస్పత్రి వంటివి ఉంటేనే ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని నిపుణులు అంటున్నారు. ప్రాజెక్ట్‌లో క్లబ్‌హౌజ్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి వసతులు కల్పించాలంటే కొంత స్థలాన్ని కేటాయిస్తారు. అలా కాకుండా ఎలివేషన్‌కు కేటాయించే స్థలంలో ఈ వసతులను కల్పిస్తే.. స్థలం వినియోగంతో పాటు ఫ్లాట్ల విస్తీర్ణమూ పెరుగుతుంది.



- వ్యవసాయ క్షేత్రాలకు ఆదరణ
- కరోనా తర్వాతి నుంచి ఫుల్ డిమాండ్

వీకెండ్ ఫామ్‌హౌస్

సాక్షి, సిటీబ్యూరో:

ఆఫీసులో పని ఒత్తిడి ఒక ఎత్తయితే.. ట్రాఫిక్ సంద్రాన్ని ఈదుకుంటూ వెళ్లడం మరొక ఎత్తు. ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ప్రతిరోజూ ఛేదించుకుంటూ వెళ్లే నగరవాసి కనీసం వారాంతంలోనైనా కుటుంబం, స్నేహితులతో స్వచ్ఛమైన ఆహ్లాదకర వాతావరణంలో గడపాలని కోరుకుంటున్నాడు. వీరి అభిరుచులకు తగ్గట్టుగానే ఫామ్ హౌస్‌లు నిర్మితమవుతున్నాయి. గతంలో ఫామ్‌హౌస్‌ల కోసం కేవలం సంపన్న వర్గాలు మాత్రమే మొగ్గు చూపేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి సామాన్య, మధ్యతరగతి సైతం వ్యవసాయ క్షేత్రాలకు ఆసక్తి చూపిస్తున్నారు.

- కొందరు 200 నుంచి వెయ్యి గజాల్లోపు భూమిని కొనుగోలు సాదాసీదాగా ఫామ్ హౌస్‌లను నిర్మించుకుంటుంటే.. మరి కొందరు వెయ్యి నుంచి 4 వేల గజాలు, రెండు, మూడెకరాలంటూ భూమి కొనేసి వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఫామ్ ల్యాండ్స్ పేరుతో కొన్ని జాగాల్లో, డీటీసీపీ లేఅవుట్లలో, గ్రామ పంచాయతీ లే అవుట్లలో స్థలాలను కొని బంగ్లాలు కడుతున్నారు. శని, ఆదివారాల్లో కుటుంబ సభ్యులతో కలిసి కారులో వారాంతపు ఇంటికి వెళ్లి షికారు చేస్తున్నారు.

ఔటర్ వెలుపలే..

నగరం ఓఆర్‌ఆర్ వరకు విస్తరించింది. చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, శామీర్‌పేట, భువనగిరి, శంషాబాద్, మేడ్చల్, సంగారెడ్డి ప్రాంతాల్లోని వీకెండ్ హోమ్స్‌కు ఆదరణ ఎక్కువగా ఉంది. భూముల ధరలు ఎక్కువ ఉన్నప్పటికీ.. వాతావరణం బాగుంటుందని, భవిష్యత్తులో ఆస్తిని విక్రయిస్తే మంచి ధర పలుకుతుందనే విశ్వాసంతో కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటితో పాటు చుట్టూ పచ్చదనం, ఆకుకూరలు, పండ్ల చెట్లను పెంచుతూ వ్యవసాయం చేశామనే తృప్తిని పొందేందుకు చాలామంది ఇష్టపడుతున్నారు.

బిల్డర్లు కూడా..

రియల్ ఎస్టేట్ సంస్థలు వేసిన వెంచర్లలో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. వారాంతాల్లో విడిది చేసేలా సకల సదుపాయాలు ఇక్కడ కల్పిస్తున్నారు. కొందరు తమ ఇళ్లను మిగతా సమయంలో కమ్యూనిటీ నిర్వహణ సంస్థలకే అద్దెకు ఇస్తున్నారు. కమ్యూనిటీల్లోని సభ్యులు చిన్న వేడుకలను ఇక్కడ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇతర ఇళ్లను ఒకటి రెండు రోజులకు అద్దెకు తీసుకుంటున్నారు. ఈ రకంగా ఖాళీగా ఉండకుండా ఆదాయం వస్తుండటంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది.



మాల్స్, స్టార్ హోటల్స్.. తినడానికో లేదా షాపింగ్ కేంద్రాలుగానే కాదు ఆఫీసు కేంద్రాలుగానూ మారుతున్నాయి. గతంలో ప్రత్యేకంగా ఒక వాణిజ్య భవనంలో కో–వర్కింగ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన కంపెనీలు ఇప్పుడు షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లనూ కార్యాలయాలుగా కేటాయిస్తున్నాయి. పనిచేసే చోటే రిటైల్, ఫుడ్ వసతులూ ఉంటేనే కంపెనీలు స్వాగతిస్తుండటంతో కో–వర్కింగ్ సంస్థలు మాల్స్, హోటళ్ల వైపు దృష్టిసారించాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఆఫీస్ @ మాల్

దశాబ్దం కాలంగా దేశంలోని కార్యాలయాల్లో పని వాతావరణంలో మార్పు వచ్చింది. ఆఫీసు డిజైన్, వసతులు, రంగులు వంటివి ఉద్యోగి నైపుణ్యం, ఉత్పాదకత, పని సంస్కృతి వంటి వాటి మీద ప్రభావం చూపిస్తున్నాయని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. కార్యాలయాల్లో గ్రీనరీ, సహజసిద్ధమైన గాలి, వెలుతురు, వాసన వంటి వాటితో ఉద్యోగిపై పని ఒత్తిడిని తగ్గిస్తుందని, దీంతో మరింత క్రియేటివిటీ బయటకొస్తుందని పరిశోధనల్లోనూ తేలింది. ఆయా వసతులను అందుబాటు ధరల్లో కో–వర్కింగ్ స్పేస్ భర్తీ చేస్తుండటంతో ప్లగ్ అండ్ ప్లే ఆఫీసులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్ మాత్రమే కాకుండా బహుళ జాతి సంస్థలూ కో–వర్కింగ్ స్పేస్‌లో కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయి.

గంట, రోజు, నెల వారీగా చార్జీలు..

ఒకే అంతస్తులో ఒక ఆఫీసు బదులు పలు రకాల చిన్న ఆఫీసులు ఉండటాన్ని కో–వర్కింగ్ స్పేస్ అంటారు. ఇక్కడ వ్యాపారం ఎవరిది వారిదే, ఎవరి ప్రమాణాలు వారివే. ప్రతి ఒక్కరికీ కావాల్సిన ప్రైవేట్ ఆఫీసు, ఫిక్స్‌డ్ డెస్క్‌లు, సమావేశ గది, క్యాబిన్లు వంటి సౌకర్యాలు ఉంటాయి. వీటితో పాటూ ప్రత్యేకంగా బహుళ జాతి కంపెనీలకు ఉండే కొరియర్ సర్వీస్, ఫుడ్ లాంజ్, ఎల్‌సీడీ, పార్కింగ్, ప్రింటర్, ప్రొజెక్టర్, వైఫై వంటి అన్ని రకాల ఆధునిక వసతుంటాయి. కో–వర్కింగ్ కార్యాలయాల అద్దెలు గంట, రోజులు, నెల వారీగా ఉంటాయి. నగరంలో నెలకు రూ.8 వేల నుంచి ప్రారంభమవుతున్నాయి. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రాంగూడ, బంజారాహిల్స్, సోమాజిగూడ, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో కో–వర్కింగ్ ఆఫీసు ఉన్నాయి.

అద్దెలు 25 శాతం వరకు తక్కువ

ఐటీ కారిడార్లు, అభివృద్ధి చెందిన వాణిజ్య ప్రాంతాల్లో స్థలాల ధరలు ఎక్కువగా ఉండటంతో అక్కడ ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసే బదులు కో–వర్కింగ్‌లోనే స్పేస్‌ను అద్దె తీసుకోవటం కంపెనీలకు సులువవుతుంది. ఇదే కో–వర్కింగ్ డిమాండ్‌కు ప్రధాన కారణం. గ్రేడ్–ఎ ఆఫీస్ స్పేస్‌తో పోలిస్తే కో–వర్కింగ్ స్పేస్‌లో అద్దెలు 25 శాతం వరకు తక్కువ ఉంటాయి. సాధారణ ఆఫీసులో సీట్లతో పోలిస్తే కో–వర్కింగ్ స్పేస్‌లో ఒక్కో సీటుకు 5–15 శాతం స్థలం ఆదా అవుతుంది. పైగా ప్రతి కంపెనీ ప్రత్యేకంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసుకునే బదులు అన్ని కంపెనీలకు కలిపి ఒకటే పార్కింగ్, హౌస్ కీపింగ్, క్యాంటీన్, రిసెప్షన్ వంటి ఏర్పాట్లు ఉంటాయి. దీంతో కంపెనీలకు మౌలిక వసతుల వ్యయం కూడా తగ్గుతుంది.



ఇంటి కోసం.. కాస్త సమయం

సాక్షి, సిటీబ్యూరో:

శ్రావణ మాసం వస్తుందంటే చాలు శుభ ముహూర్తాలు ప్రారంభమవుతాయి. వరుస పండగలతో సందడి నెలకొంటుంది. ఈ ఆనందాన్ని రంగులమయం చేస్తే ఇంటి అందం ద్విగుణీకృతమవుతుంది. అయితే ఇంటికి రంగులు వేయించడం అందరికీ కుదరకపోవచ్చు. మరెలా? రంగులు వేయకున్నా ఇల్లు మెరవాలంటే శుభ్రం చేయడం కోసం కొంత సమయాన్ని వెచ్చించాలి. ఇందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. హడావుడి లేకుండానే ఓ పద్ధతి ప్రకారం ఇంటిని అలంకరించుకోవాలి.

ఫ్లోరింగ్: మార్బుల్ ఫ్లోరింగ్ ఇంటికి అదనపు అందం, ఆకర్షణే. అయితే ఇదంతా తరచూ నిర్వహణ ఉన్నప్పుడే.. ఇంట్లోకి దుమ్ము, ధూళి రాకుండా నివారించాలి. దీని కోసం డోర్ మ్యాట్లు వాడకంతో సరిపెట్టకుండా ఇంటికి వచ్చే అతిథులు షూస్ బయటేవిప్పి ఇంట్లోకి వచ్చేలా చూసుకోవాలి. ఫ్లోరింగ్ శుభ్రత కోసం రసాయనాల జోలికి వెళ్లకుండా నీటిలో కొంచెం అమ్మోనియా కలిపితే శుభ్రం చేశాక ఫ్లోరింగ్ మెరిసిపోతుంది.

కార్పెట్లు: ఇవి దుమ్మును ఎక్కువగా ఆకర్షిస్తాయి. తరచూ వ్యాక్యుమ్ క్లీనర్‌తో శుభ్రంచేయక తప్పదు. దుమ్ము పట్టడం వల్ల కార్పెట్ కళావిహీనంగా కన్పించవచ్చు. కాబట్టి నాలుగున్నర లీటర్ల నీటిలో ఓ కప్పు తెల్ల వెనిగర్‌ను కలిపి బ్రష్‌తో రుద్దితే కార్పెట్‌లోని వర్ణాలు మెరుస్తాయి. కార్పెట్‌పై కొన్నిసార్లు టీ, సిరా వంటి మరకలు పడితే వాటిని పోగొట్టడానికి పావు కప్పు తేనె సోడా, రెండు చెంచాల తెల్ల వెనిగర్‌తో చేసిన పేస్టు రుద్దాలి. ఫలితంగా ఆ మరకలు తొలగిపోతాయి. పేస్టును ఆరనిచ్చి వ్యాక్యుమ్ క్లీనర్‌తో మరక ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయండి.

గోడలు: గోడలను తరచూ స్టాటిక్ డస్టర్‌తో తుడవాలి. ఎక్కడైనా బూజు, సాలెగూడు వంటివి ఉంటే తొలగిపోతాయి. అనుకోకుండా గోడలపై పానీయాలు, టీ వంటివి పడితే వెంటనే నీళ్లు, గాఢత తక్కువగా ఉండే డిటర్జెంట్లతో శుభ్రం చేయాలి. అయితే ఈ సమయంలో గోడల్ని గట్టిగా రుద్దడం చేయవద్దు.

మైక్రోఓవెన్: కొందరు మైక్రోఓవెన్‌ను అధికంగా వాడుతుంటారు. దీంతో ఇది ఎక్కువగా మురికి పడుతుంటుంది. దీనిని శుభ్రం చేయడానికి ఉత్తమ మార్గం సగం కప్పు నీళ్లు, సగం కప్పు తెల్ల వెనిగర్‌ను మైక్రోప్రూఫ్ గిన్నెలో పోసి, మైక్రోఓవెన్‌లో వేడిచేయాలి. గట్టిగా ఉండే ఆహార పదార్థాలు, గ్రీజు మరకలు శుభ్రం చేయడానికి అనువుగా తేలికపడతాయి.

వంటింట్లో: బాత్‌ఫిట్టింగ్‌ల దగ్గర నుంచి ఫర్నిచర్‌ల వరకు ఉక్కు ఎక్కువగా వాడుతుంటాం. స్టీల్‌కే పరిమితం కాకుండా పైన క్రోమ్ పూతతో వస్తున్నాయిప్పుడు. స్నానాల గదిలో, వంటింట్లో వాడే నల్లాలు.. నీటిలోని ఉప్పు పేరుకుపోవడంతో చూడ్డానికి వికారంగా కనిపిస్తాయి. ఇలాంటి మరకల్ని తొలగించి స్టీల్ వస్తువులు మెరిసిపోవాలంటే ఆల్కాహాల్‌తో తుడవాలి. నల్లాపై ఏర్పడే మరకల్ని టూత్ పేస్టుతో తుడవడం వల్ల తొలగించవచ్చు. వంటింట్లో సింక్ పరిశుభ్రంగా కనిపించాలంటే నాలుగు భాగాల ఉప్పుకు ఒక భాగం వెనిగర్‌ను కలిపి ప్రయత్నించండి.





క్లుప్తంగా...

వైట్ చాలెంజ్‌కి వస్తే ఇన్ని అనుమానాలు ఉండకపోయేవి

● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ విషయంలో నాడు రేవంత్ రెడ్డి విసిరిన వైట్ చాలెంజ్‌కు కేటీఆర్ సిద్ధపడి ఉంటే ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు ఇన్ని అనుమానాలుండేవి కాదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం వెళ్లడానికి ముందు సూర్యాపేటలో మూడడుగుల మనిషి దగ్గర ఆగి రెండు వేసుకుని ఉంటాడని, అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లయిందని కేటీఆర్ అంటున్నాడని ఎద్దేవా చేశారు. తమ పాలన వచ్చి ఏడాదిన్నర మాత్రమే దాటిందన్నారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ విషయంలో చిన్న అంశాన్ని పట్టుకుని హరీశ్‌రావు స్కేటింగ్ బోర్డుపై ఉరికి వచ్చినట్టు వచ్చాడని చామల వ్యాఖ్యానించారు. ఎలక్షన్లు, కలెక్షన్లు, కమీషన్ల కోసమే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ చేశారని, పార్టీ పేరు నుంచి టీని తీసేసి బీని పెట్టినందుకు ప్రజలు బొందపెట్టారని దుయ్యబట్టారు.

రేవంత్‌రెడ్డి రేసు గుర్రమైతే.. కేటీఆర్ కుంటి గుర్రం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రేసు గుర్రమైతే, కేటీఆర్ కుంటి గుర్రమని, పరుగెత్తే గుర్రాన్ని కుంటి గుర్రం ఆపాలని ప్రయత్నించడం వృథానేనని అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని చాచి కొట్టి ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని, వారికి రాష్ట్రంలో ఉన్న గుర్రం ఎవరో గాడిద ఎవరో తెలుసునన్నారు. ఇంటి తగాదాలతో అసహనంలో ఉన్న కేటీఆర్ బురదలో పొర్లాడుతూ ఆ బురదను తమకు అంటించడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. శామేల్ మాట్లాడుతూ కేటీఆర్ లీడర్ అని ప్రజలు భావించడం లేదని, ఆయన మాట్లాడుతుంటే డ్రగ్స్ తీసుకుని మాట్లాడుతున్నట్టు ప్రజలు భావిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తమ సొంత జాగీర్ అనుకున్నారని, ప్రజలు కర్రు కాల్చి వాతపెడితే ఏం చేయాలో అర్థం కాక మతి లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కనీసం రాష్ట్రంలో వర్షం కూడా పడకూడదని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని, అసలు వాళ్లు మనుషులేనా? అని శామేల్ ప్రశ్నించారు.

ఇద్దరు సీఎంలు కలిసి మాట్లాడుకుంటే తప్పేంటి?

● లోకేశ్‌ను రహస్యంగా కేటీఆర్ ఎందుకు కలిశాడో చెప్పాలి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి కూర్చొని మాట్లాడుకుంటే తప్పేంటని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఆయన బాధ్యత నెరవేర్చడం తప్పా అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావుల మతి చెడిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒంటరిగా వెళ్లలేదని, ఆయన వెంట ఉత్తమ్, శ్రీధర్‌బాబు కూడా ఉన్నారని, అది బీఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఉన్నంత కాలమే కేటీఆర్, హరీశ్‌ల ఉనికి ఉంటుందని, రేవంత్‌రెడ్డితో ముఖాముఖికి కేసీఆర్ భయపడతారని, అందుకే అసెంబ్లీకి రావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనడం లేదనేది కేటీఆర్ అభ్యంతరమైతే పార్టీ పేరు నుంచి తెలంగాణ అనే పదాన్ని ఎందుకు తొలగించారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు కొద్దిగా తెలివి ఉన్న వ్యక్తిని సాగునీటి మంత్రిగా పెట్టుకుంటే బాగుండేదని, నిమ్మల రామానాయుడు తొలిసారి మంత్రి అయ్యి ఉంటారని వ్యాఖ్యానించారు. ఏపీ మంత్రి లోకేశ్‌ను కేటీఆర్ మూడుసార్లు రహస్యంగా ఎందుకు కలిశారో చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

కుట్రల కేంద్రంగా సీఎం ఆఫీస్

● తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కార్యాలయం కుట్రల తయారీ కేంద్రంగా తయారైందని, అక్కడి నుంచి వచ్చే కాకమ్మ కథలను ఆంధ్రజ్యోతి దినపత్రిక వండి వారుస్తోందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ విమర్శించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కుంభకోణంలో కేటీఆర్, కవిత, రాజ్ పాకాల పాత్ర ఉందంటూ రేవంత్ అనుచరులు కాసుల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో ఆంజనేయగౌడ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గతంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా పనిచేసిన మంత్రి వివేక్, మాజీ ఎంపీ అజారుద్దీన్ ఇద్దరూ కాంగ్రెస్‌లో ఉన్నారని, వారి హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హెచ్‌సీఏలో కొద్ది రోజుల్లో ఏదో జరుగుతుందని మంత్రి వివేక్ కుమారుడు, ఎంపీ గడ్డం వంశీ కొద్ది రోజుల కిందట ఎలా చెప్పగలిగారని ఆంజనేయగౌడ్ ప్రశ్నించారు.

మళ్లీ ఇళ్ల సర్వే

- ఇందిరమ్మ గ్రామీణ ప్రాంత దరఖాస్తుల సర్వే.. తమ నిబంధనల ప్రకారం లేదన్న కేంద్రం
- కేంద్ర నిధులు కావాలంటే.. మళ్లీ సర్వే చేయాల్సిందేనని స్పష్టీకరణ
- అది కూడా ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని గడువు
- ఉరుకులు పరుగులతో రీ సర్వే ప్రారంభించిన యంత్రాంగం
- చేయాల్సిన ఇళ్లు 23 లక్షలు.. శుక్రవారం నాటికి చేసినవి 60 వేలే...



సాక్షి, హైదరాబాద్: 'మీరు చేసిన సర్వేతో మాకు సంబంధం లేదు..మేం రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా మీరు ఒక్కో దరఖాస్తుదారు ఇంటికి వెళ్లి మళ్లీ సర్వే చేసి అర్హుల జాబితా అందిస్తేనే..ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం గ్రామీణ యూనిట్ల మంజూరుపై నిర్ణయం తీసుకుంటాం'అని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీంతో తెలంగాణ సిబ్బంది మళ్లీ ఉరుకులు పరుగులు పెడుతూ ఇందిరమ్మ దరఖాస్తుదారుల రీసర్వే ప్రారంభించింది. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 23 లక్షల దరఖాస్తుదారుల వివరాలు మళ్లీ సేకరిస్తున్నారు. ఈ దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి గతంలో నిర్వహించిన సర్వే వివరాలను ఇప్పుడు చెత్తబుట్ట పాలు చేయాల్సి వచ్చింది. ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఇవ్వటంతో, సిబ్బంది ఆగమేఘాల మీద దరఖాస్తు పత్రాలు పట్టుకొని పరుగులు పెడుతూ సర్వే జరుపుతోంది.

ఇదీ సంగతి..

ఇందిరమ్మ ఇళ్ల కోసం గతేడాది జనవరిలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 82 లక్షల దరఖాస్తులు అప్పట్లో అందాయి. వాటిల్లో సొంత జాగా ఉన్న వారిని ఓ జాబితాగా రూపొందించారు. తొలుత సొంతజాగా ఉన్న వారికే ఇళ్లు ఇవ్వాలన్న నిబంధన పెట్టుకోవటంతో వాటికే ప్రాధాన్యం ఇచ్చారు. ఆయా దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ సిబ్బంది సర్వే చేసి ఇందిరమ్మ అర్హుల జాబితా రూపొందించింది. ఆ వివరాల ఆధారంగా గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితా తయారుచేశారు. ఈ సంవత్సరానికి నాలుగున్నర లక్షల మందికిగాను ఇప్పటికే మూడున్నర లక్షల మందికి ఇళ్ల నిర్మాణ అనుమతి పత్రాలు మంజూరు చేశారు. పట్టణ ప్రాంతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన అర్బన్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, కేంద్రం 1.13 లక్షల యూనిట్లను మంజూరు చేసింది. ఇక గ్రామీణ ప్రాంత యూనిట్ల కోసం పలుమార్లు కోరగా, తాజాగా కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం బాంబు పేల్చింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి దాదాపు 30 లక్షల వరకు దరఖాస్తులు అప్పట్లో అందాయి. సిబ్బంది వారి ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేసి 23 లక్షల మంది అర్హులుగా గుర్తించింది. ఇందులో 19.50 లక్షల మందికి సొంత జాగా ఉందని తేల్చారు. మిగతావారు సొంత భూమి లేనివారు. సొంత జాగా ఉన్న వారిలో మరీ పేదరికంలో ఉన్న వారు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వ్యవసాయ కూలీలు.. ఇలాంటి వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి మొదటి విడతలో ఇళ్లను మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి గ్రామీణ ప్రాంత ప్రధానమంత్రి ఆవాస్ యోజన యూనిట్లను మంజూరు చేయాలని కోరారు.

మొబైల్ అప్లికేషన్ ద్వారా సర్వే జరగలేదంటూ...

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ఆధారంగా సర్వే జరగనందున, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సర్వేను పరిగణనలోకి తీసుకోలేమని తాజాగా కేంద్ర అధికారులు తేల్చి చెప్పారు. ద్విచక్రవాహనాలు, బ్యాంకు ఖాతా, పన్ను చెల్లింపు తదితర వివరాలు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో లేవని, వాటితోపాటు.. ఇల్లు నిర్మించదలుచుకున్న స్థలం వద్ద లబ్ధిదారును నిలబెట్టి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని మెలిక పెట్టారు. దీంతో మరోసారి సర్వే చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. సర్వే వివరాలను ఈ నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో అందజేయాలని సూచించింది. దీంతో మారు ఆలోచన లేకుండా రీ సర్వే ప్రారంభించారు. అప్పట్లో సర్వే చేసిన బృందాలను మళ్లీ రంగంలోకి దింపి యుద్ధప్రాతిపదికన సర్వే ప్రారంభించారు. శుక్రవారం నాటికి 60 వేల దరఖాస్తుదారుల సర్వే పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంత ఇళ్లకు సంబంధించి యూనిట్ కాస్ట్ రూ.72 వేలుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయనుంది. ఐదేళ్లకు సంబంధించి ఇప్పుడు కేంద్ర యూనిట్లను మంజూరు చేయనున్నందున, 23 లక్షల యూనిట్లు పొందితే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ యూనిట్లు ఎన్ని మంజూరు చేస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ నెలాఖరు నాటికి రీసర్వే పూర్తి చేసి జాబితాను కేంద్రానికి పంపి గరిష్ట సంఖ్యలో కేంద్ర యూనిట్లు పొందాలన్న ప్రయత్నంలో రాష్ట్ర యంత్రాంగం ఉంది.

బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం

- అప్పుడు ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే నీటి సమస్య వచ్చేది కాదు
- జలవిద్యుత్ ఉత్పత్తి పెంపుపై దృష్టి పెట్టాం
- సోలార్ పవర్‌ను కూడా పెంచుతాం : డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



నాగార్జునసాగర్‌లోని జల విద్యుత్ కేంద్రం వద్ద భట్టి. చిత్రంలో హరీశ్, ఇలాత్రిపాఠి, జైవీర్‌రెడ్డి తదితరులు

నాగార్జునసాగర్: బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్లలో సాగునీటి రంగంలో చేసిన తప్పులను సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు సరిదిద్దుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లోని ప్రధాన జల విద్యుదుత్పాదన కేంద్రాన్ని జెన్‌కో సీఎండీ హరీశ్, అధికారులతో కలిసి పరిశీలించారు. జల విద్యుత్ ఉత్పాదనకు సంబంధించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని హైడల్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం విజయవిహార్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. జూరాల–శ్రీశైలం మధ్య రాయలసీమ ఎత్తిపోతల పథకం ఎవరి టైంలో మొదలైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లాలని పెద్దఎత్తున ఆందోళన చేసినా.. పోకుండా టీఆర్ఎస్ నేతలు నిద్రపోయి వాళ్ల ప్రాజెక్టులు కట్టుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. ఆ తర్వాత కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బేసిన్లు లేవు... భేషజాలు లేవని ప్రకటించారని భట్టి చెప్పారు. వారి కాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే.. ప్రస్తుతం నీటి సమస్య వచ్చేది కాదన్నారు.

విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది.

సంవత్సర కాలంలోనే 2,000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందని భట్టి చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ ఏడాది 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చిందని, గత ఏడాదితో పోలిస్తే 2,000 మెగావాట్లు అధికమన్నారు. సూర్యాస్తమయం తర్వాత సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కుదరదు కనుక.. పగలు సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసి అవసరమైనప్పుడు వాడుకునేలా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వైపు దృష్టి పెట్టినట్టు భట్టి చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఉన్నారు.

24 వరకు మహిళాశక్తి సంబురాలు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 24 వరకు ఇందిరా మహిళా శక్తి సంబురాలను పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యేలు, జిల్లా మహిళా సమాఖ్యల విజ్ఞప్తి మేరకు ఈ సంబురాలను పొడిగించారు. మంత్రుల బిజీ షెడ్యూల్ కారణంగా కొన్ని నియోజకవర్గాల్లో ఈ సంబురాలు పూర్తి కాలేదని సమాచారం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సంబురాలు నిర్వహించి వడ్డీ మాఫీ చెక్కులు, ప్రమాద బీమా, లోన్ బీమా చెక్కుల పంపిణీతో పాటు, మహిళా సంఘాల నూతన వ్యాపారాలను, మహిళా సంఘాల ఆర్టీసీ అద్దె బస్సులను.. మంత్రులు, ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తున్నారు. హుస్నాబాద్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కొల్లాపూర్‌లో సీఎం రేవంత్ కామారెడ్డి, పెద్దపల్లి ములుగు, ఇల్లందు భూపాలపల్లిలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

వివాదాస్పద అంశాలపై వ్యాఖ్యలు చేయొద్దు

పార్టీ నేతలకు బీజేపీ నాయకత్వం సూచన

సాక్షి, హైదరాబాద్: వివాదాస్పద అంశాలపై మీడియా వేదికగా పార్టీ లైన్‌కు విరుద్ధంగా వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ నేతలకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం స్పష్టంచేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆదేశాల మేరకు ఈ సూచనలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివాదాస్పద అంశాలపై పార్టీ నాయకత్వం అనుమతి లేకుండా పత్రికలు, మీడియా ముందుకు వెళ్లొద్దని సూచించారు. కేవలం పార్టీ సూచించిన వ్యక్తులే మీడియా వేదికగా మాట్లాడాలన్నారు. పార్టీకి ఎమ్మెల్యే టి.రాజాసింగ్ రాజీనామా తదితర అంశాలపై ఎవరూ మాట్లాడొద్దని సూచించినా.. ఇటీవల కొందరు విమర్శలు చేయడం, దానికి మరికొందరు ప్రతి విమర్శలు చేయడంతో నాయకత్వం స్పందించినట్టు సమాచారం. గోషామహల్‌కు ఉప ఎన్నిక వస్తే తామే అభ్యర్థి అంటూ సోషల్ మీడియా వేదికగా ఒక నేత ప్రచారం చేసుకోవడం, దాన్ని ఆ నియోజకవర్గ నేతలు ఖండించిన విషయం తెలిసిందే.

ఇది ప్రజా సర్కార్.. దొరలది కాదు

- కేటీఆర్ సొల్లు పురాణం మాని విదేశాల్లో వ్యాపారం చేసుకోవాలి
- వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మంలో బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవదు: పొంగులేటి



బూర్గంపాడులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు/భద్రాచలం: రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది దొరల ప్రభుత్వం కాదని.. పేదలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వమని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ఆయన పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. కేటీఆర్ సొల్లు పురాణం మాని పదేళ్లు అధికారంలో ఉండి సంపాదించుకున్న సొమ్ముతో విదేశాల్లో ఏదైనా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌ను ఒక్క సీటులోనైనా గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. త్వరలోనే మహిళా సంఘాల సభ్యులకు రెండేసి నాణ్యమైన చీరలు అందిస్తామని ప్రకటించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లోని గోదావరి వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఎత్తయిన ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

రామాలయ అభివృద్ధికి ప్రణాళికలతో రండి

భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తగిన ప్రణాళికతో రావాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. శుక్రవారం భద్రాచలంలో మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేయడంతో పాటు రామాలయం సమీపాన మాడ వీధుల విస్తరణ పనులను పరిశీలించి మాట్లాడారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఆలయ అధికారులు, వైదిక కమిటీ బాధ్యులు వాస్తుతోపాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ప్లాన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యం 7 కోట్ల మొక్కలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం పల్లెల్లో సాగుతోంది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా 6.90 కోట్ల మొక్కలు నాటారు. కాగా, ఈ ఏడాది 7 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోంది. ఈ లక్ష్యంలో పీఆర్‌ఆర్డీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాటికి 1.7 కోట్ల మొక్కలను నాటారు. దీంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లాల్లో వన మహోత్సవం కాస్త మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు ఆ జిల్లాలో 42 వేల మొక్కలు నాటారు. దీంతో ఆ జిల్లాలో వేగం పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈసారి వనమహోత్సవంలో భాగంగా పీఆర్‌ఆర్డీ శాఖ పండ్ల తోటలకు, ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ సారి 22 వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటి వరకు 4,521 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటారు.

రాయలసీమ ప్రాజెక్టును రద్దు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

పాలమూరుకు వలస వస్తే ఇక్కడి బిడ్డలు భుజాలపై పెట్టుకున్నారు. పదేళ్ల కాలం పాటు సీఎంగా ఉన్నా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు? ఉమ్మడి రాష్ట్రంలో కన్నా కేసీఆర్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం జరిగింది. పాలమూరు బిడ్డలు అన్నం పెడితే, కేసీఆర్ వారికి సున్నం పెట్టారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే కేసీఆర్‌కు దు:ఖం వస్తోంది. 2034 వరకు ఇంకో పదేళ్ల పాటు పాలమూరు బిడ్డనే ముఖ్యమంత్రిగా ఉంటారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాలమూరు, కల్వకుర్తి, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేసే బాధ్యత నేను తీసుకుంటా. డిసెంబర్ 9 కల్లా అన్ని ప్రాజెక్టుల భూసేకరణ పూర్తిచేసి, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తాం. ఆయన అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్షంలో కూర్చుని మేము చేస్తున్న పనులు చూడాలి..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

రెండున్నరేళ్లలో లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు

'కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు ఖర్చు చేశాడు. ఒకే ఒక్క ప్రాజెక్టుకోసం లక్ష కోట్లు పెట్టిన పరిస్థితి ఎక్కడా లేదు. ఎవరైనా గుడిసె కట్టుకున్నా పదేళ్లు ఉంటది. కానీ కాళేశ్వరం 2019లో కడితే 2023లో కూలింది. మూడేళ్లకే ప్రాజెక్టు కూలుతుందా? బీఆర్ఎస్ పాలనలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదు. తన ఇంటినిండా మాత్రం కొలువులు నింపుకున్నాడు. మా ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 60 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నరేళ్ల కాలంలో మొత్తం లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాదిగ ఉప కులాలకు న్యాయం జరిగేలా చూసే క్రమంలో నోటిఫికేషన్ల జారీ ఆలస్యం అవుతోంది. ఆరు నెలలు ఆలస్యమైనా వారికి న్యాయం జరుగుతుంది. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు దేశానికే తలమానికంగా నిలువబోతున్నాయి..' అని సీఎం చెప్పారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపనలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు దామోదర, జూపల్లి, వాకిటి తదితరులు

మా పాలనలో మహిళలకు అందలం

'కేసీఆర్ పాలనలో 2018 వరకు ఒక్క మహిళా మంత్రి కూడా లేరు. ఇలాంటి పరిస్థితి దేశంలో ఎక్కడా లేదు. ఆడవాళ్లు వంటింటికే పరిమితం కావాలన్న దుర్మార్గమైన ఆలోచన బీఆర్ఎస్‌ది. మా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరుల్ని చేసేలా పనిచేస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో బడిపంతుళ్ల హాజరు లెక్కలు చూసే అధికారం అక్కలకే ఇచ్చాం. పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని పేదల విద్య, ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతేనని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. 2011లో వైఎస్సార్ మహిళలకు వడ్డీలేని రుణాలను అందించారని, బీఆర్ఎస్ పాలనలో ఈ రుణాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతోందని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఒక్క మోటారు ఆన్‌చేసి కేసీఆర్ ఎన్నికల డ్రామా ఆడారని మండిపడ్డారు. కాగా స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు వడ్డీలేని రుణాల కింద రూ.344 కోట్లను సీఎం ఈ సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం

నిజమైన బీసీలకే రిజర్వేషన్లు దక్కాలి

- కాంగ్రెస్ ఇచ్చేవి బీసీల కొంప ముంచే రిజర్వేషన్లు
- బనకచర్లపై కేంద్ర జలశక్తి మంత్రిని మూడుసార్లు కలిశా
- తెలంగాణ ప్రజల కోణంలో ఆలోచించాలని కోరా
- గోదావరి జలాల వినియోగంపై సీఎం ప్రణాళిక ఏంటి?
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అవి బీసీల కొంప ముంచే రిజర్వేషన్లు అని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బీసీ సంఘాల నేతలు ఆలోచించాలి. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసే, కొంప ముంచే రిజర్వేషన్లు ఇస్తోంది. నిజమైన బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

గోదావరి నీళ్లపై మీ ప్రణాళికేంటి?

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తాను సమర్థిస్తున్నానంటూ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లెవేయడం తప్పితే నిర్మాణాత్మక పనులు ఒక్కటీ చేయటం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. గోదావరి నీళ్లు ఏ విధంగా ఉపయోగించుకోవాలనే విషయంలో ఇంతవరకు రేవంత్‌రెడ్డి ఏదైనా ప్రణాళిక రూపొందించుకున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు తాము ఏం చేశామో తెలియాలంటే రైల్వేస్టేషన్లకు వెళ్లాలని సూచించారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్రం ఇరు రాష్ట్రాల సీఎంలను చర్చలకు పిలిచింది. ఇది జడ్జిమెంట్ ఇవ్వడం కోసం కాదు. సమస్యను పరిష్కరించేందుకు ఫెసిలిటేటర్‌గా చర్చలకు పిలిచింది. బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాస్తే..నేను కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని మూడుసార్లు కలిసి తెలంగాణ ప్రజల అభిప్రాయాల కోణంలో ఆలోచన చేయాలని కోరాను. దీంతో కేంద్రం ఈ సమావేశం ఏర్పాటు చేసింది. అలాంటి సమావేశాన్ని బీఆర్ఎస్ ఎందుకు వ్యతిరేకించాలి?'అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణకు యూరియా పంపిణీ విషయంలో కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిదే అని అన్నారు. మహారాష్ట్రలో తెలంగాణ గ్రామాలను విలీనం చేయాలంటే పార్లమెంటులో చట్టం చేయాలని, రెండు రాష్ట్రాల ప్రజలు అందుకు ఒప్పుకుంటే చట్టం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 60–70 శాతం వరకు పూర్తయ్యాయని, శనివారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.12 లక్షల కోట్లు

- రూ.500 కోట్ల పెట్టుబడులు, 3 వేల మందికి ఉపాధి
- డీఏజెడ్ఎన్ జీసీసీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థితిగతులను మార్చే మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు (15 బిలియన్ డాలర్లు) వెచ్చిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఏఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఈవీ, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలను అనుసంధానిస్తూ రీజినల్ రింగు రోడ్డు వంటివి ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ టెక్ రంగంలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'డీఏజెడ్ఎన్'భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను శ్రీధర్‌బాబు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఆవిష్కరణలు కేంద్రంగా జరుగుతున్న కార్యకలాపాలకు నిలయంగా మారుతున్న హైదరాబాద్‌కు డీఏజెడ్ఎన్ వంటి సంస్థల రాక రాష్ట్ర ప్రతిష్టను మరింత ఇనుమడింప చేస్తుందన్నారు. వచ్చే మూడేళ్లలో డీఏజెడ్ఎన్ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న జీసీసీలో రూ.500 కోట్లు ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులు పెడుతుందని మంత్రి తెలిపారు. దీంతో 2026 చివరి నాటికి 3 వేల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. 2023లో హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసిన డీఏజెడ్ఎన్ కేవలం రెండేళ్లలోనే 1,500 మంది ఉద్యోగులను నియమించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. భవిష్యత్ తరపు క్రీడా సాంకేతికతను అభివృద్ధి చేయడంలో హైదరాబాద్ జీసీసీ కీలకపాత్ర పోషిస్తుందని డీఏజెడ్ఎన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సందీప్ టికు వెల్లడించారు.

మహిళా పారిశ్రామికవేత్తలు సరికొత్త ఆలోచనలతో ఎదగాలి

● ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి




సాక్షి, హైదరాబాద్: కాలానుగుణంగా మహిళా పారిశ్రామికవేత్తలు సరికొత్త ఆలోచనలతో విజయాలను సాధించాలని, ఆహార ఉత్పత్తులు, టెక్స్‌టైల్, గృహ రంగాల్లో వారికి మంచి అవకాశాలున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్ సెస్ ఆడిటోరియంలో శుక్రవారం బ్రేకింగ్ బేరియర్స్ అండ్ బిల్డింగ్ ఫ్యూచర్స్.. ఎంపవరింగ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇన్ ఎంఎస్ఎంఈ'అనే అంశంపై రెండు రోజుల సెమినార్ మొదలైంది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంటర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ స్టడీస్ ఈ సెమినార్‌ను సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ.రేవతం అధ్యక్షత వహించారు. సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ స్థూల జాతీయోత్పత్తిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దాదాపు 30 శాతం వాటా కలిగి ఉన్నాయని, ఇందులో 20 శాతం మహిళలదే కీలకపాత్ర అన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈలో మహిళలు విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, ఐఎఫ్‌హెచ్ఈ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎల్ఎస్.గణేష్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డాక్టర్ క్రాంతి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'నాగారం'పై విచారణ కమిషన్ వేస్తారా?

● వివరణ ఇవ్వాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని వివాదాస్పద భూములపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ఉందా అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ప్రశ్నించింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై ఉన్నట్టు ఆరోపణలున్న నేపథ్యంలో కమిషన్ వేసి చర్యలు తీసుకుంటున్నారా లేదా అనేది తెలియజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. నాగారంలోని 194, 195 సర్వే నంబర్లలోని భూమిని నవీన్‌మిత్తల్‌తోపాటు ఇతర ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై అక్రమంగా పట్టా చేసుకోవడం, రికార్డులు తారుమారు చేయడంపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పడమటి తండాకు చెందిన రాములు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సర్వే నంబర్లు194, 195లలో ఎస్టీలకు చెందిన 10.17 ఎకరాల వారసత్వ భూమి ఉందని, పిటిషనర్ తండ్రి ఆ భూమిని కొనుగోలు చేశారన్నారు. 2020లో పిటిషనర్ తండ్రి మరణించిన తర్వాత ఆ భూమికి సంబంధించి ఈ–పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ అయ్యాయని చెప్పారు. అయితే, కొందరు 'పెద్దలు'పిటిషనర్ భూమిని తమ పేరిట మ్యుటేషన్ చేయించుకొని, పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందారన్నారు. ఎలాంటి టైటిల్ లేని వ్యక్తులకు రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చి భూములు అప్పగించారన్నారు. తన భూముల మ్యుటేషన్‌కు సంబంధించి సర్టిఫైడ్ కాపీలు ఇవ్వాలని పిటిషనర్ దరఖాస్తు చేసుకున్నా అధికారులు ఇవ్వడం లేదన్నారు. ఈ భూ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఎస్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించినా, స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్టు నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నాగారం భూములపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ఉందా.. లేదా.. చెప్పాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు. 181, 182, 194, 195 సర్వేనంబర్లలోని భూములపై తాము ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని గతంలోనే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

● వికాసం



● అఖిల్

చెస్ కడుపున చిత్రకళ పుట్టింది

రెండు రాష్ట్రాలలో ఎమ్‌సెట్
అడ్మిషన్ల గాలి వీస్తోంది.
పిల్లలకు ఇష్టమున్నా లేకున్నా
బీటెక్ వైపు తల్లిదండ్రులు దారి మళ్లిస్తున్నారు.
మనం ఏదనుకున్నామో అది కాకుండా
వాళ్లు ఏదనుకున్నారో అది చేయనిచ్చే వీలు లేదు
అనేక కారణాల రీత్యా తల్లిదండ్రులకు కూడా.
కాని గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్
ఏం చేస్తున్నాడో చూడండి.
తన కుమారుడు అఖిల్‌ని
చెస్ ప్లేయర్‌ని చేయలేదు.
చిత్రలేఖనంలో అభిరుచి ఉన్న ఆ అబ్బాయి చేత
బొమ్మలేయిస్తున్నాడు.
అఖిల్ అద్భుతమైన బొమ్మలు వేస్తున్నాడు

‘నీకు ఏది ఇష్టమో దాని కోసం కృషి చేసే ధైర్యం నీలో ఉండాలి అని చెప్పం టారు నాన్నగారు’ అంటాడు అఖిల్ ఆనంద్.

15 ఏళ్ల అఖిల్ ఆనంద్ ఐదుసార్లు ప్రపంచ చెస్ విజేతగా నిలిచిన విశ్వ నాథన్ ఆనంద్ కుమారుడు. ఇటీవలే ‘మార్ఫొజెనెసిస్’ పేరుతో ఆర్ట్ ఎగ్జిబి షన్ చేశాడు. ఇదే కాదు ఇంతకు ముందు చాలా ముఖ్య నగరాల్లో అఖిల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు జరిగాయి. క్రికెటర్ల పిల్లలు క్రికెటర్లు, ఇంజినీర్ల పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్ల పిల్లలు డాక్టర్లు అవ్వాలని, అవుతారని అనుకో వడం సాధారణం. అలాగే గ్రాండ్ మాస్టర్ కొడుకు చెస్‌లో ప్రవేశిస్తాడని అనుకోవడం కూడా మామూలే. అయితే ఇక్కడ అసాధారణంగా పిల్లవాడి ఆసక్తికే విలువ ఇచ్చాడు విశ్వనాథన్ ఆనంద్.

‘నాకు తొమ్మిదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి బొమ్మలంటే ఆసక్తి అని గ్రహించి పెయింటింగ్‌లోనే కృషి చేయమని ప్రోత్సహించారు నాన్న.





● కుమారుడు అఖిల్‌తో గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్

అంతేకాదు అందుకు అవసరమైన శిక్షణ కూడా ఇప్పించారు’ అంటు న్నాడు అఖిల్.

చిత్రకారిణి డయానా సతీష్ దగ్గర శిక్షణ పొందిన అఖిల్ అంత టితో ఆగలేదు. భారతీయ చిత్రకళకు సంబంధించిన మెళకువలు గ్రామీణ కళాకారుల దగ్గర ఉంటాయని బెంగాల్‌కు చెందిన గ్రామీణ చిత్రకారుల కేంద్రం ‘హస్త’లో శిక్షణ తీసుకున్నాడు. అందుకే అఖిల్ బొమ్మల్లో గాఢమైన రంగులు, స్థానికత ఛాయ కనిపిస్తాయి.

‘నాకు గణితం ఇష్టం. నా బొమ్మల్లో గణితం అంశ ఉంటుంది. అలాగే మైథాలజీ... మత చిహ్నాలు కనిపిస్తాయి. మీరు గ్రామీణుల చిత్రకళ గమనించండి... సిందూర రంగు, అపరంజి రంగు ఎన్ని వన్నెలు పోతాయో. జనం గొప్పతనం అది. అందుకే నాకు మన రాజ్యాంగ ప్రవేశిక ఇష్టం.‘వుయ్ ద పీపుల్’ అంటుంది అది. ప్రజల పట్ల మన రాజ్యాంగం వివక్ష చూపదు. అందరూ సమానమే. నా చిత్రకళ కూడా అలాంటి స్ఫూర్తితోనే ఉంటుంది’ అంటాడు అఖిల్.

తండ్రిని విపరీతంగా అంటి పెట్టుకుని తిరిగే అఖిల్ తండ్రిని అనేక ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు తెలుసుకుంటూ ఉంటాడు.

‘నాన్న నాతో సినిమాలకు వస్తారు. నాతో స్టార్ వార్స్ సిరీస్ చూస్తారు. నేనెప్పుడైనా బొమ్మను పాడు చేసి అప్‌సెట్ అయితే నన్ను వాకింగ్‌కు తీసు కెళ్లి తాను చెస్ ఆడేటప్పుడు ఎలాంటి తప్పులు చేశారో వాటి నుంచి ఏం నేర్చుకున్నారో చెప్పి ఉత్సాహం నింపుతారు. నాన్నకు, నాకు సంగీతం ఇష్టం. ఇద్దరం చాలా కచ్చేరీలకు కూడా వెళు తుంటాం. అయితే ఆయనకంటే నాకు ఎక్కువ పాప్ సాంగ్స్ తెలుసు. నాకు ఏది ఇష్టమో అది చేస్తే ఆయనకు ఇష్టం’ అన్నాడు అఖిల్.

తన ఆర్ట్ ఎగ్జిబిషన్ సమయంలో అఖిల్ సంద ర్శకులతో ఇంటరాక్ట్ అవుతాడు. ‘వాళ్లు నాతో మాట్లాడి చాలా సందేహాలు అడుగుతారు. నేను సమాధానాలు చెప్తాను. వాటితో వాళ్లు సంతృప్తి చెంది నా బొమ్మను కొంటే చాలా సంతోషిస్తాను’ అంటున్నాడు అఖిల్. అఖిల్ వేస్తున్న అడుగులలో తల్లి అరుణ ఎప్పుడూ తోడుగా ఉంటోంది.

విశ్వనాథన్ ఆనంద్, అరుణలకు అఖిల్ ఒక్కడే సంతానం. బొమ్మలు వేయడం కాకుండా ప్రయాణాలను ఎక్కువ ఇష్టపడే అఖిల్ ప్రపంచాన్ని చుట్టేస్తూ దేశాలు తిరుగుతూ దేశమంటే మట్టి కాదు మనుషులని తెలుసుకుంటూ ఉంటాడు.

● ప్రోగ్రెస్

సీఏలో దూసుకుపోతున్నారు!

‘సీఏ పరీక్ష పాస్ కావడం అంటే మాటలా!’ అనే మాట ఒకటి ఉంది.

ఆ మాట సంగతి ఎలా ఉన్నా సీఏ (చార్టర్డ్ ఎకౌంటెంట్) పరీక్షలలో అవలీలగా విజయ కేతనం ఎగరేస్తున్నారు మహిళలు. గత పాతిక సంవత్సరాలుగా మహిళా చార్టర్డ్ ఎకౌంటెంట్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది. 2000 సంవ త్సరంలో సీఏ చేసిన మహిళలు 8 శాతం ఉండగా, 2023 నాటికి 30 శాతం పెరిగింది.

మహిళలు చార్టర్డ్ ఎకౌంటెంట్ కావాలను కోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. మన దేశంలో ఆర్థిక సరళీకరణ తరువాత అకౌం టింగ్, ఆడిటింగ్ పరిశ్రమ విస్తరించడంతో సర్టి ఫైడ్ పబ్లిక్ అకౌంటెంట్‌ల కోసం అనేక ఉద్యో గావకాశాలు పెరిగాయి.

ఆకర్షణీయమైన వేతనాలు మాత్రమే కాదు ‘ఫ్లెక్సిబిలిటీ’ కూడా మహిళలు సీఏను ఎంచుకో వడానికి కారణంగా చెప్పవచ్చు. సీఏ కోర్సుకు తక్కువ ఖర్చు కావడం, ప్రాక్టీసింగ్ సీఏలు ఇంటి నుంచే పనిచేయగల సౌలభ్యం, వృత్తిజీవి తాన్ని, కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసు కునే అవకాశం ఉండడం... మొదలైన కారణాల వల్ల సీఏ కోర్సుపై మహిళలు ఆసక్తి కనబరుస్తు న్నారు.



● ప్రపంచంలోకెల్లా అతి పిన్న వయస్కురాలైన ఫీమేల్ చార్టర్డ్ అకౌంటెంట్ నందిని అగర్వాల్

● ఉమెన్ సేఫ్టీ

ఎంపవర్‌మెంట్ టూల్

కొన్ని సంవత్సరాల క్రితం అమెరికాలో...

కారు దిగి రెస్టారెంట్‌కు నడిచి వెళుతున్న సమ యంలో సారా హస్బెల్‌ను ఒకడు అనుసరిస్తూ దాడికి ప్రయత్నించాడు. మెరుపు వేగంతో తన దగ్గర ఉన్న పెప్పర్ స్ప్రేతో అతడి ఆట కట్టించింది సారా. ఈ అను భవమే సారా హస్బెల్‌ను మల్టిపుల్ సేఫ్టీ ఫీచర్‌లతో కూడిన పర్సనల్ ప్రొటెక్షన్ టూల్‌ను డెవలప్ చేసేలా చేసింది.

‘బెస్టీ డిఫెన్స్’ అనే ఈ డివైజ్ ఉపయోగించడానికి సులభంగా ఉంటుంది. దీనిలో పెప్పర్ స్ప్రే, ప్రమాదం గురించి ఇతరులను అప్రమత్తం చేసే అలారమ్, ఇంప్రువైజ్‌డ్ వెపన్, సేఫ్టీ స్విచ్, ట్రిగ్గర్, స్ట్రైకర్, కీ రింగ్... మొదలైనవి ఉంటాయి.

‘మేము రూపొందించిన సెల్ఫ్-డిఫెన్స్ సాధనం ఆపద సమయంలో మీకు బెస్ట్ ఫ్రెండ్‌గా ఉపయోగపడుతుంది. ఇది ఎంపవర్‌మెంట్ టూల్’ అంటుంది సారా.



● లాంగ్వేజ్ స్కిల్స్

అమెరికన్ అమ్మాయి హిందీ బేషుగ్గా మాట్లాడుతుంది!

అమెరికన్ మహిళ హిందీ భాష నైపుణ్యానికి జేజేలు చెబుతున్నారు నెటిజనులు. క్రిస్టెన్ గత నాలుగు సంవత్సరాలుగా మన దేశంలో ఉంటోంది.

‘హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాను’ అని ఆమె అన్నప్పుడు...

‘చాలా కష్టం’ అన్నవారే ఎక్కువ.

‘నేను హిందీ మాట్లాడటం ఎలా నేర్చుకు న్నాను అంటే’ అనే కాప్షన్‌తో తాజాగా పూర్తిగా హిందీలో మాట్లాడుతున్న వీడియోను ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేసింది క్రిస్టెన్,

హిందీలో మాట్లాడడమే కాదు హిందీ నేర్చుకోవాలనుకునే వారిని ఉద్దేశించి విలువైన సూచనలు కూడా ఇచ్చింది.

‘హిందీ నేర్చుకోవడం కష్టమే కావచ్చు గానీ, అసాధ్యం కాదు’ అంటున్న క్రిస్టెన్ ఆన్ లైన్ క్లాసులు తీసుకోవడంతో పాటు జీపీఏ (గ్రోయింగ్ పార్టిసిపేటర్ అప్రోచ్) మెథడ్‌ను అనుసరించింది.

క్లాసులకు మాత్రమే పరిమితం కాకుండా ఇంగ్లీష్ మాట్లాడలేని స్థానికులతో హిందీలో మాట్లాడి హిందీని పర్‌ఫెక్ట్‌గా మాట్లాడేలా ప్రాక్టీస్ చేసేది.



● సోషల్ మీడియా

నవాజుద్దీన్ గారి అమ్మాయి

బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ అద్భుత నటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. తాజా విష యానికి వస్తే... తండ్రి బాటలో నడవ డానికి రెడీ అయింది నవాజుద్దీన్ కూతురు షోర.

ఒక వర్క్‌షాప్‌లో షోర ఫస్ట్ యాక్టింగ్ పెర్‌ఫార్మాన్స్‌కు సంబం ధించిన వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రా మ్‌లో పోస్ట్ చేశాడు నవాజ్.

సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అయింది. ‘నెక్స్ట్ రాధిక ఆప్టే’

‘అచ్చం రాధికా ఆప్టేలా ఉంది. నటన కూడా అదే స్థాయిలో ఉండాలని ఆశిస్తున్నాను’

‘బాలీవుడ్‌కు మరో మంచి నటి రాబోతుం ది’... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి.

‘ఇలాంటి రా టాలెంట్‌ను ఎప్పుడూ చూడ లేదు’ అంటూ షోర సిద్దిఖీని ఆకాశానికెత్తారు యాక్టింగ్ కోచ్ రోన్ కప్లన్.



● బ్యూటిప్స్

బ్లాక్‌హెడ్స్ ఇలా దూరం

సాధారణంగా బ్లాక్‌హెడ్స్ అనేవి ముఖంపై కనిపిస్తాయి. ముఖ్యంగా ముక్కుమీద చిన్న చిన్నగా మచ్చల్లా ఉండి చూడటానికి ఇబ్బందిగా ఉంటాయి. వీటిని తొలగించడానికి చాలామంది నోస్ స్ట్రిప్స్, ఫేషియల్స్, లేదా రిమూవర్లను వాడుతుంటారు. అయితే, ఇవన్నీ కాస్త నొప్పిగానే ఉంటాయి. కానీ, వీటి అవసరం లేకుండానే ముక్కుపై ఉండే బ్లాక్‌హెడ్స్‌ని దూరం చేయొచ్చు పైగా ఇంట్లోని పదార్థాలని వాడి. అదెలానో చూద్దాం...

బేకింగ్ సోడా చర్మ సమస్యల్ని దూరం చేస్తుంది. ఇందుకోసం బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు పోసి పేస్టులా చేయాలి. దీనిని సమస్య ఉన్న చోట రాసి మృదువుగా మర్దన చేసి 10 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుంటే బ్లాక్‌హెడ్స్ సమస్య తగ్గుముఖం పడుతుంది.

పసుపు.. శనగపిండి... రోజ్‌వాటర్‌తో...

పసుపు మన ఇంట్లో ఉండే అద్భుతమైన ఔషధ పదార్థం అని చెప్పొచ్చు. దీనిని ఆరోగ్యానికి, అందాన్ని పెంచడానికి వాడొచ్చు. పసుపుని వాడడం వల్ల బ్యాక్టీరియా దూరమవుతుంది. ఇక శనగపిండి కూడా చక్కగా స్క్రబ్‌లా పని చేస్తుంది. రోజ్ వాటర్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. దీనికోసం ఓ గిన్నెలో టీస్పూన్ పసుపు, రెండు టీ స్పూన్ల శనగపిండి వేసి రోజ్ వాటర్‌తో కలుపుకోండి. దీంతో మొహం మీద ప్యాక్‌లా చేయండి. దీనిని ముక్కుతో పాటు బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతంలో అప్లై చేసి ఆరిన తర్వాత కొద్దిగా నీళ్ళు చల్లుతూ వేళ్ళతోనే మృదు వుగా మసాజ్ చేస్తే బ్లాక్ హెడ్స్ తొలగి ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది.

తేనె, దాల్చిన చెక్క

ఈ రెండింటి కాంబినేషన్ చర్మ సమస్యలని దూరం చేయడంలో ఉపకరిస్తుంది. దీనికోసం దాల్చిన చెక్కని పొడిగా చేయాలి. మంచి తేనెని తీసుకుని అందులో పావు టీ స్పూన్ దాల్చిన చెక్క పొడి వేయాలి. తేనె కూడా సమాన పరి మాణంలోనే తీసుకోవాలి.. ఈ రెండింటిని బాగా కలిపి బ్లాక్‌హెడ్స్‌పై అప్లై చేసి కాసేపు ఉంచండి. తర్వాత వలయాకారంలో మెల్లిగా రబ్ చేస్తే సరి, బ్లాక్ హెడ్స్ బయటికొస్తాయి.



బులియన్ జూలై 18న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,460
బంగారం (22 క్యారెట్లు)	91,270
వెండి	1,15,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,710
బంగారం (22 క్యారెట్లు)	91,100
వెండి	1,15,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,380
బంగారం (22 క్యారెట్లు)	91,100
వెండి	1,23,900
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,380
బంగారం (22 క్యారెట్లు)	91,100
వెండి	1,23,900
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,900
బంగారం (22 క్యారెట్లు)	90,070
వెండి	1,14,700
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,380
బంగారం (22 క్యారెట్లు)	91,100
వెండి	1,25,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వంటిల్లు



రుచుల దుంప

చిలగడదుంపలు ఉడికించి తింటేనే అదిరిపోతాయి.
అలాంటిది వాటితో వెరైటీలంటే ఇంకా అదిరిపోవూ?
కాస్త వెరైటీగా ట్రై చేద్దాం అనుకునేవారి కోసమే
ఈ స్పెషల్ రుచులు! ఆలస్యం దేనికీ? ప్రయత్నించండి.

చిలగడదుంప చాట్




కావలసినవి: చిలగడ దుంపలు – 2 (ముక్కలుగా కట్ చేసుకుని, మరీ మెత్తగా కాకుండా ఉడికిం చాలి); గడ్డ పెరుగు – 2 టేబుల్ స్పూన్లు; నిమ్మకాయ రసం – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; చాట్ మసాలా – ఒక టీ స్పూన్; ఉప్పు – రుచికి సరిపడా; జీల కర్ర పొడి, కారం – అర టీస్పూన్ చొప్పున; పుదీనా చట్నీ – 2 టీస్పూన్లు (అభిరుచిని బట్టి); కొత్తిమీర తరుగు, దానిమ్మ గింజలు (గార్నిష్ కోసం) – కొద్దికొద్దిగా; మిరియాల పొడి – కొద్దిగా.

తయారీ: ముందుగా ఒక పాత్రలో గడ్డపె రుగు, నిమ్మరసం, చాట్‌మసాలా, మిరి యాల పొడి, కారం, ఉప్పు, జీలకర్ర పొడి, పుదీనా చట్నీ ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ప్రతి చిలగడదుంప ముక్కను ఆ మిశ్రమంలో ముంచి, ముక్కకు బాగా పట్టించి, ఓవెన్‌లో దోరగా బేక్ చేసుకోవాలి. ఇప్పుడు ఆ ముక్కలతో పాటు దానిమ్మగింజలు, కొత్తిమీర తురుముతో గార్నిష్ చేసుకుని, సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.

చిలగడదుంప జిలేబి

కావాల్సినవి: గడ్డ పెరుగు, మైదా – ఒక కప్పు చొప్పున; శనగ పిండి – ఒక టేబుల్ స్పూన్; చిలగడదుంపల గుజ్జు(స్వీట్ పొటాటో) – ఒకటిన్నర కప్పులు (మెత్తగా ఉడికించి ముద్దలా చేసుకోవాలి); పంచదార – ఒక కప్పు పైనే; యాలకుల పొడి – పావు టీ స్పూన్; ఉప్పు – చిటికెడు; ఫుడ్ కలర్ – కొద్దిగా (అభిరుచిని బట్టి); నీళ్లు, నెయ్యి – సరిపడా.

తయారీ: ముందుగా ఒక పెద్ద బౌల్‌లోకి మైదా పిండి, శనగ పిండి, పెరుగు వేసుకుని ఉండలు లేకుండా కలుపుకోవాలి. అందులో చిలగడదుంపల గుజ్జు, చిటికెడు ఉప్పు వేసుకుని, బాగా కలిపి 10 నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఈలోపు స్టవ్ ఆన్ చేసుకుని, పాన్‌లో పంచదార, అర కప్పు నీళ్లు వేసుకుని పాకం పట్టుకోవాలి. అందులో యాల కుల పొడి, ఫుడ్ కలర్ వేసుకుని గరిటెతో తిప్పుతూ తీగమాదిరి పాకం రాగానే.. స్టవ్ ఆఫ్ చేసుకో వాలి. ఇప్పుడు మరో కళాయిలో నెయ్యి వేసుకుని.. అందులో చిలగడదుంపల మిశ్ర మంతో జిలేబీలు వేసుకుని దోరగా వేగిన వెంటనే పాకంలో వేసుకుంటే రుచికరమైన జిలేబీలు రెడీ!



స్టఫ్డ్ స్వీట్ పొటాటో

కావలసినవి: చిలగడదుంపలు – 3 లేదా 5 (పొడవుగా లేదా వెడ ల్పుగా ఉండేలా చూసుకోవాలి); ఆలివ్ ఆయిల్ – కొద్దిగా; ఉప్పు, మిరియాల పొడి – రుచికి; ఉడికించిన శనగలు (రాజ్మా/పనీర్ ముక్కలు) – ఒక కప్పు; ఉల్లిపాయ, టమాటో, పచ్చి మిర్చి – ఒక్కొక్కటి (సన్నగా, చిన్నగా తరిగిపెట్టుకోవా లి); అల్లం వెల్లుల్లి పేస్ట్ – అర టీస్పూన్; కారం, జీలకర్ర – అర టీస్పూన్ చొప్పున; ధనియాల పొడి – ఒక టీస్పూన్; పసుపు – చిటికెడు; గరం మసాలా – అర టీస్పూన్; కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్లు; నిమ్మరసం – ఒక టీస్పూన్; ఉప్పు – రుచికి సరిపడా; పుదీనా చట్నీ – గార్నిష్‌కి.

తయారీ: ముందుగా చిలగడదుంపలను మెత్తగా ఉడికించి, పచ్చిమిర్చి బజ్జీని కట్ చేసినట్లుగా మధ్యలోకి చిత్రంలో ఉన్న విధంగా విడగొట్టుకో వాలి. ఈలోపు కళాయిలో ఆలివ్ ఆయిల్ వేసుకుని దానిలో జీలకర్ర, ఉల్లి పాయ ముక్కలు, టమాటోముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు వేసుకుని దోరగా వేయించుకోవాలి. దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, కొద్దిగా ఉప్పు, ధనియాల పొడి, గరం మసాలా, ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు ప్రతి చిలగడదుంప మధ్యలో ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా ఉంచి, ఆపైన ఉడికించిన శనగలు (రాజ్మా/పనీర్ ముక్కలు) కొద్దికొద్దిగా వేసుకో వాలి. ఇప్పుడు నిమ్మరసం, పుదీనా చట్నీ వేసుకోవాలి. అనంతరం నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.



– సన



• పేరెంటింగ్

చెడుకు చెక్!

ఉదయం లేచింది మొదలు ఉరుకుల పరుగులు జీవితాలు. పిల్లలను రెడీ చేసి స్కూళ్లకు పంపించి, తాము రెడీ అయి ఆఫీసులకు వెళుతుంటారు తల్లిదండ్రులు. ఎలాగూ స్కూల్‌కి పంపిస్తున్నాం కదా... అన్నీ అక్కడ టీచర్లే చూసుకుంటారులే అని పేరెంట్స్, పిల్లల ప్రవర్తనను సరిచేయాల్సింది వారి తల్లిదండ్రులే అని టీచర్లు... అనుకోవడం సాధారణంగా జరిగిపోతుంటుంది.



మార్కులు, ర్యాంకులు, గ్రేడులు చూసుకొని సంతృప్తి పడిపోతారు. 'కానీ, పిల్లలు సరైన దారిలో ఉన్నారా, చెడు స్నేహాల్లో తమను దాటి పోతున్నారా అనేది చూసుకోవాల్సింది తల్లిదండ్రులే. బిడ్డ చెడు సహవాసంలో ఉందని చెప్పడానికి ఈ 5 హెచ్చరిక సంకేతాలు విస్మరించవద్దు' అంటున్నారు చైల్డ్ సైకియాట్రిస్టులు, నిపుణులు.

ఈ విషయాల సాయంతో మీరు మీ పిల్లల ప్రవర్తనలో మార్పులను గుర్తించవచ్చు. సకాలంలో వాటిని సరిదిద్దడానికి సరైన చర్యలు తీసుకోవచ్చు.

• ఉపాధ్యాయుల గురించి ఎప్పుడూ చెడ్డగా మాట్లాడటం...

ఒక పిల్లవాడు తన ఉపాధ్యాయుల గురించి పదే పదే చెడుగా మాట్లాడటం లేదా తక్కువ చేసి మాట్లాడటం ప్రారంభించినట్లయితే, అది మీ బిడ్డ తప్పుడు సహవాసంలో ఉన్నాడనడానికి సంకేతంగా గుర్తించాలి.

• స్నేహితుడి తప్పులకు వత్తాసు పలకడం...

ఒక పిల్లవాడు తన స్నేహితుడి చెడు ప్రవర్తనకు మద్దతు ఇవ్వడం ప్రారంభిస్తే, అది ఆ పిల్లవాడు ఆ చెడ్డ స్నేహితుడి ప్రభావానికి లోనయ్యాడనడానికి స్పష్టమైన సంకేతంగా గ్రహించాలి. దీనిని తల్లిదండ్రులు హెచ్చరికగా తీసుకోవడం మంచిది.

• తరచూ ప్రతికూల చర్చలు...

మీ బిడ్డ అకస్మాత్తుగా తన గురించి తాను ప్రతికూలంగా మాట్లాడటం ప్రారంభిస్తే లేదా తక్కువ ఆత్మవిశ్వాసం ఉన్నట్లు అనిపిస్తే, అది అతని తోటివారి ప్రతికూల ప్రభావాల వల్ల కావచ్చని గుర్తించాలి.

• రహస్యంగా మాట్లాడటం లేదా చాటింగ్...

ఒక పిల్లవాడు అకస్మాత్తుగా తన ఫోన్‌ను దాచి స్నేహితులతో మాట్లాడటం లేదా చాటింగ్ చేస్తున్నప్పుడు తన మొబైల్ స్క్రీన్‌ను దాచుకోవడం ప్రారంభిస్తే, తల్లిదండ్రులు అలెర్ట్‌గా ఉండాలి.

• చదువు నుండి పారిపోవడం...

మీ బిడ్డ ఉన్నట్టుండి స్కూల్‌కి వెళ్లనని మొరాయించడం లేదా హోంవర్క్ చేయకుండా మొండికి వేయడం, స్కూల్ ఎగ్గొట్టడానికి రకరకాల సాకులు చెప్పడం లేదా చదువుపై ఆసక్తి చూపకపోవడం.. వంటివి గమనిస్తే అది సోమరితనం వల్ల మాత్రమే కాదు, చెడు సహవాసం వల్ల కూడా కావచ్చు అని గ్రహించాలి.

పిల్లల ప్రవర్తనలో పై విధమైన మార్పులు గమనిస్తే సకాలంలో తగు చర్యలు తీసుకోవాలి. ఇందుకు స్కూల్ టీచర్ల సాయం తీసుకోవడం, నిపుణుల కౌన్సెలింగ్‌తో.. చెడు సావాసాలను గుర్తించి, పొరపాట్లను నివారించి, సమస్యను చక్కదిద్దవచ్చు.

• సర్వే జనా...

చాట్ జీపీటీతో చాటింగ్



ఒకరెవరో చాట్ జీపీటీని తమాషాగా ఒక ప్రశ్న అడిగారు... మనుషులందరూ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన పది విషయాలేమిటీ... అని. దానికి చాట్ జీపీటీ ఇలా చెప్పింది...

ఒకటి... ప్రతి వాళ్లూ 24 గంటలూ ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు లేదా మొబైల్ ఫోన్లకు బానిసలు అయిపోయారు.

రెండు... మీరు తీసుకునే ఆహారం మీకు అనారోగ్యం కలిగించే విధంగా రూపొందించబడింది.

మూడు... ఇంటర్నెట్ అంతా జల్లెడ పట్టేశారు... దానిని మీ నియంత్రణలోకి తీసుకున్నారు.

నాలుగు... డబ్బు శూన్యం నుంచి సృష్టించబడింది. అప్పు చేయడం అందరికీ తప్పనిసరిగా మార్చేసింది.

ఐదు... ఆధునిక వైద్యం మూలకారణాలకు కాకుండా పైకి కనిపించే సాధారణ లక్షణాలకు మాత్రమే చికిత్స చేసే విధంగా తయారైంది.

ఆరు... చరిత్ర పాఠాలు అసలు విషయాలను, వాస్తవాలను చెరిపేసి వాటిని అలాగే మరుగున పడేసి ఎవరికి నచ్చిన విధంగా వారు రాసుకునేలా తయారైంది.

ఏడు.. కృత్రిమ మేధ అంటే ఏఐ ప్రపంచ వాకిళ్లను బార్లా తెరిచేసి, సువిశాలం చేసేసింది.

ఎనిమిది... అంతరిక్షం... మరీ అంత దూరం ఏం కాదు. నువ్వు అనుకున్న దానికన్నా దగ్గరే... భూమిపొర నువ్వు అనుకునేంత గట్టిగా ఏం ఉండదు. బాగా పెళుసైనది.

తొమ్మిది... జీన్ ఎడిటింగ్ అంటే జన్యు సవరణ నువ్వనుకున్నదానికన్నా నిశ్శబ్దంగా వేగంగా ముందుకు సాగుతోంది.

పది... భూమి సూర్యుణ్ణి ఇప్పుడున్న దానికన్నా వేగంగా చుట్టగలదా? అలా చుడితే ఎన్నో విపత్తులు, ఉపద్రవాలూ చోటు చేసుకోవూ..

వీటికి నెటిజనులు రకరకాల కామెంట్లు పెడుతున్నారు. చూడటానికి ఇవన్నీ ఏవో తమాషాగా.. సిల్లీ సమాధానాల్లా అనిపిస్తున్నాయి కానీ నిజంగానే అవి పరిగణనలోకి తీసుకోదగ్గవి. ఆలోచించ దగ్గవీనూ అని అంటున్నారు.



ఎండించిన దానిమ్మ పెచ్చుల చూర్ణంలో తగినంత మిరియాల పొడి, ఉప్పు కలిపి దంతధావనానికి ఉపయోగిస్తుంటే దంతాలు దృఢంగా ఉండి, చిగుళ్లనుంచి చీము, రక్తం కారటం, చిగుళ్ల వాపు, నొప్పులు తగ్గుతాయి.

మెదడుకు మేత

కొన్ని రకాల ఆహారాన్ని తరచు పిల్లలకు తినిపించడం వల్ల వారిలో మేధోవికాసం పెరుగుతుంది. కాబట్టి పిల్లలకు ఆరోగ్యంతో పాటు తెలివితేటలను పెంచే సూపర్ ఫుడ్స్ కూడా ఇస్తూ ఉండాలి.




వేరుశనగ.. ఇందులో థయామిన్‌తోపాటు విటమిన్ ఇ ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్ కూడా సమృద్ధిగా ఉండటం వల్ల పిల్లల్లో మెదడు ఎదుగుదలకు కావలసిన శక్తి అంది, చక్కగా పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



వోట్స్.. పిల్లల కోసం ఆరోగ్యాన్ని అందించే తృణధాన్యాలలో మొదటిది వోట్స్. ఇది మెదడుకు ఆరోగ్యాన్ని, శక్తిని అందిస్తుంది. ఓట్స్ లోని పీచుపదార్థం పిల్లల మెదడుకు మంచి ఇంధనంగా పనిచేస్తుంది. పొటాషియం, జింక్, విటమిన్ ఇ, బి వారి పెరుగుదలకు సహకరిస్తాయి.



బెర్రీలు.. బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్, చెర్రీస్, స్ట్రాబెర్రీస్ ఇవి రకరకాల రంగులలో ఎక్కువ పోషకాలను కలిగి ఉన్నాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.



బీన్స్.. బీన్స్ ప్రత్యేకమైనవి. ప్రోటీన్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్ శక్తితో పాటు విటమిన్లు, ఖనిజాలు కలిగి ఉంటాయి. మానసికమైన సామర్థ్యాన్ని ఇస్తాయి. మెదడుకు బీన్స్, పింటో బీన్స్ ఒమేగా 3, ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యం కోసం చక్కగా పనిచేస్తాయి.

అందుకే ఆహారం

ఆకలి వేసినప్పుడో లేదా వేళ ప్రకారమో తినడం కాకుండా బోర్ కొట్టినప్పుడల్లా ఏదో ఒకటి నోట్లో వేసుకుని నములుతూ ఉండటం చాలామందికి అలవాటు. ఇలా ఎందుకు చేస్తారనే దానిపై పరిశోధనలు నిర్వహించారు. ఈ క్రమంలో 214 మంది ఆహార ప్రియులను దగ్గరగా చూడగా వారిలో చాలామందికి చాకెట్లను చప్పరించడమో లేదా కరకరలాడే చిప్స్ తినడమో అలవాటట. అతి కొద్దిమంది మాత్రమే పోషక విలువల కోసం లేదా మేధావికాసం కోసమో తింటున్నారని ఆ పరిశోధనలలో తేలింది. ఒత్తిడికి లోనయినప్పుడు లేదా బోర్ కొట్టినప్పుడు ఏదో ఒకటి తినడం కొందరికి అలవాటు.



అయితే అసలు ఎవరికైనా చాక్లెట్లు లేదా చిప్స్ లేదా కేకులు తినడం వంటివి ఎందుకు అలవాటుగా మారుతుందనే దాని మీద కొన్ని ఆశ్చర్యకరమైన నిజాలు బయటికొచ్చాయి.

మనకు నచ్చిన ఆహారం తిన్నప్పుడు కలిగే తృప్తి లేదా సంతోషం లేదా భావోద్వేగపరమైన ఒక నిశ్చింత కోసమే ఫలానా వాళ్లు ఫలానా ఫుడ్డు అంటే పడి చస్తారు అని చెప్పుకునేలా చేస్తుంది.

ఉదాహరణకు ఐస్ క్రీమ్, చాక్లెట్లు లేదా పిజ్జాలు లేదా స్వీట్లు విపరీతమైన కొవ్వులు, చక్కెరలు కలిగి ఉండటమే కాదు, వాటితో ముడిపడి ఉన్న భావోద్వేగ సంబంధమైన బోలెడన్ని జ్ఞాపకాలను కూడా వెలికి తీస్తాయట. అంతేకాదు, అలా తమకు నచ్చిన ఆహారాన్ని ఆరగించినప్పుడు వారిని మానసిక ఒత్తిడి నుంచి బయటపడేలా చేసి అలసట, నిస్సత్తువగా ఉన్న అనుభూతి, ఒంటరితనం వంటి భావనలన్నీ దూరం అవడంలో సాయపడతాయట. అందుకే అవంటే అంత ఇష్టపడతారు.



సాక్షి సినిమా

సత్యలోకం నేపథ్యంలో...



• చిరంజీవి

చిరంజీవి హీరోగా రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా వాయిదా పడింది. ఇక సోషియో ఫ్యాంటసీ జానర్‌లో రూపొందుతోన్న 'విశ్వంభర' కథపై ఇప్పటికే పలు పుకార్లు వచ్చాయి. తాజాగా ఆ గాసిప్స్‌కి చెక్ పెడుతూ స్టోరీ లైన్ చెప్పేశారు డైరెక్టర్ వశిష్ఠ. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– ''మనకి తెలిసినవి 14 లోకాలు. కింద 7 లోకాలు, పైన 7 లోకాలు. ఆ 14 లోకాలకు పైన ఉన్న లోకమే సత్యలోకం. యమలోకం, స్వర్గం, పాతాళలోకం... అన్నీ చూసేశాం. 'విశ్వంభర' కోసం వాటన్నింటిని దాటి నేను పైకి వెళ్లాను. బ్రహ్మదేవుడు ఉండే సత్యలోకాన్ని మా సినిమాలో చూపించాం. ఆ లోకంలో ఉండే హీరోయిన్‌ను వెతుక్కుంటూ హీరో 14 లోకాలు దాటి వెళ్లి, తిరిగి భూమి మీదకు ఆమెను ఎలా తీసుకొచ్చాడు? అనేది ఈ చిత్రకథ. రెండు రోజుల ప్యాచ్ వర్క్‌తో పాటు ఓ ప్రత్యేక పాట షూటింగ్ బ్యాలెన్స్ ఉంది. ఈ నెల 25న మొదలయ్యే చిత్రీకరణతో వీటిని పూర్తి చేస్తాం. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది'' అని పేర్కొన్నారు. ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో వీఎఫ్‌ఎక్స్‌కి ఎంతో ప్రాధాన్యం ఉందట. అందుకే ప్రపంచస్థాయి కంపెనీలతో విజువల్ ఎఫెక్ట్స్ పనులు చేయిస్తున్నారు మేకర్స్.

నువ్వుంటే చాలే...



• రామ్, భాగ్యశ్రీ బోర్సే

'ఒక చూపుతో నాలోనే పుట్టిందే... ఏదో వింతగా గుండెలో చేరిందే...' అంటూ పాడేస్తున్నారు రామ్ పోతినేని. ఆయన హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడ హీరో ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. వివేక్–మెర్విన్ ద్వయం సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'నువ్వుంటే చాలే...' అంటూ సాగే తొలిపాటని శుక్రవారం విడుదల చేశారు. 'ఒక చూపుతో నాలోనే పుట్టిందే... ఏదో వింతగా గుండెలో చేరిందే...' 'నువ్వెవ్వరు నాలో అని అడిగానే... తానేగా ప్రేమ అని తెలిపిందే... నువ్వుంటే చాలే...' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటని రామ్ స్వయంగా రాశారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ పాట పాడారు. ''మనసుని కదిలించే 'నువ్వుంటే చాలే...' రొమాంటిక్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా అలరిస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి సిరీస్ ఫిలిమ్స్.

రియల్ హీరో అంటే మీరే!

• 650 మంది స్టంట్ వర్కర్స్‌కి బీమా చేయించిన అక్షయ్ కుమార్



• అక్షయ్ కుమార్

వెండితెరపై మంచి పనులు చేసి, హీరో అనిపించుకుంటారు స్టార్స్. అది 'రీల్ హీరో'. అదే తెర వెనుక మంచి పనులు చేస్తే 'రియల్ హీరో' అనిపించుకుంటారు. ఇప్పుడు అక్షయ్ కుమార్‌ని అందరూ 'రియల్ హీరో అంటే మీరే' అంటున్నారు. మరి... 650 మంది స్టంట్‌మెన్, ఉమెన్‌కి బీమా చేయిస్తే ఆ మాత్రం అభినందించాల్సిందే కదా. ఇటీవల తమిళ చిత్రం 'వేట్టువం' షూటింగ్‌లో స్టంట్ మేన్ రాజు గుండెపోటుతో మరణించారు. ఆర్య హీరోగా పా. రంజిత్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. కారుతో స్టంట్స్ చేస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. మామూలుగా ఫైట్ సీన్స్ చిత్రీకరించేటప్పుడు కూడా ప్రమాదాలకు గురై, స్టంట్ వర్కర్స్ మరణిస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే అక్షయ్ కుమార్ తాజాగా 650 మంది స్టంట్ మెన్, ఉమెన్‌కి బీమా చేయించారు. ఈ విషయం గురించి బాలీవుడ్ స్టంట్ మాస్టర్ విక్రమ్ సింగ్ స్పందిస్తూ – ''మీరు (అక్షయ్‌ని ఉద్దేశించి) చేసిన ఈ మంచి పని వల్ల బాలీవుడ్‌లో 650 మంది స్టంట్ వర్కర్స్ బీమా పరిధిలోకి వచ్చారు. ఈ ఇన్సూరెన్స్ పాలసీలో రూ. 5 లక్షల నుంచి 5.50 లక్షల వరకూ నగదురహిత చికిత్స పొందే వెసులుబాటు ఉంది. అది షూటింగ్ సెట్‌లో అయినా విడిగా అయినా. మీకెలా ధన్యవాదాలో చెప్పాలో తెలియడంలేదు అక్షయ్ సార్'' అని పేర్కొన్నారు.

డాక్టర్ మనీషా కొయిరాలా



• మనీషా కొయిరాలా

ప్రముఖ నటి మనీషా కొయిరాలాకు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ బ్రాడ్‌ఫోర్డ్' ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు మనీషా. అలాగే డాక్టరేట్ అందుకుంటున్న వీడియోను కూడా షేర్ చేశారు. ''యూకే సిటీ ఆఫ్ కల్చర్–2025' ఏడాదిలో బ్రాడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. క్రియేటివ్ డైరెక్టర్ డేనియల్ లీతో కలిసి ఈ గుర్తింపును పంచుకోవడం మరింత ఆనందాన్నిచ్చింది. నేను సంప్రదాయ విద్యా మార్గం ద్వారా వచ్చిన వ్యక్తిగా ఇక్కడ నిలబడలేదు. జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకున్న వ్యక్తిగా నిలబడ్డాను. మా అమ్మమ్మ సుశీలా కొయిరాలా నా మొదటి గురువు. పుస్తకాలు చదవడం, జీవిత విలువలు, భరతనాట్యం, మణిపురి నృత్యం వంటివి చిన్నతనంలో ఆమె నుంచే నేర్చుకున్నాను. 'యూనివర్సిటీ ఆఫ్ బ్రాడ్‌ఫోర్డ్' డాక్టరేట్ పొందడం గౌరవంగా భావిస్తున్నాను... ఈ గౌరవం మాటల్లో చెప్పలేనంత విలువైనది. నా కథ (జీవితాన్ని ఉద్దేశించి)కు విలువ ఇచ్చి గుర్తించిన 'యూనివర్సిటీ ఆఫ్ బ్రాడ్‌ఫోర్డ్'కి ధన్యవాదాలు. నా ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది'' అంటూ పోస్ట్ చేశారు మనీషా కొయిరాలా. ఇదిలా ఉంటే... చాలా విరామం తర్వాత 'లస్ట్ స్టోరీస్' (2018) తో రీ ఎంట్రీ ఇచ్చిన ఆమె 'హీరామండి: ది డైమండ్ బజార్' (2024) అనే వెబ్ సిరీస్‌లో మల్లికాజాన్ అనే వేశ్య పాత్రలో మనీషా కొయిరాలా నటించి, మెప్పించారు.

మనసుని తాకే గరివిడి లక్ష్మి



• ఆనంది

ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి నేపథ్యంలో రూపొందిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఆనంది లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకి గౌరీ నాయుడు జమ్ము దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమాలో గరివిడి లక్ష్మి పాత్రలో నటించిన ఆనంది ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''గరివిడి లక్ష్మి గొప్ప బుర్రకథ కళాకారిణి. 1990లలో ఉత్తరాంధ్ర ఫోక్ సంప్రదాయాల్ని బతికించి, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆమె పేరు ఆ ప్రాంత చరిత్రలో నిలిచిపోయింది. ఆమె జీవితంతో తీసిన ఈ సినిమా మాకు ఓ భావోద్వేగమైన ప్రయాణం. మన సంస్కృతి మీద ప్రేమతో తీసిన చిత్రమిది. మా 'గరివిడి లక్ష్మి' ఆమె గ్రామీణ జీవనానికి, సంగీత వారసత్వానికి అద్భుతమైన నివాళిలా ఉంటుంది. చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ సినిమా ఉత్తరాంధ్రని ఆవిష్కరిస్తూ మనసుని తాకేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. నరేష్, రాశి, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య తదితరులు నటించిన ఈ సినిమాకి కెమెరా: జె. ఆదిత్య.

పల్లెటూరి ప్రేమకథ



• సయాలీ

'బిగ్ బాస్' ఫేమ్ అమర్ దీప్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సుమతీ శతకం'. ఎం.ఎం. నాయుడు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సయాలీ హీరోయిన్. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి సయాలీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''వింటేజ్ విలేజ్ డ్రామా, ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నాం. దసరాకి మా చిత్రాన్ని రిలీజ్ చేయాలని శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నాం'' అన్నారు కొమ్మాలపాటి సాయి సుధాకర్. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: హాలేష్.

ఓటీటీ

ఇది చూడొచ్చు

పురుషుల కోసం మహిళా చిత్రం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం 8 వసంతాలు ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

లేచింది... నిద్ర లేచింది మహిళాలోకం... నాటి 'గుండమ్మ కథ' చిత్రంలోని ఈ పాట ఏనాటికీ మరువని పాట... గుర్తుంది కదా... ఈ పాటే స్ఫూర్తి కాబోలు '8 వసంతాలు' సినిమా దర్శకుడికి. మహిళా సాధికారతపై సున్నితంగా నేటి తరానికి నోట్లో ముద్ద పెట్టినంత సులువుగా వెండి తెర మీద తీర్చిదిద్దారు దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి. ఆవకాయ తయారు చేయడం దగ్గర నుండి అంతరిక్షం వరకు తన ఉనికిని చాటుతున్న అతివ పాత్రను చాలా ఉన్నతంగా ఈ చిత్రంలో చూపారు. అన్ని రంగాలలో పురుషుల కన్నా మెండుగా రాణిస్తూ సమాజానికి దిక్సూచిలా ఉన్న స్త్రీ నేటికీ కొన్ని చోట్ల వివక్షకు గురవుతూనే ఉంది. ఆ వివక్షకు కొంత మేర పరిష్కార రూపంగా చూపే ప్రయత్నమే ఈ '8 వసంతాలు' సినిమా. పేగు పంచి ప్రాణం పోయగలిగి నవాళ్ళం, చితి ముట్టించి మోక్షం కలిగించలేమా?



అన్న ఈ సినిమాలోని ఓ సన్నివేశంలోని డైలాగ్ స్త్రీలోని ఔన్నత్యాన్ని తెలుపుతుంది. అసలింతలా ఏముందీ సినిమా కథలో ఓసారి చూద్దాం. ఈ కథలో ప్రధాన పాత్ర శుద్ధి. ఆర్మీలో పని చేస్తున్న తన తండ్రిని చిన్నతనంలోనే పోగొట్టుకున్న శుద్ధి ఊటీలో తన తల్లి దగ్గర పెరుగుతుంది. మార్షల్ ఆర్ట్స్‌తో పాటు తన రచనలను కొనసాగిస్తున్న శుద్ధికి లవ్ బ్రేకప్ అవుతుంది. ఓ పక్క తండ్రిని, ఆ తర్వాత తన ప్రేమను పోగొట్టుకున్న శుద్ధికి మళ్ళీ కాలం కాటేస్తుంది. తాను స్ఫూర్తిదాతగా తలుస్తున్న తన మెంటర్ కూడా అనారోగ్యంతో దూరమవుతాడు. ఇదే సమయంలో శుద్ధి తిరిగి ప్రేమలో పడుతుంది. మరి... శుద్ధి ప్రేమ ఈసారైనా గెలుస్తుందా? లేదా అన్నది మాత్రం '8 వసంతాలు' సినిమాలోనే చూడాలి. ఈ సినిమా నేటి తరానికి ఓ లైబ్రరీ పీస్. అలాగే నాటి తరానికి ఓ అందమైన దృశ్య కావ్యం అని చెప్పవచ్చు. వేసే ప్రతి అడుగు ప్రమాదమైనా గుండె ధైర్యం, మనోబలం మనల్ని నడిపిస్తుంది అనేది శుద్ధి పాత్రతో ఎంతో అందంగా చెప్పారు దర్శకుడు. అలాగే ఆఖర్లో వచ్చే మంచి ట్విస్టు మతి పోగొడుతుంది. పురుషులందరూ చూడదగ్గ మహిళా చిత్రం ఇది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా మస్ట్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శనివారం
19-7-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 502	81,758
నిఫ్టీ ▽ 143	24,968

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,867	▽	19
డోజోన్స్	44,266	▽	219
ఎఫ్‌టీఎస్ఈ 100	8,992	△	19
డాక్స్	24,290	▽	81
షాంఘై	3,534	△	18
నికాయ్	39,819	▽	82

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	113.70	116.64
€	యూరో	98.55	101.29
¥	జపాన్ యెన్ (100)	57.15	58.61
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.67	56.89
S$	సింగపూర్ డాలర్	64.61	68.25
SAR	సౌదీ రియాల్	22.08	23.56
UAE D	యూఏఈ దిర్హామ్	22.55	23.79
¥	చైనా యువాన్	11.11	12.93

రిలయన్స్ రిటైల్ చేతికి కెల్వినేటర్ బ్రాండ్

- ఎలక్ట్రోలక్స్ నుంచి కొనుగోలు
- రూ. 160 కోట్ల డీల్

న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ తాజాగా ఎలక్ట్రోలక్స్ గ్రూప్ కన్జూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ కెల్వినేటర్‌ను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ సుమారు రూ. 160 కోట్లు. దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రీమియం గృహోపకరణాల విభాగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌కి ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ రిటైల్ గతంలో కెల్వినేటర్ బ్రాండ్‌కి లైసెన్సు తీసుకుని, ఉపయోగించుకుంది. దీని కింద ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషిన్లు మొదలైనవి అమ్ముడవుతున్నాయి. భారతీయ వినియోగదారులకు విశ్వసనీయమైన అంతర్జాతీయ ఉత్పత్తులను అందించేందుకు కెల్వినేటర్ కొనుగోలు తోడ్పడుతుందని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఈడీ ఈషా ఎం అంబానీ ప్రకటనలో తెలిపారు. కెల్వినేటర్‌కు అంతర్జాతీయంగా దాదాపు శతాబ్దం పైగా చరిత్ర ఉంది. అధునాతన టెక్నాలజీ, అత్యుత్తమ పనితీరుతో 1970లు, 1980లలో భారత్‌లో ఐకానిక్ స్థాయిని దక్కించుకుంది. అమెరికన్ బ్రాండ్ అయినప్పటికీ పలు సంస్థల చేతులు మారి చివరికి స్వీడన్‌కి చెందిన ఎలక్ట్రోలక్స్ గూటికి చేరింది. ఇటీవలి సీఐఐ, ఈవై సంయుక్త నివేదిక ప్రకారం భారత కన్జూమర్ డ్యూరబుల్స్ మార్కెట్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటి. 2027 నాటికి అతి పెద్ద మార్కెట్లలో నాలుగో స్థానానికి చేరనుంది. 2029 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3 లక్షల కోట్ల స్థాయికి చేరుతుంది. మరోవైపు, క్రిసిల్ రేటింగ్స్ ప్రకారం 2024–25లో ఈ పరిశ్రమ (టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు) రూ. 1.17 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

రిలయన్స్ లాభాల రికార్డ్

- క్యూ1లో నికర లాభం రూ. 26,994 కోట్లు; 78% జంప్
- ఆదాయం రూ. 2.48 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2025–26, క్యూ1)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కంపెనీ చరిత్రలోనే ఒక క్వార్టర్‌లో అత్యధికంగా రూ. 26,994 కోట్ల రికార్డు నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో సాధించిన రూ. 15,138 కోట్లతో పోలిస్తే ఇది 78 శాతం వృద్ధి. ఇందుకు ప్రధానంగా భారీగా ఇతర ఆదాయం లభించడం, పటిష్టమైన కన్జూమర్ బిజినెస్ వృద్ధి దోహదపడ్డాయి. కాగా, మొత్తం ఆదాయం 5 శాతం బలపడి రూ. 2.48 లక్షల కోట్లను తాకింది. గతేడాది క్యూ1లో రూ. 2.36 లక్షల కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో లభించిన ఇతర ఆదాయంలో రూ.8,924 కోట్ల లిస్టెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఏషియన్ పెయింట్స్) విక్రయం ప్రధానంగా నిలిచింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. కాగా, ప్రధాన విభాగం చమురు శుద్ధి, పెట్రోకెమికల్ (ఓటూసీ) బిజినెస్ 1.5 శాతం నీరసించింది. ముడిచమురు ధరలు క్షీణించడం వంటివి ప్రభావం చూపాయి.

ఫలితాల నేపథ్యంలో రిలయన్స్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 1,477 వద్ద ముగిసింది.



రిలయన్స్ అన్ని విభాగాలలో పటిష్ట నిర్వహణ, ఆర్థిక పనితీరుతో కొత్త ఏడాదిని ప్రారంభించింది. అంతర్జాతీయ ఆటుపోట్ల మధ్య ఏడాది క్రితంతో పోలిస్తే కన్సాలిడేటెడ్ ఇబిటా భారీగా మెరుగుపడింది. ఇంధన మార్కెట్లలో అత్యంత అనిశ్చిత పరిస్థితులున్నప్పటికీ ఓటూసీ బిజినెస్ పటిష్ట వృద్ధిని సాధించింది. జియో–బీపీ నెట్‌వర్క్ ద్వారా విలువ జోడింపు సొల్యూషన్లకు తెరతీశాం. తద్వారా దేశీ డిమాండును అందుకున్నాం. ఇంధనం, పెట్రో ప్రొడక్టుల మార్జిన్లు దన్నుగా నిలిచాయి.

– ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్–ఎండీ

జియో ప్లాట్‌ఫామ్స్ జోరు

నికర లాభం రూ. 7,110 కోట్లు

ఆర్‌ఐఎల్ టెలికం, డిజిటల్ బిజినెస్‌ల విభాగం.. జియో ప్లాట్‌ఫామ్స్ క్యూ1 నికర లాభం 25% వృద్ధితో రూ. 7,110 కోట్లను తాకింది. స్థూల ఆదాయం 19% ఎగసి రూ. 41,054 కోట్లకు చేరింది. మొబిలిటీ, హోమ్స్ విభాగంలో సబ్‌స్క్రయిబర్లు పెరగడం, డిజిటల్ సర్వీసుల బిజినెస్ బలపడటం ఇందుకు సహకరించాయి. ఈ కాలంలో 20 కోట్ల 5జీ వినియోగదారులను దాటడం, 2 కోట్ల హోమ్ కనెక్ట్స్‌కు చేరడం ద్వారా జియో సరికొత్త గరిష్టాలకు చేరినట్లు మాతృ సంస్థ ఆర్‌ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. 7.4 మిలియన్ సబ్‌స్క్రయిబర్లతో జియో ఫైబర్ ప్రపంచంలోనే అతిపెద్ద ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సంస్థగా అవతరించినట్లు వెల్లడించారు.

రిటైల్ లాభం రూ. 3,271 కోట్లు

ఆర్‌ఐఎల్ రిటైల్ విభాగం రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నికర లాభం క్యూ1లో 28 శాతం జంప్‌చేసి రూ. 3,271 కోట్లను తాకింది. వివిధ విభాగాలలో వృద్ధి ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,549 కోట్లు మాత్రమే ఆర్జించింది. స్థూల ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 84,171 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 75,615 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ కాలంలో కొత్తగా 388 స్టోర్లను తెరిచింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 19,592కు చేరింది. నిర్వహణ సామర్థ్యం, ప్రాంతాల వారీగా విస్తరణ, ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోపై నిరంతరం దృష్టి పెట్టడంతో రిలయన్స్ రిటైల్ నిలకడైన పనితీరును చూపినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ తెలియజేశారు.

టీవీఎస్ నుంచి 2025 అపాచీ ఆర్‌టీఆర్ 310

చెన్నై: టీవీఎస్ మోటార్ కంపెనీ అపాచీ ఆర్‌టీఆర్ 310 సీసీలో 2025 వెర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. సరికొత్త అప్‌డేట్‌లతో వచ్చిన ఈ బైక్ బేసిక్ మోడల్ ధర రూ.2.39 లక్షలుగా ఉంది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.2.57 లక్షలుగా ఉంది. ఓబీడీ2బీ నిబంధనలకు లోబడి పనిచేసే 312.12 సీసీ సామర్థ్యం కలిగిన ఇంజిన్ ఇందులో ఉంది. ఇది 9700 ఆర్‌పీఎమ్ వద్ద 35.6 పీఎస్ శక్తిని, 6,650 ఆర్‌పీఎమ్ వద్ద 28.7 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. కొత్తగా సీక్వెన్షియల్ టర్న్ ఇండికేటర్లు, ట్రాన్స్‌పేరెంట్ క్లచ్ కవర్, క్రూయిజ్ కంట్రోల్, అయిదు అంగుళాల టీఎఫ్‌టీ జెన్–2 కనెక్టెడ్ క్లస్టర్, బ్లూటూత్ ఫోన్ కనెక్టివిటీ, నావిగేషన్, మ్యూజిక్ కంట్రోల్ తదితర ఫీచర్లున్నాయి. 'టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 310 అరంగేట్రం నాటి నుంచే నేకెడ్ స్పోర్ట్స్ విభాగంలో ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది. 2025 ఎడిషన్‌లో అత్యాధునిక సాంకేతిక, డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లు, స్టయిలిష్‌తో పాటు రైడర్ భద్రతను మరింత మెరుగుపరిచాము' అని టీవీఎస్ మోటార్ బిజినెస్ హెడ్(ప్రీమియం విభాగం) విమల్ సుంబ్లే అన్నారు.

బేసిక్ మోడల్ ధర రూ.2.39 లక్షలు



జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 2,209 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం రెండున్నర రెట్లు జంప్‌చేసి రూ. 2,209 కోట్లను తాకింది. వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 867 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 1 శాతం నామమాత్ర వృద్ధితో రూ. 43,497 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 43,107 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 41,715 కోట్ల నుంచి రూ. 40,325 కోట్లకు క్షీణించాయి. ఈ కాలంలో ముడిస్టీల్ ఉత్పత్తి 14 శాతం ఎగసి 7.26 మిలియన్ టన్నులను తాకింది. నిర్వహణపరమైన మూసివేత కారణంగా సామర్థ్య వినియోగం 87 శాతానికి పరిమితమైంది. స్టీల్ అమ్మకాలు 9% పుంజుకుని 6.69 మిలియన్ టన్నులకు చేరాయి. వీటిలో దేశీ అమ్మకాలు 12% బలపడి 5.96 మిలియన్ టన్నులను తాకాయి. అయితే ఎగుమతులు 20 శాతం క్షీణించినట్లు కంపెనీ వెల్లడించింది. నిర్వహణ లాభం 37 శాతం జంప్‌చేసి రూ. 7,576 కోట్లకు చేరగా.. 17.6 శాతం మార్జిన్లు సాధించింది. కాగా, భూషణ్ స్టీల్ అండ్ పవర్‌పై సుప్రీం కోర్టు మే 2న వెలువరించిన తీర్పుపై రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసినట్లు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వెల్లడించింది.



ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు యథాతథంగా రూ. 1,034 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
జీసీసీల్లో హైరింగ్ జోరు	హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

25,000 దిగువకు నిఫ్టీ

- 502 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- బ్యాంకు షేర్లలో భారీ అమ్మకాలు

ముంబై: ప్రయివేటు రంగ యాక్సిస్ బ్యాంక్ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరచడంతో బ్యాంకింగ్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు తలెత్తాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 502 పాయింట్లు పతనమై 81,758 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 143 పాయింట్లు నష్టపోయి 25 వేల దిగువన 24,968 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆర్థిక సేవల సంస్థ సిటీ గ్రూప్ భారతీయ ఈక్విటీ మార్కెట్ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్'కు డౌన్‌గ్రేడ్ చేయడం మరింత ఒత్తిడి పెంచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 651 పాయింట్లు క్షీణించి 81,608 వద్ద, నిఫ్టీ 192 పాయింట్లు కోల్పోయి 24,919 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.



- జూన్ క్వార్టర్ నికరలాభం 3% క్షీణత నమోదుతో యాక్సిస్ బ్యాంకు షేరు నష్టాలు చవిచూసింది. బీఎస్ఈలో 5% పతనమైన 1,099 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 7% కుప్పకూలి రూ.1,074 వద్ద కనిష్టాన్ని తాకింది. రూ.18,809 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయి రూ.3.40 లక్షల కోట్లకు దిగివచ్చింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీఫైనల్లో అనిరుధ్ జోడీ

లాస్ కాబోస్ (మెక్సికో): మిఫెల్ టెన్నిస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)–టీస్ స్టాల్డర్ (అమెరికా) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–స్టాల్డర్ ద్వయం 7–5, 6–1తో మాన్యుయెల్ సాంచెజ్ (మెక్సికో)–బెర్నార్డ్ టామిక్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. 65 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–అమెరికన్ జంట మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

అర్జున్–విజయ్ జంట ఓటమి

గెస్టాడ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో అర్జున్ ఖడే–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. స్విట్జర్లాండ్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సెమీఫైనల్లో అర్జున్–విజయ్ జంట 5–7, 5–7తో హెండ్రిక్ జెబెన్స్ (జర్మనీ)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

సెమీస్‌లో అర్జున్



- క్వార్టర్ ఫైనల్లో ప్రజ్ఞానంద ఓటమి
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నీ

లాస్ వేగస్: ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పకడ్బందీ ఎత్తులతో అలరించిన భారత స్టార్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్... ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్‌బెక్ అబ్దుసత్తారోవ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అర్జున్ 1.5–0.5తో గెలుపొందాడు. నల్ల పావులతో ఆడిన తొలి గేమ్‌ను అర్జున్ 64 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. అనంతరం తెల్ల పావులతో ఆడిన రెండో గేమ్‌లో అర్జున్ 69 ఎత్తుల్లో గెలుపొంది సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. సెమీఫైనల్లో లెవాన్ అరోనియన్ (అమెరికా)తో అర్జున్ తలపడతాడు. 'వైట్ గ్రూప్' లీగ్ దశలో నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి 'టాపర్'గా నిలిచిన ప్రజ్ఞానందకు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి ఎదురైంది. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రజ్ఞానంద 3–4 పాయింట్ల తేడాతో పోరాడి ఓడిపోయాడు. తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 29 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో కరువానా 60 ఎత్తుల్లో గెలిచి స్కోరును 1–1తో సమం చేశాడు. ఆ తర్వాత మూడో గేమ్‌లో ప్రజ్ఞానంద 58 ఎత్తుల్లో... నాలుగో గేమ్‌లో కరువానా 34 ఎత్తుల్లో నెగ్గారు. దాంతో స్కోరు 2–2తో సమమైంది. ఐదో గేమ్‌లో కరువానా 64 ఎత్తుల్లో నెగ్గి 3–2తో ఆధిక్యంలోకి వెళ్లగా... ఆరో గేమ్‌లో ప్రజ్ఞానంద 48 ఎత్తుల్లో గెలిచి స్కోరును 3–3తో సమం చేశాడు. నిర్ణాయక ఏడో గేమ్‌లో కరువానా 72 ఎత్తుల్లో గెలిచి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. సెమీఫైనల్లో అమెరికాకే చెందిన హాన్స్ నీమన్‌తో కరువానా తలపడతాడు. ఇతర **క్వార్టర్ ఫైనల్స్‌లో** అరోనియన్ 2.5–1.5తో హికారు **నకమురా (అమెరికా)**పై, హాన్స్ నీమన్ 4–2తో **సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్)**పై గెలుపొందారు.

ప్రపంచకప్ చెస్ క్వార్టర్ ఫైనల్లో హంపి, హారిక, వైశాలి, దివ్య


హంపి


హారిక


వైశాలి


దివ్య

బతూమి (జార్జియా): తాడోపేడో తేల్చుకోవాల్సిన గేమ్‌లలో భారత చెస్ స్టార్స్ కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రపంచకప్ మహిళల నాకౌట్ చెస్ టోర్నీలో ఈ నలుగురూ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో గురువారం నిర్ణీత రెండు గేమ్‌ల తర్వాత భారత క్రీడాకారిణులు తమ ప్రత్యర్థులతో 1–1తో సమంగా నిలిచారు. దాంతో విజేతలను నిర్ణయించేందుకు శుక్రవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. టైబ్రేక్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 1.5–0.5తో ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)పై... హైదరాబాద్ ప్లేయర్ హారిక 2.5–1.5తో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ మాజీ చాంపియన్ కాటరీనా లాగ్నో (రష్యా)పై... తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ వైశాలి 3.5–2.5తో మెరూర్ట్ కమలిదెనోవా (కజకిస్తాన్)పై... ప్రపంచ జూనియర్ చాంపియన్, మహారాష్ట్ర అమ్మాయి దివ్య దేశ్‌ముఖ్ 1.5–0.5తో ఆసియా క్రీడల చాంపియన్ జు జినెర్ (చైనా)పై విజయం సాధించారు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌లో యుజిన్ సాంగ్ (చైనా)తో హంపి; దివ్య దేశ్‌ముఖ్‌తో హారిక; టాన్ జోంగి (చైనా)తో వైశాలి తలపడతారు.

అంతిమ్ 'పసిడి' పట్టు



బుడాపెస్ట్ (హంగేరి): పొలియాక్ ఇమ్రె–వర్గా యానోస్ స్మారక అంతర్జాతీయ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో రెండో రోజు భారత్‌కు నాలుగు పతకాలు లభించాయి. అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), హర్షిత (72 కేజీలు) స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా... నేహా (57 కేజీలు) రజత పతకం... నీలం (50 కేజీలు) కాంస్య పతకం దక్కించుకున్నారు. ఫైనల్లో అంతిమ్ 7–4తో నటాలియా మలిశెవా (రష్యా)పై గెలిచింది. కాంస్య పతక బౌట్‌లో నీలం 6–3తో సెనియా స్టానెవిచ్ (బెలారస్)పై విజయం సాధించింది. ఫైనల్లో నేహా 0–4తో హెలెన్ మరూలిస్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 72 కేజీల విభాగంలో ఐదుగురు రెజ్లర్లే బరిలో ఉండటంతో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో బౌట్‌లు నిర్వహించారు. హర్షిత పోటీపడ్డ నాలుగు బౌట్‌లలోనూ గెలిచి అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాన్ని సాధించింది. హర్షిత వరుసగా 8–0తో పౌలీన్ (ఫ్రాన్స్)పై, 6–1తో సెనియా బురకోవా (రష్యా)పై, 5–0తో క్రిస్టినా బ్రాచికోవా (రష్యా)పై, 10–0తో జమీలా బాక్‌బెర్‌జెనోవా (కజకిస్తాన్)పై గెలిచింది. ఈ టోర్నీ తొలి రోజు పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత రెజ్లర్లు సుజీత్ (65 కేజీలు) స్వర్ణ పతకం, రాహుల్ (57 కేజీలు) కాంస్య పతకం గెలిచారు.



ఈ ఒక్కటి గెలిస్తే చాలు!

ఇంగ్లండ్‌తో నేడు రెండో వన్డే

- సిరీస్ లక్ష్యంగా బరిలోకి టీమిండియా
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి 'సోనీ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం

లండన్: భారత మహిళల జట్టు ఇంగ్లండ్ గడ్డపై అరుదైన ఘనతను సొంతం చేసుకునేందుకు ఒక్క విజయం దూరంలో ఉంది. నేడు 'క్రికెట్ మక్కా' లార్డ్స్ మైదానంలో జరిగే రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం గెలిస్తే వరుస సిరీస్‌లతో పండగ చేసుకోవడం ఖాయం. టాపార్డర్ సూపర్ ఫామ్, బౌలింగ్‌లో నిలకడ కనబరుస్తున్న టీమిండియాకు విజయం, సిరీస్ కైవసం ఏమంత కష్టం కానేకాదు. ఇంగ్లండ్ మాత్రం వన్డే సిరీస్ రేసులో నిలబడాలంటే కచ్చితంగా గెలవాల్సిన ఒత్తిడిని నెత్తిన పెట్టుకొని బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యం ఆతిథ్య జట్టుకు ప్రతికూల ఫలితాలిస్తున్నాయి. గత ఓటమి నుంచి బయటపడి, కచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ఏ మేరకు రాణిస్తుందో చూడాలి.

జోరుమీదున్న భారత్

బ్యాటర్లు, బౌలర్లు అందరు ఫామ్‌లో ఉండటం భారత జట్టులో సమరోత్సాహాన్ని అమాంతం పెంచుతోంది. వన్డే జట్టులోకి రాగానే ప్రతీక రావల్ సత్తా చాటుకుంది. స్మృతి, హర్లీన్ డియోల్‌లు కూడా మెరుగ్గానే ఆడారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్... ఈ ఇద్దరు మాత్రమే రెండు పదుల స్కోరైనా చేయలేకపోయారు. కానీ మిడిలార్డర్‌లో జెమీమా, దీప్తి శర్మ మ్యాచ్‌లను గెలిపించే ఇన్నింగ్స్ ఆడటంతో బ్యాటింగ్ మరింత పటిష్టమైంది. బౌలింగ్‌లో క్రాంతి, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్‌లు సమష్టిగా ఇంగ్లండ్ బ్యాటర్ల భరతం పట్టారు. లార్డ్స్ లోనూ మరో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తే ఎంచక్కా ఇక్కడే సిరీస్‌ను చేజిక్కించుకోవచ్చు.

ఓడితే ఇక నెగ్గలేరు

మరోవైపు భారత్‌తో పోలిస్తే... ఆతిథ్య ఇంగ్లండ్‌ది భిన్నమైన పరిస్థితి. సొంతగడ్డపై ఇదివరకే టి20 సిరీస్‌ను కోల్పోయింది. ఇప్పుడు వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయే స్థితిలో ఉంది. 'లార్డ్స్' పోరులో ఓడితే ఇక సిరీస్ నెగ్గే అవకాశమే ఉండదు. ప్రధాన ప్లేయర్లంతా కీలకమైన తరుణంలో చేతులెత్తేయడం... పరుగులో వెనుకబడటం, వికెట్లు తీయడంలో అలసత్వం... ఇవన్నీ ఆతిథ్య జట్టుకు కొండంత కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి ఒత్తిడి ఈ మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌లో నిలవడం కాస్త కష్టమైన పనే! గత మ్యాచ్‌లో ఓపెనర్లు టామీ బ్యూమోంట్, అమీ జోన్స్‌ల ఘోరమైన వైఫల్యం జట్టుకు ప్రతికూలమైంది. మిడిలార్డర్‌లో సోఫియా డంక్లీ, అలైస్ రిచర్డ్స్‌ల అర్ధసెంచరీలతో జట్టు పోరాడే స్కోరు చేయగలిగింది. అయితే బౌలర్లు నిరుత్సాహపరిచే ప్రదర్శనతో లక్ష్యాన్ని భారత్ సులువుగా ఛేదించింది. కేట్ క్రాస్, లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్‌లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. అయితే సిరీస్‌లో నిలవాల్సిన ఈ మ్యాచ్‌లో అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు బాధ్యత కనబరిస్తేనే ఆశించిన ఫలితాన్ని రాబట్టొచ్చు.

తుదిజట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), ప్రతీక, స్మృతి మంధాన, హర్లీన్, జెమీమా, దీప్తిశర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్, స్నేహ్ రాణా, శ్రీచరణి, క్రాంతి గౌడ్.

ఇంగ్లండ్: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), బ్యూమోంట్, అమీ జోన్స్, ఎమ్మా లాంబ్, సోఫియా డంక్లీ, అలైస్ రిచర్డ్స్, సోఫీ ఎకిల్‌స్టోన్, చార్లీ డీన్, కేట్ క్రాస్, లారెన్ ఫైలెర్, లారెన్ బెల్.

ఇంగ్లండ్ జట్టు, ప్రతీకలపై జరిమానా

భారత టాపార్డర్ బ్యాటర్ ప్రతీక రావల్ మ్యాచ్ ఫీజులో కోత విధించారు. సౌతాంప్టన్‌లో తొలి వన్డే సందర్భంగా 18వ ఓవర్ వేసిన లారెన్ ఫైలెర్, ఆ మరుసటి ఓవర్ వేసిన సోఫీ ఎకిల్‌స్టోన్‌తో ప్రతీక అనుచితంగా ప్రవర్తించింది. ఇది ప్లేయర్ల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించడమే అని తేల్చిన రిఫరీ ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. మరోవైపు మందకొడి బౌలింగ్ నమోదు చేసినందుకు ఇంగ్లండ్ జట్టు మొత్తానికి జరిమానా పడింది. నిర్ణీత సమయంలో కోటా ఓవర్లను పూర్తి చేయలేకపోవడంతో ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం కోత పెట్టినట్లు ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

4 లార్డ్స్ మైదానంలో భారత్, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు నాలుగు వన్డేలు జరిగాయి. రెండింటిలో భారత్, మరో రెండింటిలో ఇంగ్లండ్ గెలిచాయి. ఈ మైదానంలో ఇంగ్లండ్‌పై భారత్ అత్యధిక స్కోరు 230 కాగా, అత్యల్ప స్కోరు 169.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

నేటి నుంచి హైదరాబాద్–జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్

ప్రారంభించనున్న కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డి


అశ్వినీ వైష్ణవ్

సాక్షి, హైదరాబాద్: కాచిగూడ–జోధ్‌పూర్ (భగత్–కీ–కోఠి) నూతన ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి శనివారం సాయంత్రం 5.30 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాచిగూడ–జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీరోజు రాకపోకలు సాగించనుంది. దీంతో రాజస్తాన్ నుంచి ఉపాధి కోసం హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వలస వచ్చి నివసిస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లోని నాందేడ్, వాషిమ్, ఉజ్జయిని, రత్లం, నీమచ్, చిత్తోర్‌గఢ్, భిల్వారా, అజ్మీర్, పాలి మార్వా, తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈనెల 20న కాచిగూడ నుంచి, 22న భగత్ కీ కోఠి రెగ్యులర్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కాచిగూడ–భగత్‌కీ కోఠి (17605/17606) డైలీ ఎక్స్‌ప్రెస్ ప్రతీరోజు రాత్రి 10.30 గంటలకు కాచిగూడ నుంచి బయల్దేరి రెండవ రోజు రాత్రి 8 గంటలకు భగత్ కీ కోఠికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రాత్రి 10.30 గంటలకు భగత్ కీ కోఠి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 3.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది. ఈ ట్రైన్ 42 గంటలపాటు ప్రయాణించనుంది.

ఆత్మ నిర్భర్‌లో శాస్త్రవేత్తలే కీలకం

కేంద్ర మంత్రి సంజయ్ సేథ్



సాక్షి, హైదరాబాద్: అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను సాకారం చేసుకోవడం ద్వారా ఆత్మ నిర్భర్ భారత్ నిర్మాణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేలా సాయుధ దళాలను బలోపేతం చేయడాన్ని కొనసాగించాలని శాస్త్రవేత్తలను ఆయన కోరారు. రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్షిపణి సముదాయాన్ని, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ (ఏఎస్ఎల్) ఆఫ్ మిస్సైల్ క్లస్టర్ ల్యాబ్స్‌ను పరిశీలించారు. అక్కడ తయారవుతున్న క్షిపణులు, ఆయుధ వ్యవస్థలను పరీక్షించారు. శాస్త్రవేత్తలతో మాట్లాడారు. మిస్సైల్ అండ్ స్ట్రాటజిక్ సిస్టం డైరెక్టర్ జనరల్ యు.రాజాబాబు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి ప్రాజెక్టుల స్థితిని వివరించారు.

నేడు ట్రైకార్ బోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ట్రైకార్) బోర్డు సమావేశం శనివారం జరగనుంది. ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో చైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులు పాల్గొంటారు. ప్రస్తుతం ట్రైకార్ ద్వారా అమలు చేస్తున్న యువ వికాసం పథకంపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. రెండో అంశంగా ఈ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సర్వీసు క్రమబద్ధీకరణకు కూడా రంగం సిద్ధం చేశారు. ఈమేరకు ప్రతిపాదనలు తయారు చేసి.. బోర్డు ముందు పెట్టేందుకు అధికారులు ఫైళ్లు తయారు చేశారు. శనివారం నాటి బోర్డు సమావేశంలో సదరు ఉద్యోగి క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫైలును బోర్డు ముందుంచనున్నారు.

నాసా ఎన్ఎస్ఎస్ ఐఎస్‌డీసీలో శ్రీచైతన్య సత్తా

బంజారాహిల్స్ (హైదరాబాద్): అంతర్జాతీయ స్థాయిలో అమెరికా నాసా ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని ఆ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగినవిద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి 475 మంది విద్యార్థులు హాజరైతే అందులో 67 మంది భారతదేశం నుంచి పాల్గొనగా 45 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే ఉండటం తమకు గర్వకారణంగా ఉందన్నా రు. అమెరికా నాసా ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో శ్రీచైతన్య అంతర్జాతీయ స్థాయిలో 60 విన్నింగ్ ప్రాజెక్టులు గెలుచుకొని వరల్డ్ నం.1గా నిలిచిందని తెలిపారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడు నుంచి శ్రీచైతన్య స్కూల్ తప్ప మరే ఏ ఇతర పాఠశాల నుంచి విద్యార్థులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనలేదన్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్టిస్టిక్ కేటగిరీలో 500 డాలర్ల బహుమతి అందుకున్న ఏకైక టీం శ్రీచైతన్య స్కూల్‌దేనని తెలిపారు.

ఐఎన్ఎస్ నిస్తార్ జాతికి అంకితం

జలప్రవేశం చేయించిన రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్

- జలాంతర్గాముల ఆనవాళ్లను పసిగట్టేలా సాంకేతికత
- సాగర గర్భంలో సర్వే కోసం 2 రిమోట్ ఆపరేటెడ్ వెహికల్స్
- తూర్పు నౌకాదళం నుంచి సేవలందించనున్న నిస్తార్



సాక్షి, విశాఖపట్నం: రక్షణ పరికరాలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకుందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హిందూస్తాన్ షిప్‌యార్డు నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్ ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధనౌక భారత నౌకాదళ అమ్ములపొదిలో శుక్రవారం చేరింది. విశాఖలోని నేవల్ డాక్‌యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి సంజయ్ సేథ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠీ చేతుల మీదుగా నిస్తార్ యుద్ధనౌకని జాతికి అంకితం చేశారు. అనంతరం.. సంజయ్ సేథ్ మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్‌లో ఇండియన్ నేవీ దూసుకుపోతోందని, నిస్తార్ యుద్ధనౌక మన దేశ ప్రతిష్టకి చిహ్నంగా మారిందన్నారు. ప్రస్తుతం భారత్‌లో అనేక యుద్ధనౌకలు తయారీలో ఉన్నాయని తెలిపారు. దేశంలోని వివిధ షిప్‌యార్డుల్లో ప్రస్తుతం పైప్‌లైన్‌లో ఉన్న 57 వార్‌షిప్స్ స్వదేశీ పరిజ్ఞానంతోనే రూపొందుతున్నాయని వెల్లడించారు. రూ.50వేల కోట్ల రక్షణ రంగ ఎగుమతులు చేయడమే భారత్ ముందున్న లక్ష్యమన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో ఎంఎస్ఎంఈలకు సంపూర్ణ సహకారం అందుతోందని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ బలీయమైన శక్తిగా ఎదుగుతోందని.. భవిష్యత్తులో అత్యాధునిక సాంకేతికత మన రక్షణ రంగం సొంతమవుతుందని తెలిపారు. భారత్ పరాక్రమశక్తిని ఇటీవలే పాకిస్తాన్‌కి రుచి చూపించామని.. ఈ విషయంలో భారతీయులందరూ గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నారని కేంద్రమంత్రి సేథ్ వెల్లడించారు.

యుద్ధనౌకలకు మళ్లీ పునరుజ్జీవం..

ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠీ మాట్లాడుతూ.. భారత నౌకాదళం సేవల నుంచి నిష్క్రమించిన యుద్ధనౌకలు మళ్లీ పునరుజ్జీవం పొందుతున్నాయన్నారు. 1971 యుద్ధంలో పాక్ జలాంతర్గామి ఘాజీ నాశనమైనట్లు నిస్తార్ యుద్ధనౌక గుర్తించిందనీ.. దాని విజయానికి ప్రతీకగా నిస్తార్ క్లాస్ వార్‌షిప్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. డైవింగ్ సపోర్ట్, సబ్‌మెరైన్ రెస్క్యూ ఆపరేషన్స్‌ను సమానంగా నిర్వహించగల సత్తాతో నిస్తార్‌ని నిర్మించినట్లు వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్‌తో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేస్తున్న వార్‌షిప్స్ సంఖ్య పెరుగుతోందనీ.. ఈ నౌకానిర్మాణంలో హిందూస్తాన్ షిప్‌యార్డ్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. షిప్‌యార్డ్ సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రి మాట్లాడుతూ.. సుజాత యుద్ధనౌక నిర్మాణంలో కొరియన్ టెక్నాలజీ వినియోగించగా.. నిస్తార్ యుద్ధనౌక మాత్రం 80 శాతం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించామన్నారు.


ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధ నౌక

నిస్తార్ స్వరూపమిది..

- పొడవు: 119.7 మీటర్లు
- బీమ్: 22.8 మీటర్లు
- బరువు: 10,587 టన్నులు
- వేగం: 18 నాటికల్ మైళ్లు
- సిబ్బంది : 12 మంది అధికారులు, 113 మంది సెయిలర్స్
- మొదటి కమాండింగ్ ఆఫీసర్ : కమాండర్ అమిత్ శుభ్రో బెనర్జీ
- నిర్మాణానికి పనిచేసిన ఎంఎస్ఎంఈలు : 120

సమ్మక్క బరాజ్ ముంపు 100 ఎకరాలే..

- నిగ్గు తేల్చిన ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణులు
- ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రాంతాలపై స్పష్టత
- బరాజ్ డీపీఆర్ క్లియరెన్స్‌కు మార్గం సుగమం

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిపై ములుగు జిల్లాలో నిర్మిస్తున్న సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బరాజ్ క్లియరెన్స్‌కు మార్గం సుగమమైంది. సమ్మక్క సాగర్ బరాజ్ వల్ల ఛత్తీస్‌గఢ్‌లో వంద ఎకరాల లోపు భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణులు తేల్చారు. బరాజ్‌లో 87 మీటర్ల గరిష్ట వరదతో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోటూరు, కోటూరు, తుర్లగూడ, గంగారం, కంబాలపేట, సీతానగరంలోని 100 ఎకరాలు మాత్రమే ముంపునకు గురయ్యే అవకాశం ఉందని నిర్ధారించారు. ఈ బరాజ్‌కు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని అంతర్‌రాష్ట్ర విభాగం డైరెక్టరేట్ గతంలో అభ్యంతరం తెలిపింది. సీడబ్ల్యూసీలోని మిగిలిన డైరెక్టరేట్లన్నీ క్లియరెన్స్ ఇవ్వగా.. అంతరాష్ట్ర విభాగం ఒక్కటే అనుమతులు నిలిపివేసింది. అనుమతి కావాలంటే ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) తెచ్చుకోవాలని తేల్చిచెప్పింది. బరాజ్ పూర్తి నిల్వ సామర్థ్యం 83 మీటర్లు కాగా.. అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే హామీ ఇచ్చింది. 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల వరకు గరిష్ట వరద మట్టం రికార్డయ్యిందని, ఆ మేరకు వరదతో ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పట్టుబట్టింది. తాజాగా ఐఐటీ ఖరగ్‌పూర్ నిపుణులతో అధ్యయనం చేయించగా ముంపుపై స్పష్టత వచ్చింది. దాంతో ఆ మేరకు భూములకు పరిహారాన్ని బీజాపూర్ కలెక్టర్ వద్ద జమచేయించిన తర్వాత ఆ రాష్ట్రం నుంచి ఎన్వోసీ లేదా అంతరాష్ట్ర ఒప్పందం చేసుకుంటే బరాజ్‌కు అనుమతికి మార్గం సుగమం అవుతుంది. రూ.9,257 కోట్లతో చేపట్టిన తుపాకులగూడెం బరాజ్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. బరాజ్‌లో నీటిని నిల్వ చేసి.. బ్యాక్ వాటర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఎత్తిపోయడం ద్వారా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు నీరందించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

రాజస్తాన్ నుంచి హైదరాబాద్‌కు నల్లమందు సరఫరా

- ముగ్గురిని అరెస్ట్ చేసిన ఈగల్ బృందం
- 3.25 కిలోల నల్లమందు (ఓపీఎం) స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్ నుంచి హైదరాబాద్‌కు నల్లమందు (ఓపీఎం) సరఫరా చేస్తున్న ముగ్గురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను ఈగల్ బృందం శుక్రవారం అరెస్ట్ చేసింది. వీరి వద్ద 3.25 కిలోల నల్లమందు, 2 కార్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న రాజస్తానీలు లక్ష్యంగా.. నల్లమందు అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అందులో పేర్కొన్న మేరకు వివరాలు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లు సహా హైదరాబాద్ పరిధిలో నివసిస్తున్న రాజస్తానీయులే లక్ష్యంగా.. ఈ ముఠా నల్లమందు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పోలీసులకు చిక్కిన కొనుగోలుదారుల వివరాల ఆధారంగా.. ఈగల్ బృందం 45 రోజులుగా ఈ ముఠా కార్యకలాపాలపై నిఘా పెట్టినట్టు వివరించారు. ఓపీఎం సరఫరాదారుల గురించి సేకరించిన సమాచారం ఆధారంగా.. రాజస్తాన్ జలోర్ జిల్లా భిన్మల్‌లో నల్లమందు స్థావరాల్లో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 14న భిన్మల్ నుంచి ఒక క్రెటా కార్‌లో ఓపీఎంను తరలిస్తున్నట్లు గుర్తించారు. ముందు, వెనుక ప్రత్యేక పైలట్ వాహనాలతో క్రెటా కార్ వస్తున్నట్టు గుర్తించి అనుసరించారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో క్రెటా కారును అడ్డుకున్నారు. కారులో నల్లమందును తరలిస్తున్న రాజస్తాన్ జలోర్ జిల్లా భిన్మల్‌కు చెందిన సవ్లరామ్ బిష్ణోయ్ (45), హపురామ్ బిష్ణోయ్ (38), లాలారామ్ బిష్ణోయ్ (41)లను అరెస్ట్ చేశారు. వీరినుంచి 3.25 కిలోల నల్లమందు స్వాధీనం చేసుకుని, రెండు కార్లు సీజ్ చేశారు.

నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. నటుడు ఫిష్ వెంకట్ (53) కన్నుమూశారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆయన హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సుమారు 10గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఫిష్ వెంకట్ అసలు పేరు మంగళంపల్లి వెంకటేశ్. ముషీరాబాద్ మార్కెట్‌లో చేపల వ్యాపారం చేయడంతో ఆయన ఫిష్ వెంకట్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'సమ్మక్క సారక్క'(2000) చిత్రం ద్వారా క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు వెంకట్. ఆ తర్వాత 'ఖుషి, ఆది, చెన్నకేశవరెడ్డి, దిల్, బన్నీ, యోగి, కృష్ణ, అదుర్స్, రచ్చ, గబ్బర్ సింగ్, డీజే టిల్లు'వంటి పలు సినిమాల్లో నటించారు. 'మదరాసి', 'సిరుతై'వంటి తమిళ చిత్రాల్లోనూ నటించారాయన. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా, హాస్య నటుడిగా దాదాపు 100కు పైగా సినిమాల్లో తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించారు ఫిష్ వెంకట్. ఆయన రెండు కిడ్నీలు దెబ్బతినడంతో గత కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. 'రెండు కిడ్నీలు మార్పిడి చేయాలని వైద్యులు తెలిపారని, అందుకు సుమారు రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని, అంత ఆర్థిక స్తోమత తమకు లేదని, దాతలు సాయం చేయాలంటూ'ఆయన కుమార్తె ఇటీవల మీడియా ఎదుట చెప్పిన విషయం తెలిసిందే. ఫిష్ వెంకట్ ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఫిష్ వెంకట్ మృత పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

'ఫోర్జరీ' వ్యవహారమేంటి?

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు విచారణ
- ఉప్పల్ స్టేడియం తరలించి ఆధారాలతో ప్రశ్నించిన సీఐడీ
- హెచ్‌సీఏ కార్యాలయంలో డాక్యుమెంట్ల పరిశీలన
- శ్రీనివాసరావు, సునీల్‌ను కూడా ప్రశ్నించిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరిగిన అవకతవకలపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావును సీఐడీ అధికారులు మరింత లోతుగా ప్రశ్నిస్తున్నారు. ఆరు రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం రెండో రోజు జగన్మోహన్‌రావు సహా ఐదుగురు నిందితులను ప్రశ్నించారు. జగన్మోహన్‌రావుతోపాటు హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంటేలను ఉప్పల్ స్టేడియానికి తీసుకెళ్లి, హెచ్‌సీఏ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ముగ్గురిని వేర్వేరుగా ప్రశ్నించి వివరాలు సేకరించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమర్పించిన పత్రాలను జగన్మోహన్‌రావు ముందుంచి, అందులోని సంతకాలు ఇతర వివరాలపై ప్రశ్నించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్ పేరును శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌గా మార్చడంతోపాటు గౌలిపుర క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ సంతకం ఫోర్జరీ చేయటంపైనా జగన్మోహన్‌రావు స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఈ కేసులో ఏ–3గా ఉన్న హెచ్‌సీఏ ట్రెజరర్ చౌటి శ్రీనివాసరావును అసోసియేషన్ ఆర్థిక లావాదేవీలపై పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. హెచ్‌సీఏ సీఈఓ సునీల్ కాంటేను ఆయన కార్యాలయానికి తీసుకెళ్లి పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న ఏ–6 కవితను, చర్లపల్లి జైలు నుంచి ఏ–5 రాజేందర్ యాదవ్‌ను రెడ్‌హిల్స్‌లోని సీఐడీ రీజినల్ ఆఫీస్‌కు తరలించి న్యాయవాది సమక్షంలో ప్రశ్నించారు.


ఏఐ శోధన.. ఏదైనా క్షణాల్లో..

- మరింత కచ్చితత్వంతో విశ్లేషణాత్మక సమాచారం
- నెట్‌లో శోధన తీరునే మార్చేసిన ఏఐ పవర్డ్ సెర్చింగ్
- ఏ ప్రశ్న అడిగినా క్షణాల్లో సమగ్రంగా పూర్తి సమాచారం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నెట్ సెర్చింగ్ (ఆన్‌లైన్‌లో అన్వేషణ) గత పదేళ్లలో అనేక విప్లవాత్మక మార్పులకు గురైంది. తాజాగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లోతైన అన్వేషణ (ఏఐ పవర్డ్ సెర్చ్) పరిజ్ఞానం ఈ రంగాన్ని మరో స్థాయికి తీసుకెళుతోంది. గూగుల్ వంటి ప్రధాన ఇంటర్నెట్ సెర్చ్ ఇంజిన్లు ఇప్పుడు కేవలం లింకులు ఇవ్వడానికే కాకుండా, సారాంశం చెప్పగలిగే సమాధానాలను, వ్యాఖ్యలతో కూడిన నివేదికలను అందించే దిశగా దూసుకెళ్తున్నాయి. ఇది సాంకేతిక పురోగతి మాత్రమే కాదని, మన జీవన శైలిలో భాగంగా మరింత లోతుగా విజ్ఞానం పెంచుకునేందుకు దారితీసే చైతన్యం కూడా అని నిపుణులు పేర్కొంటున్నారు.

డేటా భద్రతకి చక్కటి సాధనాలు

ఇటీవలి కాలంలో డేటా గోప్యత పై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఇంకాగ్నిటో మోడ్, వీపీఎన్, ఐక్లౌడ్, ప్రైవేట్ రిలే వంటి టూల్స్ వినియోగదారులకు మరింత భద్రతను కల్పిస్తున్నాయి. ముఖ్యంగా నార్డ్ వీపీఎన్, ప్రైవేట్ ఇంటర్నెట్ యాక్సెస్ వంటి టూల్స్ 'నో లాగ్స్ పాలసీ'కలిగి ఉండటం వల్ల, వినియోగదారుల బ్రౌజింగ్ సమాచారం ఎక్కడా నిల్వగా ఉండిపోదు. ఐఫోన్ వినియోగదారుల కోసం ఐక్లౌడ్ ప్రైవేట్ పాలసీ మరింత సహాయపడుతుంది. ఇది డేటాను ఎన్‌క్రిప్ట్ చేసి, వేర్వేరు సర్వర్లకు పంపించి డేటా లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. డొమైన్ లిమిటింగ్, డీప్ వెబ్ యాక్సెస్ వంటివి శాస్త్రీయ పరిశోధనలకు సహాయపడే మార్గాలుగా నిలుస్తున్నాయి. వివిధ శోధన అవసరాలకు అనుగుణంగా 'సైట్.జీవోవీ', డొమైన్.ఎడ్యు' వంటి సెర్చ్ ఆపరేటర్లను ఉపయోగించి ప్రభుత్వ, విద్యా సంబంధిత అధికారిక వెబ్‌సైట్ల నుంచి కచ్చితమైన సమాచారం పొందవచ్చు. కొన్ని బ్రౌజర్లు ఇప్పుడు ఏఐ ఆధారంగా బ్రౌజింగ్ చరిత్రను విశ్లేషించి, యూజర్ల అభిరుచులకు అనుగుణంగా ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి. అయితే దీనిని అవసరమైతే ఆపేయవచ్చు. గోప్యతను నిర్దేశించుకునే స్వేచ్ఛ వినియోగదారుల వద్దే ఉంటుంది.



ఏఐ మోడ్, డీప్‌సెర్చ్ ఎలా పని చేస్తుంది?

- గూగుల్ ఏఐ మోడ్ ఇతర సెర్చ్ ఇంజిన్ల టూల్స్, యూజర్ ఇచ్చే ప్రశ్నలను బహుళ మూలాల నుంచి విశ్లేషించి సమగ్రమైన సమాధానాన్ని అందిస్తుంది. ఆయా ప్రశ్నలు, కమాండ్లను బట్టి వివిధ కోణాల్లో సమాచారాన్ని ఉపయోగించి సమాధానం ఇవ్వడం దీని ప్రత్యేకత.
- ఎందుకు, ఏమిటి, ఎలా? వంటి ప్రశ్నలకు ఏఐ సెర్చ్ ఇంజిన్లు లోతైన విశ్లేషణ అందిస్తాయి.
- సవివరమైన నివేదికల మాదిరిగా చక్కటి విశ్లేషణ, సమగ్రతతో సమాధానం ఇస్తాయి.

ఆ వ్యాఖ్యలు దుర్మార్గం

- టీడీపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి
- రోజాకు మద్దతుగా నిలిచిన సినీ తారలు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఆర్కే రోజాకు సినీతారలు బాసటగా నిలిచారు. అసహ్యకరమైన పదాలతో విమర్శించిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సినీ తారలు మీనా, రమ్యకృష్ణ, కుష్బు డిమాండ్ చేశారు. వారు ఏమన్నారంటే..

రోజాను చూసి అసూయ పడుతున్నాడు



రోజా గురించి మాట్లాడిన వీడియో చూశాను. చాలా చాలా కోపం తెప్పించింది. ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడంటే ఆయన రోజాను చూసి ఎంత అసూయ పడుతున్నాడో తెలుస్తోంది. ఆయన క్యారెక్టర్, ఆలోచనలు ఎంత నీచంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రోజా చాలా ధైర్యం కలిగిన మహిళ. రోజా.. నేను నీకు అండగా ఉంటాను. సుప్రీంకోర్టు తక్షణం కలుగ చేసుకొని రోజాకు న్యాయం జరిగేట్టు చూడాలి. – మీనా

ఎట్టి పరిస్థితిలోనూ ఇది సహించరానిది



టీడీపీ మాజీ మంత్రి తనయుడు ఈ విధంగా తిట్టడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరానిది. ఈ సమయంలో కుల, మతాలకు అతీతంగా మగ, ఆడ అని తేడా లేకుండా అందరూ ఒక్కటై రోజాకు అండగా నిలబడాలి. టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో తక్షణం కలుగు చేసుకొని కఠిన చర్యలు తీసుకోవాలి. – రమ్యకృష్ణ

నీకు పెళ్లాం, సోదరి లేరా?

రోజా సినిమా హీరోయిన్‌గా నటించింది. రాజకీయాల్లోకి వెళ్లి మంత్రిగా పని చేసింది. అలాంటి రోజాపై ఇష్టానుసారం మాట్లాడటానికి ఎంత ధైర్యం కావాలి? నీకు పెళ్లాం, సోదరి లేరా? ఒక లీడర్‌గా ఆడవారి గురించి ఇంత దిగజారి మాట్లాడతారా? – నవనీత్ కౌర్

ఇంత నీచంగా ఎలా మాట్లాడతారు?

రోజాపై అంత దారుణంగా మాట్లాడటం బాధ కలిగించింది. రాజకీయాల్లో ఇలాంటి సంఘటనలు దారుణం. రాజకీయాల్లోకి మహిళలు మరింత ముందుకు రావాల్సి ఉంది. ఇలాంటి సమయంలో మహిళల గురించి ఇంత నీచంగా ఎలా మాట్లాడతారు? – రాధిక

రోజాకు మా అందరి మద్దతు



రోజాకు మా అందరి మద్దతు ఉంది. ఒక మహిళ గురించి ఇంత నీచంగా మాట్లాడిన వారిపై చర్య తీసుకోవాలి. – కుష్బూ

అన్ని పోటీపరీక్షలకు ఉపయోగపడే తాజా కరెంట్ అఫైర్స్..

సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌లో...

డైలీ, వీక్లీ, మంత్లీ కరెంట్ అఫైర్స్ బిట్స్ రూపంలో కూడా..

సాక్షి ఎడ్యుకేషన్: యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, పోలీసు, డీఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఎఫ్‌బీఓ, వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీ ఇలా మొదలైన పోటీపరీక్షల్లో కరెంట్ అఫైర్స్ నుంచే అధికంగా ప్రశ్నలు వస్తుంటాయి. ఇంతటి కీలకమైన డైలీ, వీక్లీ, మంత్లీ కరెంట్ అఫైర్స్ సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) లో చూడొచ్చు. ఈ కరెంట్ అఫైర్స్‌ను సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ప్రత్యేకంగా ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులతో డైలీ ప్రిపేర్ చేయించి.. అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో జరిగిన వివిధ పోటీపరీక్షల్లో www.sakshieducation.com అందిస్తున్న కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చిన విషయం మీ అందరికి తెల్సిందే. వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులు ఈ మంచి అవకాశాన్ని వినియోగించుకుని పోటీపరీక్షల్లో విజయం సాధించండి.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



కలెక్టర్ సార్.. థాంక్ యు

మలయాళ చిత్రం స్థానార్థి శ్రీ కుట్టన్ స్ఫూర్తిగా జనగామ జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యార్థుల కూర్చునే వరుస మారింది. వెనుక బెంచీలకు స్వస్తి పలుకుతూ.. 'యు'ఆకారంలో కూర్చునే విధానానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు.. డీఈవో భోజన్న జిల్లాలోని అన్ని పాఠశాలలకు దిశానిర్దేశం చేశారు. దీంతో శుక్రవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వెనుక బెంచీలను తొలగించి.. 'యు'ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి బోధించారు. – జనగామ



సమాచారశాఖ కార్యాలయంలో బోనాలు

సాక్షి, హైదరాబాద్: సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక శాఖ ఉద్యోగులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపులు, బోనాల సమర్పించారు. అనంతరం ఊరేగింపులో డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో సమాచార శాఖ సంచాలకుడు ఎల్ఎల్ఆర్ కిషోర్ బాబు, అదనపు సంచాలకుడు డీఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, సమాచార శాఖ మాజీ డైరెక్టర్ సుభాష్ గౌడ్, సీఐఈ రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఘటనలకు అధికారులే బాధ్యులు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ



సాక్షి ప్రతినిధి, వరంగల్ /హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో చోటుచేసుకునే సంఘటనలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, రీజినల్ కోఆర్డినేటర్లతో మంత్రి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం పలు సూచనలు చేశారు. రీజినల్ కోఆర్డినేటర్లు విధిగా గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పిల్లలపై ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఏదేని ఘటనలు జరిగితే అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, రాజీపడొద్దని మంత్రి స్పష్టం చేశారు. డైట్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గురుకుల విద్యాసంస్థల్లో ఇటీవల జరుగుతున్న ఘటనల పట్ల మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, బీసీ గురుకుల సొసైటీ గురుకుల కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


BANTIA
Furnitures
మీ పాత మ్యాట్రెస్‌ను కొత్త మ్యాట్రెస్‌తో ఎక్స్ఛేంజ్ చేయండి
ఎక్స్ఛేంజ్ విలువ రూ. 10,000 వరకు
+
2 పిల్లోలు విలువ రూ. 999 వరకు
+
MRP పై 15% డిస్కౌంట్ పొందండి
సఫారీ సోఫా సెట్ : 3 + 2 + దివాన్ (8 సీటర్) + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹62,999
Sale ₹ 23,333
PER DAY EMI ₹25
బ్రెజిల్ సోఫా సెట్ 3 + 2
+ ఉచితం సెంటర్ టేబుల్ విలువ రూ. 7,000
MRP ₹39,499
Sale ₹ 17,999
PER DAY EMI ₹19
హాయ్ : టేకఉడ్ క్వీన్ సైజ్ బెడ్
రూ. 15,000 విలువ గల మ్యాట్రెస్ ఉచితం
MRP ₹46,999
Sale ₹ 19,999
PER DAY EMI ₹22
స్టోరేజ్‌తో బెడ్ + 10" యూరో టాప్ స్ప్రింగ్ మ్యాట్రెస్ విలువ రూ. 20,000 గలది ఉచితం
MRP ₹42,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
ప్రీమియం క్వాలిటీ క్వీన్ సైజ్ బెడ్
MRP ₹21,499
Sale ₹ 5,999
PER DAY EMI ₹6
₹ 6,999
గ్లాస్ డైనింగ్ టేబుల్ 6 చైర్స్‌తో
MRP ₹47,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
గ్లాస్ డైనింగ్ టేబుల్ 4 చైర్స్‌తో
MRP ₹32,499
Sale ₹ 13,999
PER DAY EMI ₹15
6 చైర్స్‌తో
₹ 21,999
మార్బుల్ డైనింగ్ టేబుల్
4 చైర్స్‌తో
MRP ₹25,499
Sale ₹ 12,999
PER DAY EMI ₹14
with 6 Chairs ₹ 14,999
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
మిర్రర్‌తో 2 డోర్
MRP ₹ 27,449
₹ 8,999
PER DAY EMI ₹10
మిర్రర్‌తో 3 డోర్
₹ 12,999
2 మిర్రర్స్‌తో 4 డోర్
₹ 16,999


లోన్ & ఎక్స్ఛేంజ్ మేళా
సిబిల్ గురించి చింతించవద్దు. 600 సిబిల్ స్కోర్‌తో లోన్స్/ఇఎంఐ
డౌన్‌పేమెంట్ మరియు ఇఎంఐ స్కీమ్
నెలల సంఖ్య | డౌన్ పేమెంట్
8 | 0
10 | 0
10 | 2
12 | 4
18 | 6
24 | 0
50% వరకు తగ్గింపు
త్వరపడండి! 2 రోజులు మాత్రమే!!
రిక్లైనర్ సోఫా సెట్ : 2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ & కన్‌సోల్ టేబుల్
MRP ₹1,49,499 Sale ₹59,999 PER DAY EMI ₹65
రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1
+ ఉచితం 4 చైర్స్‌తో డైనింగ్ టేబుల్ + ఉడెన్ సెంటర్ టేబుల్ + ప్రీమియం కార్పెట్ విలువ రూ. 35,000
MRP ₹2,09,999 Sale ₹99,999 PER DAY EMI ₹108
లగ్జరీ సోఫా సెట్
3+3+ ఉచితం రిక్లైనర్
ఉచితం రూ. 20,000/- విలువ గల రిక్లైనర్
MRP ₹61,999 Sale ₹30,999 PER DAY EMI ₹33
రాకీ సోఫా సెట్ 3+2+1+ ఉచితం T.V. స్టాండ్ మరియు మ్యాగజైన్ ర్యాక్ విలువ రూ. 15,000
MRP ₹51,499 Sale ₹30,999 PER DAY EMI ₹33
L టైప్/కార్నర్ సోఫా సెట్ (7 సీటర్)
MRP ₹52,999 Sale ₹22,222 PER DAY EMI ₹24
ఆర్ట్ లెదర్ రిక్లైనర్ సోఫా సెట్ 3+1+1 రిక్లైనర్
ఉచితం + రూ. 10,000 విలువ గల TV స్టాండ్
MRP ₹84,999 Sale ₹39,999 PER DAY EMI ₹43
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 చైర్స్ + 1 బెంచ్)
MRP ₹55,999 Sale ₹24,999 PER DAY EMI ₹27
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
79950 00930, 040-27841562 79933 33351
www.bantia.in

సాక్షి ప్లస్
శనివారం : 19-7-2025

నాటి మత్స్యపురమే.. నేటి గంగాపురం



ఆలయం వ్యూ



చెన్నకేశవస్వామి మూలవిరాట్

11వ శతాబ్దపు శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక శ్రీలక్ష్మీచెన్నకేశవుడి ఆలయం

ప్రత్యేక ఆకర్షణగా పుష్కరిణి నిర్మాణం ● ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక

ఏటా మాఘ మాసంలో భారీగా బ్రహ్మోత్సవాలు



ఆలయ రాజగోపురం

కృతయుగంలో మత్స్యపురంగా, త్రేతాయుగంలో దురితకోలాహలంగా, ద్వాపర యుగంలో మాయాపురంగా పేరొంది.. కలియుగంలో గంగాపురంగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం నాటి శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయంలో ఏటా మాఘశుద్ధ పాద్యమి మొదలు.. నవమి వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. వైష్ణవ పాంచరాత్రాగమ సంప్రదాయానుసారం ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచేగాక.. ఆలయం పడమర దిశ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరవుతారు. –జడ్చర్ల

ఏటా వైభవంగా బ్రహ్మోత్సవాలు

మాఘమాసం శుద్ధపాడ్యమి రోజు అలంకారాభిషేకంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో.. తొలిరోజు స్వామి, అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం, నూతన వస్త్రాలంకరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. రెండోరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణం, మత్స్యంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, పల్లకీ సేవ నిర్వహించనున్నారు. మూడోరోజు ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, నాలుగో రోజు రాత్రికి ఎదుర్కోలు, స్వామి, అమ్మవార్ల కల్యాణం, 5వ రోజు మనోహరమైన శేష, హంస వాహన సేవలు, పుష్పరథం (చిన్నతేరు) 6వ రోజు రథసప్తమి సందర్భంగా పెద్దతేరు (రథోత్సవం), 7వ రోజు శకటోత్సవం (బండ్లు), 8వ రోజు పూర్ణాహుతి, చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కృతయుగంలో మత్స్యపురి

మత్స్యపురి పేరు వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది. కృతయుగాన దేవసేనుడు ఇక్కడ వీరనారాయణస్వామిని ప్రతిష్ఠించాడు. కొంత కాలం తర్వాత నలచక్రవర్తి అరణ్య వాసంలో ఇక్కడి దుందుబీ నది తీరానికి వచ్చి.. నదిలో చేపలు పట్టి దమయంతికి వంట చేయమని ఇచ్చాడు. ఆమె వాటిని వండుతూ ఒక కట్టెపుల్లతో కలుపుతుండగా.. ఉడికిన చేపలు బతికి ఆకాశమంత ఎత్తు ఎగిరి నదిలో పడి వెళ్లిపోయాయి. ఈ అద్భుతానికి వారు ఆశ్చర్యపడి.. తాము విడిది చేసిన ఈ ప్రాంతానికి మీనాంబరి అని నామకరణం చేశారు. అయితే ఈ ప్రాంతం గంగాపురాంతర్భాగం కావడంతో మత్స్యపురిగా పిలిచారు.

త్రేతాయుగంలో దురితకోలాహలం

పుండ్రపురాన్ని పాలించిన చంద్రకేతుడికి బ్రహ్మహత్యాపాతకం సంభవించింది. దీంతో అతను ఇక్కడి మీనాంబరి నదిలో స్నానం ఆచరించి దుర్గామాతను పూజించి పాప విముక్తుడయ్యాడు. దీంతో ఈ పట్టణానికి దురిత కోలాహలం అనేపేరు వచ్చింది.

ద్వాపరయుగంలో మాయాపురం

ద్వాపరయుగంలో మయునో కుమారుడు దుర్జయుడు గండకాద్రిని ముట్టడించి నాశనం చేయడంతో.. అక్కడి మునులు గంగాపురంలోని వీరనారాయణస్వామితో తమను రక్షించమంటూ మొర పెట్టుకుంటారు. దీంతో స్వామి ఇక్కడినుంచి మాయమై.. గండకాద్రి చేరి దుర్జయుని వధించడంతో మాయాపురంగా పేరొందింది.

కలియుగంలో గంగాపురం

దేవసేనుడు ఈ ప్రాంతానికి స్థానిక నాయకుడు. ఇతను గంగాదేవి గురించి తపస్సు చేస్తాడు. గంగాదేవిని రప్పించి ఆమె పేరున గంగేశ్వరుడిని ప్రతిష్ఠ చేసి నేటి గంగాపురానికి పునాది వేయడంతో గంగాపురంగా ప్రసిద్ధి చెందింది.

చారిత్రక ప్రాధాన్యం

గంగాపురం చాళుక్య చక్రవర్తులకు ఉపరాజధానిగా కొనసాగింది. క్రీ.శ. 11వ శతాబ్ది కాలానికి చెందిన పశ్చిమ చాళుక్య శాసనాల్లో ఈ గంగాపురాన్ని త్రైలోక్య మల్లకేశవపురంగా పేర్కొన్నారు. ఈ ప్రాంతం క్రీ.శ 1050 నుంచి 1280 వరకు పశ్చిమ చాళుక్య సామంతుడైన కందూరు చోళుల వంశం వారి పాలనలో ఉంది. పశ్చిమ చాళుక్య రాజులు వైజయంతిపురాన్ని రాజధానిగా.. గంగాపురాన్ని రెండో రాజధానిగా చేసుకుని రాజ్యాన్ని పాలించారు. మొదటి కల్యాణి చాళుక్య తైలపుదేవుడు గంగాపురంలో చాళుక్య పట్టాభిషేకం చేసుకుని చక్రవర్తిగా వ్యవహరించాడు. క్రీ.శ 1091 నాటికే ఇక్కడి చెన్నకేశవాలయం ప్రఖ్యాతి చెందినట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి.



ప్రత్యేక ఆకర్షణగా పుష్కరిణి

జడ్చర్ల మండలం గంగాపూర్‌లోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం నాటి శిల్పుల కళానైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. నాటి అద్భుత శిల్పకళాశోభితమైన కేశవ క్షేత్రంగా నాటినుంచి నేటివరకు విలసిల్లుతోంది. ఆలయాన్ని 11వ శతాబ్దంలో నిర్మించినట్లు ఆనవాళ్లున్నాయి. కోణార్క్ సూర్యదేవాలయం, గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాలను ఒకేవిధంగా నిర్మించారని వినికిడి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండడం ఇందుకు నిదర్శనం. క్రీ.శ. 1042–1052 మధ్య కాలంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చాళుక్యరాజు త్రైలోక్య మల్లసోమేశ్వరుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం

ఆలయ రాజగోపురం అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. నైరుతి దిశలో సువిశాలమైన ప్రాంగణంలో రెండు ప్రాకారాలు కలిగి.. ఎత్తైన అధిష్ఠానంపై తూర్పు ముఖంగా ఏకకూటాలయ వాస్తు రీతిలో నిర్మించారు. ప్రథమ ప్రాకార కుడ్యాలు అతిపురాతనమైనవి. వీటిని రాతితో వెడల్పుగా నిర్మించారు. వాటిపై మట్టితో ఎత్తైన గోడలు నిర్మించారు. ఈ ప్రాకారంలో దక్షిణ దిశలో 44 స్తంభాలున్న ఉపగుడి ఉంది. మార్చి నెలలో స్వామి మూలవిరాట్ పాదాలపై సూర్యకిరణాలు పడేలా నిర్మాణం చేశారు. కాలక్రమేణా నిర్మాణాల్లో మార్పుల కారణంగా సూర్యకిరణాలు ప్రసరించడం లేదు. ఆలయ ప్రాంగణంలో ఈశాన్య దిశలో నిర్మించిన కోనేరు (పుష్కరిణి) పలు ప్రత్యేకతలను నిలుపుకొంది. చతురస్రాకారంలో మెట్లు నిర్మించడంతో ఎటునుంచి చూసినా ఒకేలా కనిపించడం విశేషం. ఇక్కడి కోనేరుకు బాదేపల్లి పెద్దగుట్ట వరకు సొరంగమార్గం ఉన్నట్లు ప్రచారం వ్యాప్తిలో ఉంది. ఆలయం తురుష్కుల దాడిలో కొంత దెబ్బ తిన్నప్పటికీ.. గర్భగుడి మాత్రం చెక్కుచెదరలేదు. భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్లను నిర్మించడంతో.. నాటి వైభవం కొంత తగ్గినట్లయింది.

ఇంజనీరింగ్ సీట్లు, భర్తీ వివరాలు

ఇన్‌స్టిట్యూట్	కాలేజీలు	ఉన్న సీట్లు	సీట్ల భర్తీ	మిగిలినవి	భర్తీ శాతం
ప్రభుత్వ కాలేజీలు	1	195	94	101	48.2
యూనివర్సిటీలు	20	6,108	5,151	957	84.3
ప్రైవేటు వర్సిటీలు	2	1,367	1,357	10	99.2
ప్రైవేటు కాలేజీలు	149	75,384	70,959	4,425	94.1
మొత్తం	172	83,054	77,561	5,493	93.3

ప్రధాన బ్రాంచీల్లో సీట్ల భర్తీ ఇలా..

బ్రాంచీ	సీట్లు	భర్తీ అయినవి	మిగిలినవి	భర్తీ శాతం
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	28,246	27,657	589	97.91
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	3,960	3,849	111	97.20
సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ)	1,560	1,528	32	97.95
సీఎస్ఈ (డేటా సైన్స్)	7,600	7,295	305	95.99
సీఎస్ఈ (ఏఐఎంఎల్)	13,540	13,093	447	96.70
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ (ఈసీఈ)	10,967	10,099	868	92.09
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ)	4,695	3,519	1,176	74.95
సివిల్ ఇంజనీరింగ్	3,376	2,756	620	81.64
మెకానికల్ ఇంజనీరింగ్	3,230	2,401	829	74.33

సామాజికవర్గం వారీగా సీట్ల కేటాయింపు..

సామాజిక వర్గం	బాలురు	బాలికలు	మొత్తం
జనరల్	8,020	7,450	15,470
బీసీ-ఎ	3,096	2,768	5,864
బీసీ-బి	8,301	7,596	15,897
బీసీ-సి	226	140	366
బీసీ-డి	7,002	6,476	13,478
బీసీ-ఇ	3,811	1,671	5,482
ఎస్సీ-1	250	144	394
ఎస్సీ-2	4,035	3,807	7,842
ఎస్సీ-3	2,482	2,365	4,847
ఎస్టీ	4,701	3,220	7,921
మొత్తం	41,924	35,637	77,561
శాతం	54.1	45.9	

శుక్రవారం హైదరాబాద్ నారాయణగూడలో కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ 85వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులతో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్



కోర్టు ఆదేశాలున్నా కూల్చివేస్తారా?

వివరణ ఇవ్వాలని ఏవీ రంగానాథ్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్ గ్రామంలోని 200 చదరపు గజాల్లోని 480 చదరపు అడుగుల నిర్మాణంపై కోర్టు ఆదేశాలున్నా ఎలా కూల్చివేశారంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగానాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. వివరణ ఇవ్వాలని ఆయన్ను ఆదేశిస్తూ, విచారణ వచ్చే నెల 22కు వాయిదా వేసింది. రంగనాథ్‌తోపాటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిలకు నోటీసులు జారీ చేసింది. తన ఇంటి విషయంలో మున్సిపాలిటీ అధికారులు, హైడ్రా జోక్యం చేసుకొని కూల్చే ప్రయత్నం చేస్తున్నారంటూ వడ్డేతార హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చట్ట ప్రకారం పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వివాదాస్పద నిర్మాణం సున్నం చెరువు ట్యాంక్‌లో ఉందని హైడ్రా వాదనలు వినిపించింది. రెవెన్యూ అధికారుల సాయంతో సర్వే నిర్వహిస్తున్నామని, అది పూర్తయిన తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఈ ఏడాది మార్చిలో ఆదేశాలు జారీ చేశారు. అయినా, కోర్టు ఆదేశాలను పక్కకు పెట్టి తన ఇంటిని కూల్చివేశారంటూ తార ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సున్నం చెరువుపై సర్వే పూర్తి చేసి హద్దులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ణయించాలని, ఆ తర్వాత చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని న్యాయస్థానం చెప్పినా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. జూన్ 30న పిటిషనర్‌ను అరెస్టు చేసి, ఇంటిని కూల్చివేశారని చెప్పారు. కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మాదాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు, ఎస్ఐ వెంకటేశ్.. 70 మందితో జూన్ 30న ఉదయం 4 గంటలకు వచ్చి పిటిషనర్‌తోపాటు కుటుంబ సభ్యులను ఇంటిని నుంచి బయటకు వెళ్లగొట్టారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. దీనిపై వివరణ ఇవ్వాలని ఏవీ రంగానాథ్‌ను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

గోపాలమిత్రల వేతనాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 1484 మంది గోపాలమిత్రలకు ఆరునెలల వేతన బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు రూ.9 కోట్లను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. తమ వేతనాలను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గోపాలమిత్ర సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గోపాలమిత్రలకు అక్టోబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు బకాయి ఉన్న వేతనాలు విడుదలయ్యాయని ఆయన తెలిపారు.

భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీకే గచ్చిబౌలి స్థలాలను కేటాయించాలి

సీఎస్‌కు టీఎన్జీవో కేంద్ర సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని స్థలాలు భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకే చెందుతాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. ఈ స్థలాలను కొందరు ప్రైవేటు వ్యక్తులవంటూ ప్రచారం చేసుకుంటున్నారని, ఈ స్థలాలను కబ్జాలకు పాల్పడే యత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంలో జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు జగదీశ్వర్‌తో పాటు టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు కొండల్ రెడ్డి తదితరులు సీఎస్ కె.రామకృష్ణారావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. దీనిపై సీఎస్ స్పందిస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు.







శుక్రవారం హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం కారణంగా ప్యాట్నీ నగర్‌లో వరదలో చిక్కుకున్న వారిని పడవ ద్వారా తరలిస్తున్న సహాయక సిబ్బంది. ● ఓల్డ్ సిటీలో జలమయమైన రోడ్డు

మూసారాంబాగ్ వద్ద జలమయమైన రహదారి

క్లుప్తంగా...

నేటి నుంచి సెలవులో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్ రామరాజు సెలవుపై విదేశాలకు వెళ్లనున్నారు. ఈనెల 19 నుంచి 25 వరకు ఆయన కుటుంబంతో టాంజానియా, కెన్యా దేశాల్లో పర్యటించనున్నారు. దీంతో సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుకు ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్‌గా ఆదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సముద్ర మత్స్యకారుల గణనకు కేంద్రం శ్రీకారం

సాక్షి, అమరావతి: సముద్ర మత్స్యకారుల గణన 2025కు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం నోడల్ ఏజెన్సీగా కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సీఎంఎఫ్ ఆర్ఐ)ను నియమించింది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద దేశంలో తొలిసారి సముద్ర మత్స్యకారులు, గ్రామాల గణన ధ్రువీకరణను జియో రిఫరెన్సింగ్‌తో చేపడుతున్నారు. తీర రాష్ట్రాలతో పాటు ఐలాండ్‌లలో నివసించే సముద్ర మత్స్యకారుల గణన కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 3,500 గ్రామాల్లో సుమారు 12 లక్షల మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నట్లు అంచనా.

'ఎయిడెడ్'కు ఎస్ఎంఎఫ్ ఇవ్వాలి

సాక్షి, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలలకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్ టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్(ఎస్ఎంఎఫ్) విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో విద్యాశాఖను కోరింది. ప్రభుత్వ, జెడ్పీ స్కూళ్లకు నిధులు, మెటీరియల్ ఇచ్చిన ప్రభుత్వం ఎయిడెడ్‌ను విస్మరించిందని గిల్డ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం నుంచి రూ.2 వేలు మొత్తాన్ని పాఠశాల మెయింటెనెన్స్ కింద ప్రభుత్వం తగ్గించిందని, ఆ నిధులను ఎయిడెడ్ పాఠశాలలకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఎస్ఎస్ఆర్ పోటీల్లో అగ్రస్థానం సాధించిన ఏపీ ఎస్డీఆర్ఎఫ్

సాక్షి, అమరావతి : దక్షిణ భారత స్థాయి సీఎస్ ఎస్ఆర్ పోటీల్లో రాష్ట్ర ఎస్డీఆర్ఎఫ్ బృందం ప్రథమ స్థానం సాధించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన పోటీల్లో ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్‌లకు చెందిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. అందులో 19 మంది సభ్యులతో కూడిన ఏపీ ఎస్డీఆర్ఎఫ్ బృందం మొదటి స్థానంలో నిలిచింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీఎస్ఎస్ఆర్ పోటీలకు ఈ బృందం ఎంపికై ంది. రాష్ట్ర ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ

- రాత్రిపూట ప్రత్యేక తరగతులు.. ఉదయం పరీక్ష

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుకుంటున్న పేద బాలికల ప్రగతికి సమగ్రశిక్ష రాష్ట్ర విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా టెన్త్, ఇంటర్మీడియట్ చదువుతున్న వారిలో 100 శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికను అమలుచేస్తున్నట్లు కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఇందుకోసం రాత్రి భోజనం అనంతరం విద్యార్థినులకు రెండున్నర గంటలపాటు స్టడీ అవర్ నిర్వహిస్తున్నామని.. ఇలా రాత్రి చదివిన పాఠ్యాంశాలపై ఉదయం పరీక్ష పెట్టి, వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు వారంలో అయిదు రోజులు, 6–9 తరగతులకు రోజు విడిచి రోజు ఉదయం పూట పరీక్ష ఉంటుందని.. పబ్లిక్ పరీక్షలకు 100 రోజుల ముందు వరకు ఇదే ప్రణాళిక అమలుచేస్తామని.. తర్వాత 100 రోజుల ప్రణాళిక ప్రారంభిస్తామని దేవానందరెడ్డి వివరించారు.

అక్టోబర్ 2 నాటికి చెత్త డంపులన్నీ తొలగిస్తాం

మంత్రి నారాయణ

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిందని, ఇప్పటికే 55 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, ఈ ఏడాది అక్టోబర్ 2 కల్లా డంపులన్నీ క్లియర్ చేస్తామని రాష్ట్ర మంత్రి పి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన అనంతపురంలోని గుత్తి రోడ్డు కంపోస్టు యార్డులో రూ.12.21 కోట్లతో బయో రెమిడేషన్, బయోమైనింగ్ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. బయో మైనింగ్ ద్వారా చెత్త నిర్వహణను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..రెండేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి కేంద్రం తన వాటా ఇచ్చిన రోజునే రాష్ట్ర వాటాను కలిపి అందిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పట్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సాధ్యపడదన్నారు.

లేసు.. భేష్

- అల్లికల్లో రాణిస్తున్న పశ్చిమ మహిళలు
- కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డు సాధించిన నరసాపురం లేసులు
- ఇప్పటికే భౌగోళిక గుర్తింపుతో ఖండాంతర ఖ్యాతి
- గత ఏడాది ఒలింపిక్స్‌లోనూ మెరిసిన మన లేసులు
- లేసు పరిశ్రమకు ఊపిరిలూదిన మాజీ సీఎం వైఎస్సార్
- 2004లో లేసు పార్కు ఏర్పాటు


లేసులతో తయారుచేసిన ఫొటో ఫ్రేమ్



సీతారాంపురంలో దివంగత వైఎస్ హయాంలో ఏర్పాటుచేసిన లేసు పార్క్

అబ్బురపర్చే అల్లికలతో పశ్చిమగోదావరి జిల్లా అతివలు అవార్డుల మోత మోగిస్తున్నారు. ఔరా అనిపించే హ్యాండ్ మేడ్ ఉత్పత్తులతో ఇప్పటికే నరసాపురం లేసుకు భౌగోళిక గుర్తింపు తెచ్చారు. గత ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్ క్రీడా సంగ్రామంలో మన లేసులను మెరిపించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డును సాధించారు.

సాక్షి, భీమవరం: హస్తకళల్లో లేసు అల్లికలు ముఖ్యమైనవి. ఇక్కడి మహిళలు సూది మొనకు దారం తగిలించి అలవోకగా అల్లికలు చేస్తుంటారు. బ్రిటిష్ హయాంలో జల రవాణాకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం కేంద్రంగా ఉండేది. అప్పట్లో క్రిస్టియన్ మిషనరీ సంస్థల ద్వారా పరిచయమైన లేసు అల్లికలను తర్వాతి కాలంలో ఈ ప్రాంతానికి భౌగోళిక గుర్తింపు తెచ్చే స్థాయికి ఇక్కడి మహిళలు అభివృద్ధి చేశారు. టవల్స్, టేబుల్ క్లాత్స్, లంచ్ మ్యాట్స్, క్రోచెట్ బ్యాగ్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్ తదితర ఇక్కడి హ్యాండ్ మేడ్ ఉత్పత్తులకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. వీటిని అమెరికా, యూరప్, సింగపూర్, కొరియా తదితర దేశాలకు ఎగుమతులు చేసే కంపెనీలు నరసాపురం, పరిసరాల్లో 50కు పైగా ఉన్నాయి. దేశ విదేశాల్లో జరిగే ఎక్స్‌పోలు, డిజైనర్లు, థర్డ్ పార్టీల ద్వారా ఆర్డర్లు తీసుకుని ఎగుమతులు చేస్తుంటారు. గతంలో ఏటా రూ.300 కోట్లు మేర లేసు ఉత్పత్తులు ఎగుమతులు జరిగేవి.

అండగా నిలిచిన వైఎస్సార్

స్థానిక మహిళలు పొద్దు పొడవక ముందే లేచి ఇంటి పనులు, వంట ముగించుకుని, పిల్లలను స్కూళ్లకు, భర్తను పనికి పంపి అల్లికల పనిలో పడతారు. నలుగురైదుగురు కలసి టీవీ చూస్తున్నా, కబుర్లు చెప్పుకుంటున్నా వారి చేతిలో సూది, దారం కదులుతూనే ఉంటాయి. ఒక మహిళ రోజులో ఐదారు గంటలు పనిచేస్తే కేజీ దారం అల్లికకు పది రోజుల పడుతుంది. డిజైన్‌ను బట్టి కేజీకి గతంలో రూ.15 నుంచి రూ. 50 మాత్రమే వారికి కంపెనీలు ఇచ్చేవి. దళారుల దోపిడీని గుర్తించిన దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మహిళలకు అండగా 2004లో నరసాపురం రూరల్ సీతారాంపురంలో లేసు పార్కును ఏర్పాటుచేశారు. కేజీ దారం అల్లికకు ఒక్కసారిగా రూ.100 పెంచారు. దీనికి సమానంగా ప్రైవేట్ కంపెనీలు వేతనాన్ని పెంచాయి. మొదట్లో లేసు పార్కు పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన 10 వేల మంది సభ్యులు ఉంటే తర్వాతి కాలంలో ఈ సంఖ్య 15 మండలాల్లోని 30 వేల మందికి పెరిగింది. మార్కెటింగ్ మేనేజర్, ఇతర సిబ్బంది ఆర్డర్లు తెచ్చి మహిళలతో అల్లికలు చేయించడం ద్వారా అప్పట్లో ఏడాదికి రూ.100 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతులు జరిగేవి. ఈ పార్క్ ద్వారా గతంలో స్థానిక మహిళలు అమెరికా, యూరప్, సింగపూర్ తదితర దేశాలకు వెళ్లి లేసు ఉత్పత్తులను ప్రదర్శించడం గమనార్హం. యాంత్రీకరణ, ఇతర దేశాల నుంచి పోటీ, కోవిడ్ పరిణామాల అనంతరం లేసు పరిశ్రమ ప్రాభవం కోల్పోయి ఎగుమతులు తగ్గినా ఏడాది క్రితం భౌగోళిక గుర్తింపు దక్కించుకుని సత్తాను చాటింది. పారిస్ వేదికగా గత ఏడాది 206 దేశాలు పాల్గొన్న ఒలింపిక్స్ పోటీల్లో ఇక్కడి లేసు ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకుల ఆర్డరుపై సీతారాంపురానికి చెందిన సంస్థ క్రీడాకారులు, సందర్శకుల కోసం లేస్, ఫ్యాబ్రిక్‌లను ఉపయోగించి ఒలింపిక్స్ థీమ్, లోగోలతో టవల్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్ తదితర ఉత్పత్తులను భారీ మొత్తంలో పంపింది.


వివిధ రకాల డిజైన్లలో లేసుతో తయారుచేసిన దుస్తులు

ఆనందంగా ఉంది



చిన్నతనం నుంచి ఇంట్లో అమ్మ, నానమ్మలను చూసి లేసులు అల్లడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికీ రోజూ ఖాళీ సమయంలో అల్లికలు చేస్తుంటాం. వీటిపై వచ్చే డబ్బులు ఇంటిలోని చిన్నచిన్న అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయి. లేసు అల్లికలకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది.

– రాట్నాల లక్ష్మి, గృహిణి, ఎల్‌బీ చర్ల

తరతరాలుగా అల్లికలు



మా చిన్నతనంతో పోలిస్తే ఇప్పుడు లేసులు అల్లేవారు కొంత తగ్గారని చెప్పవచ్చు. అప్పట్లో ఏ ఇంటి వద్ద చూసిన ఆడవాళ్లు అల్లికలు చేస్తూ కనిపించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పటితరం వారు రకారకాల డిజైన్లలో అల్లికలు చేస్తూ జిల్లాకు దేశ విదేశాల్లో మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయం.

– తెలగంశెట్టి వెంకటలక్ష్మి, నరసాపురం


కేంద్ర మంత్రి పియూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి(ఫైల్)

ఒక జిల్లా.. ఒక ఉత్పత్తికి ఎంపిక

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల మంది మహిళలు లేసు అల్లికలు చేస్తున్నారు. 2024–25కి గాను నరసాపురం లేసుకు కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా–ఒక ఉత్పత్తి అవార్డు దక్కింది. కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అల్లికలు చేసే మహిళలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.


లేసులతో తయారుచేసిన ఫొటో ఫ్రేమ్

ఫారెన్ మెడి'కల్‌వరం'



కూటమి సర్కారు పాపం.. యువ వైద్యులకు పెను శాపం

- గతేడాది ప్రభుత్వం మారిన వెంటనే అప్పటి మెడికల్ కౌన్సిల్ కార్యవర్గం రాజీనామా
- 10 నెలలపాటు కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయని ప్రభుత్వం
- ఈ ఏడాది మార్చిలో తాత్కాలిక కార్యవర్గం.. మే నెలలో చైర్మన్ ఎంపిక
- గతేడాది జూన్‌లోనే ఎఫ్ఎంజీ మార్గదర్శకాలు సవరించిన ఎన్ఎంసీ
- మెడికల్ కౌన్సిల్ కార్యవర్గం లేక ఆ మార్గదర్శకాలపై నిర్ణయం పెండింగ్
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా చౌక్‌లో కొద్ది రోజులుగా నిరసన చేస్తున్న యువ వైద్యులు

సాక్షి, అమరావతి : వైద్యులు కావాలన్న రాష్ట్ర యువత పాలిట చంద్రబాబు ప్రభుత్వ పాలన పెను శాపంగా మారింది. ఏడాది పాలనలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టడం కోసం మన విద్యార్థుల వైద్య విద్య కలను ఛిద్రం చేశారు. మరోవైపు మన దగ్గర మెడిసిన్ చదివే అవకాశాలు లేక అప్పులు చేసి విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి శాశ్వత రిజిస్ట్రేషన్(పీఆర్) చేయకుండా కూటమి ప్రభుత్వం యువ వైద్యులను కష్టాల పాలు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పీఆర్ కోసం ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (ఎఫ్ఎంజీ) ఎదుర్కొంటున్న కష్టాలు, అవమానాలకు బాబు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని తేటతెల్లం అవుతోంది. గతేడాది ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పీపీపీలో వైద్య రంగాన్ని అస్మదీయుల చేతుల్లో పెట్టడంపై పెట్టిన శ్రద్ధలో ఒకటో వంతు కూడా ఏపీ మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసీ)పై చంద్రబాబు పెట్టలేదు. ఒకవేళ పెట్టి ఉంటే రోడ్డెక్కి పోరాటాలు చేసి, పోలీసుల దాడులకు గురికావాల్సిన దుస్థితి యువ వైద్యులకు పట్టేదే కాదు. వీరి పోరాటానికి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలిచింది. అయినప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదు. కొద్ది రోజులుగా విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఎఫ్ఎంజీలు నిరసన చేస్తున్నారు.

ఏడాది పాటు కాలయాపన

గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రాజ్యాంగబద్ధమైన విశ్వవిద్యాలయాల వీసీలు మొదలు, అన్ని రకాల నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారికి ఉద్వాసన పలికారు. ఈ క్రమంలో గతేడాది జూన్ 10న అప్పటి ఏపీఎంసీ కార్యవర్గం మొత్తం రాజీనామా చేసింది. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టనేలేదు. ఏకంగా 10 నెలల అనంతరం ఈ ఏడాది మార్చి ఆఖరులో ఆరుగురు వైద్యులతో తాత్కాలిక కార్యవర్గాన్ని నియమించారు. వీరిలో ఎవరు చైర్మన్ అనేది తేల్చడానికి మే వరకూ ప్రభుత్వం సమయం తీసుకుంది. చైర్మన్ హోదాను తమ వారికి కట్టబెట్టేందుకు కూటమిలోని మూడు పార్టీలు పోటీపడ్డాయి. ఎట్టకేలకు మే నెలలో బీజేపీ నాయకుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును చైర్మన్‌గా ఖరారు చేశారు. ఈ లెక్కన పరిశీలిస్తే ఏపీఎంసీకి సుమారు ఏడాది పాటు కార్యవర్గం లేకుండానే పోయింది.

తీర్మానంతో సరిపెట్టేశారు

విదేశాల్లో వైద్య విద్య కోర్సులు చదివిన వారు భారత్‌లో వైద్యులుగా రాణించడానికి ఎన్ఎంసీ 2022 నుంచి పలు దఫాలుగా మార్గదర్శకాల్లో మార్పులు చేస్తూ వస్తోంది. కరోనా/యుద్ధాల కారణంగా వైద్య విద్యలో అవాంతరాలు ఎదుర్కొన్న విద్యార్థులు, కోర్సులు పూర్తి చేయడానికి నిబంధనలు రూపొందించారు. నిబంధనలు మారిన ప్రతిసారి రాష్ట్రాల మెడికల్ కౌన్సిల్స్ కార్యవర్గాలు సవరించిన మార్గదర్శకాలపై తీర్మానాలు చేసి మార్పులకు అనుగుణంగా పీఆర్‌లు జారీ చేయడం దేశ వ్యాప్తంగా కొనసాగుతోంది. కరోనా/యుద్ధం కారణంగా మన దగ్గర నుంచి ఆన్‌లైన్‌లో ఎంబీబీఎస్ చదివిన కాలానికి అనుగుణంగా ఎఫ్ఎంజీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాక దేశంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలని నిబంధన విధించారు. ఈ క్రమంలో ఉత్తీర్ణత సాధించిన అనంతరం 2023 మే నుంచి 2024 మే వరకు గత ప్రభుత్వంలో ఎఫ్ఎంజీల అర్హతను బట్టి ఒకటి, రెండేళ్ల ఇంటర్న్‌షిప్ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం 2024 జూన్ 19న ఇచ్చిన మార్గదర్శకాల్లో మన దేశంలో ఉంటూ చదివిన ఆన్‌లైన్ తరగతులను అక్కడికి వెళ్లి ఆఫ్‌లైన్ మోడ్‌లో పూర్తి చేసినట్లు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు ఆమోదిస్తామని పేర్కొంది. దీని ప్రకారం విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు అక్కడి విశ్వవిద్యాలయాలు జారీ చేసిన కంపల్సరీ రొటేటింగ్ మెడికల్ ఇంటర్న్‌షిప్ శిక్షణ (సీఆర్ఎంఐ) ధ్రువీకరణ పత్రాలను ఏపీఎంసీ ఆమోదించాల్సి ఉంది. కాగా, 2024 జూన్ 10న పాత కార్యవర్గం రాజీనామా చేయడంతో పాటు, అనంతరం వెలువడిన ఎన్ఎంసీ మార్గదర్శకాల అమలుపై స్పష్టత లేకుండా పోయింది. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది అనంతరం ఈ ప్రభుత్వం నియమించిన తాత్కాలిక కార్యవర్గం గతేడాది జూన్ 19 ఎన్ఎంసీ మార్గదర్శకాల అమలు చేయాలని ఇప్పటికే రెండు పర్యాయాలు తీర్మానం చేసిందే కానీ అమలు మాత్రం చేయడం లేదు.

స్టైఫండ్ లేకుండానే..

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ చేసే ఎఫ్ఎంజీలకు స్టైఫండ్ ఇవ్వాలి. రాష్ట్రంలో ఎంబీబీఎస్ తర్వాత హౌస్ సర్జన్‌లకు స్టైఫండ్ నెలకు దాదాపు రూ.26 వేలు ఇస్తున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే ఏడాది, రెండేళ్ల పాటు ఇంటర్న్‌షిప్ చేసిన, చేస్తున్న ఎఫ్ఎంజీలు రూ.3.12 లక్షల నుంచి రూ.6.24 లక్షల మేర నష్టపోతున్నారు. తాము స్టైఫండ్ కోరుకోవడం లేదని, పీఆర్ మంజూరు చేస్తే చాలు మహాప్రభో అని యువ వైద్యులు కాళ్లా వేళ్ల పడుతున్నా ఏడాది నుంచి బాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఓ వైపు నీట్ పీజీ–2025 పరీక్ష దగ్గర పడుతోంది. పీఆర్ లేకపోతే మంచి ర్యాంక్ సాధించినా, పీజీ సీటు వచ్చే పరిస్థితి ఉండదని, అదే జరిగితే ఇప్పటికే ఒక ఏడాది కోల్పోయి, మరో ఏడాది నష్టపోతామనే ఆందోళనతో ఎఫ్ఎంజీలు పోరాటానికి దిగారు.

గ్రీన్ ఎనర్జీపై జగన్ ముందుచూపు

'స్వచ్ఛ ఇంధనం'లో వైఎస్సార్‌సీపీ హయాం స్వర్ణయుగం

- గత ప్రభుత్వంలోనే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో భేష్ అనిపించుకున్న ఏపీ
- దాదాపు 10–15 బిలియన్ డాలర్ల గ్రీన్ హైడ్రోజన్ వ్యాపారం చెయ్యొచ్చని అప్పుడే అంచనా
- అందుకు తగ్గట్టుగా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీని రూపొందించిన రాష్ట్రం
- రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన ఇంధన సంస్థలు


సాక్షి, అమరావతి : ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులను.. ఇతర దేశాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుర్తించి మన దేశ జాతీయ లక్ష్యాలను ఇతర రాష్ట్రాల కంటే ముందే అందిపుచ్చుకుని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి ఆదర్శనీయంగా నిలుస్తున్నాయి. దేశవ్యాప్తంగా 2050 నాటికి గ్రీన్ హైడ్రోజన్ ఎలక్ట్రోలైజర్ల కోసం 78 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాలున్నాయని ఆసియా సొసైటీ ఇన్‌స్టిట్యూట్ తాజాగా విడుదల చేసిన గ్రీన్ హైడ్రోజన్ ఫర్ డీకార్బనైజింగ్ ఆసియాస్ ఇండస్ట్రియల్ జెయింట్స్' నివేదిక సైతం అదే విషయాన్ని వెల్లడించింది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించేందుకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్, అందుకు అనుగుణంగా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీని రూపొందించారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) వంటి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రం అప్పుడే అందిపుచ్చుకుంది. రాష్ట్రంలో 10–15 బిలియన్ డాలర్ల మేర గ్రీన్ హైడ్రోజన్ ఇన్వెస్ట్‌మెంట్‌కు అవకాశాలున్నాయని ఇంధన శాఖ గత ప్రభుత్వ హయాంలోనే అంచనా వేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు జగన్ ఆలోచనలకు తగ్గట్లుగా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యతపై ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. ప్రజలకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించి, భవిష్యత్తులో సొంతంగా హైడ్రోజన్ కార్లు, రైళ్లు రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా తయారుచేసేలా ప్రణాళికలు రచిస్తున్నాయి.

గ్రీన్ హైడ్రోజన్‌కు అనుకూలంగా ఏపీ..

ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేయడానికి, రాష్ట్ర అవసరాల కోసం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటుచేసేందుకు రాష్ట్రం అనుకూలంగా ఉంది. ఇక్కడ ఏటా 400 కిలో టన్నుల దేశీయ హైడ్రోజన్ డిమాండ్ ఉంది. 2030 నాటికి కనీసం 500 కిలో టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఇందుకోసం యాక్సిలరేటింగ్ స్మార్ట్ పవర్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్ ఇండియా (ఆస్పైర్) ప్రోగ్రామ్ కింద ఫారిన్, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ సాయంతో ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాల నివేదికను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధంచేసింది. ఫలితంగా.. ఏపీలో కేంద్ర సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. విశాఖలో దాదాపు 1,200 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గ్రీడ్ హైడ్రోజన్ హబ్‌ను ఏర్పాటుచేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ ముందుకొచ్చి గత ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. 1,200 ఎకరాల్లో రోజుకి 1,200 టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ హబ్ ఏర్పాటుకు ఎన్టీపీసీ సంసిద్ధత వ్యక్తంచేసింది.

నాటి సీఎం నిర్ణయాలే ఆదర్శం..

ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళలో ఐదు జాతీయ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇది గత ప్రభుత్వ హయాంలో ఏపీకి దక్కిన అరుదైన గుర్తింపు. ఈ హబ్‌లను 25 గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు క్లస్టర్లుగా విభజించి గ్రీన్ హైడ్రోజన్‌ను వివిధ రంగాలకు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించింది. పునరుత్పాదక విద్యుత్‌తో పాటు, ఇంధన సామర్థ్యం, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో మన రాష్ట్రం వైఎస్సార్‌సీపీ పాలనలో అగ్రస్థానంలో దూసుకెళ్లిందనడానికి పలు నివేదికలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ పంప్డ్ స్టోరేజ్ పవర్ (పీఎస్పీ) ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా తీసుకొచ్చిన ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ పాలసీ–2020, ఏపీ పంప్డ్ స్టోరేజీ ప్రమోషన్ పాలసీ–2022, ఏపీ గ్రీన్ ఎనర్జీ అండ్ గ్రీన్ అమ్మోనియా ప్రమోషన్ పాలసీ–2023 వంటి పాలసీలే ఇప్పటి కూటమి ప్రభుత్వానికి మార్గదర్శకాలయ్యాయి.



బాలికపై వృద్ధుడు లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



నూజివీడు: మనవరాలి వయసుండే పదకొండేళ్ల బాలికపై ఓ వృద్ధుడు కామంతో కళ్లు మూసుకుపోయి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లాకు చెందిన బాలిక (11)పై ఆమె ఇంటి పక్కనే నివాసముండే గజ్జల నాగమల్లేశ్వరరావు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనులకు వెళుతుంటారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ వేసవి సెలవుల్లో ఇంటి వద్దే ఉండేవారు. కుమార్తెను గత జూన్ 13న బాలికల హోమ్‌లో చేర్చారు. రెండు రోజుల క్రితం హాస్టల్ వార్డెన్ లలితకుమారి బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి చిన్నారి ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. అయితే బాలిక తల్లిదండ్రులకు హాస్టల్‌కు వెళ్లడం కుదరలేదు. దీంతో వార్డెన్ లలితకుమారి బాలికను సముదాయించి అడగ్గా... తమ ఇంటి పక్కన ఉండే గజ్జల నాగమల్లేశ్వరరావు తాత తనపై నాలుగు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. దీంతో వార్డెన్ వెంటనే ఈ విషయాన్ని బాలిక తల్లికి తెలియజేశారు. ఆమె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ జ్యోతిబసు శుక్రవారం కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

• ఫొటో చెప్పిన కథ



వాన వస్తే అమ్మ వస్తుంది

స్కూల్ విడిచే సరికి పెద్ద వాన.
అమ్మో... ఎలా వెళ్లడం. ఇంటికి వెళ్లగలనా?
కాని ఏం భయం. అమ్మ ఉంటుందిగా.
వాన వస్తే రాకుండా వుంటుందా.
తన బిడ్డ ఎక్కడ తడిసిపోతుందోనని
గొడుగు తీసుకొని వచ్చేస్తుంది.
తడవకుండా ఇంటికి తీసుకెళుతుంది.
అమ్మకు మించిన ఫ్రెండ్ ఉందా.
అమ్మ... థ్యాంక్యూ.

• జీనియస్

క్విజ్ క్వీన్



క్విజ్‌లో పాల్గొనడం, గెలవడం అందరికీ రాదు. దానికి మంచి జ్ఞాపకశక్తి ఉండాలి. వేగంగా ఆలోచించగలగాలి. అలాంటి బుర్ర కలిగిన అమ్మాయి జివానా రాజీవ్ లూత్రా. ఆమెది భారతదేశం. కానీ తల్లిదండ్రులతోపాటు అమెరికాలో స్థిరపడింది. అక్కడే అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధించింది.

చిన్ననాటి నుంచి రకరకాల అంశాల మీద ఇష్టం కలిగిన జివానా వాటి గురించి పరిశోధనలు చేస్తూ ఉండేది. ఆమెకు తల్లి రష్మి లూత్రా సహకారం అందించి ప్రోత్సహించేది. దీంతో ఏడో తరగతి నుంచి రకరకాల క్విజ్ పోటీల్లో పాల్గొనడం ప్రారంభించింది. నిరంతర సాధన కారణంగా పోటీల్లో ముందంజలో నిలిచి పతకాలు అందుకుంది. ఈ క్రమంలో అమెరికన్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ఆమెకు కీలకఘట్టంగా మారింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన విద్యార్థులు ఆ వేదిక మీద తమ ప్రతిభ చూపుతారు. వారందరిలోకీ ఉత్తమ ప్రదర్శన అందించడం అంత సులభమైన సంగతి కాదు. అక్కడ గ్లోబల్ కాంస్య పతకం అందుకుంది జివానా. దీంతో పాటు అంతర్జాతీయ కెమిస్ట్రీ క్విజ్ మొదటి బహుమతి, జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో అనేక ప్రశంసలను అందుకుంది. 2024లో అమెరికాలోని ఐజీసీఎస్‌ఈ (ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) నిర్వహించిన గణిత విభాగం పోటీల్లో 'టాప్ ఇన్ ది వరల్డ్' అవార్డు గెలుచుకుంది. అంతర్జాతీయ సైన్స్ పోటీలోనూ ప్రతిభ చూపింది.

స్కూల్ మ్యాగజైన్ ఎడిటర్‌గా, డ్రామా క్లబ్ డైరెక్టర్‌గా, బ్రెయిన్ పల్స్ పాడ్‌కాస్ట్ హోస్ట్‌గా పలు బాధ్యతలు నిర్వహిస్తోంది. జివానా కల న్యూరాలజిస్ట్ కావడం. అందుకోసం ఇప్పటినుంచి దీక్షతో చదువుతోంది. అందుకు ఆమె కుటుంబసభ్యుల ప్రోత్సాహం ఉంది. తను అనుకున్నది తప్పక సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది జివానా.

• యంగ్ ఆర్టిస్ట్స్...

ఈ వేదిక వారి కోసమే

చాలామంది బాలబాలికలకు ప్రముఖ వేదికలపై నటించాలని ఉంటుంది. తమకు వచ్చిన కళను ప్రదర్శించాలని, చక్కగా డ్యాన్స్ చేయాలని ఉంటుంది. అయితే అందుకు తగ్గ శిక్షణ అవసరం. అలా వారికి శిక్షణ ఇచ్చే సంస్థలు చాలా తక్కువగా ఉంటాయి. వాటిలో చేరాలంటే చాలా పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించాలనే భయంతో చాలామంది ఆసక్తి చూపించరు. తమ అభిరుచిని అలాగే దాచేసుకుంటారు. అలాంటి వారి కోసమే అమెరికాలో 'యంగ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ అమెరికా' అనే సంస్థ పనిచేస్తోంది.

రోలాండో, క్రిస్టోఫర్ సాన్జ్ అనే ఇద్దరు అన్నదమ్ములు సంగీత కళాకారులు. వారిద్దరూ ఒక కచేరీ చేయాలని నిర్ణయించుకున్నారు. తమ పనుల కోసం వారు విద్యార్థులను నియమించుకుని చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఆ ప్రదర్శన విజయవంతమైంది. దీంతో తమ తర్వాతి ప్రదర్శనల్లోనూ విద్యార్థులను భాగంగా మార్చాలని, వారికి మరింత శిక్షణ ఇస్తే గొప్ప కళాకారులుగా మారతారని భావించారు. అలా 2011లో 'యంగ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ అమెరికా' సంస్థను ప్రారంభించారు. ఇందులో చెల్లించాల్సిన ఫీజు కూడా చాలా నామమాత్రంగా పెట్టారు. ఫీజులో రాయితీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇక్కడ ప్రధానంగా నృత్యం, సంగీతం, నాటకం విభాగాల్లో శిక్షణ అందిస్తారు. ఇతర సంస్థల్లో ఉండే నిబంధనలు ఇక్కడ ఉండవు. వివిధ వయసులవారు ఇక్కడ చేరొచ్చు. వారు ప్రయోగాలు చేయడానికి, అనుకున్నది చెప్పడానికి 'యంగ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ అమెరికా' అవకాశం కల్పిస్తుంది. వారికి శిక్షణ అందించేందుకు అనుభవం కలిగిన మాస్టర్లు ఉంటారు. నిత్యం ఇక్కడ వందలాది మంది చిన్నారులు శిక్షణ పొందుతుంటారు.

'యంగ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ అమెరికా' శిక్షణ మాత్రమే కాదు, తమతో కలిసి ప్రదర్శన ఇచ్చే అవకాశం కూడా కల్పిస్తుంది. ఎవరైనా వారితో కలిసి ప్రదర్శన ఇవ్వాలనుకున్నా వారిని ఆహ్వానిస్తుంది. అలా ఇప్పటికి అనేక వేదికలపై వారు ప్రదర్శనలు ఇచ్చి ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు. వారి ప్రదర్శనలను యూట్యూబ్‌లో చూడొచ్చు. రోజూ శిక్షణకు రాలేనివారికోసం వేసవిలో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారి ఇక్కడికి వచ్చినవారికి కళ పట్ల మమకారాన్ని, అభిమానాన్ని పెంచి, వారిని ఉన్నతమైన కళాకారులుగా తయారు చేయడం తమ లక్ష్యం అంటుంది 'యంగ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ అమెరికా'.



• వండర్ వరల్డ్

సముద్రం లోపల జలపాతం



పిల్లలూ. మనకు జలపాతాలు ఎక్కడ కనిపిస్తాయి? పెద్ద పెద్ద పర్వతాల నుండి జాలువారుతూనో, చిన్నపాటి మెరక నుండి పల్లానికి దిగుతూనో దర్శనమిస్తాయి. కానీ మీరెప్పుడైనా సముద్రం లోపల వాటర్ ఫాల్‌ని చూశారా? అదెలా... అసాధ్యం కదా అనుకుంటున్నారా? ప్రకృతికి అన్నీ సాధ్యమే! మారిషస్ ద్వీపంలోని మోర్న్ బ్రాబాంట్ ప్రాంతపు సముద్రంలో ఏర్పడే ఒక అద్భుతమైన సహజ దృశ్యమే ఈ సముద్రపు జలపాతం. ఇది నీటి ఉపరితలంపై కనిపించే సాధారణ జలపాతం కాదు. సముద్ర గర్భంలో జరిగే ఒక ప్రత్యేక భౌగోళిక ప్రక్రియ.


ఎలా ఏర్పడుతుంది?

ఇది సముద్రం లోపల ఉన్న భౌగోళిక నిర్మాణం మరియు నీటి సాంద్రతలో తేడాల వల్ల ఏర్పడుతుంది. మారిషస్ వద్ద, సముద్ర భాగంలో ఒక పెద్ద షెల్ఫ్ (కొండ లాంటి నిర్మాణం) ఉంది. సముద్రపు నీరు ఒక్కసారిగా కొండవద్దకు చేరుకొని ఆ కొండ తాలూకా లోతైన గర్భంలోకి దిగుతుంది. ఈ షెల్ఫ్ మీదుగా సముద్ర ధారలు, ఇసుక లోతైన సముద్రంలోకి జారిపోతాయి. ఈ ప్రవాహం ఒక జలపాతం లాంటి దృశ్యాన్ని సృష్టిస్తుంది. దీన్ని శాస్త్రవేత్తలు ఒక ఆప్టికల్ ఇల్యూషన్ (దృష్టి భ్రమ) గా పరిగణించినప్పటికీ పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు ఇది ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దీన్ని చూసేందుకు వివిధ దేశాల నుండి ఎంతో మంది పర్యాటకులు వస్తుంటారు. ఈ దృశ్యాన్ని మరింతగా అనుభూతి చెందేందుకు సముద్రం మీదుగా హెలికాప్టర్ రైడ్స్ కూడా అందుబాటులో ఉంటాయి.


• పుస్తకాలు

బుద్ధిగా మారిపోయే అల్లరి చీమ కథ

అల్లరి చీమ బుద్ధిగా మారిపోతే? అందర్నీ ఇబ్బంది పెట్టే చీమ అందరికీ సాయం చేసే స్థితికి చేరితే? భలే బాగుందిగా ఈ ఆలోచన. ఈ ఆలోచనతోనే చక్కటి పిల్లల నవల రాశారు రచయిత పుట్టగుంట సురేశ్. ఇందులో చీమ చేసే పనులు, పాలపిట్ట దానికి హితబోధ చేసి మార్చడం, చివర్లో ముగింపు.. అన్నీ ఆసక్తికరంగా సాగుతాయి. అరుదుగా వస్తున్న పిల్లల నవలల్లో ఎన్నదగిన పుస్తకం ఇది.



బానిసత్వం నుంచి బయటపడ్డ చిన్నారులు




అమెరికన్ రచయిత్రి అమీనా లుక్మాన్–డాసన్ 2022 రాసిన పిల్లల నవల ఇది. బానిసత్వం నుండి తప్పించుకున్న ఇద్దరు చిన్నారులు కొత్త జీవితాలను అన్వేషించే క్రమంలో వారు పడ్డ ఇబ్బందులు, వారి చుట్టూ జరిగిన అంశాలే ఈ నవల. ఈ నవల అనేక పురస్కారాలు అందుకుంది. బానిసత్వంలో మగ్గిపోతున్న చిన్నారుల గురించి రాసిన ఉత్తమ నవలల్లో ఇదీ ఒకటిగా నిలిచింది.

• మహనీయులు

విద్యాదాత, సంస్కర్త

భాగ్యరెడ్డి వర్మ

అణగారిన వర్గాల కోసం పాటుపడేవారు ఎందరో ఉంటారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే అటువంటి పని చేసి ఘనత పొందిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ. ఆయన సంఘసంస్కర్త, ఆది ఆంధ్రసభ స్థాపకులు. 1906–1933 మధ్య హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి విద్యాభివృద్ధికి కృషి చేశారు. 1888 మే 22న జన్మించారు భాగయ్య. ఆ తర్వాత కాలంలో ఆయన తన పేరును భాగ్యరెడ్డిగా మార్చుకున్నారు. ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ఇచ్చారు.



భాగ్యరెడ్డి బడికి వెళ్లి చదువుకోలేదు. అయితే ఆయనకు తెలుగు చదవటం, రాయటం వచ్చేది. గోవాకు చెందిన బారిస్టరు దోసా శాంటోస్ ఆయనకు ఆశ్రయమిచ్చారు. అనంతరం విద్యుత్తు శాఖలో వైర్‌మ్యాన్‌గా పనిచేశారు. ఆ తరువాత జీవన్ రక్షామండలికి చెందిన భాగ్యరెడ్డిని ప్రచారకునిగా నియమించి నెలకు రూ.60 జీతం, తిరగటానికి మోటరుసైకిలు ఏర్పాటు చేశారు. 1906లో దళిత బాలబాలికలకు విద్యను నేర్పడం కోసం హైదరాబాదులోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించారు భాగ్యరెడ్డి. 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలు కొనసాగించారు. దీని ఆధ్వర్యంలో రీడింగ్ రూములు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలను నిర్మూలించడం, దేవదాసి, జోగిని వంటి దురాచారాలు నిర్మూలించడం కోసం ఈ సంస్థ పనిచేసేది. 1921లో మన్య సంఘం పేరును 'ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్'గా మార్చారు.

1917లో విజయవాడలో భాగ్యరెడ్డి వర్మ ఆధ్వర్యంలో ఆంధ్ర పంచమ మహాజన సభ 'తొలి ఆది ఆంధ్ర మహాజనసభ'గా మారింది. 1938 వరకు ప్రతి సంవత్సరం ఆది ఆంధ్రమహాసభలు నిర్వహించారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు చేసిన ఆయన 1939లో మరణించారు.

• గుడ్ న్యూస్

వావ్... టీవీలో హ్యారీపాటర్



ఈ బుజ్జి పిల్లాడు ఎంత బాగున్నాడో కదా. వీడే మన హ్యారీపాటర్. ఇంతకు మునుపు సినిమాగా వచ్చిన హ్యారీపాటర్ ఇంటింటి ప్రేక్షకుల కోసం టీవీ సిరీస్‌గా రానున్నాడు. హెచ్‌బిఓలో. షూటింగ్ మొదలయ్యింది. 2027 నాటికి సిరీస్ రెడీ అయ్యి ప్రసారం అవుతుంది. ఈ బుజ్జినటుడి పేరు డొమినిక్ మెక్‌లాగ్లిన్. స్కాట్‌లాండ్ దేశస్థుడు. జె.కె.రౌలింగ్ రాసిన హ్యారీ పాటర్ సిరీస్‌లోని పిల్లాడులానే ఉన్నాడు కదూ. అన్నట్టు సినిమాలో యాక్ట్ చేసిన హ్యారీపాటర్ పేరు మీరు చెప్పగలరా?

రాజు... చెప్పలు కుట్టేవాడు





కుంతల రాజ్యాన్ని పరిపాలించే రాజు మాధవవర్మ వీరుడు, దానకర్ణుడు. అయితే కీర్తికాంక్ష చాలా ఎక్కువ. అందరూ తన ఘనతల్ని పొగడాలని, భయంతో గౌరవించాలని భావించేవాడు. మాధవవర్మ అప్పుడప్పుడూ రాజ్యసంచారం చేసేవాడు. తన రథం ముందుకు సాగే సమయంలో అందరూ తమ తమ పనులు మాని, తనకు ప్రణామాలు చేయాలని ఆదేశించాడు. దీంతో మాధవవర్మ రథంలో ఎప్పుడు వచ్చినా జనాలు పనులు మాని, 'మహారాజుకు జై' అని కీర్తిస్తూ ప్రణామాలు చేసేవారు. దీంతో తనంతవాడు ఈ భూమ్మీద లేరని గర్వంతో పొంగిపోయేవాడు మాధవవర్మ.

ఒకరోజు రాజు రాజ్యసంచారం చేస్తున్న సమయంలో అందరూ ఆయన ముందు మోకరిల్లి ప్రణామాలు చెప్తున్నారు. ఆ సమయంలో మాధవవర్మ దృష్టి దూరంగా ఉన్న ఓ వ్యక్తి మీద పడింది. అతను చెప్పులు కుడుతూ ఉన్నాడు. తన రథం అటుగా వెళ్తున్నా అతను ఏమాత్రం చలించకుండా చెప్పుల మీద దృష్టి నిలిపి పని చేస్తున్నాడు. అది చూసి మాధవవర్మకు కోపం వచ్చింది. అతణ్ని తీసుకురమ్మని భటుల్ని ఆదేశించాడు. వారు ఆ చెప్పులు కుట్టేవాణ్ని తీసుకుని వచ్చారు.

తనను చూసి ఎందుకు నిల్చోలేదని అడిగాడు మాధవవర్మ.

'రాజా! మీరు ఈ రాజ్యానికి రాజు. నేను చెప్పులు కుట్టేవాడిని. మీ పని రాజ్యపాలన. నా పని చెప్పులు కుట్టడం. ఇద్దరం మన పనుల్ని మనం చేస్తున్నాం. నేనెందుకు మీకు ప్రణామాలు చేయాలి?' అని ప్రశ్నించాడు. ఆ సమాధానానికి మాధవవర్మ ఆశ్చర్యపోయాడు.

అతను తన సమాధానం కొనసాగిస్తూ, 'మీరు వచ్చారని నేను పని ఆపితే ఒక జత చెప్పుల తయారీ ఆలస్యమవుతుంది. దాని వల్ల ఒక వ్యక్తి ఇబ్బందిపడతాడు. మీ రాజ్యంలో ఒక వ్యక్తి చెప్పులు లేకుండా ఇబ్బంది పడితే అది మీకు అవమానం కాదా? అలాంటప్పుడు నా పని మానేసి మీకోసం లేవడం, ప్రణామం చేయడం ఎందుకు? నేనే కాదు, ఇక్కడున్న అందరికీ పనులుంటాయి. ఎవరి పనుల్ని వారిని చేసుకోనివ్వడమే కదా రాజ్యసంక్షేమం' అన్నాడు.

ఆ మాటలతో మాధవవర్మ సిగ్గుపడ్డాడు. ఇన్నాళ్లూ తాను చేసిన తప్పు అర్థమైంది. ప్రజల్ని తాను పెడుతున్న ఇబ్బంది అర్థమై ఆనాటి నుంచి పొగడ్తలకూ, ప్రణామాలకూ దూరంగా ఉంటూ రాజ్యపాలన చేపట్టాడు.

బిజినెస్ రీల్

అత్యుత్తమ బ్యాంక్‌గా ఎస్‌బీఐ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా 2025 సంవత్సరానికి గాను గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి 'ప్రపంచంలోనే అత్యుత్తమ కన్జూమర్ బ్యాంక్' గుర్తింపు దక్కించుకుంది. ఈ ఏడాది అక్టోబర్ 18న అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో జరిగే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వార్షిక సదస్సులో ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడమే తమ వృద్ధి వ్యూహానికి కీలకమని శెట్టి తెలిపారు. ఆన్-బోర్డింగ్‌ను సరళతరం చేయడం, ప్రాంతీయ భాషల్లో వాయిస్ బ్యాంకింగ్‌లాంటి కొత్త ఆవిష్కరణలతో 52 కోట్ల పైగా కస్టమర్లకు ప్రపంచ స్థాయి సర్వీసులు అందిస్తున్నామని పేర్కొన్నారు.

పన్ను రిఫండ్ మెయిల్స్ పట్ల జాగ్రత్త

ఆదాయపన్ను శాఖ హెచ్చరిక



న్యూఢిల్లీ: పన్ను రిఫండ్‌లకు సంబంధించి వచ్చే మోసపూరిత ఫిషింగ్ ఈ-మెయిల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పన్ను చెల్లింపుదారులను ఆదాయపన్ను శాఖ హెచ్చరించింది. ఈ పేరుతో వచ్చే అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దని సూచించింది. బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని మెయిల్స్ ద్వారా ఆదాయపన్ను శాఖ ఎప్పుడూ కోరదంటూ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన పోస్ట్‌లో పేర్కొంది. అధికారిక పోర్టల్ incometax.gov.in పైనే పన్ను రిఫండ్ పురోగతి గురించి తెలుసుకోవాలని సూచించింది. ''ఇన్‌కమ్ ట్యాక్స్ రిఫండ్.. తక్షణమే మాన్యువల్ ధ్రువీకరణ అవసరం''అంటూ మెయిల్ వస్తే అది ఫిషింగ్ స్కామ్ కావొచ్చని హెచ్చరించింది.

ఆటోమోటివ్ మిషన్ ప్లాన్‌పై కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ: భారత్‌ను అంతర్జాతీయ ఆటోమోటివ్ దిగ్గజంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆటోమోటివ్ మిషన్ ప్లాన్ 2047 రూపకల్పనపై కసరత్తు జరుగుతున్నట్లు భారీ పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. పర్యావరణహితంగా, కొత్త ఆవిష్కరణలకు తోడ్పాటు అందించే విధంగా ఈ విధానం ఉంటుందని చెప్పారు. ఆటోమోటివ్ రంగం పురోగతి, ఎగుమతుల వృద్ధికి సంబంధించిన లక్ష్యాలు, విధానాలపై చర్చించేందుకు ఏఎంపీ 2047 సబ్ కమిటీలు సమావేశమైనట్లు వివరించారు. 2030, 2037, 2047 మైలురాళ్లను లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర ప్రణాళికను రూపొందించేందుకు ఏడు సబ్-కమిటీలు ఏర్పాటైనట్లు చెప్పారు. వీటిలో ప్రభుత్వం, పరిశ్రమ, విద్యా రంగం నుంచి నిపుణులు ఉన్నారన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	266.35	2.21
BAJFINANCE	941.5	1.97
TATASTEEL	162.5	1.63
HCLTECH	1,549.10	1.12
INDUSINDBK	874	1.03

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
AXISBANK	1,098.70	-5.27
SHRIRAMFIN	645.1	-3.06
BEL	394.6	-2.38
HDFCLIFE	738.45	-1.78
KOTAKBANK	2,132.00	-1.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,995
ఎన్ఎస్ఈ	93,116
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,49,429
ఎఫ్ఐఐ	+ 370
డీఐఐ	+ 2,104

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.30 (రాత్రి 11.30కు)	$ 67.54 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.26 (రాత్రి 11.30కు)	$ 69.52 (క్రితం ముగింపు)

జీసీసీల్లో హైరింగ్ జోరు

- క్యూ1లో 8-10 శాతం అప్
- క్వెస్ కార్ప్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) నియామకాల పరిస్థితి మెరుగుపడింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 3-6 శాతం క్షీణించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మాత్రం 8-10 శాతం హైరింగ్ పెరిగింది. ఏఐ, ప్లాట్‌ఫాం ఇంజినీరింగ్, సైబర్‌సెక్యూరిటీలాంటి విభాగాల్లో నిపుణులకు డిమాండ్ నెలకొంది. స్టాఫింగ్ సేవల సంస్థ క్వెస్ కార్ప్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. అన్ని విభాగాల్లోను పెద్ద సంఖ్యలో రిక్రూట్‌మెంట్ చేపట్టకుండా, దీర్ఘకాలికంగా మరింత విలువను చేకూర్చే, కొత్త ఆవిష్కరణలకు తోడ్పడే నైపుణ్యాలున్న వారినే నియమించుకోవడంపై కంపెనీలు దృష్టి పెడుతున్నట్లు నివేదిక పేర్కొంది. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), తయారీ, ఆటోమోటివ్ .. ఎనర్జీ, టెక్నాలజీ..హార్డ్‌వేర్ లాంటి విభాగాల్లో నియామకాలకు డిమాండ్ నెలకొన్నట్లు వివరించింది. స్మార్ట్ ఫ్యాక్టరీలు, పారిశ్రామిక ఐవోటీ, ఎలక్ట్రిక్ వాహనాల ప్లాట్‌ఫాంలోకి పెట్టుబడుల ప్రవాహం కారణంగా తయారీ, ఆటోమోటివ్, ఎనర్జీ విభాగాల్లో అత్యధికంగా హైరింగ్ డిమాండ్ త్రైమాసికాలవారీగా 31 శాతం మేర పెరిగింది. మొత్తం జీసీసీ మార్కెట్లో 20 శాతం వాటాతో బీఎఫ్ఎస్ఐ గణనీయంగా నియామకాలు చేపట్టింది. ఏఐ ఆధారిత క్రెడిట్ రిస్క్ అనాలిసిస్, సైబర్‌సెక్యూరిటీ నిపుణులకు డిమాండ్ నెలకొనడంతో ఈ విభాగంలో హైరింగ్ త్రైమాసికాలవారీగా 15 శాతం పెరిగింది. మరోవైపు హాస్పిటాలిటీ, ట్రావెల్..లాజిస్టిక్స్ విభాగంలో హైరింగ్ 25 శాతం, నిర్మాణ..ఇంజినీరింగ్ విభాగంలో 15 శాతం తగ్గింది.

నివేదికలో మరిన్ని వివరాలు..

- భౌగోళికంగా చూస్తే ప్రథమ శ్రేణి నగరాల్లో హైరింగ్ గణనీయంగా ఉంది. 29 శాతం మార్కెట్ వాటాతో బెంగళూరు.. జీసీసీ హబ్‌గా కొనసాగుతున్నప్పటికీ, ప్రధాన మెట్రోలతో పోలిస్తే నియామకాల వృద్ధి అత్యంత తక్కువగా 3.20 శాతంగా నమోదైంది. ప్రథమ శ్రేణి నగరాల్లో పుణె (10.60 శాతం), చెన్నై (9.40 శాతం) అత్యధిక వృద్ధి నమోదు చేశాయి. ద్వితీయ శ్రేణి పట్టణాల్లో కూడా రిక్రూట్‌మెంట్‌పరంగా అధిక వృద్ధి నమోదైంది. కోయంబత్తూర్‌లో 34.10 శాతం, కోచిలో 27.60 శాతం, అహ్మదాబాద్‌లో 24.60 శాతం మేర వృద్ధి నమోదైంది.
- ఏఐ, డేటా సైన్స్, ప్లాట్‌పాం ఇంజినీరింగ్ లాంటి విభాగాల్లో హోదాను బట్టి నిపుణుల కొరత 25 శాతం నుంచి 40 శాతం వరకు ఉంటోంది. దీనితో హైరింగ్ ప్రక్రియ నెమ్మదిస్తోంది. అత్యుత్తమ నైపుణ్యాలున్న వారికి మెట్రోల్లో రూ. 50-60 లక్షల స్థాయిలో ప్యాకేజీలు ఉంటున్నాయి.

గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల ప్రక్షాళన!

- దేశీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ధరలే ప్రామాణికం

న్యూఢిల్లీ: బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) నిర్వహణలోని భౌతిక బంగారం, వెండి విలువ మదింపునకు సెబీ నడుం బిగించింది. మరింత పారదర్శకతకు తోడు, స్థానిక మార్కెట్ ధరలకు అనుగుణంగా స్థిరత్వం కోసం కీలక ప్రతిపాదనలు చేసింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) దేశీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించే స్పాట్ ధరలను ఈటీఎఫ్‌ల నిర్వహణలోని బంగారం, వెండి విలువ మదింపునకు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని తన ముసాయిదా నిబంధనల్లో సెబీ పేర్కొంది. ప్రస్తుతం గోల్డ్ ఈటీఎఫ్‌లు తమ నిర్వహణలోని భౌతిక బంగారం విలువ మదింపునకు లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్‌బీఎంఏ) ధరలను అనుసరిస్తున్నాయి. ట్రాయ్ ఔన్స్ బంగారం ధర యూఎస్ డాలర్ల రూపంలో ఉంటుండగా.. మారకం రేటు ఆధారంగా బంగారం, వెండి విలువను నిర్ణయిస్తున్నాయి. సిల్వర్ ఈటీఎఫ్‌లకు సైతం ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఎల్‌బీఎంఏ స్థానంలో దేశీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించే బంగారం, వెండి ధరలను అనుసరించేలా సెబీ ప్రతిపాదించింది. స్పాట్ ధరల విషయంలోనూ పోలింగ్ విధానాన్ని ప్రతిపాదించింది. తద్వారా దేశవ్యాప్తంగా ఒకే బెంచ్‌మార్క్ ఉండేలా చూడనుంది. దీనిపై ఆగస్ట్ 6 వరకు సలహా, సూచనలను అందించాలని సెబీ కోరింది.

భారత్‌లోకి ప్రత్యామ్నాయ పెట్టుబడుల వెల్లువ

పరిశ్రమ నిపుణుల అంచనా



కోల్‌కతా: దేశీయంగా ప్రత్యామ్నాయ పెట్టుబడుల మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. ఈక్విటీలతో పోలిస్తే తక్కువ రిస్కులు, ఒడిదుడుకులతో అత్యధిక రాబడులను కోరుకునే ఫ్యామిలీ ఆఫీస్‌లు, కార్పొరేట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు వీటి వైపు మొగ్గు చూపుతున్నట్లు పరిశ్రమ నిపుణులు తెలిపారు. దీనితో ఈ విభాగంలోకి గణనీయంగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంచర్ క్యాపిటల్, హెడ్జ్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, కమోడిటీల్లాంటివి ప్రత్యామ్నాయ పెట్టుబడుల కేటగిరీలోకి వస్తాయి. 2025 మార్చి నాటికి ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లోకి (ఏఐఎఫ్) రూ. 13.5 లక్షల కోట్ల పెట్టుబడులు హామీలు వచ్చినట్లు ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హోల్-టైమ్ సభ్యుడు అనంత నారాయణ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ. 1.7 లక్షల కోట్లు అధికమని వివరించారు. గత అయిదేళ్లుగా చూస్తే ఏఐఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్ హామీలు, పెట్టుబడులు వార్షికంగా 30 శాతం వృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. భారత్‌లో ఈ విభాగం ఇంకా ప్రాథమిక దశలోనే ఉందన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 25,000-40,000 కోట్లుగా ఉన్న పరిశ్రమ 2027 నాటికి పది రెట్లు పెరిగి రూ. 2 లక్షల కోట్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న అథా గ్రూప్ ప్రెసిడెంట్ విశాల్ విర్లానీ తెలిపారు. సంప్రదాయ ఫిక్స్‌డ్ ఇన్‌కం సాధనాలతో పోలిస్తే అత్యధికంగా 16-18 శాతం ఈల్డ్‌లు అందిస్తూ, ఏఐఎఫ్‌లు ప్రస్తుతం ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ద వెల్త్ కంపెనీకి మ్యూచువల్ ఫండ్స్ లైసెన్స్

సెబీ నుంచి తుది అనుమతి

The Wealth Company

ముంబై: ద వెల్త్ కంపెనీ అస్సెట్ మేనేజ్‌మెంట్ హోల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ (పాంటోమ్యాథ్ గ్రూప్ సంస్థ) మ్యూచువల్ ఫండ్స్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా సెబీ నుంచి తుది ఆమోదం పొందినట్లు ప్రకటించింది. దీంతో రూ.74 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి 'ద వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్' పేరుతో అధికారికంగా ప్రవేశించడానికి మార్గం సుగమం అయినట్లు తెలిపింది. సెబీ నుంచి సర్టిఫికేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఈ నెల 18న మంజూరైనట్లు పేర్కొంది. సాధారణంగా ప్రైవేటు ఈక్విటీ మార్కెట్లో కనిపించే డేటా ఆధారిత పరిశోధన, వినూత్నమైన బోటమ్ అప్ విధానాలను తమ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు అందించనున్నట్లు తెలిపింది.

అదానీ విల్మర్ నుంచి అదానీ గ్రూప్ ఔట్

10.42 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్(గతంలో అదానీ విల్మర్)లో మిగిలిన 10.42 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విక్రయించినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా పేర్కొంది. బీఎస్ఈ బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 275.5 ధరలో 13,54,82,400 షేర్లు అమ్మివేసింది. 11 లావాదేవీల ద్వారా దాదాపు రూ. 3,733 కోట్లకు 10.42 శాతం వాటా విక్రయించింది. వీటిలో ఢిల్లీ సంస్థ షాజాయిటన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎఫ్‌జెడ్‌సీవో 8.52 శాతం వాటాకు సమానమైన 11.07 కోట్ల ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 3,050 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఏడబ్ల్యూఎల్ అగ్రిలో షేర్లు కొనుగోలు చేసిన ఇతర సంస్థలలో క్వాంట్ ఎంఎఫ్, ఐడీఎఫ్‌సీ ఎంఎఫ్, బంధన్ ఎంఎఫ్‌తోపాటు.. జూపిటర్ ఫండ్ మేనేజ్‌మెంట్, మార్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్ తదితరాలున్నాయి.

బీమా సంస్థల ఉల్లంఘనపై సెబీ దృష్టి

ప్యానెల్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం



న్యూఢిల్లీ: బీమా సంస్థలు, మధ్యవర్తులు నిబంధనల ఉల్లంఘనలపై దృష్టి సారించేందుకు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్యానెళ్లను ఏర్పాటు చేసింది. ఐఆర్‌డీఏఐ 132వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. బీమా చట్టం, నియంత్రణపరమైన మార్గదర్శకాలను బీమా కంపెనీలు సరిగ్గా పాటిస్తున్నాయా? ఎక్కడైన ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయా? అన్నది పరిశీలించేందుకు పూర్తికాల సభ్యులతో కూడిన ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు సెబీ ప్రకటించింది. పాలసీలను తప్పుడు మార్గాల్లో విక్రయిస్తుండడం, డేటా లీకేజీ నివేదికల నేపథ్యంలో ఐఆర్‌డీఏఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కివి జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఆర్1 దరఖాస్తుకు సైతం తాజా సమావేశంలో సెబీ ఆమోదం తెలిపింది. దీని తర్వాత ఆర్2, ఆర్3 స్థాయిలోనూ ఆమోదం పొందాల్సి ఉంటుంది.

కొత్త ఆవిష్కరణలపై బెంట్లీ సిస్టమ్స్ దృష్టి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్ సేవలందించే అమెరికన్ సంస్థ బెంట్లీ సిస్టమ్స్ కొత్త ఆవిష్కరణలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఇన్నోవేషన్ డే కార్యక్రమంలో పలు ప్రభుత్వ ఏజెన్సీలు, ఇంజినీరింగ్ సంస్థలు, ఇన్‌ఫ్రా కన్సల్టెన్సీలకు చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు రీజనల్ ఎగ్జిక్యూటివ్ (దక్షిణాసియా) కమలకణ్ణన్ తిరువాది తెలిపారు. రవాణా, నీటి మౌలిక సదుపాయాల నిర్వహణకు సంబంధించిన ఆవిష్కరణలను ఇందులో ప్రదర్శించినట్లు చెప్పారు. హైదరాబాద్ మెట్రో సహా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో పలు సంస్థలకు సేవలందిస్తున్నామని, జల్ జీవన్ మిషన్‌లాంటి ప్రభుత్వ ప్రాజెక్టుల్లోను పాలుపంచుకుంటున్నామని వివరించారు. అలాగే విద్యార్థుల్లో కూడా నైపుణ్యాలను పెంపొందించే దిశగా పలు విద్యా సంస్థలకు తమ డిజిటల్ సాధనాలను ఉచితంగా అందిస్తున్నట్లు తిరువాది చెప్పారు.

అమెరికాతో వాణిజ్య చర్చలు..

వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయమై భారత్ ఎంతో జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సూచించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు భారీగా సబ్సిడీలు ఇస్తున్న వ్యవసాయ రంగం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత్‌లో ఈ రంగంలో సబ్సిడీలు తక్కువగా ఉన్నట్టు చెప్పారు. నియంత్రణల్లేకుండా వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్లోకి వచ్చి పడితే అప్పుడు స్థానిక ఉత్పత్తిదారులకు సమస్యలు మొదలవుతాయన్నారు. భారత వృద్ధి 6-7 శాతం స్థాయిలో స్థిరపడిందంటూ.. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల ఫలితంగా ఒక శాతం లోపు వృద్ధి ప్రభావితం కావొచ్చని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ దీర్ఘకాలంలో భారత్‌కు అనుకూలిస్తుందన్నారు. ఈ మేరకు ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. ''ఉదాహరణకు వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి చెందిన దేశాల నుంచి మరింతంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించొచ్చు. దీనివల్ల మన పాలు, పాల పాడి, చీజ్ తదితర ఉత్పత్తులకు అదనపు విలువ తోడవుతుంది. దీనివల్ల పాల ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారు''అని రాజన్ పేర్కొన్నారు. కనుక ఎంతో జాగ్రత్తగా, తెలివిగా చర్చలు నిర్వహించాలంటూ.. భారత అధికారులు ఈ దిశగానే సంప్రదింపులు నిర్వహిస్తున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజన్ ప్రస్తుతం అమెరికాలోని చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.


భారత్ ముందు అవకాశాలు..

తమ దేశ వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు రాయితీలు ఇవ్వాలంటూ అమెరికా ఎప్పటి నుంచో భారత్‌ను డిమాండ్ చేస్తోంది. తాజా వాణిజ్య ఒప్పందం విషయంలోనూ తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు ద్వారాలు పూర్తిగా తెరవాలంటూ పట్టుబడుతోంది. కానీ, ఈ విషయంలో భారత్ సుముఖంగా లేకపోవడంతోనే వాణిజ్య ఒప్పందం ఆలస్యమవుతుండడం తెలిసిందే. మన దేశంలో కోట్లాది మంది పాడి, సాగు రంగంపై ఆధారపడి ఉండడంతో కేంద్ర సర్కారు ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో రాజన్ సూచనలకు ప్రాధాన్యం ఏర్పడింది. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు పెట్టుబడులు, ఎగుమతులకు నష్టం కలిగిస్తాయని రాజన్ అభిప్రాయపడ్డారు. అదే సమయంలో భారత్ ముందు అవకాశాలు కూడా ఉన్నట్టు చెప్పారు. చైనా, ఇతర ఆసియా దేశాలపై అమెరికా విధించిన టారిఫ్‌లు భారత్ కంటే ఎక్కువగా ఉండడాన్ని ప్రస్తావించారు. కనుక కొంత వరకు తయారీ అవకాశాలు భారత్‌కు రావొచ్చన్నారు. కానీ, అదే సమయంలో అమెరికాకు భారత్ తయారీ ఎగుమతుల గణనీయంగా లేవంటూ.. భారత్‌పై విధించే టారిఫ్‌లు ఎలాంటివి అయినా కొంత వరకు ప్రభావం చూపించొచ్చన్నారు. భారత్‌పై అమెరికా 26 శాతం అదనపు టారిఫ్‌లను (10 శాతం బేసిక్ సుంకానికి అదనం) విధించగా.. వాణిజ్య ఒప్పందానికి వీలుగా ఆగస్ట్ 1 వరకు అమలును వాయిదా వేయడం తెలిసిందే.

క్యూ1 ఫలితాలు

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

రూ. 7,591 కోట్లకు తగ్గిన ఆదాయం



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 2,234 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గడం ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 2,345 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,893 కోట్ల నుంచి రూ. 7,591 కోట్లకు బలహీనపడింది. అమ్మకాల పరిమాణంతోపాటు.. జింక్ ధరలు తగ్గడం ఇందుకు కారణమైనట్లు కంపెనీ వెల్లడించింది. అయితే సిల్వర్ ధరలు, డాలరు బలపడటంసహా ఉపఉత్పత్తుల ధరలు మెరుగుపడటం కొంతమేర ఆదుకున్నట్లు తెలియజేసింది. మొత్తం వ్యయాలు రూ. 5,284 కోట్ల నుంచి రూ. 5,065 కోట్లకు తగ్గాయి. రాజస్తాన్‌లోని దేబారివద్ద 160 కిలో టన్నుల వార్షిక సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న రోస్టర్ రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో ప్రారంభమయ్యే వీలున్నట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. ప్రభుత్వంతో బ్రాండ్ ఫీజు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు యూఎస్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ చేసిన ఆరోపణలను హింద్ జింక్ సీఈవో అరుణ్ మిశ్రా తిరస్కరించారు. కంపెనీలో ప్రమోటర్ వేదాంతా వాటా 61.84 శాతం కాగా.. ప్రభుత్వానికి 27.92 శాతం వాటా ఉంది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు నామమాత్ర నష్టంతో రూ. 436 వద్ద ముగిసింది.

ఐవోబీ లాభం హైజంప్

దిగివచ్చిన మొండి బకాయిలు

Indian Overseas Bank
Good People to Grow with

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 76 శాతం జంప్‌చేసి రూ. 1,111 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 633 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,568 కోట్ల నుంచి రూ. 8,866 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 6,535 కోట్ల నుంచి రూ. 7,386 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం రూ. 1,676 కోట్ల నుంచి రూ. 2,358 కోట్లకు జంప్‌చేసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.89 శాతం నుంచి 1.97 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.51 శాతం నుంచి 0.32 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 17.82 శాతం నుంచి 18.82 శాతానికి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోబీ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 40 వద్ద ముగిసింది.

బంధన్ బ్యాంక్ లాభం క్షీణత

క్యూ1లో రూ. 372 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్(ఐవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 65 శాతం క్షీణించి రూ. 372 కోట్లను తాకింది. మొండి రుణాలు పెరగడం, వడ్డీ ఆదాయం తగ్గడం ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,063 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,082 కోట్ల నుంచి రూ. 6,201 కోట్లకు బలపడింది. అయితే వడ్డీ ఆదాయం రూ. 5,536 కోట్ల నుంచి రూ. 5,476 కోట్లకు నీరసించింది. నికర వడ్డీ ఆదాయం రూ. 2,987 కోట్ల నుంచి రూ. 2,757 కోట్లకు వెనకడుగు వేసింది. నిర్వహణ లాభం సైతం రూ. 1,941 కోట్ల నుంచి రూ. 1,668 కోట్లకు క్షీణించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.23 శాతం నుంచి 4.96 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.15 శాతం నుంచి 1.36 శాతానికి పెరిగాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 523 కోట్ల నుంచి రూ. 1,147 కోట్లకు భారీగా పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో బంధన్ బ్యాంక్ షేరు 1.1 శాతం పుంజుకుని రూ. 187 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ లాభం జూమ్

8.3 లక్షల కోట్లకు ఏయూఎం



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 748 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 604 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 968 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 775 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ నిర్వహణలోని సగటు ఆస్తుల విలువ(ఏయూఎం) రూ. 6.71 లక్షల కోట్ల నుంచి రూ. 8.3 లక్షల కోట్లకు బలపడింది.

జీఎస్‌జీ ఎలక్ట్రానిక్స్ @ రూ. 225-237

ఈ నెల 23-25 మధ్య ఐపీవో

న్యూఢిల్లీ: ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, ట్యాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్లు, సర్వర్లను పునరుద్ధరించే(రీఫర్బిష్‌మెంట్) జీఎస్‌జీ ఎలక్ట్రానిక్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 225-237 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 23న ప్రారంభమై 25న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 22న షేర్లను కేటాయించనుంది. ఐపీవోలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా రూ. 60.4 కోట్ల విలువైన మరో 25.5 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 460 కోట్లకుపైగా సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.



ఇంటర్ కాశీ జట్టు సంబరం (ఫైల్)

చర్చిల్ బ్రదర్స్‌కు కాదు...
ఇంటర్ కాశీకి టైటిల్ ఇవ్వండి
ఐ-లీగ్ చాంపియన్ హోదాలో మార్పు

ఒకవైపు జాతీయ పురుషుల జట్టు ప్రదర్శనపై విమర్శలు... విదేశీ కోచ్‌ల ముందస్తు రాజీనామాలు... ఈ ఏడాది ఇండియన్ సూపర్ లీగ్ జరుగుతుందా లేదా అనే అనుమానాలు... సమాఖ్యలో అంతర్గత కుమ్ములాటలు... వెరసి అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్)కు ఏదీ కలిసి రావడం లేదు. ఐ-లీగ్ విజేత తాజా ఉదంతంతో మరోసారి ఏఐఎఫ్‌ఎఫ్ పరువు పోయింది. తమకు అన్యాయం జరిగిందని ఒక జట్టు వాపోతుండగా... అవేమీ పట్టించుకోకుండా గత ఏప్రిల్‌లో ఏఐఎఫ్‌ఎఫ్ హడావిడిగా బహుమతి ప్రదానోత్సవం ఏర్పాటు చేసి గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్ క్లబ్ జట్టుకు జాతీయ ఐ-లీగ్ 2024-2025 విన్నర్స్ ట్రోఫీ అందజేసింది. ఈ విషయంపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంటర్ కాశీ క్లబ్ గత నెలలో స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్)లో అప్పీలు చేసింది. నెలన్నర రోజుల తర్వాత 'కాస్' తుది తీర్పు వెలువరించింది. ఐ-లీగ్ విజేతగా ఇంటర్ కాశీ జట్టును ప్రకటించాలని స్పష్టం చేసింది.

- గతంలోనే చర్చిల్ బ్రదర్స్‌కు విన్నర్స్ ట్రోఫీ అందజేసిన అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య
- ఏఐఎఫ్‌ఎఫ్ నిర్ణయాన్ని తిరస్కరించిన 'కాస్'
- 'కాస్'లో నామ్‌ధారి ఎఫ్‌సీ కేసులో గెలిచిన ఇంటర్ కాశీ ఎఫ్‌సీ

న్యూఢిల్లీ: దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 'ఐ-లీగ్'లో ఇంటర్ కాశీ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు చాంపియన్‌గా అవతరించింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) నిర్ణయాన్ని స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) తిరస్కరించడంతో ఐ-లీగ్ 2024-25 సీజన్‌లో ఇంటర్ కాశీ జట్టుకు టైటిల్ దక్కింది. ఈ ఏడాది ఏప్రిల్ 6తో ఐ-లీగ్ మ్యాచ్‌లు ముగియగా... సీజన్‌లో 22 మ్యాచ్‌లాడిన చర్చిల్ బ్రదర్స్ 11 విజయాలు, 4 పరాజయాలు, 7 'డ్రా'లతో 40 పాయింట్లు ఖాతాలో వేసుకొని అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఇంటర్ కాశీ జట్టు 22 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 5 పరాజాయలు, 6 'డ్రా'లతో 39 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. అయితే లీగ్ దశలో భాగంగా నామ్‌ధారి జట్టుతో జరిగిన ఓ మ్యాచ్‌లో ఇంటర్ కాశీ జట్టు పరాజయం పాలైంది. అయితే ఆ మ్యాచ్‌లో నామ్‌ధారి జట్టు అర్హత లేని ఆటగాడిని ఆడించిందని ఇంటర్ కాశీ జట్టు ఆరోపించింది. దాన్ని ఏఐఎఫ్‌ఎఫ్ పట్టించుకోకపోవడంతో... వారణాసికి చెందిన ఫుట్‌బాల్ క్లబ్ స్విట్జర్లాండ్‌లోని 'కాస్'లో ఫిర్యాదు చేసింది. దీంతో జోక్యం చేసుకున్న 'కాస్'... ఏఐఎఫ్‌ఎఫ్ నిర్ణయాన్ని తప్పుపడుతూ... ఇంటర్ కాశీ జట్టుకు మూడు పాయింట్లు కేటాయించాల్సిందిగా ఆదేశించింది. దీంతో ఇంటర్ కాశీ జట్టు 42 పాయింట్లతో పట్టిక అగ్రస్థానం దక్కించుకొని 2024-25 సీజన్ చాంపియన్‌గా అవతరించింది. 'అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య ఈ ఏడాది మే 31న జారీ చేసిన నిర్ణయంపై ఇంటర్ కాశీ దాఖలు చేసిన అప్పీలును పరిశీలించాం. భారత సమాఖ్య ఇంటర్ కాశీ జట్టును ఐ-లీగ్ సీజన్ చాంపియన్‌గా ప్రకటించాలని ఆదేశిస్తున్నాం' అని 'కాస్' ప్రకటించింది.

- 2023-24 సీజన్‌లో ఐ-లీగ్‌లో అడుగు పెట్టిన ఇంటర్ కాశీ జట్టు తొలి ప్రయత్నంలో నాలుగో స్థానంలో నిలవగా... ఇప్పుడు రెండో ఏడాది టైటిల్ కైవసం చేసుకోనుంది.
- దేశంలో ఐ-లీగ్ ద్వితీయ శ్రేణి ఫుట్‌బాల్ టోర్నమెంట్ కాగా... ప్రతి ఏటా ఇందులో మెరుగైన ప్రదర్శన కనబరిచిన జట్టు అగ్రశ్రేణి ఫుట్‌బాల్ లీగ్ ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)కు అర్హత సాధిస్తుంది.
- 2025-26 ఐఎస్‌ఎల్ సీజన్‌లో ఐ లీగ్ చాంపియన్ హోదాలో ఇంటర్ కాశీ జట్టు బరిలోకి దిగనుంది. అయితే మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎమ్ఆర్ఏ) గడువు ముగిసిన నేపథ్యంలో ఐఎస్‌ఎల్ తాజా సీజన్ ప్రారంభంపై స్పష్టత లోపించింది.
- 2022-23, 2023-24 సీజన్‌లో ఐ-లీగ్ చాంపియన్‌గా నిలిచిన పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్, మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ జట్లు... ఐఎస్‌ఎల్‌లో బరిలోకి దిగాయి.
- తాజా తీర్పుతో ఐ-లీగ్ పాయింట్ల పట్టికను మార్చాల్సిందిగా ఏఐఎఫ్‌ఎఫ్‌ను 'కాస్'ఆదేశించింది. ఇంటర్ కాశీ జట్టుకు 42 పాయింట్లు కేటాయించి పట్టికలో అగ్రస్థానం ఇవ్వాలని వెల్లడించింది.
- ఆర్బిట్రేషన్ ఖర్చుల్లో 55 శాతం భరించాల్సిందిగా ఏఐఎఫ్‌ఎఫ్‌ను ఆదేశించిన కాస్... చర్చిల్ బ్రదర్స్, నామ్‌ధారి ఎఫ్‌సీ, రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్‌లు 15 శాతం చొప్పున ఖర్చులు భరించాలని ఆదేశించింది. దీంతో ఏఐఎఫ్‌ఎఫ్ 3000 స్విస్ ఫ్రాంక్స్ (దాదాపు రూ. 3,22,275)లు, మిగిలిన మూడు క్లబ్‌లు 1000 స్విస్ ఫ్రాంక్ (దాదాపు రూ. 1,07,413)లు ఇంటర్ కాశీ జట్టుకు చెల్లించాల్సి ఉంటుంది.
- ఈ ఏడాది జనవరి 13న ఇంటర్ కాశీ, నామ్‌ధారి జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌లో నామ్‌ధారి జట్టు 2-0 గోల్స్ తేడాతో నెగ్గింది. అయితే ఆ మ్యాచ్‌లో నామ్‌ధారి క్లబ్ అర్హత లేని ఆటగాడిని బరిలోకి దింపిందని ఇంటర్ కాశీ ఆరోపించింది.
- ఐ-లీగ్‌లో ఆరుగురు విదేశీ ప్లేయర్లను మాత్రమే ఆడించే నిబంధన ఉండగా... నామ్‌ధారి జట్టు ఏడుగురు ఆటగాళ్లతో ఆడిందని నిరూపించడంలో ఇంటర్ కాశీ జట్టు విజయవంతమైంది. దీంతో గత నెల 17న జరిగిన తొలి అప్పీలుతో పాటు... శుక్రవారం జరిగిన మరో విచారణలో సైతం ఇంటర్ కాశీ జట్టు విజయం సాధించింది. ఫలితంగా ఈ సీజన్ చాంపియన్‌గా అవతరించింది.
- ఇంటర్ కాశీ జట్టు ఈ అంశాన్ని 'కాస్' దృష్టికి తీసుకెళ్లినా... భారత ఫుట్‌బాల్ సమాఖ్య మాత్రం అవేవి పట్టించుకోకుండా సీజన్ ముగియగానే పాయింట్ల పట్టిక 'టాప్'లో ఉన్న చర్చిల్ బ్రదర్స్ జట్టుకు ట్రోఫీ బహుకరించింది. అయితే తాజా 'కాస్' నిర్ణయంతో చర్చిల్ బ్రదర్స్ నుంచి ట్రోఫీ వెనక్కి తీసుకొని ఇంటర్ కాశీకి అందివ్వనున్నారు.



ట్రోఫీతో చర్చిల్ బ్రదర్స్ జట్టు (ఫైల్)

ఔరా... ఒలీవియా

- లివర్‌పూల్ మహిళా ఫుట్‌బాలర్ కోసం రూ. 11 కోట్ల 55 లక్షలు చెల్లించిన అర్సెనల్ క్లబ్
- మహిళల ఫుట్‌బాల్ చరిత్రలో ఇదే అత్యధిక బదిలీ మొత్తం



లండన్: మహిళల ఫుట్‌బాల్‌లో ఒలీవియా స్మిత్ కొత్త చరిత్ర సృష్టించింది. కెనడాకు చెందిన ఈ స్టార్ ప్లేయర్ కోసం... ఇంగ్లండ్‌కు చెందిన అర్సెనల్ ఫుట్‌బాల్ క్లబ్ రికార్డు ధర చెల్లించింది. గత సీజన్‌లో లివర్‌పూల్ క్లబ్ కోసం ఆడిన ఒలీవియా వచ్చే నాలుగేళ్లపాటు అర్సెనల్ క్లబ్ తరఫున బరిలోకి దిగుతుంది. ట్రాన్స్‌ఫర్ ఫీజు కింద అర్సెనల్ క్లబ్ 10 లక్షల పౌండ్లను (రూ. 11 కోట్ల 55 లక్షలు) లివర్‌పూల్‌కు చెల్లించింది. మహిళల ఫుట్‌బాల్ చరిత్రలో ఇదే అత్యధిక బదిలీ మొత్తం కాగా... ఈ ఏడాది జనవరిలో అమెరికా ప్లేయర్ నవోమీ గిర్మా కోసం చెల్సీ క్లబ్... సాన్ డియెగో వేవ్ జట్టుకు చెల్లించిన 9 లక్షల పౌండ్ల (రూ. 9 కోట్ల 47 లక్షలు) ధర రెండో స్థానానికి చేరింది. 'ఒలీవియ స్మిత్ ప్రతిభావంతురాలు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగల సత్తా ఆమెలో ఉంది. క్లబ్ అభివృద్ధికి అది దోహదపడుతుంది' అని అర్సెనల్ మహిళల ఫుట్‌బాల్ క్లబ్ డైరెక్టర్ క్లేర్ వీట్లీ తెలిపారు. 15 ఏళ్ల వయసులోనే కెనడా తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసి ఆకట్టుకున్న ఒలీవియా... 2023 సీజన్‌లో స్పోర్టింగ్ లిస్బన్ క్లబ్ తరఫున 28 మ్యాచ్‌ల్లో 16 గోల్స్‌తో మెరిసింది. ఇక గతేడాది లివర్‌పూల్‌కు ప్రాతినిధ్యం వహించిన 20 ఏళ్ల ఒలీవియా 25 మ్యాచ్‌ల్లో 9 గోల్స్ చేసింది. 'ఒలీవియాలో అపార నైపుణ్యం ఉంది. అర్సెనల్ తరఫున ఆమె అద్భుతాలు చేయగలదనే నమ్మకముంది. చిన్న వయసులోనే గత రెండు యూరోపియన్ లీగ్‌ల్లో తన నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుంది' అని అర్సెనల్ హెడ్ కోచ్ రెనీ స్లెగెర్స్ అన్నాడు. 15 సార్లు ఇంగ్లిష్ చాంపియన్‌గా నిలిచిన అర్సెనల్ క్లబ్... గత సీజన్‌లో రెండోసారి చాంపియన్స్ లీగ్ టైటిల్ గెలుచుకుంది. 'ఇది నా కల. అత్యున్నత స్థాయిలో ఇంగ్లండ్, యూరప్ లీగ్‌ల్లో రాణించాలనుకుంటున్నా. అర్సెనల్ జట్టు తరఫున ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. క్లబ్ విజయం కోసం నా వంతు కృషి చేస్తా'అని ఒలీవియా పేర్కొంది.

గతంలో మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లకు పెద్దగా డిమాండ్ లేకపోగా... ఇటీవలి కాలంలో వారి కోసం వెచ్చిస్తున్న మొత్తం భారీగా పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో గిర్మాకు కేటాయించిన ధరే అత్యధికం అనుకుంటే... ఆరు నెలలు తిరిగేసరికి ఒలీవియా ఆ రికార్డును బద్దలు కొట్టింది. పురుషుల విభాగంతో పోల్చుకుంటే ఇది తక్కువే అయినా... మహిళల ఆటకు దక్కుతున్న ఆదరణకు ఈ గణాంకాలు తాజా ఉదాహరణ. పురుషుల ఫుట్‌బాల్‌లో బ్రెజిల్‌కు చెందిన నెమార్ కోసం పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్... 2017లో బార్సిలోనా క్లబ్‌కు 262 మిలియన్ల అమెరికా డాలర్లు (రూ. 2255 కోట్లు) చెల్లించింది. ఫ్రాన్స్ స్టార్ కిలియాన్ ఎంబాపె కోసం పీఎస్‌జీ క్లబ్... 216 మిలియన్ల అమెరికా డాలర్లు (రూ. 1859 కోట్లు) వెచ్చించింది.

న్యూజిలాండ్ రెండో విజయం

- 8 వికెట్ల తేడాతో జింబాబ్వే ఓటమి
- ముక్కోణపు టి20 టోర్నమెంట్

హరారే: ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను ఓడించిన న్యూజిలాండ్... శుక్రవారం జింబాబ్వేపై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన న్యూజిలాండ్ జట్టు 4 పాయింట్లు సాధించి దాదాపు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు సొంతగడ్డపై జరుగుతున్న టోర్నీలో జింబాబ్వే పేలవ ప్రదర్శనతో రెండో పరాజయం మూటగట్టుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. వెస్లీ మధెవెరె (32 బంతుల్లో 36; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ సికందర్ రజా (12) సహా తక్కినవాళ్లు విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 13.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డెవాన్ కాన్వే (40 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... రచిన్ రవీంద్ర (19 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్), డారిల్ మిచెల్ (19 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అతడికి సహకరించారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, మపోసా చెరో వికెట్ పడగొట్టారు. టోర్నీలో భాగంగా ఆదివారం జరగనున్న తదుపరి మ్యాచ్‌లో జింబాబ్వేతో దక్షిణాఫ్రికా తలపడుతుంది.


కాన్వే

త్వరలోనే వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు
ఒలింపిక్స్ క్రికెట్ ఈవెంట్ నియమావళి ఖరారు కోసం ఐసీసీ నిర్ణయం

సింగపూర్: లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, నిబంధనలపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఉన్నతస్థాయి సమావేశం శుక్రవారం ఇక్కడ జరిగింది. విశ్వక్రీడల్లో క్రికెట్ కోసం ఐసీసీ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించింది. ఈ గ్రూప్ సిఫార్సులతోనే ఒలింపిక్స్‌లో క్రికెట్ క్రీడ నియమావళిని ఖరారు చేయాలని ఐసీసీ భావిస్తోంది. శుక్రవారం జరిగిన ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ (సీఈసీ) సమావేశంలో ప్రధానంగా వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుపైనే చర్చ జరిగింది. ఒలింపిక్స్ కోసం ఈ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నప్పటికీ చాన్నాళ్లుగా ఇది పెండింగ్‌లో పడింది. ఇక ఇప్పుడు వేగవంతం చేయాల్సిన అవసరం వచ్చిందని పలువురు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఈసీ, క్రికెట్ బోర్డులు... ఈ రెండింటి నుంచి సభ్యులతో కూడిన వర్కింగ్ గ్రూప్ బృందానికి పలు బాధ్యతలు అప్పగిస్తారు. లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు అర్హత పద్ధతిని ఖరారు చేయడం, ఐసీసీ వర్గాలు, సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని వర్కింగ్ గ్రూప్ పని చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. విశ్వక్రీడల కోసం ర్యాంకింగ్‌తో జట్లను ఖరారు చేయాలా లేదంటే క్వాలిఫయింగ్ టోర్నీని నిర్వహించడం ద్వారా జట్లను ఒలింపిక్స్‌కు పంపించాలా అన్న అంశాన్ని వర్కింగ్ గ్రూప్‌కే వదిలేయాలని ఐసీసీ చైర్మన్ జై షా సూచించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే ఆటగాళ్ల కనీస వయస్సును 15 ఏళ్లుగా ఉంటేనే మంచిదని ఐసీసీ కమిటీ ఇదివరకే సిఫార్సు చేసింది. ఐసీసీ నూతన సీఈఓ సంజోగ్ గుప్తాకూడా 15 ఏళ్ల వయసు ప్రామాణికమేనని బలపరిచారు. ఐసీసీ ఉన్నతస్థాయి సమావేశంలో జై షా, సంజోగ్ సహా పలువురు ఐసీసీ బోర్డు కమిటీల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్ శుభారంభం

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి పోరులో 110-69 పాయింట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. గ్రూప్ 'డి'లో శుక్రవారం జరిగిన టీమ్ ఈవెంట్ మ్యాచ్‌ల్లో భారత్ పది మ్యాచ్‌లు గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో విష్ణు కోడె-రిషిక జోడీ 11-5తో కెనెత్ అరుగొడ-ఇసురి అటనాయకె జంటపై గెలుపొందగా, మహిళల సింగిల్స్‌లో గాయత్రి-మానస రావత్ 11-9తో సితుమి డిసిల్వా-ఇసురి అటనాయకెలపై గెలిచారు. సింగిల్స్‌లో తన్వీ శర్మ 11-7తో సితులి రణసింఘేపై గెలిచింది. మిగతా మ్యాచ్‌ల్లోనూ భారత షట్లర్లే గెలుపొందడంతో గరిష్ట 110 పాయింట్లతో భారత్ జయకేతనం ఎగురవేసింది. శనివారం జరిగే తమ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత బృందం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో తలపడుతుంది.


తన్వీ శర్మ

2036 ఒలింపిక్స్‌లో టాప్-5 లక్ష్యం: అమిత్ షా



న్యూఢిల్లీ: భారత్ 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ విశ్వ క్రీడల నాటికి భారత్ పతకాల పట్టికలో టాప్-5లో నిలవడమే లక్ష్యమని చెప్పారు. ప్రపంచ పోలీస్-ఫైర్ క్రీడల్లో పతకాలతో సత్తా చాటిన భారత బృంద సభ్యులను కేంద్ర మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అమిత్ షా పతక విజేతలకు నజరానా అందజేశారు. అనంతరం మాట్లాడుతూ '2036 విశ్వక్రీడల ఆతిథ్య హక్కులు దక్కించుకునేందుకు ప్రాథమిక బిడ్డింగ్‌లో పాల్గొన్నాం. ఒలింపిక్స్‌ను నిర్వహించే సత్తా భారత్‌కు ఉంది. అలాగే ఈ పోటీల కోసం ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. పతకాలు గెలవగలిగే 3000 మంది ప్రతిభావంతుల్ని గుర్తించి వారికి నెలకు రూ. 50 వేల చొప్పున ఆర్థిక చేయూతతో విశ్వక్రీడలకు దీటుగా తయారుచేస్తాం' అని అన్నారు.

ప్రపంచ స్నూకర్ పోటీలకు శ్రీకాంత్
నేటి నుంచి బహ్రెయిన్‌లో మెగా ఈవెంట్ ● పంకజ్ అద్వానీపై దృష్టి


శ్రీకాంత్


పంకజ్

మనామా (బహ్రెయిన్): ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ క్యూయిస్ట్ గడ్డం శ్రీకాంత్ బరిలోకి దిగనున్నాడు. శనివారం నుంచి బహ్రెయిన్ వేదికగా శనివారం వరల్డ్ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్ ప్రారంభం కానుండగా... ఇందులో భారత్ నుంచి భారీ బృందం పోటీపడుతోంది. మూడు సార్లు ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీ... భారత బృందానికి నేతృత్వం వహిస్తున్నాడు. ఇటీవల ఆసియా టీమ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన భారత బృందం... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. ఈ టోర్నీలో పంకజ్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీ సాధించగా... మన దేశం నుంచి బ్రిజేశ్ దమానీ, ఆదిత్య మెహతా కూడా పాల్గొంటున్నారు. 'ప్రస్తుతం నేను మంచి లయలో ఉన్నా. బిలియర్డ్స్ కన్నా స్నూకర్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నా. ఇదే నిలకడ కొనసాగించాలని భావిస్తున్నా. 6-రెడ్ టోర్నమెంట్ చాలా భిన్నమైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. ఇందులో ఫేవరెట్ అంటూ ఎవరూ ఉండరు. ఇది 10 ఓవర్ల మ్యాచ్ లాంటిది. చిన్న చిన్న క్షణాలు మొత్తం పరిస్థితిని తారుమారు చేయగలవు'అని పంకజ్ అన్నాడు. ఈ టోర్నీలో భారత క్యూయిస్ట్‌లు మూడు విభాగాల్లో పోటీ పడుతున్నారు.

భారత జట్టు: పురుషులు: కమల్ చావ్లా, పారస్ గుప్తా, పుష్పేందర్ సింగ్, మల్‌కీత్ సింగ్, పంకజ్ అద్వానీ, బ్రిజేశ్ దమానీ, ఆదిత్య మెహతా.

మాస్టర్స్: మనన్ చంద్రా, విజయ్ నిచానీ, రిషబ్ జైన్.

అండర్-21: షహ్యాన్ రజ్మీ, మయూర్ గార్గ్, గడ్డం శ్రీకాంత్, మయాంక్ కార్తీక్, ఆరవ్ సంచేతి, భవ్య పిపాలియా, జయాద్ ఆరవ్, రాహుల్ విలియమ్స్, వైభవ్ చద్దా.

సాక్షి ప్లస్
శనివారం : 19-7-2025

ఎగిరే కారు



గోవీ ఎయిర్‌క్యాబ్ కంపెనీకి చెందిన ఎగిరే కారిది. బీజింగ్‌లో జరుగుతున్న మూడో చైనా ఇంటర్నేషనల్ సప్లై చైన్ ఎక్స్‌పో సందర్భంగా శుక్రవారం ఇలా కనువిందు చేసింది

ఎగిరే రోబో డాగ్



ఎక్స్‌పోలో ఎగిరే రోబోడాగ్‌ను పరీక్షగా చూస్తున్న ఓ సందర్శకుడు

ఎగిరే మోటార్



ఎగిరే మోటార్ 'స్కైరైడర్ ఎక్స్1' ముందునుంచి వెళ్తున్న సందర్శకురాలు

గాజా నేలమట్టం

సర్వనాశనం చేస్తున్న ఇజ్రాయెల్ | బూడిద కుప్పలుగా పట్టణాలు

దెయిర్ అల్ బలాహ్: గాజా స్వాధీన ప్రణాళికలను ఇజ్రాయెల్ అత్యంత **కర్కశంగా** అమలు చేస్తోంది. గత మార్చిలో **కాల్పుల** విరమణకు తెర దించిన **నాటి నుంచీ** గాజాపై భారీగా వైమానిక **దాడులకు** దిగుతున్న ఇజ్రాయెల్ అలా **కూలిన భవనా**లను కూడా తాజాగా నేలమట్టం **చేస్తోంది.** దాంతో రెండేళ్ల కిందిదాకా వేలాది **మందితో** కళకళలాడిన పట్టణాలు ఇప్పుడు **బూడిద** కుప్పలుగా మారుతున్నాయి. **ఇజ్రాయెల్** సైనిక నియంత్రణలో ఉన్న పలు ప్రాంతాల్లో భారీ విధ్వంసం జరిగినట్టు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. దాడుల వల్ల ఇప్పటికే దెబ్బతిన్న భవనాలతో పాటు చెక్కు చెదరకుండా ఉన్న అనేక నిర్మాణాలను కూడా ఇజ్రాయెల్ సైన్యం నేలమట్టం చేసి ఆ ప్రాంతాలను పూర్తిగా చదును చేస్తోంది. నివాస భవనాలు, పాఠశాలలు అని లేకుండా అన్నింటినీ వరుసబెట్టి కూల్చేస్తోంది. తాము అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే పనిచేస్తున్నామని ఇజ్రాయెల్ వాదిస్తోంది. ''పౌర ప్రంతాల్లో హమాస్ ఉగ్ర సంస్థ ఆయుధాలను దాచింది. అందుకే వాటిని సైన్యం కూల్చేస్తోంది''అని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) అంటోంది.

కాల్పుల విరమణ తరువాత గాజాలో 40 ప్రదేశాల్లోని మౌలిక సదుపాయాలను ఇజ్రాయెల్ నేలమట్టం చేసింది. ఈజిప్టు సరిహద్దులో రఫా నగరంలో విధ్వంసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రఫాలోని అనేక ప్రాంతాలాను ఇజ్రాయెల్ సైనికులు, కాంట్రాక్టర్లు చదును చేశారు. ఏప్రిల్ నుంచి గాజాలో జరిగిన విధ్వంసంలో అత్యధికం ఈ ప్రాంతంలోనే చోటుచేసుకుంది. భవనాల కింద బాంబులు పెట్టి మరీ పేలుస్తున్నారు. అనంతరం బుల్డోజర్లతో ఆ ప్రాంతాలను పూర్తిగా తుడిచి పెట్టేస్తున్నారు. రఫా నగరంలోనే అత్యంత శక్తివంతమైన ప్రాంతాల్లో ఒకటైన టెల్ అల్ సుల్తాన్‌లో ఓ పాఠశాలను కూల్చేసిన వీడియోను బీబీసీ విడుదల చేసింది. ఆ ప్రాంతం పూర్తిగా దెబ్బతిన్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి.

ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖుజాను సైతం ఇజ్రాయెల్ నేలమట్టం చేసింది. యుద్ధానికి ముందు ఈ పట్టణ జనాభా 11 వేలు. ఇక్కడ అత్యధికం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే ఉండేవి. టమాటా, గోధుమలు, ఆలివ్ పంటలకు ప్రసిద్ధి చెందిన నేల. గత మే దాకా బాగానే ఉన్న ఆ పట్టణాన్ని జూన్ మధ్య నాటికి సగానికి సగం ఇజ్రాయెల్ కూల్చేసింది. ఏకంగా 1,200 భవనాలు విధ్వంసమయ్యాయి. అబాసన్ అల్ కబీరా పట్టణానిదీ అదే దుస్థితి! యుద్ధానికి ముందు 27,000 మంది నివసించిన ఈ పట్టణం మేలో బాగానే ఉంది. జూన్‌కు వచ్చేసరికి అక్కడి ముఖచిత్రమే మారిపోయింది. సగం పట్టణం ఆనవాలు లేకుండా పోయింది. ఇజ్రాయెల్‌కు సరిహద్దుకు 7 కి.మీ. దూరంలో ఉన్న కిజాన్ అబు రష్వాన్‌లో కూడా విధ్వంసం జరిగింది. గత మార్చి దాకా పచ్చగా ఉన్న ఈ పట్టణం జూలై 4 నాటికి బూడిద కుప్పగా మిగిలింది. గాజాలో ఇజ్రాయెల్ కూల్చివేతల వేగం నానాటికీ పెరుగుతోంది! అమెరికా నుంచి ఇజ్రాయెల్ సైన్యానికి డజన్ల కొద్దీ డీ9 బుల్డోజర్లు అందినట్టు అక్కడి మీడియా గత వారం తెలిపింది. కూల్చివేతల పనులకు కాంట్రాక్టర్లు కావాలంటూ ఫేస్‌బుక్‌లో పోస్టులు చేసింది. మే నుంచి వారిని యుద్ధ ప్రాతిపదికన నియమించుకుంటోంది.



గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో సమూలంగా నేలమట్టమై శ్మశానాన్ని తలపిస్తున్న రఫా

శిథిలాలపై మానవతా నగరి!

రఫా శిథిలాలపై మానవతా నగరాన్ని నిర్మిస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటించారు. 6 లక్షల మంది పాలస్తీనియన్లకు అక్కడ ఆవాసం కల్పిస్తామని చెప్పారు. ఈ ప్రణాళికలపై తీవ్ర విమర్శలొచ్చాయి. అది మానవతా నగరం కాదని, నిర్బంధ శిబిరమని ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎముద్ ఓల్మెర్ట్ అన్నారు! శాపాలస్తీనా ప్రజలు కొంతకాలానికి తిరిగొచ్చినా స్వస్థలంలో ఏమీ మిగలేదనే నిరాశతో తిరిగి వలస వెళ్లేలా చేయడమే ఇజ్రాయెల్ ఉద్దేశంగా కనిపిస్తోంది. పాలస్తీనా ప్రజలు గాజాకు తిరిగి రాకుండా చేయడమే అసలు ప్రణాళిక అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ఆ దేశ ఎంపీల బృందంతో అన్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్

కట్నం వేధింపులతో యువతి ఆత్మహత్య... ఒంటిపై సూసైడ్ నోట్

లక్నో: మరింత కట్నం తేవాలంటూ అత్తింటి వారు పెట్టే వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు కారణమంటూ భర్తతోపాటు అత్తింట్లో వాళ్ల పేర్లను ఒంటిపై రాసుకుని మరీ ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మనీషా అనే యువతికి 2023లో నోయిడాకు చెందిన కుందన్‌తో పెళ్లయింది. మొదట్లో అంతా సాఫీగానే వారి కాపురం సాగింది. ఆ తర్వాత పరిస్థితులన్నీ మారిపోయాయి. పెళ్లప్పుడు బుల్లెట్ బైక్‌ను కొనిచ్చారు మనీషా తల్లిదండ్రులు. అయితే, ఎస్‌యూవీ కావాలంటూ కుందన్ కుటుంబీకులు డిమాండ్ చేయనారంభించారు. తమకు అంత స్తోమత లేదని చెప్పడంతో మనీషా తల్లిదండ్రులు తెలపడంతో శారీరకంగా, మానసికంగా వేధింపులు తీవ్రతరం చేశారు. 'అన్నం పెట్టకుండా పస్తులుంచుతున్నారు. గదిలో ఉంచి తాళం వేస్తున్నారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ కుందన్ బెదిరిస్తున్నాడు'అని మనీషా తన చేతిపై రాసుకుంది. వేధింపులు తట్టుకోలేక మనీషా 2024లో పుట్టింటికి చేరుకుంది. అక్కడున్నా వేధింపులకు మాత్రం అంతం లేకుండాపోయింది. ఇటీవల కుందన్, అతడి తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు గ్రామ పెద్దను తీసుకువచ్చి విడాకుల పత్రాలపై సంతకం చేయాలంటూ మనీషాను, ఆమె కుటుంబాన్ని ఒత్తిడి చేశారు. ఒప్పుకోకపోయేసరికి బెదిరింపులు మొదలుపెట్టారు. 'నా మరణానికి భర్త కుందన్, మరుదులు దీపక్, విశాల్‌లే కారణం. పంచాయితీ సమయంలో వారు నా కుటుంబానికి హెచ్చరికలు చేశారు'అంటూ మనీషా తన కాలిపై రాసుకుంది. 'మంగళవారం రాత్రి మేడపైన పడుకునేందుకు వెళ్లిన మనీషా పురుగుమందు తాగింది. ఉదయానికి విగత జీవిగా కనిపించింది'అని కుటుంబీకులు చెప్పారు. అత్తింటి నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్ల, వేధింపులను తాళలేక డిప్రెషన్‌తో బలవన్మరణం చెందిందన్నారు. చనిపోయేముందే శరీరంపై ఆమె ఈ మేరకు రాసుకుందన్నారు. మనీషా మరణానికి విష ద్రావకమే కారణమని పోస్టుమార్టంలో తేలిందని ఏఎస్పీ ఎస్పీ సింగ్ చెప్పారు. ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు.

రష్యా మహిళ, చిన్నారి జాడ తక్షణమే కనిపెట్టండి

ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: రష్యా మహిళ, ఆమె కుమార్తె కనిపించకుండా పోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీని వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా ఆమెకు ఎవరో సాయం చేసి ఉండొచ్చని పేర్కొంది. లుకౌట్ నోటీసు జారీ చేసి, తల్లి, కుమార్తె జాడను త్వరగా తెలుసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సైకత్ బసు అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా శుక్రవారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చిల ధర్మాసనం పైవిధంగా స్పందించింది. రష్యా పౌరురాలైన తన మాజీ భార్య విక్టోరియా బసు, నాలుగున్నరేళ్ల చిన్నారి ఈ నెల 7వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ సైకత్ బసు పేర్కొన్నారు. పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారని, రష్యా ఎంబసీతో భారత ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి ధర్మాసనానికి నివేదించారు. ఈ నెల 6న ఆమెకున్న కెనరా బ్యాంక్ అకౌంట్‌లో కేవలం రూ.169 మాత్రమే బ్యాలెన్స్ ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆమె దేశం విడిచి వెళ్లినట్లు ఎయిర్‌పోర్టుల్లో నమోదు కాలేదని వివరించారు. స్పందించిన ధర్మాసనం..విక్టోరియా బసు వేరే మార్గాల ద్వారా దేశం దాటి వెళ్లి ఉండొచ్చని అభిప్రాయపడింది. అన్ని రైల్వే స్టేషన్లు, ఇతర రవాణా వ్యవస్థల నుంచి సమాచారం సేకరించాలని, ఢిల్లీని విడిచారా లేదా నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే వారి జాడ కనుగొనాలంది. సుప్రీంకోర్టు గత ఆదేశాల మేరకు సైకత్, విక్టోరియా దంపతులు చిన్నారి సంరక్షణను వారంలో చెరో మూడు, నాలుగు రోజులు తీసుకోవాల్సి ఉంది. అయితే, ఈ నెలారంభంలో ఢిల్లీలోని రష్యా ఎంబసీ వెనుక వైపు నుంచి ఓ దౌత్యాధికారి వెంట కూతురిని తీసుకుని వెళ్లిన విక్టోరియా జాడ మళ్లీ కనిపించలేదని సైకత్ పేర్కొన్నారు. కుమార్తె సహా ఆమె భారత్ విడిచి వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

శృంగారానికి భార్య నిరాకరించడం క్రూరత్వమే

బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబై: భర్తతో శృంగారానికి భార్య నిరాకరించడం, అతడిని బహిరంగంగా అవమానించడం, మానసికంగా వేధించడం ముమ్మాటికీ క్రూరత్వమే అవుతుందని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. ఇలాంటి సందర్భాల్లో భార్యతో విడాకులు తీసుకొనే హక్కు అతడికి ఉంటుందని స్పష్టంచేసింది. భార్య చేతిలో వేధింపులకు గురైన భర్తకు విడాకులు మంజూరు చేస్తూ పుణే ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. పుణేకు చెందిన యువతీ, యువకుడు 2013లో పెళ్లి చేసుకున్నారు. 2014లో వారి మధ్య విభేదాలు మొదలయ్యాయి. తనకు విడాకులు మంజూరు చేయాలని కోరుతూ ఆ యువకుడు పుణే ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. భార్య తనతో శృంగారానికి ఒప్పుకోవడం లేదని, బంధువులు, స్నేహితుల ముందు అవమానిస్తోందని, దివ్యాంగురాలైన తన సోదరిని వేధిస్తోందని పేర్కొన్నాడు. అతడి వాదనను పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేస్తూ 2015లో ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ యువకుడి భార్య బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తనకు విడాకులు అవసరం లేదని, భర్త నుంచి ప్రతినెలా రూ.లక్ష ఇప్పించాలని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ రేవతి మోహితే, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. భార్య పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. బంధువులు, స్నేహితుల ముందు భర్తను అవమానించడం, అతడితో శృంగారానికి ఒప్పుకోకపోవడం, దివ్యాంగురాలైన సోదరిని వేధించడం వంటివి అతడిని మానసికంగా తీవ్ర అశాంతికి గురి చేశాయని పేర్కొంది. దంపతులు ఇక కలిసి ఉండేందుకు ఆస్కారం లేదని, వారికి విడాకులు మంజూరు చేయడం సమంజసమేనని తేల్చిచెప్పింది.



శుక్రవారం స్కాట్లండ్‌లోని గ్లాస్గోలో సౌత్‌సైడ్ కూడలిలో జనాన్ని అలరిస్తున్న భారీ పపెట్. ఎదురుగా నుంచుని దాన్ని అబ్బురపాటుతో తిలకిస్తున్న ఓ ఆరేళ్ల అబ్బాయి.

'సుప్రీంకోర్ట్ ఆఫ్ కర్నాటక' అకౌంట్ క్రియేట్ చేశాం

దీనిపై ఏమంటారు?: 'ఎక్స్'ను ప్రశ్నించిన కేంద్రం ● కర్నాటక హైకోర్టులో తీవ్ర వాదోపవాదాలు

బెంగళూరు: సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో 'సుప్రీంకోర్ట్ ఆఫ్ కర్నాటక'పేరుతో ఫేక్ అకౌంట్‌ని ఎటువంటి అడ్డంకులు లేకుండా సులభంగా క్రియేట్ చేసినట్లు సొలిసిటర్ జనరల్(ఎస్‌జీ) తుషార్ మెహతా చెప్పారు. ఇలా ఇష్టారాజ్యంగా ప్రమాదకరమైన ధోరణులకు 'ఎక్స్'సైతం వేదికగా మారిందని తెలిపారు. సామాజిక మాధ్యమ సంస్థ ఎక్స్ కార్పొరేషన్‌తో కేంద్రం విభేదాలు కొనసాగుతున్న వేళ శుక్రవారం కర్నాటక హైకోర్టులో వాదనల సందర్భంగా ఎస్‌జీ తుషార్ మెహతా దీనిని ఓ ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజలను సులువుగా మోసం చేసేందుకు సామాజిక మాధ్యమ వేదికలను దుర్వినియోగం చేసేందుకు ఎంతో అవకాశముందని వివరించారు. 'నేను ఈ అకౌంట్ క్రియేట్ చేశాను. ఎక్స్ ఈ అకౌంట్‌ను ధ్రువీకరించింది కూడా. నేనిక ఇందులో ఏదైనా పోస్ట్ చేసుకోవచ్చు. జనం సైతం సుప్రీంకోర్ట్ ఆఫ్ కర్నాటక ఇలా చెప్పి ఉంటుందనే నమ్ముతారు'అంటూ మెహతా వాదించారు. దుర్వినియోగం తీవ్రతను చూపేందుకు తప్ప, కంటెంట్‌ను పోస్ట్ చేయడానికి ఈ అకౌంట్‌ను క్రియేట్ చేయలేదని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వచ్చే కంటెంట్‌కు జవాబుదారీతనం లేదనటానికి ఇదో ఉదాహరణ అని వాదించారు. ఫలానా సమాచారాన్ని తొలగించాలంటూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 79(3)(బీ) కింద ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎక్స్ కార్పొరేషన్ వేసిన పిటిషన్‌పై వాదనల సందర్భంగా కేంద్రం తరఫున తుషార్ మెహతా ఈ లోపాన్ని ఎత్తి చూపారు. అయితే, ఇదే చట్టంలోని సెక్షన్ 69ఏ ప్రకారం మాత్రమే సంబంధిత కంటెంట్‌ను బ్లాక్ చేయాలని ఆదేశించొచ్చని ఎక్స్ కార్పొరేషన్ వాదించింది.

జెఫ్రీ ఎప్‌స్టీన్ స్కామ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలి

పూర్తి వివరాలు సేకరించండి

- అటార్నీ జనరల్ పామ్ బాండీకి ట్రంప్ ఆదేశం

వాషింగ్టన్: రాజకీయ నాయకులకు వ్యభిచారిణులను ఎరగా వేసి, సొంత పనులు చక్కబెట్టుకోవడంలో సిద్ధహస్తుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంలో పూర్తి నిజాలు బయటకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక తాజాగా ఓ రిపోర్ట్ ప్రచురించింది. 2003లో జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పంపించిన బర్త్‌డే లేఖలో ట్రంప్ పేరు, సంతకం ఉన్నట్లు ఆ పత్రిక బయటపెట్టింది. అభ్యంతకర రీతిలో ఉన్న ఓ మహిళ శరీర భాగాలు, దానిపై ట్రంప్ సంతకం ఇందులో కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ట్రంప్‌పై ప్రతిపక్ష డెమొక్రటిక్ నేతలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఆయన అనైతిక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. దీనిపై ట్రంప్ తాజాగా స్పందించారు. అది నకిలీ లేఖ అని తేల్చిచెప్పారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌ను, పాత్రికేయుడు రూపర్ట్ మర్డోక్‌ను కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. డెమొక్రటిక్ పార్టీ సృష్టిస్తున్న ఈ కుంభకోణానికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఎప్‌స్టీన్ అంశంలో పూర్తి వివరాలు సేకరించాలని, నిజాలు నిగ్గుతేల్చాలని తమ అటార్నీ జనరల్ పామ్ బాండీని ఆదేశించారు. కోర్టు ఆమోదం మేరకు సమాచారం బహిర్గతం చేయాలన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ట్రంప్ ఆదేశాలపై దీనిపై పామ్ బాండీ ప్రతిస్పందించారు. కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, ఎప్‌స్టీన్‌పై ఇప్పటిదాకా రహస్యంగా సాగిన దర్యాప్తునకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తానని స్పష్టంచేశారు.

ఢిల్లీ, బెంగళూరు స్కూళ్లకు బాంబు బూచి

సుమారు వంద విద్యాసంస్థలకు అందిన మెయిళ్లు

న్యూఢిల్లీ/బనశంకరి: దేశ రాజధాని ఢిల్లీతోపాటు కర్నాటక రాజధాని బెంగళూరులో శుక్రవారం పలు విద్యాసంస్థలకు బాంబు బెదిరింపు అందింది. ఢిల్లీలోని 45 స్కూళ్లు, బెంగళూరులోని సుమారు 50 స్కూళ్లకు బెదిరింపు మెయిల్ అందింది. దీంతో, విద్యాసంస్థలన్నిటిలోనూ డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్లతో పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన స్కూళ్లకు చేరుకుని అంతటా గాలింపు చేపట్టారు ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు, ఇతర అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఢిల్లీలో వారం రోజుల వ్యవధిలో నాలుగోసారి శుక్రవారం స్కూళ్లకు బాంబు బెదిరింపు అందింది. సుమారు 45 పాఠశాలలతోపాటు మూడు కళాశాలలకు ఈమెయిళ్ల ద్వారా బెదిరింపు అందినట్లు పోలీసులు తెలిపారు. 'హలో, స్కూల్ క్లాస్‌రూంల్లో బాంబులు పెట్టా. ఎవరికీ కనిపించకుండా నల్లని ప్లాస్టిక్ బ్యాగుల్లో వీటిని ఉంచా'అని ఆ మెయిల్‌లో ఉందని చెప్పారు. ద్వారక, రోహిణి, వసంత్ విహార్, జనక్‌పురి, కైలాశ్ ప్రాంతాల్లోని పాఠశాలలకు ఎక్కువగా ఇవి బెదిరింపులందాయి. ఇంద్రప్రస్థ కాలేజ్ ఫర్ ఉమెన్, హిందూ కాలేజ్, శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్ ఉన్నాయి. కొన్ని స్కూళ్లు తనిఖీలు చేపడుతూనే తరగతులను యథా ప్రకారం కొనసాగించగా, మరికొన్ని చోట్ల విద్యార్థులను ఖాళీ చేయించి పోలీసు బృందాలతో క్షుణ్నంగా గాలింపు చేపట్టాయి.

పదేళ్లుగా వేటాడుతున్నారు

వాద్రా ఉదంతంలో ఈడీపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: ''మా బావ రాబర్ట్ వాద్రా ఏ తప్పూ చేయలేదు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఆయనను మోదీ సర్కారు పదేళ్లుగా వేటాడుతోంది''అని విపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. మనీ లాండరింగ్ కేసులో వాద్రాపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో కేంద్రంపై ఆయన శుక్రవారం విరుచుకుపడ్డారు. ''మా బావ ఏ తప్పూ చేయలేదు. అయినా ఈ ప్రభుత్వం తనను పదేళ్లుగా వెంటాడుతోంది. తాజా ఛార్జిషీట్ అందుకు కొనసాగింపే. రాబర్ట్, ప్రియాంక దంపతులు, వారి పిల్లలు దురుద్దేశపూరిత, రాజకీయ ప్రేరేపిత అపవాదులను, వేధింపులను ఎదుర్కొంటున్నారు''అంటూ ఎక్స్‌లో రాహుల్ పోస్టు చేశారు. ''వారు ఎలాంటి హింసనైనా తట్టుకునేంత ధైర్యవంతులని నాకు తెలుసు. ఈ కేసులనూ అలాగే ఎదుర్కొంటారు. చివరికి సత్యమే గెలుస్తుంది. వారి పోరాటానికి నా మద్దతుంటుంది''అని రాహుల్ పేర్కొన్నారు. హరియాణాకు చెందిన ఓ భూ ఒప్పందం తాలూకు అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో వాద్రాపై ఈడీ గురువారం చార్జిషీట్ దాఖలు చేయడం తెలిసిందే. ఈ విషయమై గత ఏప్రిల్‌లో వాద్రాను వరుసగా ఈడీ మూడు రోజులు ప్రశ్నించింది.

బాధితుల కోసం రూ.500 కోట్లతో సంక్షేమ ట్రస్ట్

ప్రకటించిన ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో గత నెలలో 260 మంది ప్రాణాలను బలితీసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాద బాధితులకు మెమోరియల్, సంక్షేమ ట్రస్ట్‌కు రూ.500 కోట్లను అందజేయనున్నట్లు టాటా గ్రూప్ ప్రకటించింది. మెమోరియల్‌కు రూ.250 కోట్లు, సంక్షేమ ట్రస్ట్‌కు రూ.250 కోట్లు అందజేయనున్నట్లు టాటా సన్స్, టాటా ట్రస్ట్‌లు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో మరణించిన వారి తక్షణ వారసులు లేదా ఆధారపడిన వారు, గాయపడిన వారికి, ఈ ఘటనతో ప్రత్యక్షంగా ప్రభావితులైన ఇతరులకు తక్షణ సాయం అందజేసేందుకు ట్రస్ట్ సహకరిస్తుందని టాటా సన్స్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సహాయక, రక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న సహాయక సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం తమ సంస్థ సహకారం, సాయం అందించనుందని వివరించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారంతోపాటు తీవ్రంగా గాయపడిన వారికి వైద్య చికిత్సలు అందించడం, ప్రమాదం కారణంగా దెబ్బతిన్న అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్‌ను పునరుద్ధరించడం వంటి ట్రస్ట్ లక్ష్యాలుగా ఉన్నాయి.

లాలుకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: సీబీఐ దర్యాప్తు చేపట్టిన 'ల్యాండ్ ఫర్ జాబ్స్'కుంభకోణం కేసులో ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం ఈ కేసు విచారణకు సీబీఐకి అర్హత లేదని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. వెంటనే స్టే ఇవ్వాలన్నారు. ఆరోగ్యం బాగోలేనందున దిగువ కోర్టు విచారణకు హాజరు నుంచి మినహాయింపు కల్పించాలన్న వినతికి అంగీకరించింది. అదేసమయంలో, సీబీఐ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలు వేసిన పిటిషన్‌పై విచారణను వేగవంతం చేయాలంటూ జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

సిద్ధరామయ్యకు మెటా క్షమాపణ

న్యూఢిల్లీ: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ తర్జుమాలో ఆయన చనిపోయినట్లుగా రావడంపై మెటా క్షమాపణ వ్యక్తం చేసింది. ప్రముఖ నటి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సీఎం సిద్ధరామయ్య మంగళవారం కన్నడ భాషలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాల్లో ఒక పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ కన్నడ నుంచి ఇంగ్లిష్‌లోకి ఆటోమేటిక్‌గా ట్రాన్స్‌లేట్ అయ్యింది. అయితే, పొరపాటున అందులో సిద్ధరామయ్య చనిపోయినట్లు(పాస్డ్ ఎవే)గా వచ్చింది. వాస్తవానికి కన్నడ నటి బి.సరోజా దేవి చనిపోయినట్లుగా ఆ పోస్టులో ఉండాలి. బదులుగా అనువాదంలో సిద్ధరామయ్యే చనిపోయినట్లుగా వచ్చింది. ఈ అంశంపై సిద్ధరామయ్య సీరియస్ అయ్యారు. దీంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాల మాతృసంస్థ స్పందించింది. 'ఈ ఘటనపై క్షమాపణ కోరుతున్నాం'అని పేర్కొంది.

పీఓకేలో మసూద్ అజార్ మకాం!

న్యూఢిల్లీ: కరడుగట్టిన ఉగ్రవాది, జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్ పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో మకాం వేసినట్లు తెలిసింది. ఈ విషయం భారత నిఘా వర్గాలు గుర్తించినట్లు సమాచారం. పాకిస్తాన్‌లోని బహవల్‌పూర్ మసూద్ అజార్ అడ్డా. అక్కడికి వెయ్యి కిలోమీటర్ల దూరంలోని గిల్గిట్–బాలిస్తాన్ ప్రాంతంలోని స్కర్దూలో అతడు ఉన్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలే అక్కడ కనిపించాడని పేర్కొంటున్నాయి. ఇక్కడ రెండు మసీదులు, మదర్సాలు, ప్రైవేట్, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. ఇండియాలో జరిగిన ఎన్నో ఉగ్రవాద దాడుల్లో మసూద్ అజార్ హస్తం ఉన్నట్లు ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై దాడి, 2019లో పుల్వామా దాడికి అతడే సూత్రధారి. మసూద్ అజార్ కోసం భారత దర్యాప్తు అధికారులు వేట కొనసాగిస్తున్నారు. జైషే మొహమ్మద్‌ను ఐక్యరాజ్యసమితి గతంలోనే ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం దాడుల్లో మసూద్ అజార్ కుటుంబ సభ్యులు మరణించారు.

దేశ విభజనకు దారి తీసిన చట్టం ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

భారత కౌన్సిల్ చట్టాలు

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత దేశంలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడానికి, భారతీయుల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించింది. వీటినే కౌన్సిల్ చట్టాలు లేదా శాసన చట్టాలు అంటారు.

కౌన్సిల్ చట్టం-1861

భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో మొదటి సారిగా భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు.

- ఈ చట్టం ప్రకారం కొంతమంది భారతీయులను అనధికార సభ్యులుగా కౌన్సిల్‌లోకి వైస్రాయ్ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయిన వారిలో బెనారస్ రాజు, పాటియాలా మహారాజు, శ్రీ దినకర్‌రావు ఉన్నారు.
- 1773 చట్టం ద్వారా రద్దయిన బాంబే,మద్రాస్ ప్రెసిడెన్సీల శాసనాధికారాలను పునరుద్ధరించారు. ఆ విధంగా ఈ చట్టాన్ని 'వికేంద్రీకరణ ప్రక్రియ'కు నాందిగా చెప్పొచ్చు. బెంగాల్, పంజాబ్, ఈశాన్య సరిహద్దు ప్రావిన్సులతో నూతన లెజిస్లేటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు.
- కౌన్సిల్‌లో కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన సూత్రాలు, నియమాలను జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కి ఇచ్చారు. 1859లో లార్డ్ కానింగ్ ప్రవేశపెట్టిన పోర్ట్‌ఫోలియో (మంత్రిత్వ శాఖలుగా విధుల కేటాయింపు) పద్ధతిని గుర్తించి కొనసాగించారు. తద్వారా వైస్రాయ్ కౌన్సిల్ మరిన్ని శాఖలను నిర్వహించే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. శాసన కౌన్సిళ్ల సమ్మతి లేకుండానే ఆర్డినెన్సులు జారీ చేసే అధికారాన్ని వైస్రాయ్‌కు కల్పించారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలపై ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుండటంతో ఈ చట్టాన్ని రూపొందించారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా నియంత్రించారు. కేంద్ర శాసన మండలికి ఎంపికైన భారతీయ ప్రముఖులు.. గోపాలకృష్ణ గోఖలే, ఫిరోజ్ షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్.

ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్, గవర్నర్ జనరల్‌ల ముందస్తు అనుమతి పొందాలి. శాసనసభల్లో తమ స్థానం నామమాత్రమేనని గ్రహించిన భారతీయులు ఈ చట్టాన్ని వ్యతిరేకించారు.

భారత కౌన్సిల్ చట్టం-1909 లేదా మార్లే-మింటో సంస్కరణలు

1892 చట్టంలోని లోపాలను సవరించాలని, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనాలనే ఉద్దేశంతో ఈ చట్టానికి రూపకల్పన చేశారు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, భారత వైస్రాయ్ మింటో పేర్లతో ఈ చట్టాన్ని సూచించారు. అందువల్ల దీన్ని మార్లే-మింటో సంస్కరణ చట్టం అంటారు. కాంగ్రెస్‌లోని మితవాదులను మచ్చిక చేసుకోవడానికి బ్రిటిష్‌వారు ఈ చట్టం ద్వారా ప్రయత్నించారని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- కేంద్ర, రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచారు.
- శాసన ప్రక్రియ కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసన మండళ్లలో సభ్యుల సంఖ్యను 50కి, పంజాబ్, అస్సాం, బర్మాల్లో 30కి పెంచారు.
- గవర్నర్ జనరల్ ఆధీనంలోని శాసన మండలిలో 4 రకాల సభ్యులు ఉంటారు.
  1. నామినేటెడ్ అధికార సభ్యులు
  2. నామినేటెడ్ అనధికార సభ్యులు
  3. హోదా రీత్యా సభ్యులు 4. ఎన్నికైన సభ్యులు

మెజారిటీ సభ్యులు అధికార సభ్యులు కావడం వల్ల బిల్లుల ఆమోదం ప్రభుత్వానికి సులభమయ్యేది. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఇలా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

ముస్లింలు, వ్యాపార సంఘాల సభ్యులకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని కల్పించారు. ముస్లిం జనాభాకు మించిన ప్రాధాన్యాన్ని ఈ చట్టం కల్పించింది. ముస్లిం సభ్యులను ముస్లింలే ఎన్నుకునే వీలు కల్పించింది. దీని కోసం ప్రత్యేక మతపరమైన నియోజక గణాలను ఏర్పాటు చేశారు.

ఈ చట్టం మతతత్వానికి చట్టబద్ధత కల్పించింది. అందుకే లార్డ్ మింటోను 'మత నియోజక గణాల పితామహుడి'గా పేర్కొంటారు.

ప్రెసిడెన్సీ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, భూస్వాములు, వ్యాపార సంస్థలకు కూడా ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యులు సైనిక, దౌత్య, మతపరమైన విషయాలు మినహా ఇతర ఏ అంశంపైనైనా ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు అడగడానికి అధికారం లభించింది. కేంద్ర, రాష్ట్ర శాసనమండళ్లలో పోటీచేసే అభ్యర్థులకు ఈ చట్టం కచ్చితమైన అర్హతలను నిర్ణయించింది.

విమర్శ: ఈ చట్టంలోని అంశాలు 'అసలైన స్వరూపానికి బదులు కేవలం నీడ లాంటి ఆకారా'న్ని మాత్రమే అందించడం వల్ల 1909 చట్టాన్ని చంద్రకాంతితో పోల్చారు. ఈ చట్టం హిందూ, ముస్లింల మధ్య వేర్పాటు బీజాలు నాటి అడ్డుగోడలు సృష్టించిందని, దేశ విభజనకు దారి తీసిందని నెహ్రూ అభిప్రాయపడ్డారు.

భారత ప్రభుత్వ చట్టం-1919 లేదా మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు

భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేసింది. అందులో భాగంగా భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మాంటెగు 1917 నవంబర్‌లో భారతదేశాన్ని సందర్శించాడు. వైస్రాయ్ ఛెమ్స్‌ఫర్డ్‌తోపాటు భారతీయ నాయకులతో ఆయన చర్చలు జరిపి ఈ సంస్కరణలను ప్రకటించాడు. అందువల్ల వీటిని మాంటెగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అంటారు.

ముఖ్యాంశాలు

- భారత రాజ్య కార్యదర్శి జీతభత్యాలను భారత ఆదాయం నుంచి కాకుండా బ్రిటిష్ నిధి నుంచి చెల్లిస్తారు.
- రాష్ట్ర స్థాయిలో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టారు. రాష్ట్రాల అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్‌గా విభజించారు. రిజర్వ్‌డ్ విభాగంలో 28 పాలనా అంశాలను చేర్చారు. విత్తం, భూమి శిస్తు, న్యాయం, నీటి పారుదల, పరిశ్రమలు, మొదలైన వాటిని ఇందులో పేర్కొన్నారు.
- ఈ అంశాలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను బ్రిటిష్ కౌన్సిలర్ల సహాయంతో ఆయా రాష్ట్ర గవర్నర్లు నిర్వహిస్తారు. అయితే బ్రిటిష్ కౌన్సిలర్లు తమ విధి నిర్వహణలో రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించరు.
- ట్రాన్స్‌ఫర్డ్ విభాగంలో 22 అంశాలను పేర్కొన్నారు. స్థానిక పాలన, వ్యవసాయం, ప్రజా ఆరోగ్యం, విద్య, సహకారం, మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.
- రాష్ట్ర గవర్నర్ ఈ అంశాల పాలనా వ్యవహారాలను భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహిస్తారు. భారతీయ మంత్రులు ఆయా రాష్ట్ర శాసనసభల్లో సభ్యులై ఉంటారు. తమ విధుల నిర్వహణలో శాసనసభకు బాధ్యత వహిస్తారు.
- దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి(కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువసభను కేంద్ర శాసనసభ(సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరిస్తారు.
- ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌లో 60 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 34 మంది ఎన్నికైనవారు, 26 మందిని గవర్నర్ జనరల్ నియమిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. అధ్యక్షుడిని వైస్రాయ్ నియమిస్తారు. దిగువసభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 145 మంది సభ్యులుంటారు. ఇందులో 104 మంది ఎన్నికైనవారు, 41 మంది నియమితులైనవారు ఉంటారు. ఈ సభ పదవీకాలం మూడేళ్లు.
- మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో-ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు.
- ఆస్తి పన్ను చెల్లింపు ప్రాతిపదికపై పరిమిత ఓటు హక్కును కల్పించారు. లండన్‌లో భారత వ్యవహారాలను, ముఖ్యంగా రెవెన్యూ, పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ పదవిని సృష్టించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను వేరు చేశారు.
- లీ కమిషన్ (1923-24) సూచన మేరకు భారతదేశానికి విడిగా ఒక ఆడిటర్ జనరల్‌ను, 1926లో ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు. ఈ చట్టం అమలు తీరును సమీక్షించడానికి పదేళ్ల తర్వాత చట్టబద్ధత ఉన్న కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విమర్శ: ఈ చట్టం ప్రతిపాదించిన అంశాలపై అనేక విమర్శలు వచ్చాయి.

- 1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు 'సూర్యుడు లేని ఉదయం'లా ఉన్నాయని బాలగంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు.
- ఈ సంస్కరణలను బ్రిటిష్‌వారు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఈ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని అనిబిసెంట్ వ్యాఖ్యానించారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన దాదాపు దూషణ పదంగా మారింది. ఒక వ్యక్తి, ఇంకొక వ్యక్తిని నీవు 'డైయార్కి'వి అని అరవడం విన్నానని సర్ బట్లర్ అనే రచయిత తెలిపాడు.
- ద్వంద్వ పాలనను ఎప్పటికీ ఆదర్శంగా భావించలేం. మరో ఉత్తమ ప్రయోజన స్థితికి ఇది ఓ మెట్టు మాత్రమే. ఆ ఉత్తమ ప్రయోజనమే 'పరిపూర్ణ స్వపరిపాలిత భారతదేశం' అని పలాండే అనే రచయిత పేర్కొన్నారు.

ఈ సంస్కరణలు స్వపరిపాలన దిశగా చెప్పుకోదగ్గ ముందంజ కాబట్టి భారత రాజ్యాంగ చరిత్రలో ముఖ్య పరిణామంగా పరిగణిస్తారు. ప్రేరణను, భవితవ్యం కోసం అనుభవం సంపాదించడానికి ఈ చట్టం తగిన అవకాశం ఇచ్చిందని కూడా చెప్పవచ్చు.

సైమన్ కమిషన్ - నవంబర్ 1927

భారత ప్రభుత్వ చట్టం 1919 ద్వారా ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి నిర్దీత సమయం కంటే రెండేళ్ల ముందే బ్రిటన్ ప్రధాని స్టాన్లీ బాల్డ్విన్ 1927 నవంబర్‌లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులతో ఒక రాయల్ కమిషన్‌ను నియమించారు. ఇందులోని సభ్యుడైన క్లెమెంట్ అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి ఇంగ్లండ్ ప్రధానిగా ఉన్నారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులు కావడం వల్ల భారతీయులు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఈ కమిషన్ భారతదేశంలో రెండు సార్లు పర్యటించింది. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు తొలిసారి, 1928 అక్టోబర్ 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు రెండోసారి పర్యటించింది. ఈ కమిషన్ 1930లో నివేదికను సమర్పించింది.

ముఖ్యాంశాలు

- రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలనను రద్దు చేయడం, మంత్రులు శాసనసభకు బాధ్యత వహించేలా చేయడం.
- ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పించడం.
- రాష్ట్ర శాసన మండళ్లలో సభ్యత్వ సంఖ్యను పెంచడం.
- ఏక కేంద్ర వ్యవస్థ భారతదేశానికి సరిపడదు కాబట్టి సమాఖ్య వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం.
- హైకోర్టుపై కేంద్ర ప్రభుత్వానికి పాలనాపరమైన నియంత్రణ ఏర్పాటు.
- సార్వజనీన వయోజన ఓటు హక్కు వెంటనే సాధ్యం కాదు కాబట్టి దీన్ని కాలానుగుణంగా విస్తృతం చేయడం.
- కమ్యునల్ ప్రాతినిధ్యం సమంజసం కాకపోయినా, దీనికి ప్రత్యామ్నాయం లేని దృష్ట్యా కొనసాగించడం.

మాదిరి ప్రశ్నలు

1. రెగ్యులేటింగ్ చట్టం 1773కి సంబంధించి సరైంది?
   1) మొదటి లిఖిత రాజ్యాంగగా పరిగణిస్తారు
   2) కంపెనీ పాలనపై పార్లమెంట్ తొలి నియంత్రణ
   3) ఏదీకాదు 4) 1, 2
2. కింది వాటిలో భారత కౌన్సిల్ చట్టాలేవి?
   1) 1909 2) 1861
   3) 1813, 1892 4) పైవన్నీ

సమాధానాలు: 1) 4; 2) 4.

చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి ఎవరి బిరుదు?



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

తెలుగు

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు-సామెతలు, ప్రత్యక్ష కథనం- పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణఅంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96):** గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: రుగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925-2010):** జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు.
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910-83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ **ప్రక్రియ:** గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).
6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):** పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త. **పాఠ్యభాగం:** అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915-61):** గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.
10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930-89):**
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగు చుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నండూరి రామమోహన్‌రావు (1927-2011):** పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922-2011):**
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు - రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) - సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) - శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) - వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) - భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) - దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) - సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) - సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం) - సభారంజన శతకం (అనువాద కర్త)

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టినవారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త 4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2;	2) 4;	3) 1;	4) 2;
5) 3;	6) 1;	7) 2;	8) 3;
9) 4;	10) 1;	11) 3;	12) 4;
13) 2;	14) 4;	15) 3;	16) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

జీఆర్ఎస్ఈలో ఉద్యోగాలు

కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్‌లో వివిధ విభాగాల్లో జర్నీమ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** జర్నీమ్యాన్(పైప్ ఫిట్టర్)-01, జర్నీమ్యాన్(పెయింటర్)-02, జర్నీమ్యాన్(కంప్యూటర్ ఆపరేటర్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఎన్ఏసీ/ఎన్‌టీసీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.07.2025 నాటికి 26 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, పీఈటీ పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.
- **వెబ్‌సైట్:** https://www.grse.in

ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు

ముంబైలోని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా.. శాశ్వత ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** షిప్‌వే వర్కర్ గ్రూప్ 3-02, వెల్డర్-01.
- **అర్హత:** పదో తరగతి, ఎస్ఎస్ఎల్‌సీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
- **వయసు:** షిప్‌వే వర్కర్‌కు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. వెల్డర్‌కు 30 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జోనల్ డైరెక్టర్, కొచ్చిన్ బేస్ ఆఫ్ ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, కొంచంగడి, కొచ్చి చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.09.2025.
- **వెబ్‌సైట్:** https://fsi.gov.in

నాబార్డ్‌లో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తించిన సంస్థ నుంచి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం ఉండాలి.
- **వయసు:** 75 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** hrmd.kolkata@nabard.

అమెరికా, భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధితోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు-2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు-2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.



- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడం గానీ చేయలేదు.

ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు-2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు:
క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో), ఆస్తి కొనుగోలు, భూమిని సాగు చేసుకోవడం, బోరుబావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం:
గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు. సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం:
సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది. దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు:
మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు   బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి   డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి   డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు   బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష   డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
   ఎ) ఎం. హిదయతుల్లా
   బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
   సి) పి.ఎన్. భగవతి   డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
   ఎ) సుప్రీంకోర్టు   బి) హైకోర్టు
   సి) జిల్లా కోర్టు   డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
   ఎ) క్యూరేటివ్ పిటిషన్ బి) రివిజన్ పిటిషన్
   సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
   డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి;
5) డి; 6) డి; 7) సి; 8) బి;
9) సి; 10) సి; 11) డి; 12) సి.

Clients are judging you by your?



Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Each time Hemanth turns on his computer, he has (1)/ to wait for it to load, enter the special code, and then enters a password (2)/ to get into his workspace before (3) / he can begin working (4)/ No Error (5)
2. Because there is (1)/ two sets of cutlery, a couple napkins, and plates on each table, students do not have (2) / to set(3) / their own place settings. (4) / No Error (5)
3. The decision that has just been (1) / agreed with (2) / by the board members should serve as a basis for their (3) / other accomplishments in the years to come. (4)/ No Error(5)
4. People who dislike cats sometimes (1) /criticize them for being (2) /savvy and independent; whereas those who are fond of (3) / cats often admire them for the same qualities. (4) / No Error(5)
5. Even with (1) / a calculator, you must have a basic understanding of (2) / mathematics if one expects (3)/ to do decently on the Math section. (4) / No Error(5)

Directions: (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction as required as your answer.

6. Godavari rises in a magnificent way above its tributaries during rainy season.
   1) rises a magnificent way above
   2) rises in a magnificent way, way above
   3) rises magnificently above
   4) rises magnificently way above
   5) No correction required
7. During colonial days, a school room looked rather empty.
   1) colonial days, a school room looks
   2) colonial days, a schoolroom looked
   3) colonial days; a schoolroom looked
   4) colonial days; a school room looked
   5) No correction required
8. The helium-filled balloon rose in the air.
   1) rose on the air.
   2) was rising in the air.
   3) was in the air.
   4) rose into the air.
   5) No correction required
9. If I had the address, I would have delivered the package myself.
   1) had address,
   2) had seen the address
   3) had had the address
   4) had their address
   5) No correction required
10. Vasantha claims that cats made the best pets.
   1) will make the best pets
   2) could be the best pets
   3) are the best pets
   4) make the best pets
   5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Tsunamis generally consist of a series of waves with periods ranging from minutes to hours, arriving in a so-called "wave train".
B) Wave heights of tens of meters can be generated by large events.
C) Rather than appearing as a breaking wave, a tsunami may instead initially resemble a rapidly rising tide, and for this reason they are often referred to as tidal waves.
D) A Tsunami is a series of waves in a water body caused by the displacement of a large volume of water, generally in an ocean or a large lake.
E) Although the impact of tsunamis is limited to coastal areas, their destructive power can be enormous and they can affect entire ocean basins.
F) Tsunami waves do not resemble normal sea waves, because their wavelength is far longer.

11. What is the LAST sentence after rearrangement?
   1) C 2) B 3) D 4) E 5) F
12. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) C
13. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) C 3) B 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) C 3) D 4) E 5) F
15. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Japan's abundant rainfall and the ___ mild temperature throughout most of the country have produced a _____vegetation cover.
   1) Typically, lush
   2) Prominence, dry
   3) Importantly, scarce
   4) Average, green
   5) General, prominent
17. Nobody knows ____ how many languages there are in the world, partly because of the difficulty in distinguishing between a language and the sub-languages or dialects ____ it.
   1) Exclusively, from
   2) Extend, among
   3) Exactly, within
   4) Extensively, Between
   5) Precisely, with
18. The ______ of natural gas from Norway's Troll gas _______ is expected to increase annually.
   1) Yield, field
   2) Production, depot
   3) Manufacture, ground
   4) Assemble, bunk
   5) Making, drivel
19. The results of the company's cost-cutting ______ are evident in its profits.
   1) Events   2) Action
   3) Dealings   4) Procedure
   5) Measures
20. With cloning technology, scientists _______ what has long been the ultimate _____ of modern husbandry.
   1) are approaching, goal
   2) were approaching, aim
   3) had approached, target
   4) is approaching, mark
   5) was approaching, set

Directions (Q. 21 - 30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Businesses spend a lot of time and money on choosing just the ___ (21) name for their enterprise. But, all too often choosing the right domain name is left for the end of the business naming process instead of at the _____ (22) where it belongs. Your future customers have to be able to _______ (23) you on the web. Your domain name may be sending the wrong message and ______ (24) you business. When people are given a website and then told it's .net or .biz, the first thing they think is, "Oh, somebody else got the .com, huh?" Some will even purposefully go and see what company secured .com, maybe they are the one that they should really be dealing with.

Even more damaging is the fact that .com is everyone's ____ (25) when typing. You may know someone's site ends in .net, but by default you probably often start to type .com. People are busy. Everyone is multitasking and managing a staggering amount of information. The ____ (26) you make someone work to find you the more likely they won't put in the effort.

While there are only so many .com addresses available, it is unlikely that anything else will ever take the place of .com as the default website ending ____ (27) users.

In an effort to get a website ending in .com some business owners get cute and make up their own word. Sometimes service providers have reasonably used their own name as their website URL, but their name is tough for most people to spell.

The problem with both scenarios is that once someone has to ask how to spell your domain name they have already convinced themselves it is too hard to remember. If someone has to write down your domain name you are one lost piece of paper away from losing him or her as a ___ (28) forever.

People are not willing to put too much effort into finding your site. There are just ______ (29) many options on the web to be bothered by difficult to spell websites. Don't get too cute when thinking up a company name or domain name. Make it easy. If you want to use your own name, but your name is tough to spell, get a simple domain that will point to your other site. For example if your name is Christopher Zvynski, get another domain called askchris.com that will redirect customers to your site.

One company that has built its entire business around a premium domain name that's the obvious choice for its category is Hotels.com. One of their recent marketing campaigns even featured the tagline, "Hotels.com, the obvious choice". While the space is fiercely competitive, Hotels.com will likely always be an industry leader because it's name coincides perfectly with what people are likely to search for or enter into their browsers. How much value does this kind of premium domain name generate?

Beyond being easy to find, domain names like Cars.com or Hotels.com send a message to customers that this company understands the web and that they have been around a while. How else would they have gotten such a perfect name? Typical consumers are not thinking that the domain name was probably purchased as a business cost.

Customers and clients are judging you by your _______ (30). It may have nothing to do with your quality and abilities, but it is the way of the marketplace. Make it easy for people to find you and you will always have eager customers.

21. 1) exactly 2) right 3) precise 4) correctly 5) truth
22. 1) beginning 2) start 3) proceeding 4) preceding 5) recede
23. 1) evasion 2) find 3) come 4) hit 5) draw
24. 1) costing 2) estimate 3) find 4) figure 5) quotation
25. 1) evasion 2) avoidance 3) dodging 4) default 5) internet
26. 1) hardly 2) hard 3) hardest 4) too hard 5) harder
27. 1) any 2) some 3) most 4) much 5) little
28. 1) friend 2) relative 3) foe 4) customer 5) neighbor
29. 1) few 2) many 3) much 4) little 5) too
30. 1) knowledge 2) expertise 3) skills 4) service 5) domain

Key:

1) 2	2) 1	3) 2	4) 5
5) 3	6) 3	7) 2	8) 4
9) 4	10) 4	11) 4	12) 2
13) 2	14) 3	15) 1	16) 1
17) 3	18) 1	19) 5	20) 1
21) 2	22) 3	23) 2	24) 1
25) 4	26) 5	27) 3	28) 4
29) 5	30) 5.		